ISSN : 0971-8729

# యోజన

సంపుటి : 45 సంచిక : 5 అభివృద్ధి మాసపత్రిక మార్చి 2017 ₹ 30

ప్రత్యేక సంచిక

# బడ్జెట్ 2017-18

**2017-18 కేంద్ర బడ్జెట్ - స్థూల విశ్లేషణ**
ఎన్.ఆర్. భానుమూర్తి, శ్రీహరి నాయుడు

**స్వాట్ ఎనాలసిస్ - భారత ఆర్థికవ్యవస్థ-సర్వే 2016-17**
రవీంద్ర హెచ్. ధొలాకియ

**కేంద్ర బడ్జెట్: ఉపాధి, పారిశ్రామిక వృద్ధి అవకాశాలు**
అరూప్ మిత్ర

**ప్రత్యేక వ్యాసం**

**నూతన అవతారంలో రైల్వే బడ్జెట్**
ఎస్ హెచ్ అరుణేంద్ర కుమార్

**విశిష్ట వ్యాసం**

**బడ్జెట్ 2017-18 : మౌలిక రంగానికి కేటాయింపులు**
కృష్ణదేవ్

## మీకు తెలుసా?

### సార్వత్రిక మూల ఆదాయం

స్వాతంత్ర్యం వచ్చినప్పటి 70 శాతం పేదరికాన్ని 2011-12 అంచనాల ప్రకారం 22 శాతానికి విజయవంతంగా తగ్గించగలిగినప్పటికీ, మనం దేశప్రజలందరి కన్నీటినీ తుడవడానికి ఇంకా బారెడు దూరంలోనే ఉన్నామని చెప్పకతప్పదు. దీనికి పరిష్కారంగా 2016-17 ఆర్థిక సర్వేక్షణం సార్వత్రిక మూల ఆదాయం (సా.మూ.ఆ.) అనే ఒక నూతన ప్రతిపాదనను చేసింది. ప్రస్తుతం అమలులో ఉన్న అన్ని సంక్షేమ కార్యక్రమాలకు బదులుగా పేదరిక నిర్మూలనకై ఈ నూతన ప్రతిపాదనను అమలు చేయవచ్చు. దేశంలోని ప్రతి వ్యక్తి కూడ తన అవసరాలకోసం కనీసమొత్తంలో ఒక నిర్ణీత వేతనాన్ని పొందాలనేది దీని భావం. ఇందులో మూడు ప్రధానాంశాలుంటాయి. అవి:

(1) సార్వత్రికత అంటే ఎలాంటి బేధాలూ/వ్యత్యాసాలూ లేకుండా ఈ కనీస వేతనం అందరికీ సమంగా అందాలి.

(2) ఎటువంటి నిబంధనలూ లేకుండా అంటే ఈ కనీస వేతనానికి అర్హతగా ఎటువంటి నిబంధనలూ ఉండరాదు.

(3) అత్యంత పేద స్థితిలోనున్నవారి నిర్ణయాత్మక సామర్థ్యంపై ఎటువంటి సందేహాలు, నిబంధనలు ఉండరాదు.

**అనుకూల వాదనలు:**

(1) సామాజికన్యాయం. సమాజంలోని అందరినీ గుర్తించకుండా ఏ సమాజమూ కూడ న్యాయబద్ధంగా మనజాలదు.

(2) వేతనాన్ని ప్రజలకు అత్యంత వేగంగా అందచేసే లక్ష్యంతో అందరినీ సమంగా చేరాలి.

(3) ఉపాధి. ఉపాధి అవకాశాలు అందరికీ అందటం ఇంకా కలగానే ఉన్న నేటి తరంలో సమాజంలో కనీస వేతనానికి ఈ సార్వత్రిక మూలవేతనం ఒక హామీ. ఈ కనీస వేతనం తన జేబులో ఉంటే, వ్యక్తి లేబర్ మార్కెట్లో తన పనికి బేరసారాలు చేయగలడు. తను చేయలేని పనికి అననుకూలమైన నిబంధనలను అంగీకరించకుండా ఉండగలడు. అంటే, కార్మికుల దోపిడీని కొంతవరకు అరికట్టవచ్చు.

(4) ఏజన్సీ. దేశంలోని పేదలను ప్రభుత్వ పథకాలకు లక్ష్యాలుగా మాత్రమే చూస్తున్నారు. ప్రస్తుత మన సంక్షేమ విధానం ఎంత సమర్థంగా నిర్వహించినప్పటికీ, పేదలకు తమ జీవితాలను ఉద్ధరించే ఆర్థిక నిర్వహణలో ఎటువంటి నిర్ణయాత్మక పాత్రా లేకుండా చిన్నబుచ్చుతున్నారనే చెప్పవచ్చు. అయితే ఎటువంటి నిబంధనలూ లేని నగదు బదిలీతో కూడిన ఈ పథకం వల్ల వారిని కనీస మానవులుగా చూడవచ్చు.

(5) ప్రజలను పేదరికంలో అనేక అంశాలు కట్టి పడేస్తున్నాయి. వారు నిత్యం ఎదుర్కొంటున్న న(క)ష్టాలు, సమస్యలు అనేకం. వీటిలో ఏ సమస్యలను నివారించవచ్చు, వాటికి ఎలాంటి ప్రాధాన్యాలు ఏర్పాటు చేయాలి అనే విషయాలను ప్రభుత్వం నిర్ణయించజాలదు. ఈ కనీస వేతనం అందరికీ, అంటే మహిళలకు కూడ అందటంవల్ల వారి నిర్ణయాత్మక శక్తి క్రియాశీలకంగా ఉంటుంది.

**తరువాయి 75వ పేజీలో...**

మార్చి 2017 సంపుటి : 45 సంచిక : 5

ISSN : 0971-8729

# యోజన

ముఖ్య సంపాదకులు : దీపికా కచ్చల్
వరిష్ఠ సంపాదకుడు : విజయకుమార్ వేదగిరి
సంపాదకుడు : మహమ్మద్ సిరాజుద్దీన్
జాయింట్ డైరెక్టర్ (ప్రొడక్షన్) : వి.కె. మీనా

e-mail : yojana_telugu@yahoo.co.in
e-mail : yojana.telugu@nic.in

*ఆనోభద్రా క్రతవోయన్తు విశ్వతః (ఉత్తమ భావాలు అన్నివైపుల నుండి రావాలి)*

## ఈ సంచికలో...

1. 2017-18 కేంద్ర బడ్జెట్ - స్థూల విశ్లేషణ - ఎన్.ఆర్. భానుమూర్తి, ఎ. శ్రీహరి నాయుడు 5
2. స్వాట్ ఎనాలసిస్ - భారత ఆర్థికవ్యవస్థ- సర్వే 2016-17 - రవీంద్ర హెచ్. ధొలాకియ 9
3. కేంద్ర బడ్జెట్ : ఉపాధి, పారిశ్రామిక వృద్ధి అవకాశాలు - అరూప్ మిత్ర 14
4. నూతన అవతారంలో రైల్వే బడ్జెట్ - ఎస్ హెచ్ అరుణేంద్ర కుమార్ 18
5. బడ్జెట్ 2017-18 : మౌలిక రంగానికి కేటాయింపులు - కృష్ణదేవ్ 24
6. 2017-18 కేంద్ర బడ్జెట్ ముఖ్యాంశాలు - యోజన సంపాదకవర్గం 29
7. యువత భవిష్యత్తు కోసం - ఓ కొత్త అధ్యాయం - డా॥ ఎస్.ఎస్. మంత 34
8. విజ్ఞాన విపంచి - ప్రాతూరి పోతయ్య శర్మ 38
9. దర్పణం 41
10. కేంద్ర బడ్జెట్ 2017-18 లో వ్యవసాయానికి ఊతం - లక్ష్మీ జోషి, వి.పి. ఆహూజ 43
11. గ్రామీణ వ్యవస్థకు ప్రాధాన్యతనిచ్చిన ప్రగతిదాయక బడ్జెట్ - రేపూరు ఉమామహేశ్వరరావు 45
12. మౌలిక సదుపాయాల రంగం - బడ్జెట్ కేటాయింపులు - ప్రొఫెసర్ వి. ఉషాకిరణ్ 50
13. కేంద్ర బడ్జెట్ 2017-18 : స్థిరాస్తి రంగంపై ప్రభావం - రంజిత్ మెహతా 52
14. నవ్యాభివృద్ధి నమూనా : మహా యుగంవైపుగా ప్రయాణం - నీరేంద్ర దేవ్ 56
15. వైద్య సేవల్లో ఆరోగ్యకరమైన అభివృద్ధి - రాజీవ్ ఆహూజా 61
16. బలహీనవర్గాల సంక్షేమం... అభివృద్ధి - శ్రీకర నాయక్, కుమారి అంజలి బన్సల్ 65
17. బడ్జెట్‌లో విధానపరమైన మార్పులు - హాపీ పంత్ 69

**ప్రణాళికలు, అభివృద్ధి కార్యక్రమాల గురించిన సమాచారాన్ని అందజేసేందుకు, తెలుగు, హిందీ, ఇంగ్లీషు, అస్సామి, బెంగాలి, తమిళం, ఉర్దూ, మరాఠీ, గుజరాతీ, మళయాళం, పంజాబీ, కన్నడ, ఒడియా భాషలలో వెలువడుతున్న మాసపత్రిక.**

**యోజన (తెలుగు) చందా వివరాలు**

**1 సంవత్సరానికి - రూ. 230/- 2 సంవత్సరాలకు - రూ. 430/- 3 సంవత్సరాలకు - రూ. 610/-**

**మరిన్ని వివరాల కోసం : 040-27546312 /13 / 14 ఈ ఫోన్ నంబర్లకు సంప్రదించండి.**

**చందాను Bharatkosh.gov.in సైట్‌లో Publications Division లింకును క్లిక్ చేసి ఆన్‌లైన్ ద్వారా చెల్లించవచ్చు :**

ఎడిటర్, **యోజన (తెలుగు),** 205, 2వ అంతస్తు, సి.జి.ఓ. టవర్స్, కవాడిగూడ, హైదరాబాద్ - 500 080.

యోజన ప్రచురించిన వ్యాసాలలో వ్యక్తపరిచిన భావాలు ఆయా రచయితలవే, వారు పనిచేస్తున్న సంస్థలు, ప్రభుత్వ అభిప్రాయాలను అవి ప్రతిబింబించవు.
యోజనలో ప్రచురించే ప్రకటనలలోని అంశాలు ఆయా సంస్థలు, వారి ప్రతినిధులకు చెందినవి. ప్రకటన పాఠం / సారాంశం మూలంగా ఎదురయ్యే ఎటువంటి పర్యవసానాలకు యోజన బాధ్యత వహించదు.


ISSN : 0971-8729

# యోజన

చీఫ్ ఎడిటర్స్ డెస్క్

## సంపాదకీయం

### దేశ ఔన్నత్యం కోసం బడ్జెట్



ఈ సంవత్సరం జాతీయ బడ్జెట్, అనేక అస్థిరతల మధ్య సమర్పించబడింది. నోట్ల రద్దు, అనివార్యంగా మారిన నూతన సరుకులు, సేవల పన్ను విధానం, ప్రపంచానికి పెద్దన్న అమెరికాలో మారిన ప్రభుత్వం వంటి మార్పులు ఈ బడ్జెట్‌కు సవాలుగా మారాయి. సంప్రదాయాలను మార్చిన ఈ సంవత్సరపు బడ్జెట్ ఒక నెల ముందుగా ప్రజలలోకి రావడమే కాక, బ్రిటీషు వారసత్వంగా వచ్చిన ప్రత్యేక రైల్వే బడ్జెట్‌ను కూడ కలుపుకుని ప్రజల ముందుకు వచ్చింది. అదేవిధంగా, ప్రణాళిక, ప్రణాళికేతర వ్యయాలను వేరువేరుగా కాక, ఒక్కటిగా చూపింది. జనసామాన్యంలో ప్రణాళికేతర వ్యయంపై వచ్చిన అపప్రథలను తొలగించడానికి ఈ నిర్ణయం తీసుకున్నారు. నోట్ల రద్దు అనంతరం ఉన్నవారు, లేనివారు ఇరువురూ ఒకేవిధంగా ఇబ్బందులు పడ్డారు కనుక, కొన్ని అనునయాలతో ఈ బడ్జెట్ వస్తుందని అందరూ ఆశించారు. అలవాటైన ప్రభుత్వ ఒరవడిలో ఈ బడ్జెట్, పేదలకు, వెనుకబడిన వర్గాలకు, రైతులకు, ఇతర గ్రామీణ ప్రజలకు ప్రయోజనంచేకూర్చే విధంగా దీర్ఘకాలిక ప్రగతి లక్ష్యాలతో వచ్చింది. మొత్తం మీద, పరిణామము సశక్తీకరణ, స్వచ్ఛత ప్రధాన లక్ష్యాలుగా గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, మౌలిక సౌకర్యాలు, నైపుణ్యాభివృద్ధి, తయారీ, ఉపాధి కల్పనలకు ప్రోత్సాహంవంటి బహుముఖ లక్ష్యాలతో ఈ బడ్జెట్ మనముందుకు వచ్చింది.

రైతులు, గ్రామీణ ప్రజలే మొదటి ప్రాధాన్యంగా, రానున్న ఐదు సంవత్సరాలలో రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం, వ్యవసాయరుణాలకు కేటాయింపును 10 లక్షల కోట్లకు పెంచడం వంటి చర్యలేకాక, ప్రకృతి వైపరీత్యాల నుండి రైతును కాపాడేందుకు, ప్రధానమంత్రి పంటల బీమా పథకాన్ని 40 శాతంగా విస్తరించాలనీ, దీర్ఘకాలిక నీటివనరుల సహాయనిధిని రూ. 40,000 కోట్లకు పెంచాలనీ నిశ్చయించారు. గ్రామీణ ఉపాధికి మరిన్ని జవజీవాలనిచ్చి, గ్రామీణ ప్రాథమిక సౌకర్యాలను మరింత విస్తరించడానికి అనేక చర్యలను ప్రకటించారు. మొత్తం ఆసియాలోనే గర్వించదగ్గ మన గ్రామీణ ఉపాధి హామీ పథకానికి అత్యధిక స్థాయిలో, రూ. 48,000 కోట్లు కేటాయించారు. యువతకు గిట్టుబాటైన ఉపాధిని కల్పించే మార్కెటింగ్ నైపుణ్యాలను పెంచే 300ల పైచిలుకు శిక్షణా కార్యక్రమాలను రూ. 4,000 కోట్లతో ఆన్‌లైన్‌లో అందరికీ అందుబాటులో ఉంచే స్వయం (SWAYAM-STUDY WEBS OF ACTIVE --LEARNING FOR YOUNG ASPIRING MINDS) పథకాన్ని ప్రకటించారు. అదేవిధంగా యువత నైపుణ్యాలను మరింత పదును తేల్చేందుకు సంకల్ప్ (SANKALP) పథకాన్నీ ప్రకటించి, మనదేశాన్ని, ప్రపంచానికే నైపుణ్యరాజధానిగా రూపొందించాలని లక్ష్యించారు. మొత్తం 50, వేల గ్రామ పంచాయతీలలో, కోటిమంది అతి బీదస్థితిలోనున్న వారిని ఉద్ధరించడానికి మిషన్ అంత్యోదయ పథకాన్ని ప్రకటించారు. నూటికి నూరు శాతం గ్రామీణ విద్యుదీకరణను మే 1, 2018 నాటికి సాధిచాలని పెట్టుకున్న లక్ష్యం, బహిరంగ మలవిసర్జన శాపం నుండి విముక్తమైన గ్రామాలకు పైపుల ద్వారా నీటి సరఫరా, ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన కింద ప్రతిరోజూ 133 కి.మీ.ల చొప్పున గ్రామాలకు జీవనాడి ఐన రోడ్లు వేయించాలే లక్ష్యం వంటివి ప్రభుత్వానికి గ్రామీణాభివృద్ధిపై నున్న చిత్తశుద్ధిని తెలియచేస్తున్నాయి.

ఏ దేశానికైనా బలమైన ప్రాథమిక వసతులు అత్యావశ్యకము కనుక, దీనికి రూ. 3.96 లక్షల కోట్లను కేటాయించారు. రైల్వేలకు రూ. 1.3 లక్షల కోట్ల కేటాయింపు ప్రజల రవాణా సౌకర్యాలపై ప్రభుత్వానికున్న శ్రద్ధను తెలియచేస్తున్నది. భద్రమైన, పరిశుభ్రమైన సౌకర్యవంతమైన ప్రయాణాలకు ఈ మొత్తాన్ని వ్యయం చేస్తారు. అందరికీ ఇళ్ళు అనే లక్ష్యంలో భాగంగా రియల్ ఎస్టేట్ రంగానికి మౌలిక సౌకర్యాల ప్రాధాన్యంతో పరిశ్రమ స్థాయిని కట్టపెట్టారు. వ్యాపారనిర్వహణను మరింత సులభసాధ్యంచేసే అనేక చర్యలను ప్రకటించారు. ఇకపై విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు నేరుగా వచ్చేందుకు వెసులుబాటు కల్పిస్తూ, విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డును రద్దు చేశారు. పారిశ్రామిక వేత్తలకు టర్నోవరు రూ. 50 కోట్లు దాటితే, ఆదాయపు పన్నును 25 శాతానికి పరిమితం చేశారు. డిజిటల్ ఎకానమీకి దన్నుగా భారత్ నెట్ అంతర్జాల వ్యవస్థకు, ఆధార్ పే విధానానికీ, ఆన్‌లైన్ చెల్లింపులకు భద్రతను మరింత పటిష్టం చేయడానికీ రూ. 10 వేల కోట్లను కేటాయించారు. రాజకీయాలలో అవినీతిని అరికట్టేందు, పార్టీలకు వచ్చే విరాళాలను రూ. రెండు వేలకు కుదించి, ఆ పై మొత్తాలను విధిగా చెక్కు, డిజిటల్/ఎలక్టోరల్ బాండ్ల రూపంలోనే చెల్లించాలనే నిబంధన విధించారు. మొత్తంమీద 2017-18 వార్షిక బడ్జెట్ పాలనలో మరింత పారదర్శకతకు, అవినీతిని అరికట్టడానికి ప్రధానంగా ఉద్దేశించినట్లు కనబడుతున్నది. ■

**సుస్థిర వృద్ధి**

# 2017-18 కేంద్ర బడ్జెట్ - స్థూల విశ్లేషణ




**బడ్జెట్ అనేది కేవలం ప్రతిపాదిత బ్యాలెన్స్‌షీట్ అయినప్పటికీ ప్రభుత్వాలు బడ్జెట్‌ను ప్రధాన విధాన నిర్ణయాలు ప్రకటించే సందర్భంగా పరిగణించడం పరిపాటిగా మారింది. ఆర్థికమంత్రి ప్రస్తావించినట్టుగా, ఈ ఏడాది బడ్జెట్ టెక్ ఇండియా (సంస్కరణ, ఉద్దీపన, శుద్ధభారత్) అజెండాను ఆవిష్కరించింది. ప్రత్యక్ష పన్నుల పరంగా చూస్తే వందమందిలో ఏడుగురు మాత్రమే పన్ను చెల్లింపుదారులని ఆర్థిక సర్వే చెబుతోంది.**

బడ్జెట్ రూపకల్పన భారత రాజ్యాంగంలోని అధికరణాలు 112, 113, 114(3), 110(ఎ) క్రింద ప్రభుత్వానికి ఒక బాధ్యత. బడ్జెట్ అనేది కేవలం ప్రతిపాదిత బ్యాలెన్స్‌షీట్ అయినప్పటికీ ప్రభుత్వాలు బడ్జెట్‌ను ప్రధాన విధాన నిర్ణయాలు ప్రకటించే సందర్భంగా పరిగణించడం పరిపాటిగా మారింది. అయితే కాలక్రమంలో వార్షిక బడ్జెట్ సమర్పణ అనేక మార్పులకు లోనవుతూ వచ్చింది. ఈసారి కూడా మూడు ప్రధాన మార్పులు జరిగాయి. రైల్వే బడ్జెట్‌ను కేంద్ర బడ్జెట్‌లో విలీనం చేశారు. బడ్జెట్ సమర్పణ తేదీని ఒక నెల ముందుకు జరిపారు. అలాగే ఈసారి వ్యయాలకు సంబంధించి ప్రణాళిక, ప్రణాళికేతర వ్యత్యాసాలను తొలగించారు. ఈ మార్పులతో ప్రస్తుత బడ్జెట్ స్వరూపం గత బడ్జెట్‌లతో పోలిస్తే కొద్దిగా నూతనత్వాన్ని సంతరించుకుంది.

ముఖ్యంగా ఈసారి బడ్జెట్ సమర్పణ సందర్భాన్ని అవగాహన చేసుకోవడం అవసరం. బడ్జెట్ సమర్పణకు ముందు రెండు ప్రధాన విధాన మార్పులు చోటు చేసుకున్నాయి. ఒకటి పెద్ద నోట్ల రద్దు అయితే, మరొకటి జి.ఎస్.టి బిల్లు ఆమోదం. అంతర్జాతీయంగా అమెరికా, యూరప్‌లలో డీ గ్లోబలైజేషన్ ధోరణులు పెరుగుతున్న క్రూడ్ ఆయిల్ ధరలు, మందకొడి గ్లోబల్ రికవరీ భారత ఆర్థికవ్యవస్థలో అనిశ్చితికి తోడయ్యాయి. ఇటువంటి భారీ అనిశ్చితుల మధ్య పెద్దఎత్తున ఉద్యోగాల కల్పనకు దోహదపడేలా ఆర్థికవ్యవస్థను పునరుద్ధరించే చర్యలకోసం బడ్జెట్‌పై అంచనాలు భారీగా పెరిగాయి. ఇక్కడ బడ్జెట్‌పై అవగాహన, విశ్లేషణతో పాటు ఆర్థికవ్యవస్థపై ప్రభావాన్ని అంచనా వేసే ప్రయత్నం జరిగింది. ఆర్థికమంత్రి ప్రస్తావించినట్టుగా, ఈ ఏడాది బడ్జెట్ టెక్ ఇండియా (సంస్కరణ, ఉద్దీపన, శుద్ధభారత్) అజెండాను ఆవిష్కరించింది.

## ప్రస్తుత స్థూల ధోరణులు

2016-17 సంవత్సరానికి కేంద్ర గణాంక సంస్థ (సి.ఎస్.డబ్ల్యు) భారత గరిష్ట దేశీయోత్పత్తి పెరుగుదలను (ముందస్తు అంచనా)ను 7.1%గా అంచనా వేసింది. అయితే ఈ ముందస్తు అంచనాకు పెద్ద నోట్ల రద్దు ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకోలేదని సి.ఎస్.డబ్ల్యు తెలిపింది. ఎక్కువమంది విశ్లేషకులు పెద్దనోట్ల రద్దు వల్ల జి.డి.పి.లో ఒకటినుంచి రెండు శాతం తగ్గుదల ఉండవచ్చునని పేర్కొన్నారు. జి.డి.పి.లో

**ఎన్.ఆర్. భానుమూర్తి,** ప్రొఫెసర్, NIPFP, న్యూ ఢిల్లీ. E-mail: nrbmurthy@gmail.com
**ఎ. శ్రీహరి నాయుడు,** ఆర్థికవేత్త, NIPFP, న్యూ ఢిల్లీ. E-mail: sriharinaidua@gmail.com

వ్యవసాయరంగం పెరుగుదల మంచి వర్షాల కారణంగా ఎక్కువగా ఉండవచ్చునని భావిస్తుండగా, సేవారంగం పెరుగుదల కూడా 9 శాతం వరకు ఉండవచ్చునని అంచనా వేస్తున్నారు. ఇక పారిశ్రామిక రంగం పెరుగుదల మధ్యస్థంగా 5.2 శాతం (పట్టిక-1) ఉండవచ్చు. డిసెంబర్‌లో నమోదైన 3.4 శాతం ద్రవ్యోల్బణ ఆధారిత సి.పి.ఐ. రిజర్వ్‌బ్యాంక్ నిర్దేశిత లక్ష్యం కంటే బాగా తక్కువే వుంది. వాణిజ్యరంగానికి వస్తే ఎగుమతులు, దిగుమతులు రెండూ కూడా ఆందోళనకర రీతిలో తగ్గుదల ధోరణిని కొనసాగిస్తున్నాయి. దీనితో 2016-17 తొలి అర్ధభాగంలో కరెంట్ అకౌంట్ లోటు 0.3 శాతం తగ్గింది. ఆర్థికపరంగా ఏప్రిల్-నవంబర్‌లో లోటు నిర్ణీత లక్ష్యంలో 86 శాతాన్ని చేరినట్టు కనబడుతోంది. దీని ఆధారంగా 2016-17లో 3.5 శాతం ఆర్థికలోటు తేలే అవకాశం వుంది.

బ్యాంకింగ్ రంగంలో పెద్ద నోట్ల రద్దు దరిమిలా బ్యాంక్ డిపాజిట్లు పెరగడంతో రుణాలు / డిపాజిట్లపై వడ్డీరేట్లు తగ్గించారు. ఇందువల్ల ఎక్కువ రుణాలకోసం డిమాండ్ పెరిగే అవకాశం వుంది. తద్వారా అధిక వృద్ధి నమోదు కావచ్చు. ప్రస్తుతం పెట్టుబడుల (జి.ఎఫ్.సి.ఎఫ్) పెరుగుదల ప్రతికూలంగా -0-2తో ఆందోళనకరంగా ఉంది. సి.ఎమ్.ఐ.ఇ. డేటా కూడా బాగా పడిపోయింది. 50 రోజుల పెద్దనోట్ల రద్దు సమయంలో కొత్త ప్రాజెక్ట్ ప్రకటనలు 227 నుంచి 177కి తగ్గిపోయాయి.

**బడ్జెట్‌లో ప్రధానాంశాలు**

గత ఏడాది దివాళా కోడ్, సరళ ద్రవ్యోల్బణ టార్గెటింగ్ అండ్ మానిటరీ పాలసీ కమిటీ, ఆధార్ చట్టం, జి.ఎస్.టి. తదితర అనేక సంస్కరణల తరువాత ఈ ఏడాది బడ్జెట్ వివిధ రంగాలలో మరికొన్ని విధాన రూపకల్పనలను తీసుకువచ్చింది.

సాంప్రదాయ రంగాలు

వ్యవసాయం చేసే రైతుల ఇబ్బందులను మూడు దశలుగా చూడవచ్చు. కోతకు ముందు, కోత సమయం లోను, కోత తరువాత రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటారు. కోతకు ముందు సమస్యలు, పరపతి, ఎరువులు, సాగునీటికి సంబంధించినవి. కోత సమయంలో సమస్యలతో దుర్భిక్షం లేదా వరదల పరిస్థితి, వీటికి బీమా పథకం మొదలైనవి. పంట కోత తరువాత మార్కెటింగ్, గిట్టుబాటు ధర, మార్కెట్‌లకు ఉత్పత్తుల రవాణా మొదలైన సమస్యలు ఉంటాయి. భూమిహక్కు పత్రాల డిజిటలైజేషన్, గ్రామీణ విద్యుద్దీకరణ, గ్రామీణ ఆప్టికల్ ఫైబర్ కేబుల్ లైనింగ్ వంటి గత ఏడాది కార్యక్రమాలకు కొనసాగింపుగా ఈ ఏడాది భూసార ఆరోగ్యకార్డులు, ఫసల్‌బీమా యోజన, దీర్ఘకాల-స్వల్పకాల సాగునీటి నిధి, 'ఈ-నామ్' (ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్) మొదలైన కార్యక్రమాలు సక్రమంగా అమలు జరిగితే భారతీయ వ్యవసాయంలో కష్టనష్టాలు తగ్గవచ్చని భావించవచ్చు.

2017-18లో వ్యవసాయ పరపతిని బడ్జెట్‌లో 10 లక్షల కోట్ల రూపాయలకు పెంచారు. 2016-17లో ఇది రూ. 9 లక్షల కోట్లుగా ఉంది. దీర్ఘకాల, స్వల్పకాల ఇరిగేషన్ ఫండ్‌కు రు. 20,000 కోట్ల అదనపు కేటాయింపు జరిపారు. మార్కెట్ మార్పులు, సమీకృత వ్యవసాయ మార్కెట్‌లలో దళారీ వ్యవస్థను నిర్మూలించడానికి ప్రస్తుతం 250 మార్కెట్‌లలో ఉన్న ఈ-నామ్ వ్యవస్థను 585 మార్కెట్ కమిటీలకు విస్తరించనున్నారు.

**మౌలిక సదుపాయాలు :**

భారత్‌లో ప్రవేట్ పెట్టుబడులకు, విదేశీ పెట్టుబడులకు అరకొర మౌలిక సదుపాయాలు అవరోధంగా ఉన్నాయి. మౌలిక సదుపాయాల లోటుపాట్లను సరిదిద్దడానికి రోడ్లు, విద్యుత్, డిజిటల్ మౌలిక సదుపాయాల అభివృద్ధిపై బడ్జెట్

**పట్టిక - 1 : స్థూల ఆర్థిక సూచికలలో ఇటీవలి ధోరణలు**

| సూచిక/సంవత్సరం | 2012 2013 | 2013 2014 | 2014 2015 | 2015 2016పి.ఇ. | 2016 2017పి.ఇ. |
|---|---|---|---|---|---|
| జి.వి.డి. ఎట్ బేసిక్‌ప్రైసెస్17పి.ఇ. (గ్రోత్ రేట్) | 5.4 | 6.3 | 7.1 | 7.2 | 7.1 |
| జిఎఫ్‌సిఎఫ్ (గ్రోత్‌రేట్) | 4.9 | 3.4 | 4.9 | 3.9 | -0.2 |
| గ్రాస్ డొమెస్టిక్ సేవింగ్(జిడిపిలో) | 33.8 | 33 | 33 | -- | -- |
| అగ్రికల్చర్ (గ్రోత్ రేట్) | 1.5 | 4.2 | -0.2 | 1.2 | 4.1 |
| ఇండస్ట్రీ (గ్రోత్ రేట్) | 3.6 | 5 | 5.9 | 7.4 | 5.2 |
| సర్వీసెస్ (గ్రోత్ రేట్) | 8.1 | ఓ7.8 | 10.3 | 8.9 | 8.8 |
| ద్రవ్యోల్బణం-సిపిఐ(వార్షికసగటు) | 10 | 9.4 | 5.8 | 4.9 | 3.41# |
| కరెంట్ అకౌంట్ లోటు (జిడిపిలో) | 4.8 | 1.7 | 1.3 | 1.1 | 0.3 |
| ఎగుమతులు (గ్రోత్ రేట్) | 6.7 | 7.8 | 1.7 | -5.2 | 2.2 |
| దిగుమతులు (గ్రోత్ రేట్) | 6 | -8.2 | 0.8 | -2.8 | -3.8 |
| రెవెన్యూ లోటు (జిడిపిలో) | 3.7 | 3.2 | 2.9 | 2.5 | 2.3 |
| ఆర్థిక లోటు (జిడిపిలో) | 4.9 | 4.5 | 4.1 | 3.9 | 3.5 |

ఎకనామిక్ సర్వే 2016-17, సిఏడి ఫర్ ఫస్ట్ హాఫ్ 2016, # డేటా ఫర్ డిసెంబర్ 2016

ప్రత్యేక దృష్టి పెట్టింది. 2018 మే ఒకటి నాటికి నూరుశాతం గ్రామీణ విద్యుద్దీకరణ సాధించాలని ప్రభుత్వం ఉద్దేశిస్తోంది. ఇందు కోసం దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామజ్యోతి యోజన పథకానికి రూ.4814 కోట్లు కేటాయించారు. ప్రధానమంత్రి గ్రామసడక్ యోజన (పి.ఎం.జి.ఎస్.వై) క్రింద 2016-17లో రోజువారీ రోడ్ల నిర్మాణం 133 కిలోమీటర్లకు చేరుకుంది. ఇది 2011-2014లో సగటున 73 కి.మీ గా ఉండేది. ఈ పథకానికి 2017-18 బడ్జెట్‌లో రూ 19,000 కోట్లు కేటాయించారు. రైల్వేలకు బడ్జెట్‌లో విస్తరణ ప్రతిపాదనల కోసం రూ. 55,000 కోట్లు కేటాయించారు. మొత్తంగా రవాణా రంగానికి బడ్జెట్‌లో రూ. 2.41 లక్షల కోట్లు ప్రత్యేకించారు. రవాణా రంగంలో విస్తరణ ద్వారా వృద్ధిరేటును పునరుద్ధరించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టినట్టుగా కనబడుతోంది. ఇది ఉపాధికి ఎక్కువ అవకాశాలు ఉన్న రంగం కావడం, ఇతర రంగాల అభివృద్ధితో ముడిపడివున్న రంగం కావడంతో కేటాయింపుల పెంపు సమ్మిళిత వృద్ధికి దోహదపడవచ్చు.

**బడ్జెట్ - స్థూల ఆర్థికాంశాలు**

బడ్జెట్‌లోని ప్రధాన విధాన నిర్ణయాలలో ఆర్థిక / ద్రవ్యలోటు లక్ష్యాలకు సంబంధించినది ప్రధానమైనది. అంతర్జాతీయ రేటింగ్ సంస్థల నుంచి ఒత్తిడుల నేపథ్యంలో ప్రభుత్వం ప్రస్తుతం ఎఫ్.ఆర్.బి.ఎమ్ నిబంధనకు అనుగుణంగా 3% ఆర్థికలోటుకు కట్టుబడి వుండొచ్చన్న అంచనాలు ఉన్నాయి. పెట్టుబడుల పునరుద్ధరణకు ఎఫ్.ఆర్.బి.ఎం కొత్తగా సిఫారసు చేసిన విధానం స్పష్టంగా లేకపోయినా బడ్జెట్ మాత్రం తన ఆర్థికలోటు లక్ష్యం నుంచి మరలి 3.2 శాతంగా (3% లక్ష్యానికి భిన్నం)గా నిర్ధారించింది. ఇక్కడ ముఖ్యమైన అంశం రెవెన్యూ లోటును 2.3% నుంచి 1.9% తగ్గించడం. అలాగే పెట్టుబడి వ్యయాన్ని 1.1 శాతం నుండి 1.3 శాతానికి పెంచడం. మా దృష్టిలో ఇది ఆర్థిక వ్యవస్థను విస్తరించి సుస్థిరపరిచే చర్య. అయితే ఎఫ్.ఆర్.బి.ఎం 2023 నాటికి కేంద్రానికి 60 శాతం మధ్యకాలిక పరపతి విధానాన్ని (కేంద్రం 40%, రాష్ట్రాలు 20%) సూచించినట్టు కనవడుతోంది. మధ్యకాలిక పెరుగుదల, అభివృద్ధి లక్ష్యాల సాధనకు ఈ విధానం దోహదపడాలి.

**పట్టిక - 2 : మౌలిక సదుపాయాలకు కేటాయింపు ధోరణులు**

| **రంగాలు** | **2015-16** | **2016-17 ఆర్‌ఇ** | **2017-18 బిఇ** |
|---|---|---|---|
| ఎమ్‌జిఎన్‌ఆర్‌ఇజిఎస్ | 38,500 | 47,499 | 48,000 |
| ప్రధానమంత్రి ఆవాస్ యోజన | 20,075 | 20,936 | 29,043 |
| ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన | 19,000 | 19,000 | 19,000 |
| అమృత్ | 7,296 | 9,559 | 9,000 |
| ఆప్టికల్ ఫైబర్ కేబుల్ నెట్‌వర్క్ ఫర్ డిఫెన్స్ సర్వీసెస్ | 2,710 | 3,210 | 3,000 |
| భారత్ నెట్ | 0 | 6,000 | 10,000 |
| మెట్రో ప్రాజెక్టులు | 10,000 | 15,700 | 18,000 |
| దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామజ్యోతి యోజన | 8,500 | 7,874 | 10,635 |
| సాగరమాల | 450 | 406 | 600 |
| పేదకుటుంబాలకు ఎల్‌పిజి | 2,000 | 2,500 | 2,500 |
| రైల్వేలు | 30,121.2 | 35,007.9 | 55,000 |
| **మొత్తం** | **1,38,652.2** | **1,67,691.9** | **1,87,678** |

బడ్జెట్ - స్థూల ఆర్థికాంశాలు

**రెవెన్యూ సమీకరణ విధానాలు :**

జి.ఎస్.టి., నోట్ల రద్దు వల్ల పన్ను చెల్లింపు నిబద్ధత పెరగవచ్చు. పన్ను ఆదాయంపై బడ్జెట్ అంచనాలను ఇది ప్రభావితం చేయవచ్చు. టాక్స్ ఇన్‌ఫర్మేషన్ నెట్‌వర్క్-టిన్-ను ప్రవేశపెట్టిన తరువాత 2003-2007 మధ్య ఈ ధోరణి కనిపించింది. పెట్టుబడి చెల్లింపులు గత కొన్ని సంవత్సరాల మాదిరిగా రూ 72,000 కోట్లుగా బడ్జెట్ భావిస్తోంది. ఇతర చెల్లింపులు (ఎక్కువగా పెట్టుబడి ఉపసంహరణలు) కూడా క్లిష్టమైన లక్ష్యంగానే కనిపిస్తున్నాయి. మార్కెట్ రుణాల సర్దుబాటు తరువాత నగదు బ్యాలెన్స్ నుంచి సుమారు రెండు లక్షల రూపాయలను ప్రభుత్వం ఆశిస్తోంది. 2017-18లో 11.75 శాతం నామమాత్రపు జిడిపి అంచనా ఆధారంగా (2016-17లో 11శాతం) కూడా ఈ అభిప్రాయం వ్యక్తమవుతోంది. జులై ఒకటి నుంచి అమలులోకి వచ్చే జి.ఎస్.టి. రేట్లపై కూడా ఇది ఆధారపడి వుంది. ప్రత్యక్ష పన్నుల పరంగా చూస్తే వందమందిలో ఏడుగురు మాత్రమే పన్ను చెల్లింపుదారులని ఆర్థిక సర్వే చెబుతోంది. పన్ను చెల్లింపు వ్యవస్థను విస్తృతపరచడానికి బడ్జెట్ దిగువ శ్లాబ్‌లో పన్ను 5 శాతానికి తగ్గించింది. ఇందువల్ల మరింతమంది పన్ను చెల్లించేందుకు ముందుకు వస్తారని మేము (రచయితలు) భావిస్తున్నాం. అలాగే ఈ చర్య పన్ను రేట్లతో అస్థిరతను కూడా సృష్టించవచ్చు. రిటర్న్లు దాఖలు, ఇ.ఫైలింగ్ సరళీకరణ ఇతర సంస్కరణ చర్యలుగా భావించాలి.

### బ్యాంకింగ్ సంక్షోభం – ఎన్‌పిఎ సమస్యలు :

పాలసీ వడ్డీరేట్లు తగ్గినా భారత్‌లో ప్రయివేటు పెట్టుబడుల కొరతకు ఒక ప్రధాన కారణం బ్యాంకింగ్ రంగంలో ద్వంద్వ బ్యాలెన్స్‌షీట్ సంక్షోభం. పెద్ద నోట్ల రద్దు పెద్ద ఎత్తున డిపాజిట్ల సమీకరణకు, బ్యాంక్ బ్యాలెన్స్‌షీట్‌ల సాధారణ స్థితి పునరుద్ధరణకు సహాయపడినప్పటికీ పున:పెట్టుబడీకరణకు బడ్జెట్ దోహద పడగలదని అంచనాలు సాగాయి. గత ఏడాది రూ. 25,000 కోట్ల కేటాయింపుతో పోలిస్తే ఈ బడ్జెట్ రూ.10,000 కోట్లు మాత్రమే కేటాయించింది. ప్రభుత్వ రంగ బ్యాంకుల నిరర్థక ఆస్తులు గణనీయంగా పెరిగినా ఈ కేటాయింపు బ్యాంకులకు పెద్దగా ఉపకరించకపోవచ్చు. అయితే గత ఏడాది నుంచి తీసుకున్న దివాళా కోడ్, రుణరికవరీ, ట్రైబ్యునల్స్, సర్ఫేశి చట్టసవరణ, బ్యాంక్ బోర్డు బ్యూరో, ఇంద్రధనుష్ పథకం వంటి చర్యలు దీర్ఘకాలంలో బ్యాంకులకు ప్రయోజనం కల్పించవచ్చు.

### నోట్ల రద్దు – బడ్జెట్:

పెద్ద నోట్ల రద్దు తరువాత ఆర్థికవ్యవస్థలోని కొన్ని విభాగాలలో వైరుధ్య ధోరణులు, అస్తవ్యస్త ధోరణులు కానవచ్చాయి. రంగాలవారీగా సియామ్ సంస్థ వెల్లడించిన వివరాలు చూస్తే ఆటోమొబైల్ రంగం విక్రయాలు 2016 డిసెంబర్‌లో 18.66 శాతం ద్విచక్ర, త్రిచక్ర వాహనాల అమ్మకాలు 22.04, 36.23 శాతం తగ్గాయి. నైట్ ఫ్రాంక్ వివరాల ప్రకారం రియల్ ఎస్టేట్ రంగం అమ్మకాలు 2016 ఆఖరి త్రైమాసికంలో 50 శాతం పైగా పడిపోయాయి. జిడిపిపై నోట్ల రద్దు ప్రతికూల ప్రభావం 0.25 నుంచి ఒకటి శాతం మేర ఉండవచ్చునని ఆర్థిక సర్వే అంచనా వేసింది.

మరోవైపు జి.డి.పి పెరుగుదల మందగింపుతో నిమిత్తం లేకుండా నోట్ల రద్దు తర్వాత పన్ను రాబడులు గణనీయంగా పెరుగుతుండడం కనిపిస్తోంది. కార్పొరేట్ పన్ను 4.4 శాతం, ఆదాయపన్ను 24.6 శాతం, కేంద్ర అమ్మకం పన్ను 43 శాతం, సేవా పన్ను 23.9 శాతం కస్టమ్స్ సుంకం 4.1 శాతం పెరుగుదలను నమోదు చేశాయి. నోట్ల రద్దు తరువాత పన్ను చెల్లింపు వ్యవస్థ విస్తృతమైనట్లు ఈ ధోరణి సూచిస్తోంది. ఇంతకుముందు లెక్కకురాని లావాదేవీలను సమర్థంగా లెక్కలోకి తేగలిగితే వాటిపై పన్ను చెల్లింపు సాధ్యం కాగలదు. ఆర్థిక సర్వే ప్రకారం, జాతీయ చెల్లింపుల సంస్థ (ఎన్ డి సి ఐ) వివరాల ప్రకారం రూపే ఆధారిత ఎలక్ట్రానిక్ లావాదేవీలు గత కొద్ది నెలలలో రూ. 13,000 కోట్లు, పి.డబ్ల్యు.ఎస్. లావాదేవీలు, రూ 2000 కోట్లు, ఇ.కామర్స్ లావాదేవీలు 300-400 శాతం పెరిగాయి.

కాగా నగదు లావాదేవీలు జరిగినంతకాలం నల్లధనం నియంత్రణ సాధ్యంకాదనేది సాధారణ అభిప్రాయం. ఈ దిశగా బడ్జెట్‌లో అదనపు చర్యలుగా రూ. 3 లక్షలకు మించిన ఎటువంటి ఆదాయం పైనైనా పన్ను విధింపున ప్రతిపాదించారు. దీనిద్వారా దీర్ఘకాలంలో నగదు రహిత చెల్లింపు వ్యవస్థల వినియోగం పెరిగే దిశగా ఆర్థికవ్యవస్థను మళ్ళించడం ప్రభుత్వ ఉద్దేశం. పన్ను చెల్లింపులూ పెరుగుతాయి. ఫలితంగా నల్లధనం ఉత్పత్తికి కళ్లెం పడుతుంది.

### బడ్జెట్ – డిజిటల్ ఆర్థిక వ్యవస్థ :

ఆర్థికవ్యవస్థను నగదు నుంచి నగదురహితం దిశగా మార్చేందుకు చెల్లింపుల మౌలిక వ్యవస్థలో గణనీయమైన అభివృద్ధి అవసరం. ఈ విషయంలో భారత్ మూడు ప్రధాన సవాళ్ళను ఎదుర్కొంటోంది. సైబర్‌భద్రత, డిజిటల్ మౌలిక సదుపాయాలు, డిజిటల్ లావాదేవీల వ్యయం, బడ్జెట్ కొంతమేరకు మొదటి రెండు సవాళ్ళకు పరిష్కారాలు చూపింది.

### సైబర్ భద్రత :

పెరుగుతున్న సైబర్ దాడులనుంచి ఆర్థికరంగం సుస్థిరతకు, సమగ్రత పరిరక్షణకు బడ్జెట్ మన ఆర్థిక రంగానికి కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (సిఇఆర్‌టి – ఫైనాన్స్)ను ప్రతిపాదించింది.

### డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ :


డిజిటల్ మౌలిక సదుపాయాల వ్యవస్థను మెరుగుపరచడంలో భాగంగా బడ్జెట్ భారత్ నెట్, డిజిగావ్, మోడిఫైడ్ స్పెషల్ ఇన్సెన్‌టివ్ ప్యాకేజి (ఎమ్ – సిప్స్) కార్యక్రమాలపై కేటాయింపులు పెంచడం ద్వారా ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ విధానాలు దేశీయంగా మాన్యుఫ్యాక్చరింగ్ ఎకో–సిస్టమ్‌కు దోహదపడే డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను అభివృద్ధి పరుస్తామని ఆశించాలి.

### బడ్జెట్‌తో సమ్మిళిత వృద్ధి సాధ్యమేనా?

అధికంగా ఉద్యోగ అవకాశాలు కల్పించగల అభివృద్ధిని ఎలా సాధించాలనేది ఇండియా ఎదుర్కొంటున్న ప్రజా విధాన సవాళ్ళలో ప్రధానమైనది. ఇందుకోసం తయారీ రంగం వాటాను 25 శాతం పెంచే మధ్యకాలిక లక్ష్యాన్ని నిర్దేశించినప్పటికీ, ఈ రంగంలో ఇటీవలి ప్రతికూల ధోరణులు పెద్ద సవాల్‌ను విసురుతున్నాయి. ఈ నేపథ్యంలో పాక్షికంగా ఈ సమస్య పరిష్కారానికి బడ్జెట్ ఒక ప్రయత్నం చేసింది. మానవవనరులు ఎక్కువగా అవసరమయ్యే గృహనిర్మాణం, పర్యాటకం, రోడ్ల నిర్మాణం, ఇతర మౌలిక సదుపాయాలకు బడ్జెట్ ప్రాధాన్యం కల్పించింది. అయినా ఎంతో అవసరమైన నిర్మాణాత్మక మార్పుకు, విస్తరణకు ఇతర అంశాలలో కూడా విధాన సంస్కరణలు అవసరం. ముఖ్యంగా భూమి, కార్మికులకు సంబంధించి అవసరమైన సంస్కరణలను బడ్జెట్ గుర్తించింది.

*తరువాయి 17వ పేజీలో...*

# స్వాత్ ఎనాలసిస్ - భారత ఆర్థికవ్యవస్థ-సర్వే 2016-17




**పెద్దనోట్ల రద్దు విజయవంతంగా అమలవడం వలన, రానున్న కాలంలో అవినీతి తగ్గుదల, పొదుపు పథకాల అమలు, వృద్ధి మరియు పన్ను కట్టేస్థాయి పెరగడం, గమనించవచ్చు. జీఎస్‌టీ బిల్లు పార్లమెంట్ ఆమోదం పొంది అమలులోకి రావడం వల్ల దేశమంతా ఒకే పన్ను, ఒకే మార్కెట్ విధానంలో భారీ పెట్టుబడులు, వాటి వృద్ధి, వనరుల వినియోగం జరిగి ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది.**

ప్రస్తుత ఆర్థికవృద్ధిని దృష్టిలో పెట్టుకుని, పార్లమెంటులో జనవరి 31, 2017 నాడు భారత ఆర్థికవ్యవస్థపై నిర్వహించిన ఆర్థిక సర్వేను ప్రకటించారు. దీనిలో ప్రస్తుతం ఎదుర్కొంటున్న సవాళ్ళు, వాటిని అధిగమించే మార్గాలు, వాదనలకు సంబంధించిన అనేక విషయాలను పొందుపరచారు. ఎంతో కష్టంతో, క్లిష్టమైన అంశాలతో కూడిన ఈ సర్వేలో ప్రభుత్వ రంగ నిపుణులు, ఆర్థికవేత్తలు, మేధావులు పాలుపంచుకున్నారు. గత రెండు సంవత్సరాలుగా అందిస్తున్నట్లు కాకుండా ప్రస్తుతం ఈ వివరాలు సంక్షిప్తంగా నమోదు చేసినవి. త్వరలో పూర్తి నివేదిక ఆర్థికసర్వే 2016-17ను సమర్పిస్తారు. ఈ సర్వే నాలుగు ముఖ్యాంశాలను గురించి ప్రసావిస్తుంది. ఆర్థిక వ్యవస్థకు సంబంధించి భారతదేశ ఆర్థికవ్యవస్థ బలాలు, బలహీనతలు, అవకాశాలు, మరియు అవరోధాలు. ఈ వివరాల సేకరణకు సాహిత్య మరియు భావనల గురించి వార్తా పత్రికలు మరియు వివిధ ప్రసార సాధనాల సహాయం తీసుకోవడంతో పాటు, నూతన ఆర్థిక పరిశోధకులను, సంస్థలను, ప్రభుత్వ రంగ నిపుణులను సంప్రదించడం జరిగింది. ప్రస్తుతం అందిస్తున్న విషయాలు, భారత ఆర్థిక వ్యవస్థలోని నిగూఢంగా వున్న బలాలు, బలహీనతలు, అవకాశాలు, మరియు అవరోధాలను బయటపెడుతున్నాయి.

భారత ఆర్థిక వ్యవస్థ బలాలు

1. ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రస్తుత తరుణంలో భారతదేశం మాత్రం సుస్థిర ఆర్థిక వ్యవస్థతో కొనసాగుతుంది. ఈ ఆర్థిక సర్వే ప్రకారం వృద్ధిరేటు 6.5%-6.75% మధ్యలో వున్నది. ద్రవ్య విధాన కమిటీ ప్రకారం సుమారు 7% వున్నట్లయితే మన వృద్ధిరేటు త్వరగా పెరిగినట్లే. ద్రవ్యోల్బణస్థాయి ప్రస్తుతం 4 నుండి 5 శాతం మధ్యలో వున్నది. జీడీపీలో ద్రవ్య లోటుతో పాటు డాలరు-రూపాయల మారకం విలువలు స్థిరంగా వున్నాయి. పన్నుల ద్వారా మరియు పన్నేతర ఆదాయవనరులను సమకూర్చుకునే విధానంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత రెండు సంవత్సరాలుగా అనేక మార్గాలను అవలంబినస్తా స్థిరంగానే వున్నాయి.
2. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను సరళతరం

**రవీంద్ర హెచ్. ధొలాకియ,** ప్రొఫెసర్. ఐ.ఐ.ఎం., అహ్మదాబాద్.
E-mail: rdholkia@iima.ac.in

చేయడంతో దేశంలోకి విదేశీ పెట్టుబడులు గణనీయంగా పెరిగాయి. తద్వారా స్థూల జాతీయోత్పత్తి 2015-16 ఆర్థిక సంవత్సరానికి 1.7 శాతం వుండగా, 2016-17 సంవత్సరానికి 3.2 శాతంగా వుంది. ఫోరెక్స్ నిల్వలు 360 బిలియన్ డాలర్లుగా వున్నాయి. 2016, డిసెంబర్ తర్వాత ఇవి మరింతగా పెరగవచ్చు.

3. ద్రవ్యోల్బణాన్ని 2015-16లో రిటైల్ ధరల ఆధారంగా మరియు టోకు ధరల ఆధారంగా గణించగా ప్రస్తుతం ఇవి రెండు స్థిరంగానే కొనసాగుతున్నాయి. దీనివల్ల స్థూల జాతీయోత్పత్తిలో పెరుగుదల ఉండడమే కాక, ప్రభుత్వ ఆదాయం కూడా పెరిగే అవకాశాలుంటాయి.

4. పెద్దనోట్ల రద్దు విజయవంతంగా అమలవడం వలన, రానున్న కాలంలో అవినీతి తగ్గుదల, పొదుపు పథకాల అమలు, వృద్ధి మరియు పన్ను కట్టేస్థాయి పెరగడం, గమనించవచ్చు.

5. జీఎస్టీ బిల్లు పార్లమెంట్ ఆమోదం పొంది అమలులోకి రావడం వల్ల దేశమంతా ఒకే పన్ను, ఒకే మార్కెట్ విధానంలో భారీ పెట్టుబడులు, వాటి వృద్ధి, వనరుల వినియోగం జరిగి ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది.

6. ప్రపంచస్థాయి ఎగుమతులలో భారత దేశం ఇతర దేశాలతో పోటీపడుతోంది. ఎగుమతుల వృద్ధి క్రమంగా పెరుగుతుంది.

7. దేశ అంతర్గత వస్తుసేవల వినియోగం, దేశీయ వాణిజ్యం సుమారుగా స్థూల జాతీయోత్పత్తిలో 54% వుంది అలాగే ప్రపంచ వాణిజ్యంలో 1.7 శాతంగా నమోదైంది. అంతర్గత వలసలలో కూడా తగ్గుదల చూడవచ్చు.

8. ప్రస్తుతం వచ్చే మార్పులకు అనుకులంగా, భారతదేశం కూడా పెట్రోలు మరియు డీజిల్‌లపై పన్నులు విధిస్తున్నది.

9. భారతదేశానికి వున్న మరొక అద్భుతమైన వనరు, మానవనరులు- పెద్ద పెద్ద రాష్ట్రాలలో విస్తరించివున్న మానవవనరులను సద్వినియోగం చేసుకుంటూ భవిష్యత్తు ఆర్థిక వనరులను విస్తరింపచేస్తున్నాయి. ఇతర దేశాలతో పోల్చితే, మన వద్దే మానవ వనరుల స్థాయి ఎక్కువ.

10. జనధన్ యోజన, ఆధార కార్డుల పంపిణీ మరియు నగదు రహిత లావాదేవీలు, మొబైల్ ఫోన్స్ వినియోగం లాంటి వాటివల్ల మారుమూల ప్రాంతాల వారికి కూడా ఆర్థిక ప్రయోజనాలు నేరుగా అందుతున్నాయి.

11. వైద్యరంగానికి సంబంధించి మౌలిక వసతుల వృద్ధివలన, జీవన ప్రమాణ స్థాయి పెరుగుదల, సంతానోత్పత్తి రేటు పెరుగుదల భారతదేశ మంతా చూడవచ్చు.

12. ఇదే స్థితిలో కనుక ఆర్థిక వృద్ధిని నమోదు చేసుకుంటూ వెళితే రానున్న కాలంలో 8 నుండి 10 శాతం ఆర్థిక వృద్ధిని సాధించవచ్చు. ప్రపంచ దేశాలకు పోటీనిస్తూ భారత దేశం విదేశీ పెట్టుబడుల మదుపును ప్రోత్సహిస్తుంది. అతి ముఖ్యమైన అంశాన్ని ఈ ఆర్థిక సర్వేలో పొందుపరచలేదు. అదే భారత ప్రజాస్వామిక భాగస్వామ్యం అన్ని రంగాలలో ప్రజల భాగస్వామ్యం. అంతేకాక ప్రభుత్వ, ప్రభుత్వేతర, రంగాలలో కీలక నిర్ణయాలలో కూడా ప్రజల భాగస్వామ్యం, ప్రపంచ దేశాలు భారత్‌లో పెట్టుబడులు పెట్ట డానికి సిద్ధపడేలా చేస్తున్నాయి.

**భారత ఆర్థిక వృద్ధి - బలహీనతలు**

1. ఆర్థిక వ్యవస్థలో అతిపెద్ద బలహీనత, ఇక్కడి సాంఘిక భావనలు అభిప్రాయాలు, ఆదాయ వనరుల పంపకంలో తలెత్తే భేదాలు, సేవల వినియోగంలోగల అసమానత, మార్కెట్ పంపిణీ వ్యవస్థలో క్రమబద్ధీకరణ, ప్రైవేటు భాగస్వామ్యం మరియు ఆదాయ హక్కుల విషయాలలో కల సంధిగ్ధత. వీటితో పాటు పాశ్చాత్య అభివృద్ధిని దోహదపడిన అంశాలలో మన దగ్గర సామాజిక రాజకీయ వ్యవస్థతో పాటు ఆర్థిక వ్యవస్థను తక్కువ చేసి చూడడం కూడా ఆర్థిక వృద్ధిని బలహీనం చేస్తున్నది.

2. వనరుల పంపిణీ అన్నది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత కాని అవి సరిగా అమలు కావడంలేదు. వస్తు-వినిమయ సేవల బిల్లు ఆమోదం పొందినప్పటికీ, దీనిలో గల క్లిష్టత వల్ల అమలు సరైన స్థాయిలో జరగడంలేదు.

3. ప్రభుత్వరంగ, ప్రైవేటురంగ వ్యవస్థల పట్ల సరియైన భావనలు, లేకపోవడం గందరగోళానికి దారితీస్తున్నది. దీని వలన వస్తు ఉత్పత్తిలో ఆలస్యం, మధ్యలోనే విరమణ, ప్రభుత్వరంగం నియంత్రణలో లేకపోవడం, ప్రణాళికలు సరిగా అమలు కాకపోవడం ఆస్తి హక్కులపై అనిశ్చిత కూడా కారణం.

4. విద్యా, వైద్య రంగాలు అందించే సేవలలో ఎక్కడ కూడా మంచి ఫలితాలు కనిపించటంలేదు. ఈ రెండు రంగాలలో ఎదురవుతున్న, అనిశ్చితి, సవాళ్ళు అన్నీ పెద్ద బలహీనతలుగా మారాయి.

5. ప్రైవేటు భాగస్వామ్య పెట్టుబడులు తగ్గడమే కాక, ఎగుమతుల స్థాయి అనుకున్న రీతిలో పెరగడంలేదు. ప్రైవేటు పెట్టుబడులు, ఎగుమతుల పెరుగుదలలో వృద్ధి కారాకాలు.

6. కార్పోరేటు, బ్యాంకుల బ్యాలెన్స్ షీట్స్ విపరీతమైన ఒత్తిడితో ఉన్నాయి. నూతన పెట్టుబడులు వచ్చే అవకాశం క్షీణించడంవల్ల బ్యాంకులు కూడా పెట్టుబడులు ఇచ్చేందుకు సిద్ధంగా లేవు. దీనికి కారణం సమస్యాత్మక రుణాలు, అవి వసూలు కాకపోవడం.

7. పన్నేతర ఆదాయన్ని వసూలు చేయటంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైనది. దీనికి కారణాలు స్పెక్ట్రమ్ రశీదులు, పెట్టుబడులలో లోపం, ప్రభుత్వరంగం డివిడెండ్ల పతనం. ఇవి భవిష్యత్తులో పెరిగే అవకాశాలు కూడా లేవు.

8. రాష్ట్రాల కోశాదాయం తగ్గుదల, బడ్జెట్‌లలో పెరుగుదలలు ఆదాయ వ్యయాల మధ్య అంతరాన్ని పెంచు తున్నాయి. UDAY స్కీమ్ కూడా దీనికి ఒక కారణం. ఈ సంవత్సరం కోశాదాయంలో స్వల్ప పెరుగుదలలు వుండవచ్చు. అక్టోబర్, 2016తో పోల్చినపుడు జనవరి, 2017కు వడ్డీ రేట్లు కొంత పెరిగి ప్రభుత్వానికి ఆదాయం లభించింది.

9. ద్రవ్యోల్బణ వృద్ధి, స్థూల జాతీయోత్పత్తి తగ్గుదల, ప్రాథమిక రంగంలో కొరతలు కూడా అనుకున్న స్థాయిలో ఫలితాలు రాకపోవడానికి కారణం అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వృద్ధి రేటు తగ్గింది.

10. దేశమంతా అమలు జరుగుతున్న పలు సంక్షేమ పథకాలు, సరిగా అమలు జరగడం లేదు. అంతేకాక అందాల్సిన వారికి అందడంలేదు. మరియు కొన్ని పథకాలు అమలవుతున్న ప్రదేశాలలో పేదల నిష్పత్తి ఎక్కువగా ఉండడం కూడా ఒక కారణం.

11. 2020 నాటికి పనిచేసే వయస్సుగల ప్రజలు మరియు పనిచేయలేని వయస్సు ప్రజల మధ్య నిష్పత్తి 1:7గా ఉంటుంది. బ్రిక్స్ దేశాలతో పోల్చినప్పుడు ఇది చాలా తక్కువ నిష్పత్తి. దీనివల్ల పనిచేసే జనాభా తగ్గుతుంది. భారతదేశం మానవవనరులపై కూడా శ్రద్ధవహించి ఈ నిష్పత్తిని పెంచేలా సుదీర్ఘ భవిష్యత్తు చర్యలు తీసుకోవాలి.

12. ప్రస్తుత సంవత్సరాలలో పెట్టుబడులు మరియు మదుపుల శాతం గణనీయంగా తగ్గుతోంది.

13. భారతదేశంలో ఆర్థిక అసమానతలు, ఆదాయం తగ్గుదలలు పెరుగుతు న్నాయి.

**భారత ఆర్థికవృద్ధి – అవకాశాలు**

1. ఆర్థిక వ్యవస్థను దివాళా తీసే అంశాల పట్ల కఠిన చట్టాలు అమలు చేస్తూ, వనరుల వినియోగాన్ని పెంచడం.

2. ఆధార్ కార్డుల సక్రమ వినియోగాన్ని బలోపేతం చేయడం, క్రయ విక్రయా లలో డిజిటలైజేషన్‌ను సంపూర్ణంగా ప్రవేశపెట్టి, ప్రభుత్వ పథకాలు సక్ర మంగా లబ్ధిదారులకే అందేలా చేయటం.

3. నైపుణ్యత, పెట్టుబడులు మరియు సాంకేతిక పరిజ్ఞానానికి పెద్దపీట వేస్తూ పరస్పర సహకార అంశాలను ప్రోత్సహించడం.

4. సంస్కరణలు అమలు పాక్షికంగా ఉన్న చోట దానిని సంపూర్ణంగా పూర్తి చేయడంలో రాజకీయ రంగాన్ని కూడా వినియోగించడం. ముఖ్యంగా పెద్ద నోట్ల రద్దు తర్వాత తలెత్తిన పరిస్థితిని నియంత్రించి, కేంద్ర ప్రభుత్వం తన బలాన్ని పార్లమెంట్‌లో నిరూపించు కుంది.

5. డాలర్ మారకం విలువ పెరుగుదల తద్వారా, అమెరికా ఆర్థిక వృద్ధి రేటు, చైనా ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపి అక్కడి ఎగుమతులను తగ్గించింది. దీనితో చైనా దేశీయ వ్యాపారం దెబ్బతిన్నది. ఇది భారత్‌కు లాభించే విధానం. చైనా వదిలివేసిన ఆ స్థానాన్ని భారత్ ఎగుమతుల ద్వారా ఆక్రమించ వచ్చు.

6. ఆర్థికంగా అభివృద్ధి చెందిన దేశాలు ముఖ్యంగా అమెరికా మరియు జర్మనీలు, అభివృద్ధి చెందుతున్న దేశాలు ముఖ్యంగా భారత్ ఎగుమతులను పునరుద్ధరించుకోవచ్చు.

7. బ్రెగ్జిట్ పోల్ అనంతరం ఎగుమతుల విషయంలో భారత్‌తో బ్రిటన్ వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడానికి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. దీనితో ఉద్యోగస్థల పెరుగుదల, ఎగుమతులలో పెరుగుదల జరుగు తుంది.

8. అమెరికా స్థానిక వాణిజ్య ఒప్పందాలలో అనిశ్చితి, ప్రపంచ వాణిజ్య సంస్థ ఒప్పందాలు మరియు సరళ నియమాలు, బహుళ ప్రయోజన అవకాశాలు, భారత్‌కు లాభించే అంశాలు.

9. పెద్ద పెద్ద రాష్ట్రాలతోవున్న భారతదేశం, జనాభా పరంగా వ్యత్యాసాన్ని కలిగివుంది. ఈ రాష్ట్రాలను రెండు భాగాలుగా విభజించినట్లయితే, ద్వీపకల్ప రాష్ట్రాలు : పశ్చిమబెంగాల్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ మరియు కర్ణాటక, భూదిగ్బంధ రాష్ట్రాలు: మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ మరియు బీహార్. ద్వీపకల్ప రాష్ట్రాలలో యువజనుల సంఖ్య ఎక్కువ. ఇలాంటి జనాభా వ్యత్యాసం, అవకాశాలను కల్పించడంతో పాటు, ఆదాయ పెరుగుదల మరియు సంక్షేమాన్ని అందిస్తుంది.

10. వివిధ దేశాలతో పోల్చినపుడు, భారత దేశంలోని ద్వీపకల్ప రాష్ట్రాల అధిక

జనాభా, ప్రయోజనం 2020 నాటికి చేరుతుందని అంచనా! అయితే భూదిగ్బంధ రాష్ట్రాల జనాభా విభాజం 2040 నాటికి అత్యున్నత స్థానం చేరుకుంటున్నది. దీనివలన మన జనాభా విభాజం యొక్క పనివృద్ధి చాలా సంవత్సరాలు నిరాగాటంగా కొనసాగుతుంది. ఇది భారతదేశార్థిక వృద్ధికి కలిసి వచ్చే అంశం. దీని వలన సహజ అవకాశాలు అందరికీ అంది ఆర్థికాభివృద్ధి అవిచ్ఛిన్నంగా సాగేలా చేస్తాయి.

11. ప్రభుత్వరంగ ఆస్తుల పునరావాస సంస్థను ఏర్పాటు చేసి సుదీర్ఘంగా మరియు కష్టంతో కూడుకున్న అంశాలలోని సమస్యలను అధ్యయనం చేస్తూ, కఠిన నిర్ణయాలు తీసుకోవాలిసిన అవసరం ఉన్నది.

**భారత ఆర్థికవృద్ధి - అవరోధాలు**

1. అంతర్జాతీయ సంస్థలు, ప్రపంచ పలు దేశాల స్థూల ఆర్థిక అంశాలలో వృద్ధిని గణిస్తూ, ఆర్థికవృద్ధి రేటును అంచనా వేస్తున్నాయి. గత 7 సంవత్సరాలుగా భారతదేశం ఎలాంటి వృద్ధిరేటునూ దీనిలో నమోదు చేసుకోక పోవడం అత్యంత భాదాకరం. అంటే వారు సూచించే వృద్ధిరేటు పాయింట్లకన్న భారతదేశ వృద్ధిరేటు తక్కువగావుంది. దీనివలన మనం కొన్ని పెట్టుబడులను కోల్పోతున్నాము.
2. ఫెడరల్ ప్రజాస్వామ్యంలో, పన్నుల వసూలు క్రమబద్ధీకరణ లేకపోవడం మరియు పరిపాలన వికేంద్రికరణ కూడా ఆర్థిక వృద్ధిని శాసిస్తున్నాయి.
3. జీతభత్యల సవరణలు, UDAY బాండ్స్ లాంటి అంశాలు రాష్ట్రాల పన్నుల లక్ష్యాన్ని నీరుకారుస్తున్నాయి.
4. అంతర్జాతీయంగా జరిగే రాజకీయ సమీకరణలు మరియు అనిశ్చితి ఆర్థిక వృద్ధిని డీలాపరుస్తూ, ఆత్మరక్షణ భావంలోకి తీసుకెళుతున్నాయి. దీని వలన ప్రపంచీకరణను వ్యతిరేకిస్తూ వస్తు సేవలు మరియు శ్రమను నిలువరిస్తూ ఆర్థికస్థితి దిగజారుతుంది. దీనితో భారతదేశం సాధించాలనుకున్న ఎగుమతుల నిష్పత్తి 15-20 శాతం నుండి 8-10 శాతానికి దిగజారిపోయింది. ఇది స్థూల జాతీయోత్పత్తిపై ప్రభావం చూపుతున్నది.
5. అంతర్జాతీయ చమురు ధరల పెరుగుదల, సరుకుల ధరల పెరుగుదలపై ప్రభావం చూపుతున్నది. ఈ ధరల వ్యత్యాసాలను గుణించడంపై ఈ సర్వే దృష్టి సారించలేదు. అంతేకాక చమురు ఉత్పత్తి తగ్గుదల ఒకవైపు అమెరికాలో షెల్ గ్యాస్ ఉత్పత్తి మరోవైపు, చమురు ధరల పెరుగుదలపై ప్రభావం చూపుతున్నాయి.
6. అమెరికా ఆర్థికవ్యవస్థ అభివృద్ధి, ప్రపంచ వడ్డీరేట్లు, ద్రవ్యోల్బణం రేట్లు, అభివృద్ధి చెందిన దేశాలను ఆర్థికంగా బల వంతులుగా చేస్తున్నాయి. ఇది భారతదేశ అంతర్గత మరియు బహిర్గత పెట్టు బడులపై తీవ్ర ప్రభావం చూపుతున్నది.
7. అమెరికా ఆర్థికాభివృద్ధి, డాలర్ రేటు పెరుగుదలకు కారణం కాగా, చైనా యువాన్ రేటు తగ్గిపోతున్నది. తద్వారా చైనా ఆర్థిక వ్యవస్థ క్రమాభివృద్ధి తగ్గిపోతున్నది. ఇది భారతదేశ వాణిజ్య, వ్యాపార మరియు పెట్టుబడులపై ప్రభావం చూపుతున్నది. అంతే కాక అమెరికా, చైనా వాణిజ్య పోటీ ప్రపంచ ఆర్థికవ్యవస్థను స్తంభింపచేస్తుంది.
8. గత 6 సంవత్సరాలుగా ప్రపంచ వ్యాప్తంగా ఎగుమతులు - స్థూల జాతీయోత్పత్తి రేటు తగ్గిపోతున్నాయి. ఈ అనిశ్చిత పరిస్థితుల ప్రభావం భారత ఎగుమతులపై కూడా పడింది. ప్రపంచ ఎగుమతుల స్థాయితో పోటి పడడం భారత్ ముందున్న సవాలు.
9. ప్రపంచ మార్కెట్‌లో భారతదేశం, పలు అభివృద్ధి చెందుతున్న దేశాలు ఉదా: వియత్నాం, బంగ్లాదేశ్ & ఫిలిఫైన్స్ లాంటి వాటి ఎగుమతులతో పోటి పడాల్సివస్తుంది. ఈ పోటీ ముఖ్యంగా విస్తృతమైన సరుకులు ఎగుమతులు మరియు సేవా రంగాలలోనే !
10. వాస్తవ ద్రవ్య మారక విలువల ప్రకారం భారతదేశ రూపాయి విలువకి మిగతా దేశాల రూపాయిలతో పోల్చినపుడు మారకం విలువ తగ్గుతోంది. దీనివలన భారతదేశ వస్తువులు మరియు సేవలపై ఆదాయం తగ్గిపోవడమే కాక, పోటీలో తగిన విలువను పొందలేక పోతున్నది. అంతర్జాతీయ ద్రవ్యనిధి ప్రకారం ఈ మారకం విలువ తేడా 19.4 శాతం వుండగా, రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకారం ఈ తేడా 12 శాతం ఉన్నది. ద్రవ్య మారకం విలువలలో వచ్చే మార్పులను మూడు ప్రత్యేక సంస్థలు నిర్ణయిస్తాయి. వాస్తవ ద్రవ్య మారక విలువల పెరుగుదల, భారతదేశ రూపాయి విలువల క్షీణిత వలన, ప్రపంచ మార్కెటులో భారతదేశ ఉత్పత్తుల విలువ తగ్గిపోతున్నది.
11. చైనా మరియు బ్రెజిల్ లాంటి దేశాలలో మానవ వనరులు అధికంగా ఉండటంతో పాటు అందులో యువ జనాభా స్థానం ఎక్కువ తద్వారా ఆయా దేశాల ఉత్పాదిక శక్తి ఎక్కువగా వుంది. భారతదేశం ఆ స్థాయికి 2020 తర్వాతే చేరుతుంది.

ఆర్థిక సర్వే 2016-17 విస్తృత పరిధిలో భారత ఆర్థిక వ్యవస్థ బలాలు, బలహీనతలు, అవకాశాల మరియు అవరోధాలను గూర్చి వివరిస్తూ, కొన్ని

*తరువాయి 23వ పేజీలో...*

## బడ్జెట్‌పై ప్రధాన (ని) స్పందన

గత రెండున్నర సంవత్సరాలలో ఈ ప్రభుత్వం చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల ప్రతి స్పందనే ఈ బడ్జెట్. అంతేకాదు, వాటిని అదే స్ఫూర్తితో ముందుకు తీసుకువెళ్లడానికి మార్గదర్శికూడ! మొత్తం జాతీయాభివృద్ధికి మొదటి మెట్టు కూడా. నూతన ఉపాధి అవకాశాలను కల్పిస్తుంది. ప్రగతికి ప్రోది చేస్తుంది. రైతుల ఆదాయాన్ని పెంచడానికి తోడ్పడుతుంది. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, మౌలిక సౌకర్యాలు వంటి అంశాలకు బడ్జెట్ ప్రాధాన్యమిచ్చింది. ఇవే అంశాలకు ప్రభుత్వం కూడా ప్రాధాన్యమిచ్చింది. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్న ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా విధాన రచన జరిగింది. దేశవ్యాప్తంగా చిన్న, మధ్యతరహా పరిశ్రమలే అధికంగా ఉపాధిని కల్పిస్తున్నాయి. తమ సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుచుకుని అంతర్జాతీయ సంస్థలతో పోటీ పడటానికి పన్నుల భారం పెద్ద అడ్డంకిగా మారిందని ఈ సంస్థలు ఎంతోకాలంగా మొరబెట్టుకుంటున్నాయి. పన్ను రాయితీ ఏదైనా ఇస్తే, 90 శాతం సంస్థలు ఊపిరి పీల్చుకుంటాయని అంటున్నాయి. ఈ అభ్యర్థనకు స్పందిస్తూ ప్రభుత్వం పన్ను రేటును 30 శాతం నుండి 25 శాతానికి తగ్గించింది. భవిష్యత్తును ఊహించే మన కలలూ ఆశయాలకు ఈ నిర్ణయం చేయూత నిస్తుంది. FUTURE అనే పదంలో F అంటే రైతు. U అంటే, UNDERPRIVILEGED అంటే, దళితులు, అణగారిన వర్గాలు, మహిళలు మొదలైన వారు. T అంటే TRANSPARENCY అంటే పరిణామము అంటే మార్పు, సాంకేతిక పరిజ్ఞాన మెరుగు. U అంటే పట్టణ పునరుజ్జీవనము. R అంటే గ్రామీణాభివృద్ధి. చివరగా E అంటే యువతకు ఉపాధి అవకాశాలు, నూతన ఒరవడిలో మరిన్ని ఉపాధి అవకాశాలను కల్పించే ఔత్సాహికత.

## బడ్జెట్ 2017-18 పై ఆర్థికమంత్రి వ్యాఖ్య.

బడ్జెట్ తయారీలో నా ప్రధానోద్దేశ్యం గ్రామీణ, తయారీ రంగాలపైనా, పేదరిక నిర్మూలనపైనా ఎక్కువ ఖర్చు చేయాలనీ, అదే సమయంలో ఉన్నత బడ్జెట్ ప్రమాణాలను పాటించాలని. అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్నివర్గాలకూ ముఖ్యంగా పేదలకు, షెడ్యూల్డ్ కులాలు, జాతులవారికీ మహిళలకూ ఇతర సమాజంలోని అణగారిన వర్గాలకు చేర్చేందుకు మరెన్నో కార్యక్రమాలను కూడా చేపడుతాము. ప్రజల ఆశయాలు ఫలించడానికి రానున్న సంవత్సరానికి "TEC అంటే సమూల మార్పు, సశక్తీకరణ, పరిశుభ్ర భారత్" మాత్రమే మా మంత్రము.

* ప్రభుత్వ పాలనను మార్చడం, ప్రజల జీవన ప్రమాణాలను మార్చడం,
* సమాజంలోని వివిధ వర్గాలను సశక్తీకరించడం, ముఖ్యంగా యువతను వారి పూర్తి సామర్థ్యాలను వినియోగించుకునే విధంగా!
* దేశాన్ని అవినీతి, నల్లధనం తెరవెనుక రాజకీయ విధానాల నండి ప్రక్షాళన చేయడం పరిపాలనలో అవినీతి, నల్లధనాలను సమూలంగా పెకిలించివేసి ప్రక్షాళన చేయడానికి డిజిటల్ అర్థ వ్యవస్థ అత్యావశ్యకము.

యోజన

కార్మిక సంస్కరణలు

ఏప్రిల్, 2017 సంచిక

# కేంద్ర బడ్జెట్ : ఉపాధి, పారిశ్రామిక వృద్ధి అవకాశాలు



**అంతరిక్ష పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఉపాధి హామీ పనులకు ప్రణాళికలు వేసే ఒక కొత్త కోణాన్ని కేంద్ర బడ్జెట్ అమల్లోకి తెస్తోంది. దీని వల్ల, ముందే పని కేటాయింపును నిర్ణయించుకుని, ఆర్థిక సంవత్సరంలో చివరి నిముషం వరకు పనులు పూర్తి చేయాలన్న హడావిడినీ, పని జరగక నిధులు తిరిగి ఇవ్వవలసిన పరిస్థితిని నివారించవచ్చు. గ్రామీణ, వ్యవసాయ, అనుబంధ రంగాలకు కేటాయింపును గత ఏడాదితో పోలిస్తే 24 శాతం పెంచారు. గ్రామీణ నిరుద్యోగం, పేదరికం అంశాలపై మరింత ఉధృతమైన వైఖరితో వ్యవహరించాలని ప్రభుత్వం నిర్ణయించిందన దానికి ఇది సంకేతం.**

పారిశ్రామిక వృది, ఉపాధి కల్పన ప్రభుత్వ ప్రాథమిక లక్ష్యాల్లో భాగం. భారత దేశంలో కానీ, ఇంకే ఇతర అభివృద్ధి చెందుతున్న దేశంలో కానీ నైపుణ్యాలు లేని, లేదా పాక్షికంగా నైపుణ్యాలు ఉన్న కార్మిక శ్రేణులకు ఉపాధి కల్పించేందుకు సేవా రంగం మాత్రమే సరిపోదు కనుక, ఆ దేశాలు పారిశ్రామిక రంగాన్ని తప్పనిసరిగా పునరుద్ధరించాలి. వ్యవసాయ రంగంలో పూర్తి ఉపాధి కల్పించడం సాధ్యపడదు. సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో పారిశ్రామిక రంగంలో సంపూర్ణ పెట్టుబడీయేతర ఉత్పాదకతను గణనీయంగా పెంచవచ్చు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా సృజనాత్మకత ఎక్కువ పెట్టుబడి అవసరం అయిన విషయమే అయినా, ఉపాధి కల్పనలో లాభాలకు ఇది అనేక విధాలుగా దారి తీస్తుందని ఇటీవలి పరిశోధన సూచిస్తోంది.

పెట్టుబడిలో కానీ, ముడిపదార్థాల్లో కానీ నిష్పత్తిపరంగా పెరుగుదల లేకుండానే, కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని భారీ స్థాయిలో వినియోగిస్తూ ఉత్పత్తి వైవిధ్యం, కొత్త ఉత్పత్తులు, ఉపఉత్పత్తుల తయారీ ద్వారా ఉపాధి కల్పన పెరుగుతుందని అర్థమవుతోంది. ఉత్పాదకతలో, ఉపాధి కల్పనలో ఒకే సమయంలో ప్రగతి సాధిస్తూ కూడా వేరే విషయాలను పణం పెట్టనవసరం లేదు. ఈ నేపథ్యంలో, 2017-18 కేంద్ర బడ్జెట్ ని ఒకసారి పరిశీలించి, స్వల్పకాలిక అవకాశాలు, సమస్యలను అర్థం చేసుకుని, దీర్ఘకాలిక లక్ష్యాలకు ఇవి ఏ విధంగా సానుకూలంగా దోహదం చేస్తాయో ఆకళింపు చేసుకోవడం ఆసక్తికరమైన కసరత్తు అని చెప్పవచ్చు.

చారిత్రాత్మకమైన నోట్ల రద్దు ఇటీవలే జరిగింది. స్వల్పకాలికంగా అయినా సరే ఇది పెరుగుదలపై ప్రతికూల ప్రభావం చూపి, నిరుద్యోగాన్ని పెంచుతుందని ఆందోళన చెందుతున్నారు. పట్టణ ప్రాంతాలలో కేంద్రీకృతమైన వ్యవసాయేతర పెట్టుబడుల, వృద్ధిపైనా ఈ నిర్ణయం ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం వల్ల, పట్టణ నిరుద్యోగ, పాక్షికోద్యోగ సమస్యలు పెరుగుతాయి. తయారీ, సేవా రంగాలు రెండింటిలో మధ్య, చిన్న తరహా పరిశ్రమలు పెట్టుబడి, పెరుగుదల, ఉపాధి విషయాల్లో దెబ్బ తినవచ్చు. అయితే, భారీ పరిశ్రమలకు కూడా నష్టం వాటిల్లే ప్రమాదం లేదని చెప్పడానికి లేదు. ఎందుకంటే, చాలా

**అరూప్ మిత్ర,** ప్రొఫెసర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్ గ్రోత్, న్యూ ఢిల్లీ
E-mail: arup@iegindia.org

పరిశ్రమలు నిబంధనలు, నియంత్రణలను తప్పించుకొని వ్యాపారం చేసేందుకు లంచాలు ఇచ్చి పబ్బం గడుపుకుంటుంటాయి. పెట్టుబడిలో కోత వల్ల మొట్టమొదట ప్రస్ఫుటం అయ్యే ప్రభావం కార్మికులకు డిమాండ్ తగ్గడం. ఇది ఎందుకంటే, కాంట్రాక్టీకరణ యుగంలో అన్నింటికంటే అనిశ్చితంగా ఉన్నది ఇన్‌పుట్ కార్మికుల శ్రమే కనుక ! అందువల్ల మార్కెట్లు తగ్గుదల ధోరణిలో ఉన్నప్పుడు, ఖర్చులు తగ్గించుకోవడానికి పారిశ్రామికవేత్తలు ముందుగా కార్మికులను తగ్గించాలనే ఆలోచిస్తారు.

గ్రామీణ రంగంలో నిరుద్యోగం కూడా బాగా పెరుగుతుందని భయపడుతున్నారు. వ్యవసాయరంగంలో కార్మికులకు గణనీయమైన స్థాయిలో పని కల్పించడం సాధ్యం కాదు కనుక చాలా మంది గ్రామీణ వ్యవస్థలోనే వ్యవసాయేతర జీవనోపాధి మార్గాలు ఎంచుకుంటారు. వీటికి రోజువారీ నగదు అవసరం ఎక్కువ. కాబట్టి నోట్ల రద్దు వల్ల గ్రామీణ వ్యవసాయేతర రంగంలో పెరుగుదల, ఉపాధిపై దుష్ప్రభావం ఉండబోదని చెప్పడానికి లేదు. అయితే, వ్యాపారంలో లావాదేవీలు చాలావరకు సూచనప్రాయమే కనుక, కాలపరిమితుల్లో వెసులుబాటు చాలా ఉంటుంది కనుక ఈ దుష్ప్రభావాన్ని మనం ఎక్కువగా అంచనా వేస్తుండవచ్చు. నోట్ల రద్దు వల్ల పెరుగుదల తగ్గే అవకాశాలను సర్దుబాటు చర్యలు కాపాడతాయి. డెబ్బయ్యో దశకంలో బ్యాంకుల జాతీయకరణ మాదిరిగా నోట్ల రద్దు ఎంత ముందే తీసుకోవలసిన అనివార్య చర్య. ఆ చర్య హఠాత్తుగా తీసుకుంటేనే ఫలం. లేదా అసలు ఉద్దేశ్యమే దెబ్బ తినేది.

స్వల్పకాలికంగా నష్టం జరుగుతుందని అంచనా వేసిన ప్రభుత్వం కేంద్ర బడ్జెట్ లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి అత్యధికంగా కేటాయింపు జరిపి, తాత్కాలిక ఉపశమనంగా ఉపాధి అవకాశాలు కల్పించే ఏర్పాటు చేసింది. భవిష్యత్తు పెరుగుదలకు తోడ్పడే విధంగా తగు స్థాయిలో ఆస్తులు కల్పించలేదన్నది ఉపాధి హామీ పథకంపై ఉన్న సాధారణ విమర్శల్లో ఒకటి. అయితే, అంతరిక్ష పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఉపాధి హామీ పనులకు ప్రణాళికలు వేసే ఒక కొత్త కోణాన్ని కేంద్ర బడ్జెట్ అమల్లోకి తెస్తోంది. దీని వల్ల, ముందే పని కేటాయింపు నిర్ణయించుకుని, ఆర్థిక సంవత్సరంలో చివరి నిముషం వరకు పనులు పూర్తి చేయాలన్న హడావిడినీ, పని జరగక నిధులు తిరిగి ఇవ్వవలసిన పరిస్థితిని నివారించవచ్చు. అనావృష్టిని ఎదుర్కొనేందుకు 2017-18లో మరో అయిదు లక్షల చెరువులు నిర్మించాలని నిర్ణయించారు. ఈ సేద్యపు నీటి కార్యక్రమాన్ని, ఉపాధి హామీ పథకంతో అనుసంధానం చేస్తే మరింత పటిష్టమైన వ్యూహం ఏర్పడుతుంది. వ్యవసాయ పెరుగుదల కోణం నుంచి మరిన్ని ఫలితాలు సాధించగలుగుతాం.

గ్రామీణ, వ్యవసాయ, అనుబంధ రంగాలకు 2017-18 సంవత్సరాల్లో మొత్తం కేటాయింపును గత ఏడాదితో పోలిస్తే 24 శాతం పెంచారు. గ్రామీణ నిరుద్యోగం, పాక్షిక నిరుద్యోగం, పేదరికం అంశాలపై మరింత ఉధృతమైన వైఖరితో వ్యవహరించాలని ప్రభుత్వం నిర్ణయించిందన డానికి ఇది సంకేతం.

ప్రధానమంత్రి ఉపాధి కల్పన, రుణసహాయం కార్యక్రమాలకు కేటాయింపు మూడు రెట్లు పెంచారు. PMEGP గ్రామీణ ఉపాధి కల్పనా కార్యక్రమాన్ని, ప్రధాన మంత్రి ఉపాధి కల్పనా కార్యక్రమాన్ని కలిపి రుణం ఆధారంగా ఇచ్చే సబ్సిడీ పథకం. సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల ఆధ్వర్యంలో ఈ పథకాన్ని ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమీషన్ అమలు చేస్తుంది. రాష్ట్రస్థాయిలో, KVIC డైరెక్టరేట్ కార్యాలయాలు ఈ పథకాన్ని అమలు చేస్తాయి. ఈ పథకం ప్రాథమిక లక్ష్యం గ్రామీణ, పట్టణ ప్రాంతాలు రెండింటిలో స్వయం ఉపాధి పరిశ్రమలు, సూక్ష్మ పరిశ్రమలు, ఇతర ప్రాజెక్టుల ద్వారా ఉద్యోగాలు కల్పించడం. గ్రామాల్లో వృత్తిపని సంప్రదాయాన్ని తిరిగి తెచ్చి, ఇంకే ఇతర ఉద్యోగాలు దొరకని పట్టణ యువకులకు సహాయపడడం రెండో లక్ష్యం. నిరంతరాయంగా, సుస్థిరంగా ఉపాధి కల్పించి, లబ్ధిదారులకు ఆదాయం గడించే సామర్థ్యం పెంచడం ఇక్కడ ఉద్దేశ్యం.

డిజిటల్ లావాదేవీలపై మళ్లేందుకు దేశం యావత్తు చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా కేంద్ర బడ్జెట్, సూక్ష్మ చిన్న పరిశ్రమలు వ్యవస్థాగతమైన రుణాలు పొందేందుకు డిజిటల్ లావాదేవీలు తోడ్పడతాయని తెలియచేసింది. అందువల్ల, నోట్ల రద్దు వల్ల తలెత్తే ప్రతికూల పరిణామాలను అధిగమించేందుకు ఈ కర్మాగారాలు, తమ ఉత్పాదకత పెంచుకోగలుగుతాయనీ, జాతీయ జీడీపీకి అధిక వాటా అందించగలుగుతాయనీ భావిస్తున్నారు. చిన్న, సూక్ష్మ పరిశ్రమలు అసంఖ్యాకంగా ఉండగా, వాటి వల్ల ఫలసాయం మాత్రం అతి తక్కువగా ఉంటోంది. ఉదాహరణకి, వ్యవస్థీకృతంగా నమోదు కానీ తయారీ పరిశ్రమలను తీసుకోండి. మొత్తం తయారీ రంగం విలువలో ఇది దాదాపు మూడో వంతు. దేశం యావత్తు డిజిటల్ అవుతున్న నేపథ్యంలో ఈ పరిశ్రమల పునరుద్ధరణ అనేది ఆసక్తికరమైన చర్య. ముఖ్యంగా వ్యవస్థీకృత తయారీ రంగం మాత్రమే కార్మిక డిమాండ్ సరఫరా పరిస్థితిలో వ్యత్యాసాన్ని తగ్గించలేదు అన్న విషయాన్ని మనం గుర్తు పెట్టుకుంటే ఈ విషయం తెలుస్తుంది. పన్నులను తప్పించుకునేందుకు అనేక పరిశ్రమలు అవ్యవస్థీకృత రంగంలోనే ఉండిపోయి, తమ కార్యక

లాపాలను బహుళంగా విభజిస్తుంటాయి. డిజిటీకరణ వల్ల వీటిని స్థూల పరిశ్రమగా మార్చి, పన్నుల వసూలును మెరుగుపరచ వచ్చు. ఆ పరిశ్రమలు కూడా తమ ఆర్థిక వెసులుబాటును, ఫలితాలను మెరుగుపరచు కోగలుగుతాయి. డెబిట్ కార్డులు కానీ మొబైల్ ఫోన్లు కానీ లేనివారి కోసం వర్తకుడి దగ్గరే ఆధార్ చెల్లింపు వ్యవస్థను ప్రారంభించాలని ప్రతిపాదించారు.

యాభై కోట్లు లేదా అంత కంటే తక్కువ వ్యాపారం కల చిన్న సంస్థలు తక్కువగా 25 శాతం మాత్రమే పన్నులు చెల్లించవలసి ఉంటుంది. ఆధునిక చిన్న తరహా పరిశ్రమలు దీని వల్ల ఎక్కువగా పెట్టుబడులు పెట్టే అవకాశం ఉంది కనుక, పారిశ్రామిక పెరుగుదల, ఉపాధి కూడా పెరుగుతాయి. మరో పక్క, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాల ప్రాతిపదికగా వచ్చే విదేశీ పెట్టుబడుల పట్ల కూడా బడ్జెట్‌లో శ్రద్ధ పెట్టారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో 90 శాతం ఇక ఆటోమేటిక్ పద్ధతిలో ఆమోదం పొందే వెసులుబాటు, విదేశీ పెట్టుబడి ప్రోత్సాహక బోర్డు రద్దు మొదలైన వాటి వల్ల అధికారికంగా జాప్యాలు లేకుండా ఆర్థిక కార్యకలాపాలు వేగం పుంజుకునే అవకాశం ఉంది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో 36 శాతం పెరుగుదల వల్ల పెట్టుబడి పెరగడమే కాదు, ఉపాధి కూడా పెరుగుతుంది. పారిశ్రామిక రంగంలో పెరుగుదలకు అనేక కారణాలను గుర్తించారు. వాణిజ్యంలో వెసులుబాటు, కూటమి అర్థ వ్యవస్థలు, మౌలిక సదుపాయాలూ, సమాచార, కమ్యూనికేషన్ పరిజ్ఞానాలు, సృజనాత్మకత అనేవి నాలుగు ప్రధానమైన కారణాలు.

ఉత్పాదకత పెంచేందుకు సృజనాత్మ కత కూడా ఒక కారకమే. సృజనాత్మక ఆవిష్కారాల వల్ల మరింత ఆధునిక పరిజ్ఞాన ఉపయోగం జరిగి, పెట్టుబడి యేతర పెరుగుదల సాధ్యమౌతుంది. మౌలిక సదుపాయాల ప్రాముఖ్యత కూడా తెలిసిందే. ఉదాహరణకి, మౌలిక సదుపాయాల వల్ల ఉత్పాదకత, సాంకేతిక సామర్థ్యం పెరుగుతాయని, ఉత్పత్తిలో పెంపు కారణంగా ఖర్చులు తగ్గుతాయనేది తెలిసిందే. కార్మికులకు ఉపాధి కల్పించేందుకు అవసరమైన సామర్థ్యాలు, నైపుణ్యాలు లేకపోవడం మరో ఆటంకం కలిగించే విషయం. క్రమేణా, ఈ నైపుణ్యాల లేమి తయారీ రంగంలో మరింత ఉధృతమైందని తెలుస్తోంది. కేంద్ర బడ్జెట్ ఈ ఆటంకాల పరిష్కారానికి వ్యూహాత్మకంగా ప్రాధాన్యత ఇస్తోంది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో సంకల్ప్ (జీవనోపాధి ప్రోత్సాహం కోసం నైపుణ్యాల పెంపు) అనే పథకాన్ని ప్రారంభించనున్నట్లు బడ్జెట్ వెల్లడించింది. సంకల్ప్ కార్యక్రమం కింద దాదాపు నాలుగు వేల కోట్ల రూపాయల ఖర్చుతో సుమారు మూడున్నర కోట్ల మంది యువజనులకు శిక్షణ ఇస్తారు. ఈ కార్యక్రమం కింద మార్కెట్ సంబంధ శిక్షణ ఇస్తారు. ప్రధానమంత్రి కౌశల్ కేంద్రాలను 600లకు పెంచుతారు. వంద అంతర్జాతీయ నైపుణ్య కేంద్రాలు ప్రారంభిస్తారు. గ్రామీణ జనాభా కేంద్రబిందువుగా, భాషా పరిశోధన శాల, డిజిటల్ గ్రంథాలయం, కెరియర్ సలహా కేంద్రం, మూల్యాంకన కేంద్రాలతో ఈ కౌశల్ కేంద్రాలు ఏర్పాటవు తాయి. వీటన్నిటినీ కూడా యువజనులకు ఉపాధికి అవసరమైన సత్తా పెంచే లక్ష్యంతో చేపడతారు.

దేశవ్యాప్తంగా భారత అంతర్జాతీయ నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ఏర్పాటు కూడా ఎంతో ఆసక్తికరమైన ప్రతిపాదన. ఈ కేంద్రాలు ఉన్నత స్థాయి శిక్షణ, విదేశీ భాషల్లో శిక్షణ అందిస్తాయి. దేశం వెలుపల ఉద్యోగాలు కోరుకునేవారికి ఇవి తోడ్పడతాయి. ITI లలో ఇచ్చే శిక్షణ నాణ్యత గురించి ఎంతగానో విమర్శ వచ్చింది. ITIలో శిక్షణ పొందిన ఒక ప్లంబర్‌కు మధ్య ప్రాచ్య దేశాలలో ఉద్యోగం కోసం పంపే ముందు రిక్రూటింగ్ సంస్థ మళ్ళీ శిక్షణ ఇవ్వవలసి వచ్చింది.' ఈ దృక్కోణం నుంచి చూస్తే, ఇటీవలి నిర్ణయాలు ఆశాజనకంగానే ఉన్నాయి. ఈ నైపుణ్యాల శిక్షణ వల్ల కార్మికులు వివిధ దేశాల్లో పనికి వెళ్లగలుగుతారు; దేశీయంగా అతి ఎక్కువగా ఉన్న కార్మిక జనాభా తగ్గుతుంది. విదేశాల నుంచి చెల్లింపుల వల్ల మన దేశంలో విదేశీ మారక ఆదాయం పెరుగుతుంది. చెల్లింపుల వల్ల స్వదేశంలోనే ఉన్న బంధువుల సంక్షేమం కూడా మెరుగౌతుంది. ఈ చెల్లింపుల ద్వారా ఒక ప్రోత్సాహక యంత్రాంగం ఏర్పరిచి, ఫలవంతమైన ఆస్తుల ఏర్పాటు ఏ విధంగా జరపవచ్చుననే అంశాన్ని భవిష్యత్తులో విధానపరమైన అజెండాలో భాగంగా చేపట్టవచ్చు. మొదటి మెట్టుగా మన దేశం అంతర్జాతీయ ప్రమాణాలకు దీటైన కార్మిక శక్తిని రూపొందించే చర్య తీసుకుంది. దీనితో ప్రభుత్వానికి కల ప్రగతిశీలకమైన, దీర్ఘకాలిక దార్శనికత వెల్లడౌతోంది.

మౌలిక సదుపాయాలకు భారీ కేటాయింపులే చేశారు. భారీ మౌలిక సౌకర్యాల నిర్మాణానికి కార్మికులు అవసరం కనుక దీని వల్ల కూడా ఉపాధి పెరుగుతుంది. అయితే, ఈ మౌలిక వసతుల వ్యూహానికి ప్రాంతీయ కోణం చేర్చి ఉంటే మరింత మంచి ఫలితాలు వచ్చేవి. గత కొద్దికాలంగా సమానత్వం బదులు ప్రాంతీయ అసమానతలు పెరిగిపోయాయి. రాష్ట్రాల మధ్య ఆర్థిక పెరుగుదల విషయంలో వ్యత్యాసాలు ఏర్పడ్డాయి. ఈ అసమానతలను తొలగించేందుకు ఒక సమర్థవంతమైన పద్ధతి వెనుకబడ్డ ప్రాంతాల్లో మౌలిక వసతులు పెంచడం. ఒకే చోట దృష్టిపెట్టడం వల్ల ఆర్థిక కూటములు పెరుగుతాయనేది తెలిసిందే. అలా కూటములు ఏర్పడ్డప్పుడు,

ముందే ఒక విధమైన పరిశ్రమలు ఉన్న ప్రాంతాల్లోనే మరింతగా పెట్టుబడి పెట్టవలసి వస్తుంది. ఈ ప్రక్రియలో కొన్ని ప్రాంతాలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతాయి, పారిశ్రామికీకరణ కొన్ని చోట్లే వికసించడంతో ప్రాంతీయంగా ఉద్రిక్తతలు ఏర్పడతాయి. వీటిని నివారించాలంటే, మౌలిక వసతుల నిర్మాణంలో మరింత ప్రాంతీయ వైఖరి అవలంబించాలి. ఈశాన్య రాష్ట్రాల్లో పారిశ్రామికీకరణ చాలా తక్కువగా ఉంది; అక్కడ కొత్త మెట్రో రైలు ప్రాజెక్టు ప్రారంభించనున్న కారణంగా యువకులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ఆ ప్రాంతంలో ఈ ప్రాజెక్టు వల్ల మౌలిక సదుపాయాలూ పెరిగి, ప్రయాణానికి వెనులుబాటు గణనీయంగా పెరుగుతుంది. గ్రామీణ ప్రాంతాల నుంచి వలసల కారణంగా, పట్టణ ప్రాంతాలు కేంద్రంగా కల ఇటువంటి ప్రాజెక్టులను ప్రోత్సహించడం అభిలషణీయం.

అయితే, పరిశ్రమల చోదక శక్తికి పెరుగుదల అనేది తప్పనిసరి లక్ష్యమైతే తయారీ రంగం కోసం మరిన్ని నిర్ణయాలు ప్రకటించవలసింది. కార్మిక శక్తిపై నడిచే తోలు, ఆభరణాల వంటి పరిశ్రమలకు ప్రభుత్వం తయారీ పెంచి, ఉపాధి కల్పించి, ఎగుమతులు పెంచేందుకు ఉద్దేశించిన మేక్ ఇన్ ఇండియా పథకం కింద మరిన్ని పన్ను ప్రోత్సాహకాలను ప్రకటించాల్సింది. చైనాలో మాదిరిగా దేశవ్యాప్తంగా ఉత్పత్తి కర్మాగారాలు, ప్రజా సౌకర్యాలు, ఆవాస ప్రాంతాలు, స్కూళ్ళు, ఆసుపత్రులు ఉండే మెగా పారిశ్రామిక నగరాలను స్మార్ట్ సిటీస్ కింద ప్రతిపాదించవలసింది. అయితే బడ్జెట్‌లో అటువంటి పెరుగుదల కేంద్రాల ప్రోత్సాహానికి ఆర్థిక కేటాయింపుల పెంపు ప్రతిపాదనేది కనిపించలేదు. కార్మిక పెట్టుబడి, వస్తువుల తయారీ ప్రధానంగా కల పారిశ్రామికీకరణ బడ్జెట్‌లో ప్రధానాంశంగా అనిపించడం లేదు. ఈ బడ్జెట్ వ్యవసాయ, గ్రామీణ ప్రాంతాలపై శ్రద్ధ పెట్టినట్లు కనిపిస్తోంది. మన దేశంలో అత్యధిక జనాభా ఇంకా గ్రామాల్లో, వ్యవసాయంలో ఉన్నందు వల్ల ఇది మంచిదే. కానీ, కార్మిక శక్తి ప్రధానంగా కల పరిశ్రమలను ప్రోత్సహించడం, ఎగుమతి డిమాండ్ పెరిగేలా నాణ్యమైన ఉత్పత్తుల తయారీని ప్రోత్సహించడం, వాటి వల్ల పెరుగుదల, ఉపాధికి కూడా మరింత తోడ్పాటు లభించేలా చూడడం ఇంకా మనం వేచి చూస్తున్న అంశాలుగానే ఉన్నాయి. సాంకేతిక పరిజ్ఞానాన్ని దిగుమతి చేసుకోవడం బదులు, ఉత్పాదకత, ఉపాధికి తోడ్పడే సృజనాత్మక ఆవిష్కారాలను సాధించడం మన భవిష్య ప్రణాళికల్లో ప్రధాన భాగం కావాలి. ■

*8వ పేజీ తరువాయి...*

## 2017-18 కేంద్ర బడ్జెట్ - స్థూల విశ్లేషణ

**ముగింపు :.**

మొత్తంమీద ఇటు దేశీయ అటు విదేశాంగ ఆర్థిక వాతావరణంలోని అనిశ్చితుల నేపథ్యంలో కేంద్ర బడ్జెట్ – దేశంలో వృద్ధి పునరుద్ధరణకు దోహదపడే అనేక అంశాలను పరిష్కరించే ప్రయత్నం చేసింది. ముఖ్యంగా ఎక్కువ సమయంలో తక్కువ ఫలితాలు ఇచ్చే ప్రోత్సాహకాలకు బదులు వృద్ధిని, వృద్ధిరేటును సుస్థిరంగా పెంచే ప్రక్రియలకే బడ్జెట్ ప్రాధాన్యం ఇవ్వడం గమనార్హం. కాగా ఈ చర్యలన్నింటికి అనుబంధంగా మరికొన్ని సమ్మిళిత వృద్ధి విధానాలు సబ్–నేషనల్ స్థాయిలో అవసరం. మధ్యకాలిక పెరుగుదల, అభివృద్ధి లక్ష్యాలను సాధించడంతో సమాన లేదా అంతకంటె ఎక్కువ ప్రాధాన్యతను ఈ విధానము కలిగి వుండాలి. ■


## FORM IV

**Statement about ownership and other particulars about Yojana (Telugu)**
***to be published in the first issue every year after the last day of February***

| | | | |
|---|---|---|---|
| 1. | Place of Publication | : | Hyderabad |
| 2. | Periodicity of Publication | : | Monthly |
| 3. | Printer's Name | : | Dr. Sadhana Rout |
| | Nationality | : | Indian |
| | Address | : | Publications Division, Soochna Bhavan, New Delhi - 110 003. |
| 4. | Publisher's Name | : | Dr. Sadhana Rout |
| | Nationality | : | Indian |
| | Address | : | Publications Division, Soochna Bhavan,New Delhi - 110 003. |
| 5. | Editor's Name | : | Vedagiri Vijaya Kumar |
| | Nationality | : | Indian |
| | Address | : | Publications Division Room No. 205, 2nd Floor, CGO Towers, Kavadiguda, Hyderabad-500080 |
| 6. | Name & Address of Individual Who own the newspaper and Partner or shareholder holding More than one Percent of the total capital. | : | Wholly owned by Ministry of Information & Broadcasting, Government of India, New Delhi - 110 001. |

I, Sadhana Rout , hereby declare that the particular given above are true to the best of my Knowledge and belief.

Dated:-

(Dr.Sadhana Rout )
Signature of Publisher.

ప్రత్యేక వ్యాసం

# నూతన అవతారంలో రైల్వే బడ్జెట్




**1920లో సర్ విలియం అక్వర్త్ అధ్యక్షతన ఈస్ట్ ఇండియన్ రైల్వే కమిటీ ఏర్పడింది. ఈ కమిటీ సూచనల మేరకు 1924 నుంచి 'సెపరేషన్ కన్వెన్షన్' ద్వారా సాధారణ, రైల్వే బడ్జెట్ల విభజన జరిగింది. అప్పటి నుంచి సాధారణ బడ్జెట్ వేరుగా, రైల్వే బడ్జెట్ వేరుగా ప్రవేశ పెట్టడం ప్రారంభమైంది. స్వాతంత్ర అనంతర కాలానికి వస్తే, ప్రజా రవాణాలో 75 శాతం, సరకు రవాణాలో 90 శాతం రైల్వేల ద్వారానే జరుగుతూ ఉండేది. ఈ నేపథ్యంలోనే, రైల్వే బడ్జెట్ ప్రత్యేకంగా ఉండడం సమజసం, సహేతుకమే అనిపించుకుంది. అయితే ఇప్పుడు ప్రజా / సరుకు రవాణాలో రైల్వేల పాత్ర వరుసగా 15, 30 శాతంగానే ఉన్నది. కనుకనే ఈ మార్పు.**

సాధారణ బడ్జెట్ వేరు, రైల్వే బడ్జెట్ వేరు. ఆర్థిక మంత్రి సాధారణ బడ్జెట్, రైల్వే శాఖ మంత్రి రైల్వే బడ్జెట్‌ను పార్లమెంట్ లో ప్రవేశ పెడతారు. ఇది 93 సంవత్సరాలుగా వస్తున్న ఆచారం. అయితే తొలి సారిగా ఈ సంవత్సరం ఆ ఆచారాన్ని పక్కనపెట్టి, రైల్వే బడ్జెట్‌ను సాధారణ బడ్జెట్ కలిపి, ఒకే బడ్జెట్‌గా ప్రవేశపెట్టారు. ఇక, ఇక్కడ కొంచెం గతంలోకి వెళ్ళి రావలసిన అవసరం ఉంది. మన దేశానికీ స్వాతంత్రం రాక ముందు, 1920లో సర్ విలియం అక్వర్త్ అధ్యక్షతన ఈస్ట్ ఇండియన్ రైల్వే కమిటీ ఏర్పడింది. ఈ కమిటీ సూచనల మేరకు 1924 నుంచి 'సెపరేషన్ కన్వెన్షన్' ద్వారా సాధారణ, రైల్వే బడ్జెట్ల విభజన జరిగింది. అప్పటి నుంచి సాధారణ బడ్జెట్ వేరుగా, రైల్వే బడ్జెట్ వేరుగా ప్రవేశ పెట్టడం ప్రారంభమైంది. ఈ కన్వెన్షన్ పదజాలాన్ని యధాతధంగా చూస్తే అది ఇలా ఉంది. Its reconstruction was done in a form which frees a great commercial business from the trammels of a system which assumes that the concern goes out of business on every 31st of March and recommences de novo on the 1st of April. The general revenues were to receive a definite annual contribution from the Railway which would be the first charge on the new receipts of the Railways.

ఇక స్వాతంత్ర అనంతర కాలానికి వస్తే, ప్రజా రవాణాలో 75 శాతం, సరకు రవాణాలో 90 శాతం రైల్వేల ద్వారానే జరుగుతూ ఉండేది. ఈ నేపథ్యంలోనే, రైల్వే బడ్జెట్ ప్రత్యేకంగా ఉండడం సమజసం, సహేతుకమే అనిపించుకుంది. అయితే, ఇప్పుడు ఇటు ప్రజా రవాణాలో గానీ, అటు సరకు రవాణాలో గానీ, రైల్వేల వాటా తరిగి వరసగా 15,30 శాతానికి చేరింది. ఈ మార్పును ప్రస్తుత ప్రభుత్వం గుర్తించింది. అందుకు అనుగుణంగా లోతైన అధ్యయనం చేసింది. వివేకవంతమైన నిర్ణయం తీసుకుంది. ఈ పూర్వ రంగంలో, రైల్వే బడ్జెట్‌ను సాధారణ బడ్జెట్ లోని మౌలిక సదుపాయాల విభాగంలో చేర్చారు. అయితే అదే సమయంలో రైల్వేల ఆర్థిక స్వావలంబన, స్వేచ్ఛకు ఎలాంటి భంగం వాటిల్లకుండా బడ్జెట్ భరోసా ఇచ్చింది.

రవాణా మౌలిక వ్యవస్థలో రైల్వేలను చేర్చడం వలన బడ్జెట్‌పై ఆ ప్రభావం స్పష్టంగా కనిపించింది. ఎంపిక చేసిన వస్తువులకు సంబంధించి, నిర్వాహక

**ఎస్ హెచ్ అరుణేంద్ర కుమార్,** రైల్వే శాఖ నిపుణుడు, న్యూ ఢిల్లీ.
E-mail: noidarail54@gmail.com

సంస్థలు, వ్యవస్థల అనుసంధాన సహకారంతో సమగ్ర రవాణా వ్యవస్థకు రైల్వేలు పరిష్కారాలను చూపవలసి ఉంటుంది. దీని వలన, ఇటు వినియోగ దారులకు అటు రవాణా దారులకు ఇద్దరికీ కూడా ప్రయోజనం చేకూరుతుంది. ఉభయ తారకంగా ఉంటుంది. అంతే కాకుండా గూడ్స్ షెడ్లలో వాగన్లు నిలిచి పోవడం గణనీయంగా తగ్గుతుంది. వినియోగ దారులకు ప్రయోజనం కలుగుతుంది.

**ప్రస్తుత బడ్జెట్, నాలుగు ప్రధాన అంశాలపై దృష్టిని కేంద్రీకరించే వెసులుబాటు రైల్వేలకు కలిపించింది.**

1) ప్రయాణీకుల భద్రత
2) మూలధన అభివృద్ధి పనులు
3) పరిశుభ్రత
4) ఆర్థిక, గణాంక సంస్కరణలు

**1) ప్రయాణీకుల భద్రత:**

భద్రతా వ్యవస్థను ఆధునికీకరించేందుకు అంతర్గత వనరులు సరిపోవు. కాబట్టి ఆధునీకరణకు అవసరమైన వనరులను సమకూర్చుకు నేందుకు ప్రత్యేక వ్యవస్థ అవసరం. ఈ వాస్తవాన్ని గత కొన్ని సంవత్సరాలుగా అందరూ గుర్తించారు. అయితే, ఆ దిశగా అడుగులు పడలేదు. గతంలో, 2001లో ఆప్పటి ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్ పేయి ప్రభుత్వం రైల్వేభద్రతకు ప్రత్యేక నిధిని సమకూర్చింది. ముఖ్యంగా భద్రతకు సంబంధించిన, రైలు పట్టాలు, వంతెనలు, సిగ్నలింగ్ వ్యవస్థ, రోల్లిగ్న్ స్టాక్ వంటి వాటిని ప్రాధాన్యత క్రమంలో ఆధునీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకు గాను, రూ. 17వేల కోట్లను మురిగి పోని నిరంతర పద్దు కింద కేటాయించారు. గ్రీన్ బుక్‌లో భద్రత అవసరాల దృష్ట్యా గుర్తించిన పనులను ప్రాధాన్యత క్రమంలో పొందు పరిచారు. ఇక ప్రస్తుత బడ్జెట్ విషయానికి వస్తే, రానున్న ఐదు సంవత్సరాలలో ప్రయాణీకుల భద్రతకు మరింత పెద్ద పీట వేయాలని బడ్జెట్ లోప్రతిపదించారు. లక్ష కోట్ల రూపాయల మూల ధనం తో రాష్ట్రీయ రైల్ సంరక్షక కోష్ (ఆర్ ఆర్ ఎస్ కే) ఏర్పాటు చేస్తున్నట్లు బడ్జెట్ లో ప్రకటించారు. ఇందుకు గాను కేంద్ర ప్రభుత్వం మౌలిక మూల ధనాన్ని సమకూరుస్తుంది. మిగిలిన మొత్తాన్ని రైల్వేలు తమ సొంత ఆదాయం ఇతర మార్గాల నుంచి సమీకరించుకుంటాయి. అదే విధంగా ఈ నిధులతో చేపట్టే పనులకు సంబంధించి ప్రభుత్వం మార్గ దర్శకాలను, ఖచ్చితమైన కాల ప్రణాళికను నిర్దేశిస్తుంది. అలాగే, భద్రతా వ్యవస్థను పటిష్టపరచేందుకు అంతర్జాతీయ స్థాయిలో నిపుణుల సలహాలను, సహకారాన్ని తీసుకుంటారు. మొత్తంగా చూస్తే ఇదొక అత్యంత సాహసోపేతమైన సముచిత నిర్ణయం. అదే విధంగా సాంకేతిక విజ్ఞానాన్ని వినియోగించుకుని కోచ్ నమూనాలను ఆధునికీకరించడం మొదలు, సిగ్నల్ వ్యవస్థను ఆధునీక రించడం, రైలు పట్టాల ఆధునీకరణ, శిథిలావస్థకు చేరిన వంతెనల స్థానంలో నూతన వంతెనల నిర్మాణం వరకు అనేక కార్యక్రమాలను రానున్న ఐదేళ్ళలో పూర్తి చేయాలని నిర్ణయించారు.

గత కొంత కాలంగా, కాపలా లేని రైలు గేట్ల వద్ద జరిగే ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గింది. మరో వంక ప్రస్తుత బడ్జెట్ లో 2020 నాటికి కాపలా లేని రైలు గేట్లు అనేవి లేకుండా చర్యలు తీసుకోవాలని బడ్జెట్లో ప్రతిపాదించారు. అదేవిధంగా రైల్ క్రాసింగుల స్థానంలో రోడ్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణాన్ని పెద్ద ఎత్తున చేపట్టాలని బడ్జెట్ లో ప్రతిపాదించారు. రాష్ట్రీయ రైల్ సంరక్ష కోష్ (ఆర్ ఆర్ ఎస్ కే) రెవెన్యూ, కాపిటల్ వ్యయం రెంటికీ వర్తిస్తుంది. రెవెన్యూ నుంచి రూ. 1,000 కోట్లు, క్యాపిటల్ వ్యయం కింద రూ.19,000 కోట్లు కేటాయించారు. ఈ నిధి పరిధిలో చేపట్టే ప్రాజెక్టుల వివరాలను స్పష్టంగా పొందు పరిచారు.

**2) పెట్టుబడి .. అభివృద్ధి పనులు**

ప్రస్తుత బడ్జెట్‌లో ప్రణాళికా పెట్టుబడులను రూ. 121,000 కోట్ల నుంచి రూ.131,000 కోట్లకు పెంచారు. అలాగే స్థూల బడ్జెట్ కేటాయింపులను రూ. 46,355 కోట్ల రూపాయల నుంచి రూ.55,000 కోట్లకు పెంచారు. అలాగే బడ్జెట్ యేతర వనరుల సమీకరణకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. అయితే అంతర్గత వనరుల సమీకరణ విషయంలో వాస్తవ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, రూ.14,715 కోట్ల నుంచి రూ.14,000 కోట్లకు తగ్గించారు.

ప్రణాళిక పెట్టుబడులు 2014-15 సంవత్సరంతో పోలిస్తే 2017-18లో ఇంచు ముంచుగా రెట్టింపు అయ్యాయి రూ.65,798 కోట్ల నుంచి రూ.131,000 కోట్లకు చేరుకున్నాయి. ఇది ప్రస్తుత ప్రభుత్వం దేశ జీవనాడిగా భావించే భారతీయ రైల్వేలలో పెద్ద ఎత్తున పెట్టుబడులను పెట్టేందుకు చూపుతున్న చిత్త శుద్ధిని తెలియ చేస్తుంది. అలాగే. రైల్వే బడ్జెట్‌ను సాధారణ బడ్జెట్లో మిళితం చేయడం వలన రైల్వేల డివిడెండ్ లయబిలిటీ పెరిగి ప్రతి సంవత్సరం సుమారు రూ.10,000 కోట్ల మేర అదనపు నిధులు అందుబాటులోకి వస్తాయి.

ప్రస్తుత బడ్జెట్‌లో ప్రతిపాదించిన పనులు, ప్రాధాన్యతలను గమనిస్తే రైల్వేల అభివృద్ధికి అవసరమైన కీలక పద్దులకు ప్రథమ ప్రాధాన్యత ఇచ్చారు. గత సంవత్సరం 2800 కిమీ కొత్త రైల్వే లైన్ల నిర్మాణం లక్ష్యంగా నిర్దేశించుకుంటే ప్రస్తుత సంవత్సరంలో 3500 కిలో మీటర్లు లక్ష్యంగా నిర్దేశించారు. విద్యుదీకరణపై ప్రధానంగా దృష్టిని కేంద్రీకరించారు. గత సంవత్సర లక్ష్యం 2000 రూటు కిలో మీటర్లు అయితే ఈ సంవత్సరం దాన్నిరెట్టింపు చేసి 4000 రూటు కి.మీటర్లగా బడ్జెట్‌లో నిర్దేశించారు. అలాగే రానున్న మూడు సంవత్సరాలలో

'త్రూపుట్' ను 10 శాతం పెంచాలని వ్యూహ రచన చేశారు. సాధారణ పరిభాషలో 'త్రూపుట్' అంటే, టన్ కిలోమీటర్లు పాసెంజర్ కిలోమీటర్ల మొత్తం. ఈ బడ్జెట్ ప్రతిపాదించిన మరో కీలక ప్రతిపాదన స్టేషన్ రీడెవలప్మెంట్, రైల్వే స్టేషన్ల ఆధునీకరణ. భోపాల్ సమీపంలోని హబీబ్ గంజ్, గాంధీ నగర్ లో ఈ పని ఇప్పటికే ప్రారంభమైంది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో కనీసం 25 రైల్వే స్టేషన్ల అభివృద్ధికి కాంట్రాక్టులు మంజూరు చేయాలని ఆశిస్తున్నారు. అలాగే, 500 స్టేషన్లలో దివ్యాంగులకు ప్రత్యేక సదుపాయాలను కలిపించాలని, బడ్జెట్లో ప్రతిపాదించారు. అదే విధంగా 7000 స్టేషన్లలో సౌర విద్యుత్ సదుపాయం కలిపిస్తారు. ఇప్పటికే 300 స్టేషన్లలో ఈ పనులు ప్రారంభమయ్యాయి. వెయ్యి మెగావాట్టుల సౌర విద్యుత్ ప్రణాళిక లో భాగంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2000 స్టేషన్లలో పనులు చేపడతారు. పర్యాటక, పుణ్య క్షేత్రాల యాత్రికుల కోసం ప్రత్యేక రైళ్ళను నడిపేందుకు చర్యలు తీసుకుంటారు. పైన పేర్కొన్న కార్య క్రమాలకు సంబంధించి పనులు ప్రారంభమైన దాఖలాలు స్పష్టమవు తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలలో సంయుక్త ఒప్పందాలు కుదుర్చుకునే నూతన ప్రక్రియకు బడ్జెట్ శ్రీకారం చుట్టింది. సంయుక్త ఒప్పందాల వల్ల పనులు వేగంగా ముందుకు సాగుతాయి. ఇలా 70 ప్రాజెక్టులకు సంబంధించి 9 రాష్ట్ర ప్రభుత్వాలతో రైల్వేలు ఒప్పందాలు కుదుర్చు కున్నాయి.

### 3) పరిశుభ్రత:

స్వచ్ఛ భారత్ అభియాన్ పరిధిలో భారతీయ రైల్వేలు పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాయి. ఇందులో భాగంగా చేపట్టిన స్వచ్ఛ రైల్ కార్యక్రమం ఇప్పటికే చక్కని ఫలితాలు ఇస్తోంది. ఎస్.ఎం.ఎస్ ఆధారిత 'క్లీన్ మై కోచ్' సేవలు బహుళ ప్రచారంలోకి వచ్చాయి. ప్రస్తుత బడ్జెట్ లో 'కోచ్ మిత్ర' పథకాన్ని ప్రతిపాదించారు. దీని ద్వారా రైలు పెట్టెలలో అవసరమైన అన్ని సదుపాయాలను ఏక గవాక్షం ద్వారా పొందే సదుపాయం ఉంటుంది. అదే విధంగా 2019 నాటికీ అన్ని రైలు పెట్టెలలో బయో - టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని బడ్జెట్లో ప్రతిపాదించారు, ఈ వినూత్న ప్రయోగం విజయవంతమైనప్పుడు, రైల్వే స్టేషన్లు, రైలుపట్టాల పరిసర ప్రాంతాల స్వరూపమే మారి పోతుంది.

### 4) ఆర్థిక, గణాంక సంస్కరణలు

ఆదాయ వ్యయాల వాస్తవ గణాంక వివరాల ప్రకటన 2019 మార్చిలో వెలువడుతుంది. వాస్తవ గణాంకాల ఆధారంగా, ఎంత ఆదాయం వచ్చింది ఆదాయ ప్రకటనలో తెలుస్తుంది. అదే విధంగా నగదు ఆధారిత గణాంకాల పరిధిలో నగదు రూపంలో వచ్చిన ఆదాయం ఎంతన్నది ఆదాయ ప్రకటనలో ఉంటుంది. ఇలా వాస్తవ గణాంకాల ఆధారంగా ఆదాయ వ్యయాలను మదింపు వేయడం వలన, వ్యాపార లావాదేవీల పూర్తి ప్రభావం ఏమిటన్నది ఒకే ప్రకటనలో స్పష్టంగా తేలిసిపోతుంది. అదే విధంగా ఈ నూతన సంస్కరణల వలన రైల్వేలు అందించే ప్రతి సేవపై ఎంత ఖర్చు అవుతున్నది నిర్దిష్టంగా తెలుస్తుంది. ఈ బడ్జెట్లో చార్జీలు పెంచలేదు. మరో వంక డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించే లక్ష్యంతో, ఐ ఆర్ సి టీ సి ద్వారా బుక్ చేసుకునే ఈ-టికెట్పై విధించే సేవా పన్నును ఉపసంహరించారు. మూడు రైల్వే ప్రభుత్వ రంగ సంస్థలు, ఐ ఆర్ ఎఫ్ ఎస్, ఐ అర్ సి ఓ ఎన్, ఐ ఆర్ సి టీ సి షేర్లను స్టాక్ ఎక్స్చేంజిలో లిస్ట్ చేయాలనీ బడ్జెట్లో ప్రతిపాదించారు.

ప్రస్తుత 2017-18 బడ్జెట్ అంచనాల ప్రకారం, రైల్వేల నికర ఆదాయం రూ.188,988 కోట్లు. 2016-17 సవరించిన అంచనాల ప్రకారం 2016-17 ఆదాయం రూ 172, 155 కోట్లు. అంటే రూ. 16, 843 కోట్లు ఎక్కువ. అదే 2016-17 బడ్జెట్ అంచనాలతో పోలిస్తే రూ 4,178 కోట్లు ఎక్కువ. ప్రయాణీకుల రవాణా ఆదాయం విషయానికి వస్తే, 2016 -17 సవరించిన అంచనాల కంటే రూ 2,125 కోట్లు ఎక్కువ, అయితే బడ్జెట్ అంచనాలతో పోలిస్తే మాత్రం రూ.887 కోట్లు తక్కువ. అదే విధంగా, సరకు రవాణా ఆదాయం కూడా 2016-17 సవరించిన అంచనాల కంటే రూ. 9,256 కోట్లు ఎక్కువ, 2016-17 బడ్జెట్ అంచనాలతో పోలిస్తే రూ. 224 కోట్లు ఎక్కువ. ఇతర చిల్లర ఆదాయాలలో గణనీయ ఎదుగుదల కనిపిస్తోంది. 2017-18 బడ్జెట్ అంచనాల ప్రకారం, ఇతర మార్గాల ద్వారా వచ్చే ఆదాయం రూ. 14,122 కోట్లు. అంటే, 2016 -17 సవరించిన అంచనాల కంటే రూ. 4,032 కోట్లు ఎక్కువ. ఈ గణాంకాలను జాగ్రత్తగా గమనిస్తే, అంచనాలన్నీ వాస్తవానికి దగ్గరగా ఉన్నాయి. మొత్తం అన్ని పద్దుల (పెట్టుబడులు, ఆదాయం) కింద వచ్చే అంచనా ఆదాయం రూ. 3,06,498 కోట్లు. ఇది 2016 -17 సవరించిన అంచనాల కంటేరూ. 27, 908 కోట్లు అధికం , బడ్జెట్ అంచనాల కంటే, 12, 903 కోట్లు ఎక్కువ. రెవెన్యూ వ్యయం విషయంలో కూడా అంచనాలు వాస్తవానికి దగ్గగా ఉన్నాయి. 2016 -17 సవరించిన అంచనాల కంటే రూ.15,390 కోట్లు ఎక్కువగా రూ. 178,350 కోట్లుగా అంచనా వేశారు. సాధారణ నిర్వాహణ వ్యయాన్ని కట్టడి చేయడంలో రైల్వేలు 2016-17 లో చాలా చక్కగా పనిచేశాయి. ఇది 2016-17 సవరించిన అంచనాల ప్రకారం

**ఆదాయ, వ్యయాలు**

రైల్వే బడ్జెట్‌లోని ప్రధాన అంశాలను చర్చించిన మీదట ఇప్పుడు, 2017-18 ఆదాయ వ్యయాలను పరిశీలిద్దాం.

**ఆదాయ వ్యయాల సంక్షిప్త స్వరూపం** (రూపాయాలు కోట్లలో)

| వరుస సంఖ్య | ఐటం | వాస్తవాలు 2015-16 | బడ్జెట్ 2016-17 | సవరించిన బడ్జెట్ 2016-17 | బడ్జెట్ 2017 -18 |
|---|---|---|---|---|---|
| | **ఆదాయం** | | | | |
| 1. | మొత్తం రవాణా ఆదాయం (1ఎ మొదలు 1ఈ వరకు) | 164,334 | 184,820 | 172,155 | 188,998 |
| | ఎ) ప్రయాణీకుల ఆదాయం | 44,283 | 51,012 | 48,000 | 50,125 |
| | బి) సరకు రవాణా ఆదాయం | 109,208 | 117,933 | 108,900 | 118,157 |
| | సి) కోచ్ ద్వారా వచ్చే ఇతర ఆదాయాలు | 4,371 | 6,185 | 5,000 | 6,494 |
| | డి) ఇతర చిల్లర ఆదాయాలు | 5,929 | 9,590 | 10,100 | 14,123 |
| | ఈ) ట్రాఫిక్ సస్పెన్స్ | 543 | 100 | 155 | 100 |
| 2) | ఇతర ఆదాయాలు | 4,046 | 4,451 | 150 | 500 |
| 3) | మొత్తం ఆదాయం (1+2) | 168,380 | 189,271 | 172,305 | 189,498 |
| 4) | సాధారణ ఆదాయం నుంచి పెట్టుబడుల మద్దతు | 37,608 | 45,000 | 46,355 | 55,000 |
| 5) | రైల్వేల మొత్తం ఆదాయంం బడ్జెట్ మద్దతు (3+4) | 205,988 | 234,271 | 218,660 | 244,498 |
| 6) | బడ్జెట్ యేతర ఆదాయ వనరులు | 39,066 | 59,325 | 59,930 | 62,000 |
| 7) | ఈ బీ ఆర్ సహా మొత్తం ఆదాయం | 245,054 | 293,596 | 278,590 | 306,498 |
| | **వ్యయం** | | | | |
| 8) | మొత్తం నిర్వహణ వ్యయం ( 8ఎ నుంచి 8సి వరకు) | 147,836 | 169,260 | 162,960 | 178,350 |
| | ఎ) సాధారణ నిర్వాహణ వ్యయం | 107,736 | 123,560 | 122,760 | 129,750 |
| | బీ) పెన్షన్ ఫండ్ వినియోగం | 34,500 | 42,500 | 35,000 | 43,600 |
| | సి) మిగుల నిధుల తరుగుదల వ్యయం | 5,600 | 3,200 | 5,200 | 5,000 |
| 9) | చిల్లర ఖర్చులు | 1,315 | 1,800 | 1,650 | 2,200 |
| 10) | రైల్వే ఆదాయం నుంచి మొత్తం వ్యయం (8+9) | 149,151 | 171,060 | 164,610 | 180,550 |
| 11) | ఈ బీ ఆర్ & బడ్జెట్ సపోర్ట్ నంచి మొత్తం వ్యయం (4+6) | 76,671 | 104,325 | 106,285 | 117,000 |
| 12) | ఈ బీ ఆర్ సహా మొత్తం వ్యయం (10+11) | 225,826 | 275,385 | 270,895 | 297,550 |
| 13) | నికర ఆదాయం (3-10) | 19,228 | 18,211 | 7,695 | 8,948 |
| 14) | చెల్లించవలసిన డివిడెంట్ | 8,723 | 9,731 | ... | ... |
| 15) | మిగులు/ తరుగులు (13&14) | 10,506 | 8,479 | 7,695 | 8,948 |
| 16) | అభివృద్ధి నిధి చెల్లింపులు | 1,220 | 2,515 | 2,515 | 2,000 |
| 17) | పెట్టుబడి నిధి చెల్లింపులు | 5,798 | 5,750 | 5,180 | 5,948 |
| 18) | రుణ చెల్లింపులు | 3,488 | 214 | ... | ... |
| 19) | రాష్ట్రీయ రైల్ సంరక్ష కోష్ (ఆర్ ఆర్ ఎస్ కే) కేటాయింపులు | ... | ... | ... | 1000 |
| 20) | నిర్వహణ నిష్పత్తి | 90.5% | 92.0% | 94.9% | 94.6% |

**గమనిక: పై అంకెలలో దశాంశాలను తదుపరి సమీప పూర్ణ సంఖ్యలో చూపడం జరిగింది.**

రూ.122, 760 కోట్లు. అంటే, అదే సంవత్సరపు బడ్జెట్ అంచనాల కంటే రూ. 800 కోట్లు తక్కువ. 2017-18లో సాధారణ నిర్వహణ వ్యయం రూ. 1,29.750 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. 2017-18 నికర ఆదాయం లక్ష్యం 8,948 కోట్లు. ఇది 2016 -17 సవరించిన అంచనాల కంటే రూ. 1,253 కోట్లు ఎక్కువ. అయితే ఇది, 2015-16 నికర ఆదాయం రూ. 19,228 కంటే చాలా తక్కువ. ఆపరేటింగ్ రేషియో లక్ష్యం 94.6 శాతం. ఇది, 2016-17 సవరించిన అంచనా 94.9 శాతం కంటే తక్కువ. అయితే దీన్ని ఒక సవాలుగా భావించవలసి ఉంటుంది. ఎందుకంటే, 2016 డిసెంబర్ నాటికి ఆపరేటింగ్ రేషియో 109.6 శాతంగా ఉంది. బడ్జెట్ ఈ వాస్తవాన్ని గుర్తించింది. రైల్వే టారిఫ్‌ను వ్యయం, సేవల నాణ్యత, సామాజిక బాధ్యత, ఇతర రవాణా వ్యవస్థల పోటీ వంటి పలు అంశాలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయించాలని బడ్జెట్ పేర్కొంది.

ఈ వివరాలను గమనిస్తే, కొత్త రైలు మార్గల నిర్మాణానికి కొంచెం తక్కువగా రూ. 11,33 కోట్లు కేటాయించారు. అదే విధంగా గేజ్ మార్పిడి జరగ వలసిన మార్గాలు అంతగా లేక పోవడం వలన, ఈ పద్దు కింద కూడా కేటాయింపును రూ. 3, 091 కోట్లకు పరిమితం చేశారు. రైల్ లైన్ల డబులింగ్, రవాణా సదుపాయ కల్పనకు అధిక కేటాయింపులు చేశారు. లైన్ల డబులింగ్ అంశాన్నే తీసుకుంటే, 2016-17 సవరించిన అంచనాలకంటే రూ. 1,423 కోట్లు చేర్చి రూ. 2,543 కేటాయించారు. అదే విధంగా రవాణా సదుపాయాల కల్పన కోసం రూ. 1,851 కోట్లు అంటే 2016-17 సవరించిన బడ్జెట్ కేటాయింపులకు రూ.1,036 కోట్లు అదనంగా కేటాయించారు. రోడ్డు భద్రత పనులకు కూడా కేటాయింపులు గణనీయంగా పెరిగాయి. ముఖ్యంగా రోడ్డు ఓవర్ / అండర్ బ్రిడ్జిల నిర్మాణానికి కేటాయింపులు పెద్దగా పెరిగాయి. 2016-17లో రూ. 3,066 కొట్లున్న రోడ్డు భద్రత కేటాయింపులను 2017-18 బడ్జెట్ అంచనాలలో రూ. 4,512 కోట్లకు పెంచారు. అలాగే ట్రాక్ మరామత్తులకు అధిక కేటాయింపులు చేశారు. 2016-17 సవరించిన అంచనాల ప్రకారం రూ. 6, 740 కోట్లు ఉన్న మొత్తాన్ని 2017- 18లో రూ 9,961 కోట్లకు పెంచారు. ఈ కేటాయింపులను చూస్తే, కాలం చెల్లిన రైలు పట్టాలను మార్చే విషయంలో ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో పనిచేస్తోందని అర్థం అవుతుంది. అదే విధంగా బ్రిడ్జిల నిర్మాణ కేటాయింపులు 2016-17 సవరించిన బడ్జెట్లో రూ. 592 కోట్లు అయితే, 2017-18 బడ్జెట్‌లో రూ. 746 కోట్లు ప్రతిపాదించారు. సిగ్నలింగ్ వ్యవస్థ అదునీకరణకు బడ్జెట్‌లో పెద్ద పీట వేసారు. 20 16 -17 బడ్జెట్ సవరించిన అంచనాల కంటే ఇంచుమించుగా 145 శాతం పెంచి రూ. 954 కోట్లు ప్రతిపాదించారు.

పెట్టుబడి వ్యయంతో చేపట్టే రైల్వే అభివృద్ధి పనులను ప్రాధాన్యతా క్రమంలో ఈ క్రింది విధంగా ఎంపిక చేశారు.

(రూపాయాలు కోట్లలో)

| ఐటం | వాస్తవాలు 2015-16 | బడ్జెట్ 2016-17 | సవరించిన బడ్జెట్ 2016-17 | బడ్జెట్ 2017 -18 |
|---|---|---|---|---|
| **పెట్టుబడి వ్యయం (బడ్జెట్ వనరులు)** | | | | |
| కొత్త రైలు మార్గాలు | 13,248 | 11,963 | 13,660 | 11,533 |
| గేజ్ మార్పిడి | 3,407 | 3,276 | 3,721 | 3,091 |
| లైన్ల డబులింగ్ | 2,950 | 4,782 | 1,423 | 2,543 |
| రవాణా సదుపాయాలు-యార్డుల ఆధునీకరణ. | 984 | 1,126 | 1,036 | 1,851 |
| రోలింగ్ స్టాక్ | 4,240 | 5,448 | 6,150 | 2,006 |
| లీజ్ అసెట్స్ కాపిటల్ కాంపోనెంట్ చెల్లింపులు. | 6,325 | 7,000 | 7,000 | 8,000 |
| **రోడ్డు భద్రతా పనులు** | | | | |
| ఎ) లెవెల్ క్రాసింగ్ | 470 | 555 | 679 | 705 |
| బి) రోడ్ ఓవర్/ అండర్ బ్రిడ్జిలు | 2,133 | 2,443 | 3,066 | 4,512 |
| ట్రాక్ మరమ్మత్తులు | 5,586 | 4,000 | 6,740 | 9,961 |
| బ్రిడ్జి పనులు | 520 | 589 | 592 | 746 |
| సిగ్నలింగ్ అండ్ టెలికాం పనులు | 894 | 958 | 954 | 2,331 |

**గమనిక: పై అంకెలలో దశాంశాలను సమీప పూర్ణ సంఖ్యలో చూపడం జరిగింది.**

ఆర్.ఆర్.ఎస్.కే కాకుండా, సంప్రదాయ భద్రతా చర్యలను కొనసాగి స్తారు. భద్రతకు సంబంధించి, ట్రాక్స్, లోకో మోటివ్స్, కోచిలు, వంతెనలు, సిగ్నలింగ్ వంటి వివిధ పద్దుల కింద నిధులను ఖర్చు చేస్తారు. రెవెన్యూ వద్ద పరిధిలో భద్రతా కార్యకలాపాలకు కేటాయించిన మొత్తం రూ. 42, 679 కోట్లు, (ఇది ఆర్ ఆర్ కే ఎస్ కేటాయింపులకు అదనం) అంటే 2016-17 సవరించిన అంచనాలకంటే రూ. 814 కోట్లు ఎక్కువ.

**భద్రతా సంబంధిత కార్యక్రమాల వ్యయం**

(రూపాయాలు కోట్లలో)

| ఐటం | బడ్జెట్ 2016-17 | సవరించిన బడ్జెట్ 2016-17 | బడ్జెట్ 2017 -18 |
|---|---|---|---|
| రెవెన్యూ వ్యయం<br>ట్రాక్ నిర్వాహణ | 13,712 | 13.539 | 13,759 |
| లోకో మోటివ్స్ | 6,318 | 6.108 | 6,204 |
| రైలు పెట్టెలు, వ్యాగన్లు | 14,312 | 14.351 | 14,734 |
| ప్లాంట్, పరికరాలు | 8,112 | 7.832 | 7,947 |
| రవాణా | 35 | 35 | 35 |
| **మొత్తం రెవిన్యూ (భద్రత)** | **42,489** | **41,865** | **42,679** |

**ముందడుగు ముఖ చిత్రం:**

రైల్వేల ప్రస్థానంలో చైతన్యం చోటు చేసుకుంటోంది. నెట్ టన్ కిలోమీటర్, పాసెంజర్ కిలో మీటర్ లలో ఇది స్పష్టం అవుతోంది. ఈ రెండు అభివృద్ధి సూచికల వృద్ధికి ఈ క్రింది విధంగా లక్ష్యాలను నిర్దేశించుకోవడం జరిగింది.

(రూపాయాలు కోట్లలో)

| ఐటం | వాస్తవిక 2015-16 | బడ్జెట్ 2016-17 | సవరించిన బడ్జెట్ 2016-17 | బడ్జెట్ 2017 -18 |
|---|---|---|---|---|
| ప్రయాణీకులు<br>కి.మీ (మిలియన్) | 1,143,039 | 1,137,298 | 1,157,637 | 1,159,900 |
| నెట్ టన్<br>కి.మీ (మిలియన్) | 654,481 | 694,607 | 621,247 | 675,622 |

బడ్జెట్లో నాలుగు ప్రధాన క్షేత్రాలకు సరిపడినంతగా ఆర్థిక వనరుల మద్దతు లభించింది. అలాగే కొత్తగా ఏర్పాటు చేసిన రాష్ట్రీయ రైల్ సంరక్షా కోష్‌కు తగినంతగా నిధులను సమకూర్చారు. ఆదాయ, వ్యయ లక్ష్యాల విషయంలో గానీ, వివిధ పథకాల భౌతిక లక్ష్యాల విషయంలో గానీ, వాస్తవ పరిస్థితుల గీత దాట లేదు. నేల విడిచి సాము చేసే ప్రయత్నం చేయ లేదు. కొత్త అవతారం సంతరించుకున్న ఈ బడ్జెట్, దేశ అభివృద్ధి చోదక శక్తిగా పరిగణించే భారతీయ రైల్వేలు మరింత మెరుగైన సేవలు అందిచడంలో పెద్ద ముందడుగు అనడంలో సందేహం లేదు.

■

*12వ పేజీ తరువాయి...*

## స్వాత్ ఎనాలసిస్ - భారత ఆర్థికవ్యవస్థ-సర్వే 2016-17

ప్రత్యేక సంస్కరణలు, ప్రణాళికలు, సవాళ్లను ఎదుర్కొనే అంశాలను గూర్చి ప్రస్తావించింది. ఇందులో కొన్ని అంశాలను గూర్చి భిన్న అభిప్రాయాలు వ్యక్తమైనాయి. అనుభవజ్ఞులు తమ అభిప్రాయాలలో బలాలు మరియు అవకాశాల విషయాల గూర్చి కొన్ని విషయాల పట్ల విభేదించారు. ముఖ్యంగా "భారతదేశంలో స్థానికంగా పెద్ద ఎత్తున వలసలు కొనసాగుతాయి". అన్న విషయంలో కొన్ని రాష్ట్రాలలో మాత్రమే అనగా ఢిల్లీ, మహారాష్ట్ర, తమిళనాడు మరియు గోవాలకు వలస వచ్చే వారి సంఖ్య 75 శాతం ఉండగా, కొన్ని రాష్ట్రాలలో అనగా ఉత్తరప్రదేశ్, బీహార్, జార్ఖండ్ మరియు మధ్యప్రదేశ్ నుండి వలస వెళ్లే వారి సంఖ్య 66 శాతంగా వున్నది. మిగతా రాష్ట్రాలలో ఈ వలసలు చెప్పుకోదగిన స్థాయిలో లేవు. అలాగే వస్తువుల వినియోగం, రవాణా మరియు ఆదాయ స్థాయిలో ఇలాంటి అంశాలనే గమనించవచ్చు. అంతేకాక వినియోగం మరియు ఆదాయం వచ్చే విషయాలలో రాష్ట్రాల మధ్య విభజన సమానంగా వుండదు. వస్తుసేవలు, శ్రమ మరియు రాబడులపై ఇది ఆధారపడి వుంటుంది. దీనివలన ప్రయోగసిద్ధమైన అంశాల పట్ల కొంత స్పష్టత వచ్చింది. ఇలాంటి చిన్న పరిమితులను మినహాయించితే, ఈ ఆర్థిక సర్వే ఒక బాధ్యతాయుతమైన అంశాన్ని అందించించ డంలో విస్తృత పరిశోధన చేసిందని చెప్పవచ్చు.

■

విశిష్ట వ్యాసం

# బడ్జెట్ 2017-18 : మౌలిక రంగానికి కేటాయింపులు



**2017-18 బడ్జెట్‌ను స్థూలంగా పరిశీలిస్తే కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసుకున్న లక్ష్యాలను త్వరగా, సకాలంలో పూర్తి చేయాలనే సంకల్పంతో ఉన్నట్లు స్పష్టమవుతుంది. మొత్తం బడ్జెట్‌లో దేశ మౌలిక రంగానికి చేసిన కేటాయింపులు దాదాపు ఒకింట అయిదొంతులు ఉండడమే దీనికి నిదర్శనంగా చెప్పాలి. ఇది దేశ ఆర్థిక రంగానికి కొత్త ఉత్తేజాన్ని ఇవ్వడమే కాకుండా యువతకు భారీగా ఉపాధి అవకాశాల కల్పనకి బాటలు వేస్తూ, విదేశీ మదుపరులకి అనుకూల వాతావరణాన్ని సృష్టిస్తూ, గ్రామీణ భారతానికి సరికొత్త జవజీవాలను అందిస్తుంది.**

కేంద్ర బడ్జెట్ 2017-18 ప్రధాన ఉద్దేశ్యం 'టెక్ ఇండియా' నిర్మాణం @ TEC= Transforming Energizing & Cleansing (భారత్‌ని మార్చడం, శక్తివంతం చేయడం, పరిశుభ్రంగా ఉంచడం). టెక్ ఇండియా అజెండాను అమలు చేయడానికి పది విభిన్నమైన పథకాలపై ప్రధానంగా దృష్టి సారించారు. ఈ పథకాలు ప్రధానంగా రైతులు, గ్రామీణ జనాభా, యువత, పేదలు, జనజీవన స్రవంతికి దూరంగా ఉన్నవారు, మౌలిక సదుపాయాలు, ఆర్థికరంగం, డిజిటల్ ఎకానమీ, ప్రజా సేవా రంగం, ఆర్థిక నిర్వహణ, వన్ను పాలనా యంత్రాంగాన్ని లక్ష్యంగా చేసుకొని రూపొందించినవి. ఈ అజెండాను అమలు చేయడానికి లక్షిత లక్ష్యాలను సాధించడానికి 2017-18 బడ్జెట్‌లో రూ. 21,46,735 కోట్లను కేటాయించాలని ప్రతిపాదించారు.

2017-18 బడ్జెట్ మౌలిక రంగంపై అమితంగా దృష్టి సారించింది. సామర్థ్య, ఉత్పాదకత పెంపు, నాణ్యమైన జీవన ప్రమాణాలను సాధించడమే లక్ష్యంగా రూపొందించారు. ఈ లక్ష్యాలను సాధించడానికి మొత్తం కేటాయింపులు రూ. 3,96,135 కోట్లుగా, అంటే అది గత ఏడాది బడ్జెట్‌తో పోలిస్తే 18.45 శాతం అధికంగా ఉంది. ఈ కేటాయింపులు 2016-17లో రూ. 3,48,952 కోట్లు కాగా దాన్ని 2016-17లోనే రూ. 3,58,634 కోట్లకు పెంచడం జరిగింది. ఆ వివరాలు దిగువ చూపిన పట్టికలో చూడవచ్చు.

పట్టిక 1: వ్యయ పట్టిక — కోట్ల రూపాయల్లో

| వరస సంఖ్య | రంగం/పద్దు | 2016-17 (బడ్జెట్ అంచనాలు) | 2016-17 (సవరించిన అంచనాలు) | 2017-18 (బడ్జెట్ అంచనాలు) |
|---|---|---|---|---|
| 1. | ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం జీడీపీ 2011-12 వరసలో | 1,50,75,429 | 1,50,75,429 | 1,68,47,544 |
| 2. | మొత్తం బడ్జెట్ వ్యయం | 19,78,060 | 20,14,407 | 21,46,735 |
| 3. | మౌలిక సదుపాయాల కల్పన నుంచి.. | 3,48,952 | 3,58,634 | 3,96,135 |
| 4. | రవాణ వ్యయం నుంచి... | 2,16,268 | 2,16,903 | 2,41,387 |

**కృష్ణదేవ్,** మౌలిక రంగ నిపుణుడు, న్యూ ఢిల్లీ.
E-mail: kd.krishnadev@gmail.com

ఇక ఆర్థిక వ్యవహారాల శాఖ (మౌలిక సౌకర్యాల విభాగం) కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ 8, అక్టోబర్, 2013న జారీ చేసిన రాజపత్రం ప్రకారం మౌలిక సౌకర్యాల రంగమంటే రవాణ, విద్యుత్, నీరు, పారిశుద్ధ్యం, సమాచార రంగం, సాంఘిక, వాణిజ్య మౌలిక సౌకర్యాల కల్పనగా పేర్కొంది.

## 1. రవాణ

| పట్టిక 2: మౌలిక సౌకర్యాల కల్పన కోసం వివిధ మంత్రిత్వశాఖలు/విభాగాలు వ్యయం చేసిన వివరాలు | | | | | |
|---|---|---|---|---|---|
| | | కోట్ల రూపాయాల్లో | | | |
| వరస సంఖ్య | మంత్రిత్వశాఖ/విభాగం | 2015-16 వాస్తవికం | 2016-17 బిఈ | 2016-17 ఆర్ఈ | 2017-18 బీఈ |
| 1. | ఉపరితల రవాణా మంత్రిత్వశాఖ | 46,913 | 57,976 | 52,447 | 64,900 |
| 2. | రైల్వే మంత్రిత్వశాఖ | 35,008 | 45,000 | 46,155 | 55,000 |
| 3. | నౌకాయాన మంత్రిత్వశాఖ | 1,324 | 1,531 | 1,454 | 1,773 |
| 4. | పౌర విమాన మంత్రిత్వశాఖ | 4,168 | 2,590 | 3,452 | 2,702 |
| 5. | విద్యుత్ మంత్రిత్వశాఖ | 7,735 | 12,253 | 10,476 | 13,881 |
| 6. | పెట్రోలియ, సహజవాయుశాఖ | 31,287 | 29,160 | 30241 | 29,158 |
| 7. | సమాచార మంత్రిత్వశాఖ | 20,485 | 18,414 | 24,272 | 26,687 |
| 8. | తాగునీరు, పారిశుద్ధ్య మంత్రిత్వశాఖ | 11,081 | 14,009 | 16,512 | 20,010 |
| | **మొత్తం బడ్జెట్ వ్యయం** | **17,90,783** | **19,78,060** | **20,14,407** | **21,46,735** |
| | ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం జీడీపీ-2011-12 | **1,36,75,331** | **1,50,75,420** | **1,50,75,429** | **1,68,47,544** |

2017-18 బడ్జెట్‌లో రైల్, రోడ్, షిప్పింగ్, విమానాశ్రయాలకు మొత్తంగా కలిపి రూ.2,41,387లు కేటాయించగా, అది ఈ ఏడాది మౌలిక రంగం కోసం చేసిన కేటాయింపుల్లో 61 శాతంగా ఉంది. అత్యంత ఆశాజనకమైన, భారీ పరిమాణంలోని ఈ కేటాయింపులు దేశ వ్యాప్తంగా ఆర్థిక కార్యకలాపాలు శరవేగంగా పెరగడానికి, మరిన్ని ఉపాధి అవకాశాల పెంపుకి దోహదపడనున్నాయి. అదే జరిగితే, మొత్తం ఆర్థిక వ్యవస్థ రూపురేఖలే గణనీయంగా మారిపోయి, యావత్ ఆర్థిక ప్రక్రియ అత్యధిక వృద్ధి రేటుకి దారి తీయడంతో సామర్థ్య పెంపు, జీవన ప్రమాణాల పెరుగుదల, ఉత్పాదకతలో వృద్ధిని సాధించే లక్ష్యాలను చేరుకోవడం ఖాయంగా చెప్పవచ్చు. అయితే అదే సమయంలో మరోవైపు సరైన నిర్ధారిత కాల వ్యవధిలో ఆయా ప్రాజెక్టులు పూర్తి కావడం మీదే పైన పేర్కొన్న లక్ష్యాల సాధన ఆధారపడి ఉంటుందని చెప్పాలి.

### ఎ. రహదారులు

ఇక రహదారుల రంగానికొస్తే, బడ్జెట్‌లో ఈ రంగానికి 2016-17లో అంచనా వేసిన రూ.57,976 కోట్ల స్థానంలో 2017-18 బడ్జెట్‌లో రూ.64,900 కోట్లు (పట్టిక 2) కేటాయించగా అందులో మొత్తం రవాణ రంగానికి జరిపిన కేటాయింపుల్లో 27 శాతం ఉండడం విశేషం. ఈ కేటాయించిన నిధులను ఇప్పటికే శరవేగంగా జరుగుతున్న ప్రాజెక్టులు, కార్యక్రమాలకు వ్యయం చేస్తూ, కోస్తా రహదారుల అనుసంధానత కోసం మొత్తం 2 వేల కిలోమీటర్ల రహదారుల నిర్మాణం, అభివృద్ధికి కేటాయించనున్నారు. దీంతో దేశంలోని ఓడరేవులు, మారుమూల గ్రామాలు అనుసంధానించబడతాయి. దీంతోపాటు, పీఎమ్‌జీఎస్‌వై కింద 2014-15 ఆర్థిక సంవత్సరం నుంచి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వరకు నిర్మిస్తున్న రహదారుల పొడవు 1,40,000 కిలోమీటర్లు కాగా, అది గత మూడేళ్లలో నిర్మించిన నిడివి కన్నా ఎంతో ఎక్కువగా ఉంది.

దీనికి తోడు, ఒక ప్రభావంతమైన భిన్న తరహా లాజిస్టిక్స్, రవాణా రంగం ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుంది. దీని కోసం భిన్న తరహా లాజిస్టిక్ పార్కులతో పాటు భిన్న తరహా రవాణా సదుపాయల కల్పనను రూపొందించి అమలు చేయాల్సి ఉంటుంది. ఈ తరహా భిన్నమైన లాజిస్టిక్ పార్కులతో అనుసంధానమైన భిన్న తరహా రవాణా సదుపాయాల కల్పన అన్నది నిజానికి అనేక సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నందున ప్రస్తుతం దీని అమలును స్వాగతించాల్సి ఉంది.

ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన (పీఎమ్‌జీఎస్‌వై)ని గతంలో ఎన్నడూ లేని రీతిలో ప్రస్తుతం అమలు చేస్తున్నారు. ఈ పథకం అమలు శరవేగంగా జరుగుతోంది. 2016-17 ఆర్థిక సంవత్సరంలో పీఎమ్‌జీఎస్‌వై పథకం కింద రోజుకి 133 కిలో మీటర్ల మేరా రహదారులు నిర్మాణం జరిగింది. అదే 2011-2014 మధ్య కాలంలో ఈ పథకం కింద కేవలం సగటున రోజుకి 73 కిలో మీటర్ల రహదారుల నిర్మాణం మాత్రమే జరిగింది. ఇదే కాకుండా వామపక్ష తీవ్రవాదం ప్రబలంగా ఉన్న ప్రాంతాల్లో వందకి పైగా జనాభా ఉన్న ఆవాసాలను అనుసంధానించడానికి రహదారుల నిర్మాణానికి ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పీఎమ్‌జీఎస్‌వై పథకం కింద ఏర్పరుచుకున్న లక్ష్యాలను 2019 నాటికి పూర్తి చేయాలని, అందు కోసం పట్టిక 3లో చూపిన విధంగా రూ. 19,000 కోట్లు కేటాయించడం జరిగింది. ఈ పథకం కింద కేంద్రనిధులే కాకుండా రాష్ట్రాల వాటాతో కలిసి 2017-18 ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.27,000 కోట్లు వ్యయం చేయనున్నారు.

పట్టిక 3: ప్రధానమైన కేంద్ర ప్రభుత్వ స్పాన్సర్డ్ పథకాలు

| వరస సంఖ్య | మంత్రిత్వశాఖ/విభాగం పథకాలు | 2015-16 | 2016-17 | 2016-17 | 2017-18 |
|---|---|---|---|---|---|
| 1. | ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన (పీఎమ్‌జీఎస్‌వై) | 18,290 | 19,000 | 19,000 | 19,000 |
| 2. | ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎమ్ఏవై) | 11,603 | 20,075 | 20,936 | 29,043 |
| | ఏ) పీఎమ్ఏవై: గ్రామాలు | 10,116 | 15,000 | 16,000 | 23,000 |
| | బి) పీఎమ్ఏవై: పట్టణాలు | 1,487 | 5,075 | 4,936 | 6,043 |
| 3. | జాతీయ గ్రామీణ తాగునీటి పథకం | 4,370 | 5,000 | 6,000 | 6,050 |
| 4. | దీనదయాళ్ ఉపాధ్యాయ గ్రామజ్యోతి పథకం | 4,500 | 3,000 | 3,350 | 4,814 |
| 5. | స్వచ్ఛ్ భారత్ మిషన్ (ఎస్‌బీఎమ్) | 7,469 | 11,300 | 12,800 | 16,248 |
| | ఏ) ఎస్‌బీఎమ్: గ్రామాలు | 6,703 | 9,000 | 10,500 | 13,948 |
| | బి) ఎస్‌బీఎమ్: పట్టణాలు | 766 | 2,300 | 2,300 | 2,300 |
| 6. | సమగ్ర విద్యుత్ అభివృద్ధి పథకం | 1,002 | 5,500 | 4,524 | 5,821 |
| 7. | అమృత్ పథకం | 4,186 | 7,296 | 9,559 | 9,000 |
| 8. | భారత్‌నెట్ | - | - | 6,000 | 10,000 |
| 9. | ఎమ్ఆర్‌టీఎస్, మెట్రో ప్రాజెక్టులు | 9,300 | 10,000 | 15,700 | 18,000 |
| 10. | పేదల గృహాలకు ఎల్పీజీ కనెక్షన్లు | - | 2,000 | 2,500 | 2,500 |
| 11. | రహదారి భద్రతా పనులు | 2,603 | 2,998 | 3,745 | 5,217 |
| 12. | ఐటీ, ఎలక్ట్రానిక్స్‌కి ప్రోత్సాహాలు | 52 | 70 | 50 | 745 |

జాతీయ రహదారుల అభివృద్ధి ప్రాజెక్టు (ఎన్‌హెచ్‌డీపీ) ప్రధానంగా అనుసంధాన సామర్థ్య పెంపుపై కాకుండా అనుసంధానపైనే ఎక్కువగా దృష్టి పెట్టబోతున్న విషయాన్ని ఇక్కడ ప్రస్తావించడం అత్యంత ముఖ్యమైందిగా భావించాలి. ఈ రంగంలో ఉన్న అతి పెద్ద సవాళ్లలో ప్రాజెక్టులు ఇవ్వడానికి నిర్ణీత కాల గడువు, భూసేకరణలో సంక్లిష్టతలు, పర్యావరణ అనుమతులు సాధించడం, నిర్మాణ సామర్థ్యంలో నిరంతరంగా ఉంటున్న లేమితనం ముఖ్యమైనవిగా చెప్పాలి.

ఇకపోతే హై కెపాసిటీ కారిడార్ల వెంబడి పాదచారులు, ఎడ్లబండ్లు వంటి రవాణాకి చెందిన సాంఘిక అవసరాలు, మోటారేతర వాహనాలు, స్థానిక మోటారు వాహనాల కదలికలకు అనువైన ఏర్పాట్లపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అయితే మరోవైపు గ్రామీణ ప్రాంతాలు మరీ ముఖ్యంగా పీఎమ్‌జీఎస్‌వై పథకం కింద ఎక్కువ లబ్ధి పొందుతూ రవాణా అవసరాలకు తగిన రీతిలో మెరుగైన రహదారి అనుసంధానతను సాధిస్తున్నాయి. అయితే ఇక్కడ ఉన్న ఒక లోపభూయిష్టమైన అంశం ఏమిటంటే గ్రామీణ ప్రాంతాల్లో నిర్మిస్తున్న రహదారులు అన్ని కాలాలకు అనువుగా లేకపోవడమని చెప్పాలి.

అయితే దేశంలో రహదారుల ముఖచిత్రాన్ని మార్చడంలో అనుమతుల జారీలో తీవ్రమైన జాప్యం, అనేకానేక అధికార పరిధులు, ప్రైవేటు రంగానికి సంబంధించి తరచూ మారుతున్న నిబంధనలు, పెద్దగా ఫలితాలివ్వని భూ చట్టాలు, నైపుణ్య లేమి అవరోధాలుగా మారుతున్నాయి. దీంతోపాటు రహదారి నిర్మాణాన్ని విడిగా చూడడం కాకుండా, ఒక సమగ్రమైన రవాణా వ్యవస్థలో భాగంగా చూడాల్సి ఉంటుంది. దీని కోసం క్రమబద్ధంగా కనీసం ప్రతి అయిదు సంవత్సరాలకు ఒకసారైనా ప్రాంతీయ ట్రాఫిక్, ట్రాన్స్‌పోర్ట్ సర్వేలను సవివరంగా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**బి) విమానాశ్రయాలు**

ఇక 2016-17 బడ్జెట్ అంచనాలలో రూ.2590 కోట్లు కేటాయించిన విమానాశ్రయ రంగానికి 2017-18 బడ్జెట్‌లో దాన్ని రూ.2702 కోట్లకు పెంచడం జరిగింది. అయితే అదే 2016-17 సవరించిన అంచనాలలో ఈ రంగానికి కేటాయింపులు రూ.3452 కోట్లుగా ఉంటే దాన్ని తగ్గించడం జరిగింది. నిజానికి 2016-17 సవరించిన అంచనాలలో విమానాశ్రయ రంగానికి కేటాయింపులు పెంచిన తరువాత ఈ రంగానికి కేటాయింపులు ఇంకా చేయాల్సి ఉందని, భారీగా నిధులు వ్యయం జరగాల్సి ఉందని గుర్తించారు. ఎందుకంటే గత 20 సంవత్సరాలుగా భారత వైమానిక రంగంలో అనేక నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. కొత్త విమాన సంస్థలు దేశీయంగా, అంతర్జాతీయంగా కొంగొత్త వైమానిక మార్గాలను ప్రారంభించారు. మరోవైపు దేశంలోని విమానాశ్రయాలను ఆధునీకరించడం, విస్తరించడం జరుగుతోంది. అదే సమయంలో అంతర్జాతీయ ప్రమాణాలతో పోలిస్తే భారతీయ విమానాశ్రయాలు, వైమానిక సర్వీసుల భద్రతా ప్రమాణాలు బాగా తక్కువనే చెప్పాలి.

గగనతల ప్రయాణంలో భద్రతా ప్రమాణాలను కొనసాగించడానికి ఎయిర్ నేవిగేషన్ సర్వీసెస్‌ని బలోపేతం చేయడానికి తగినన్ని నిధులను కేటాయించాల్సి ఉంది. ఇప్పటికే మెట్రో నగరాల్లో గగనతల రవాణా బాగా పెరగడమే కాకుండా రద్దీ కూడా పెరిగింది. అందుకోసం సరికొత్త సాంకేతిక

పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ విమానాల రాకపోకలు వేగంగా, సులభంగా జరగడానికి చర్యలు చేపట్టాలి. దీని ప్రకారం ఢిల్లీ విమానాశ్రయంలాగా అన్నిచోట్లా విమానం లాండింగ్‌ని, టేకాఫ్‌ని రెండు విభాగాలుగా విడదీసి ఎయిర్‌పోర్టుల్లో ట్రాఫిక్ నియంత్రణకి ఉత్తమమైన పద్ధతులను అవలంభించడం ద్వారా గగనతలాన్ని సురక్షితంగా మార్చాల్సి ఉంది.

2017-18 బడ్జెట్‌లో రెండవ వరుస నగరాల్లోని ఎంపిక చేసిన విమానాశ్రయాల నిర్వహణను ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్య (పిపిపి)పద్ధతిలో కొనసా గించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీంతో పాటు, ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా చట్టాన్ని సవరించడం ద్వారా ఎయిర్‌పోర్టుల భూముల రూపంలో ఉన్న ఆస్తులను లాభసాటిగా వినియోగించు కోవాలి. ఆ విధంగా సేకరించిన వనరులను ఎయిర్ పోర్టు మెరుగుదలకి ఉపయోగించాలి. ఇక ఎయిర్‌పోర్టుల ఆధునీకరణ అత్యంత ఆవశ్యకంగా మారిన ఈ తరుణంలో దాని ప్రస్తావన తాజా బడ్జెట్‌లో లేకపోవడం విచారకరం.

అదే సమయంలో ప్రభుత్వం విదేశీ యాజమాన్యం, దేశీయ విమానిక సర్వీసుల నియంత్రణపై స్పష్టమైన నిబంధనలను రూపొందించాల్సి ఉంది. విదేశీ వైమానిక పరిశ్రమలను దేశంలో అనుమతించడం ద్వారా తక్కువ వడ్డీకే రుణాలు, సాంకేతిక మార్పిడి, నిర్వహణా సామర్థ్యం, అంతర్జాతీయ మార్కెట్లలోకి ప్రవేశం తేలిగా జరిగే అవకాశముంది.

అయితే వైమానిక రంగానికి సంబంధించి నిబంధనలు రూపొందిస్తున్నప్పుడు ప్రైవేటు ఈక్విటీ, దేశీయ వైమానికి రంగానికి రుణ వితరణలో సుస్థిరత సాధించడం ద్వారా ఈ రంగపు మొత్తం ఆర్థికాభివృద్ధిని దృష్టిలో పెట్టుకోవాలి.

### సి) షిప్పింగ్

సామర్థ్య కోణంలో చూస్తే భారతీయ నౌకాశ్రయాలకి పరిమితులు అత్యధికంగా ఉంటాయి. సమీప భవిష్యత్‌లో కూడా ఇందులో పెద్దగా మార్పేమీ రాకపోవచ్చును. 2011-12లో ఓడరేవుల వినియోగం సగటున 80 శాతముంటే, తరువాతి కాలంలో అంతర్జాతీయ ఆర్థిక మాంద్యం పట్టి పీడిస్తున్నప్పటికీ దేశంలోని 12 ప్రధాన ఓడరేవుల్లో నాలుగింటి వినియోగం వంద శాతం పెరగడం విశేషంగా చెప్పాలి.

గత ఏడాది భారత ఓడరేవుల నుంచి అత్యధిక పరిమాణంలో ఎగుమతులు, దిగుమతులు భారీ స్థాయిలో జరిగాయి. ఎగుమతులు సీఏజీఆర్ కింద 21 శాతం వృద్ధి ఉంటే, దిగుమతులు 25 శాతం పెరగాయి. అంతర్జాతీయంగా ఓడరేవుల ద్వారా జరిగే రవాణా పరిమాణంలో భారతీయ వాట గణనీయంగా ఉన్న నేపథ్యంలో ఈ రంగానికి బడ్జెట్ కేటాయింపులు కూడా ఎక్కువగానే ఉండాలి.

జలరవాణ వ్యయం పరిమితంగా ఉంటూ పర్యావరణానికి అనుకూలంగా ఉండడంతో 2017-18 బడ్జెట్ అంచనాల రూ.1773 కోట్లు కేటాయించాలని ప్రతిపాదించగా, అది 2016-17బిఈ మరియు ఆర్ఈలో రూ.1531 కోట్లే ఉంది. ఓడరేవులు, లైట్‌హౌస్‌ల అభివృద్ధి కోసం 2016-17 బీఈలో రూ.732 కోట్లు ఉంటే 2017-18 బడ్జెట్‌లో రూ.801.40 కోట్ల కేటాయింపు లతో పదిశాతం నిధులు పెరిగాయి. దీంతో పాటు ఓడరేవులు, ఈశాన్య ప్రాంతాలకు తాజా బడ్జెట్‌లో రూ.238 కోట్లు, రూ.126 కోట్లు ఉంటే అదే 2016-17 బీఈలో వరసగా రూ.100 కోట్లు, 172 కోట్లుగా ఉంది.

దేశీయ జల రవాణా వ్యవస్థ అత్యంత పర్యావరణ అనుకూలమైందే కాకుండా ఇంధన వినియోగంలో వ్యయం తగ్గడం, కార్బన ఉద్గారాల శాతం తక్కువడం ఉండడంతో జల రవాణాకి సమీపంలో ఉన్న భూ ప్రాంతాల్లో ఒక సమగ్రమైన సాంఘిక, ఆర్థిక అభివృద్ధికి కీలకంగా మారుతుంది. అయితే దేశీయ జల రవాణాకి బడ్జెట్ కేటాయింపుల్లో క్షీణత కనిపిస్తోంది. ఈ రంగానికి 2016-17 బీఈలో రూ.326.42 కోట్లు ఉంటే అది అదే సంవత్సరం ఆర్ఈలో రూ.278.42 కోట్లకి, 2017-18 బీఈకి రూ.225 కోట్లకి పడిపోయింది. దీనికి ప్రధాన కారణంగా దేశీయ జల రవాణాలో సరుకుల రవాణ పరిమాణం అతి తక్కువగా ఉండడమేనని చెప్పాలి. మహా అంటే పశ్చిమకోస్తా ప్రాంతంలో గోవాలో ఇనుప ఖనిజం రవాణా మాత్రమే దేశంలో ఎక్కువగా జరుగుతున్న దేశీయ జల రవాణా అని చెప్పాలి. అయితే దేశీయ భూ జల రవాణా మార్గాలను గుర్తించడం, అనుసంధానించడం, అభివృద్ధి చేయడంతో రహదారులు, రైలు మార్గాల రవాణాపై ఒత్తిడి తగ్గడమే కాకుండా కర్బన ఉద్గారాల విడుదల కూడా తగ్గుతుంది.

## 2. కమ్యూనికేషన్

దేశ మౌలిక సౌకర్యాల వ్యవస్థలో టెలికాం రంగం అతి కీలకమైంది. ప్రస్తుతం దేశంలోని స్పెక్ట్రమ్ కొరత కారణంగా స్పెక్ట్రమ్ వేలం నిలిపివేశారు. దాని బదులుగా మారుమూల ప్రాంతాల్లో, గ్రామాల్లో నివసించే అత్యధిక జనాభాకి ప్రయోజనం కలిగేలా మొబైల్ బ్రాండ్ బాండ్‌కి, డిజిటల్ ఇండియాకి స్పెక్ట్రమ్ సేవలను వినియోగించడం జరుగుతోంది. దీంతో భారీగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

గత ఏడాది బడ్జెట్, సవరించిన అంచనాలలో రూ.18,414 కోట్లు, రూ.24,272 కోట్ల కేటాయింపుల కన్నా ఈ ఆర్థిక సంవత్సరంలో 10 శాతం, 45 శాతం అధికంగా అంటే రూ.26,687 కోట్లను

దేశీయ టెలీకాం రంగ అభివృద్ధికి ప్రతిపాదించారు.

ఇక జాతీయ ప్రాముఖ్యత ఉన్న భారత్ నెట్ పథకం ద్వారా డిజిటల్ ఇండియా ప్రాజెక్టుని సాకారం చేయడానికి కోరుకున్న అన్ని సంస్థల అవసరాల మేరకు, దేశంలోని అన్ని గృహాల అవసరాలు తీర్చే విధంగా వివక్షా రహితంగా బ్రాండ్ బాండ్ అనుసంధానం చేయనున్నారు. ఆప్టికల్ ఫైబర్‌ను ఉపయోగించి గ్రామీణ ప్రాంతాల్లో బ్రాండ్ బాండ్ అనుసంధానం ప్రపంచంలోనే అతి పెద్ద ప్రాజెక్టుగా నిలవనుంది.

భారత్‌నెట్ ప్రాజెక్టుకి 2017-18 ఆర్థిక సంవత్సరంలో రూ.10,000 కోట్లు కేటాయించగా అది 2016-17 ఆర్‌ఈలో కేవలం రూ.6000 కోట్లుగా మాత్రమే ఉంది. 2017-18 చివరి నాటికి దేశ వ్యాప్తంగా 1,50,000 గ్రామ పంచాయతీల్లో ఆప్టికల్ ఫైబర్ ద్వారా హైస్పీడ్ బ్రాండ్ బాండ్ అనుసంధానంతో పాటు వైఫై హాట్‌స్పాట్, డిజిటల్ సేవలను అతి తక్కువ వ్యయానికే అందించనున్నారు. ఆప్టికల్ ఫైబర్ కేబుల్ అనబడే ఈ ప్రాజెక్టు 1,55,000 కిలో మీటర్ల మేర వేయడం జరుగుతుంది. దీంతోపాటు, డిజిటిల్ టెక్నాలజీ ద్వారా డిజీగోన్ అనే కార్యక్రమం ద్వారా టెలీ మెడిసిన్, వైద్యం, నైపుణ్యాభివృద్ధికి అవసరమైన సమాచార, సాంకేతిక సహకారం అందించనున్నారు.

### 3. ఎనర్జీ

#### ఏ) విద్యుత్

మే, 2018 నాటికి దేశంలోని అన్ని గ్రామాల్లో వంద శాతం విద్యుదీకరణ సాధించాలని ప్రభుత్వం కంకణబద్ధమై ఉంది. అందు కోసం తాజా బడ్జెట్‌లో దీన దయాళ్ గ్రామ జ్యోతి యోజన కింద గతంలో కన్నా అధికంగా రూ.4,814 కోట్లను కేటాయించడం జరిగింది.

సౌర విద్యుత్ కోసం అదనంగా 20,000 మెగా వాట్ల సామర్థ్యంతో రెండో దశ సోలార్ పార్క్ నిర్మాణం చేపట్టాలని ఈ ఏటి బడ్జెట్‌లో ప్రతిపాదించారు. ఇక అంతర్జాతీయంగా ఎలక్ట్రానిక్ తయారీ హబ్‌గా భారత్‌ను తయారు చేయడానికి ఎకో వ్యవస్థను రూపొందించడం జరుగుతోంది. ఎలక్ట్రానిక్ తయారీ రంగానికి 250కి పైగా పెట్టుబడి ప్రతిపాదనలు గత రెండేళ్లలోగా రాగా ప్రతిపాదిత పెట్టుబడుల మొత్తం రూ.1.26 లక్షల కోట్లుగా ఉంది. భారత్‌లో అనేక అంతర్జాతీయ మొబైల్ తయారీదారులు తమ యూనిట్లను నెలకొల్పారు. అందుకనే ఎమ్-సిప్, ఈడీఎఫ్ వంటి పథకాలకు 2017-18 బడ్జెట్‌లో ఎన్నడూ లేని విధంగా రూ.745 కోట్లు కేటాయించి దేశంలో ఎలక్ట్రానిక్ పరిశ్రమ అభివృద్ధిని మరింత వేగవంతం చేయనున్నారు.

#### బి) చమురు, సహజ వాయువు

ఆధునిక నాగరికతకి పెట్రోలియం అన్నది జీవనాడిగా చెప్పాలి. వ్యవసాయానికి, పారిశ్రామిక, రవాణా రంగానికి ఇతర పారిశ్రామిక రథ చక్రాలు కదలడానికి ప్రధాన శక్తి ఈ వనరుగా ఉంది. దాని ఫలితంగా, విస్తరణకి, ఉపాధి అవకాశాలకు పెట్రోలియం, సహజ వాయు రంగాలకు విపరీతమైన అవకాశాలున్నాయి. దేశ మౌలిక రంగంలో అత్యంత సంఘటితమైత రంగాల్లో పెట్రోలియం, సహజ చమురు రంగాలు కూడా ఒకటిగా ఉన్నాయి. అయితే ఆటోమొబైల్ రంగం నుంచి, గృహ అవసరాల కోసం ఇటీవల కాలంలో ఈ రంగంలో విపరీతంగా పెరుగుతున్న డిమాండ్‌తో పాటు వీటి లభ్యతలో ఉన్న కొరత, కార్బన్ ఉద్గారాల విడుదలపైనా దృష్టి పెట్టాల్సి ఉంది.

విద్యుత్ రంగాన్ని బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం వ్యూహాత్మక ముడి చమురు నిల్వను ఏర్పాటు చేయడానికి నిర్ణయించింది. ఇందులో మొదటి దశలో అలాంటి మూడు రిజర్వ్ సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పుడు రెండో దశలో ఒడిశాలోని చండిఖోల్‌లో, రాజస్థాన్‌లోని బికనూర్‌లో రెండు ముడి చమురు నిల్వ కేంద్రాలను ఏర్పాటు చేయాలని తాజా బడ్జెట్‌లో ప్రతిపాదించారు. దీంతో ముడి చమురు వ్యూహాత్మక నిల్వ సామర్థ్యం 15.33 మిలియన్ మెట్రిక్ టన్నులకు చేరుకుంటుంది.

ఈ రంగంలో గత ఏడాది ఆర్‌ఈ, బీఈ కన్నా తక్కువగా 2017-18 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో రూ.29,158 కోట్లు ప్రతిపాదించారు. 2016-17 బీఈలో కేటాయింపులు రూ.29,160 కోట్లు, 2016-17ఆర్‌ఈలో రూ.30,241 కోట్లు కేటాయింపులు జరిగాయి. 2017-18 బీఈలో కేటాయింపులు తగ్గించడానికి కారణాలను బడ్జెట్‌లో పేర్కొనలేదు. అయినప్పటికీ, కేంద్ర ప్రభుత్వ స్పాన్సర్డ్ పథకాలైన పేదల గృహాలకు ఎల్పీజీ కనెక్షన్ల కోసం కేటాయింపు 2017-18 బడ్జెట్‌లో రూ.2500 కోట్లకి పెరగగా, అది 2016-17 బీఈలో రూ.2 వేల కోట్లు కాగా, అదే ఏడాది ఆర్‌ఈలో కూడా ఇంతే సమానమైన కేటాయింపులు జరిగాయి.

గ్రామీణ స్వచ్ఛ భారత్ మిషన్ బహిరంగ మలమూత్ర విసర్జనను అంతమొందించే దిశగా సురక్షిత పారిశుద్ధ్య అలవాట్లను, ఏర్పాట్లను సాధించడంలో గణనీయమైన పురోగతి సాధించింది. గ్రామీణ భారతంలో పారిశుద్ధ్య వ్యయం 2014లో 42 శాతముండగా ప్రస్తుతం 60 శాతానికి చేరుకుంది. బహిరంగ మలమూత్ర విసర్జన రహిత గ్రామాలకు పైపుల ద్వారా నీటి సరఫరాలో అధిక ప్రాముఖ్యత ఇవ్వడం జరుగుతోంది.

*తరువాయి 44వ పేజీలో...*

# 2017-18 కేంద్ర బడ్జెట్ ముఖ్యాంశాలు



**2017-18 ఆర్థిక సంవత్సరంలో రైతులకు పంట రుణాల మొత్తాన్ని 10 లక్షల కోట్ల రూపాయలకు పెంచారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (MGNREGS) అమలుకు అత్యధికంగా 48 వేల కోట్ల రూపాయలను బడ్జెట్‌లో కేటాయించారు. ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన (PMGSY) కింద రాష్ట్రాల వాటాలతో సహా 27 వేల కోట్ల రూపాయలను 2017-18లో ఖర్చు చేస్తారు. మహిళా సాధికారతకు దేశవ్యాప్తంగా గ్రామ స్థాయిలో 14 లక్షల అంగన్ వాడి కేంద్రాల్లో మహిళా శక్తి కేంద్రాలను ఏర్పాటు చేస్తారు.**

ప్రభుత్వం గత రెండు సంవత్సరాలుగా అమలు చేస్తున్న విధానాల వల్ల 2017-18 కేంద్ర బడ్జెట్ స్థిరమైన, స్థూల ఆర్థిక పునాదులతో కొనసాగుతోంది. దీనికి పెద్ద నోట్ల రద్దు, వస్తు సేవల పన్ను (GST), జన్‌ధన్ యోజన, ఆధార్ నంబరు, మొబైల్ ఫోన్ (JAM)ల అమలుతో సానుకూల దృక్పథం ఏర్పడింది. గత సంవత్సరం చేపట్టిన పలు సంస్కరణలు మన ఆర్థిక వ్యవస్థకు బలాన్నిచ్చాయి.

ఎ) అభివృద్ధి దృక్పథం సానుకూలంగా వుంది.

బి) ప్రస్తుతం 3.2 శాతంగా వున్న ద్రవ్య లోటును వచ్చే ఆర్థిక సంవత్సరం (2018-19)లో 3 శాతానికి తగ్గించాలని నిర్ణయించారు.

సి) ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ లోటును తగ్గించడం జరిగింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో దీన్ని 1.9 శాతానికి తగ్గించనున్నారు.

డి) 2017-18లో మార్కెట్ నుండి 3.48 లక్షల కోట్ల రూపాయల మేర నిధులు సేకరించాలని నిర్ణయించారు. ఇది అంతకుముందు ఏడాది కంటే తక్కువే.

ఇ) సుస్థిరమైన పరపతి విధానంతో ద్రవ్య విధానాన్ని పటిష్ట పరచాలని నిర్ణయించారు.

**II రైతులు:**

ఎ) దీర్ఘకాలిక సాగునీటి నిధులు-దీని కింద మూల ధనాన్ని 40 వేల కోట్ల రూపాయలకు పెంచారు.

బి) జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డ్) 5 వేల కోట్ల రూపాయల మూలధనంతో సూక్ష్మ సాగునీటి నిధిని ఏర్పాటుచేస్తుంది.

సి) ఈ-నామ్ (E-NAM) కింద ప్రాథమిక వ్యవసాయ మార్కెట్ కమిటీల (PAC) సంఖ్యను 585కు పెంచనున్నారు.

డి) వ్యవసాయ ప్రాథమిక మార్కెటింగ్ కమిటీలలో త్వరగా పాడైపోయే పంట ఉత్పత్తులను డీ నోటిఫై చేస్తారు.

ఇ) అన్ని రాష్ట్రాల్లో అమలు చేసేలా ఆదర్శ న్యాయం, కాంట్రాక్ట్ వ్యవసాయ విధానాన్ని అమలు చేయడం.

ఎఫ్) 2017-18 ఆర్థిక సంవత్సరంలో రైతులకు పంట రుణాల మొత్తాన్ని 10 లక్షల కోట్ల రూపాయలకు పెంచారు.

**యోజన సంపాదకవర్గం**
E-mail: yojana_telugu@yahoo.co.in

జి) ప్రాథమికంగా 63 వేల ప్రాథమిక వ్యవసాయ కమిటీలను కంప్యూటరీకరించి వాటిని జిల్లా కేంద్ర సహకార బ్యాంకులతో అనుసంధానం చేస్తారు.

హెచ్) ఫసల్ బీమా యోజన కింద 2017-18లో 2017-18 ఆర్థిక సంవత్సరంలో 40 శాతం మంది రైతులకు, 2018-19 ఆర్థిక సంవత్సరంలో 50 శాతం మంది రైతులకు అందుబాటులోకి తీసుకు వస్తారు.

ఐ) పాల ఉత్పత్తులను పెంచాలనే లక్ష్యంతో రాగల మూడు సంవత్సరాల్లో అమలయ్యేలా 8 వేల కోట్ల రూపాయల వ్యయంతో డెయిరీ ప్రాసెసింగ్ మౌలిక వసతుల అభివృద్ధి నిధిని ఏర్పాటు చేయనున్నారు.

**III గ్రామీణ జనాభా:**

ఎ) మిషన్ అంత్యోదయను ప్రారంభించి 2019 కల్లా ఒక కోటి కుటుంబాలను పేదరికం నుంచి పైకి తీసుకువస్తారు. 50 వేల గ్రామాలను పేదరికం లేని గ్రామాలుగా తీర్చిదిద్దుతారు.

బి) జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (MGNREGS) అమలుకు అత్యధికంగా 48 వేల కోట్ల రూపాయలను బడ్జెట్‌లో కేటాయించారు.

సి) ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన (PMGSY) కింద రాష్ట్రాల వాటాలతో సహా 27 వేల కోట్ల రూపాయలను 2017-18లో ఖర్చు చేస్తారు. ఈ పథకం కింద రహదారులను వేగంగా నిర్మిస్తున్నారు. 2011-14 సంవత్సరాల్లో రోజుకు సగటున 73 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణం జరిగితే, 2016-17లో రోజుకు సరాసరి 133 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణం జరిగింది.

డి) విషపూరిత ఆర్సెనిక్, ఫ్లోరైడ్ ప్రభావిత 28 వేల గ్రామాలకు రాగాల నాలుగేళ్లలో రక్షిత మంచి నీరు అందిస్తారు.

**IV యువత, విద్య ఉపాధి తదితర రంగాలు:**

ఎ) విశ్వవిద్యాలయాల విరాళాల మండలి (UGC)లో సంస్కరణలు చేపడతారు.

బి) SWAYAM వేదికగా కనీసం 350 ఆన్‌లైన్ కోర్సులను ప్రారంభిస్తారు.

సి) SANKALP నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాన్ని 4 వేల కోట్ల రూపాయల వ్యయంతో ప్రారంభించి మూడున్నర కోట్ల మంది యువతకు శిక్షణను అందిస్తారు.

డి) జౌళి రంగంలో అమలు చేస్తున్న విధంగా తోలు, పాదరక్షల పరిశ్రమ అభివృద్ధికి పథకాన్ని అమలు చేస్తారు.

ఇ) పర్యాటక రంగ అభివృద్ధికి అయిదు ప్రత్యేక జోన్లను ఏర్పాటు చేస్తారు.

**V పేదలు, బలహీన వర్గాల అభ్యున్నతి:**

ఎ) మహిళా సాధికారతకు దేశవ్యాప్తంగా గ్రామ స్థాయిలో 14 లక్షల అంగన్ వాడీ కేంద్రాల్లో మహిళా శక్తి కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. వీటి ద్వారా మహిళలకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, ఆరోగ్యం, పౌష్టికాహారం తదితర అవకాశాలు కల్పిస్తారు.

బి) చౌకగా ఇళ్లనిర్మాణానికి మౌలిక సదుపాయాల కల్పనా స్థాయినిచ్చారు. దీని వల్ల గృహనిర్మాణ ప్రాజెక్టులకు సులభంగా బ్యాంకు రుణాలు అందుబాటులోకి వస్తాయి.

సి) జాతీయ హౌసింగు బ్యాంకు 2017-18 లో 20 వేల కోట్ల రూపాయలతో వక్తిగత గృహరుణాలకు తిరిగి ఆర్థిక సహాయం (రీ ఫైనాన్స్) చేస్తుంది.

డి) దేశంలో కాలా అజర్, బోదకాలు, కుష్ఠు వ్యాధి, క్షయ, తట్టు, వంటి వ్యాధులను నిర్దిష్ట కాలంలో పూర్తిగా రూపుమాపాలని నిర్ణయించారు.

ఇ) శిశు మరణాల రేటు (IMR)మాతృ మరణాల రేటు(MMR)లను తగ్గిస్తారు.

ఎఫ్) దేశవ్యాప్తంగా లక్షన్నర ఆరోగ్య ఉప కేంద్రాలను ఆరోగ్య సంక్షేమ కేంద్రాలుగా మెరుగుపరుస్తారు.

జి) వైద్య విద్య, ప్రాక్టీసు నియంత్రణకు ప్రణాళికను రూపొందిస్తారు.

హెచ్) జార్ఖండ్, గుజరాత్‌లలో రెండు అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థలను ఏర్పాటు చేస్తారు.

ఐ) ప్రస్తుతమున్న కార్మిక చట్టాలను హేతుబద్ధీకరించి 4 కోడ్‌లుగా మార్పు చేస్తారు.

**VI మౌలిక సదుపాయాలు:**

ఎ) రైల్వేలు - ప్రభుత్వామిచ్చే 55 వేల కోట్ల రూపాయలతో సహా పెట్టుబడి అభివృద్ధి వ్యయం 1.31 లక్షల వేల కోట్ల రూపాయలు.

బి) రైల్వేలో లక్ష కోట్ల రూపాయల మూల ధనంతో రాగల 5 ఏళ్లలో రాష్ట్రీయ రైల్ సంరక్షా కోశ్ నిధిని ఏర్పాటు చేస్తారు.

సి) రాగల మూడేళ్లలో రైల్వే రవాణా సామర్థ్యాన్ని 10 శాతం పెంచుతారు.

డి) రైల్వేలు 9 రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో 70 గుర్తించిన ప్రాజెక్టులను అభివృద్ధి చేయనున్నారు.

ఇ) రైల్వేలు ప్రయాణం ప్రారంభం నుంచి చివరి వరకు సమగ్ర రవాణా సౌకర్యాలను అందించేలా అభివృద్ధి చేస్తారు.

ఎఫ్) అకౌంటింగ్ సంస్కరణలు - రైల్వేలు మార్చి 2019 వరకు నగదు ఆధారిత ఆర్థిక జాబితా రూపొందించుకొనేలా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

జి) నూతన మెట్రో విధానాన్ని, నూతన మెట్రో చట్టాన్ని తీసుకువస్తారు.

హెచ్) రహదారి రంగం ప్రాధాన్యతను కొనసాగిస్తారు.

ఐ) ద్వితీయ స్థాయి నగరాల్లో ఎంపిక చేసిన విమానాశ్రయాల నిర్వహణను ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం లో చేపడతారు.

జె) పౌర విమానయాన సంస్థ ఆస్తులను నగదు పరంగా లెక్కించడానికి వీలుగా ఎయిర్ పోర్టు ఆథారిటీ ఆఫ్ ఇండియా చట్టాన్ని సంస్కరిస్తారు.

కె) భారత్ నెట్ ప్రాజెక్టు: 2017-18 సంవత్సరం చివరికల్లా లక్షన్నర గ్రామ పంచాయతీలను ఆప్టికల్ ఫైబర్ కేబుల్ ద్వారా అనుసంధానం చేస్తారు.

ఎల్) ముడి చమురు నిల్వ కోసం ఒడిశా, రాజస్థాన్లలో కొత్తగా రెండు భూగర్భ నిల్వలను ఏర్పాటు చేస్తారు.

ఎం) రెండవ దశ సౌర శక్తిపార్కు అభివృద్ధితో అదనంగా 20 వేల మెగా వాట్ల సౌర విద్యుత్తును ఉత్పత్తి చేస్తారు.

ఎన్) భారత్‌ను ప్రపంచ ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల కేంద్రంగా అభివృద్ధి చేయడానికి అవసరమైన వాతావరణాన్ని కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

## VII ఆర్థిక రంగం:

ఎ) విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (FIPB)ని 2017-18లో రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది

బి) సరుకుల స్పాట్ మార్కెట్, ఉత్పత్తి మార్కెట్లను సంఘటిత పరచడానికి అవసరమైన నిర్వహణ, న్యాయ ముసాయిదాను రూపొందించడానికి నిపుణుల కమిటీని ఏర్పాటు చేయనున్నారు.

సి) బహుళ రాష్ట్రాల సహకార సంఘాల చట్టాన్ని సవరించి సాధారణ, పేద పెట్టుబడి దారులు మోసపోయే అవకాశం లేకుండా నియంత్రణ లోపాలను సరిద్దుతారు.

డి) ఆర్థిక సంస్థల పరిష్కార బిల్లును ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశ పెడతారు.

ఇ) మౌలిక సదుపాయాల కల్పన, ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (PPP) తో నిర్మిస్తున్న ప్రాజెక్టులలో తలెత్తుతున్న సమస్యల పరిష్కారానికి ఆర్బిట్రేషన్ కన్సిలియేషన్ చట్టాన్ని సవరించనున్నారు.

ఎఫ్) ఆర్థిక రంగం లో కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం (CERT-Fin)ను ఏర్పాటు చేయనున్నారు.

జి) కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యం లోని ప్రభుత్వ రంగ సంస్థలను స్టాక్ మార్కెట్ లిస్టింగ్ కోసం నిర్ణీతకాల వ్యవధితో ఒక యంత్రాంగాన్ని తిరిగి ఏర్పాటు చేస్తారు.

హెచ్) రైల్వే లకు చెందిన IRCTC, IRFC, IRCON వంటి వాటిని స్టాక్ ఎక్స్ఛేంజీలో లిస్టింగ్ చేయనున్నారు.

ఐ) చమురు రంగంలో ప్రస్తుతమున్న ప్రభుత్వ రంగ సంస్థలను సంఘటిత పరచి సమగ్రమైన పెద్ద చమురు సంస్థను ఏర్పాటు చేయనున్నారు .

జె) కేంద్ర ప్రభుత్వ రంగానికి చెందిన వివిధ సంస్థల స్టాక్‌లను ప్రవేశ పెట్టడానికి కొత్తగా ETFను ప్రారంభించనున్నారు.

## VIII డిజిటల్ ఆర్థిక వ్యవస్థ

ఎ) ఆధార్ ప్రాతిపదికగా చెల్లింపుల విధానాలను త్వరలో ప్రవేశ పెట్టనున్నారు.

బి) ఆర్థిక సమ్మిళిత నిధిని ప్రోత్సహిస్తారు.

సి) డిజిటల్ చెల్లింపులకు అవసరమైన విధంగా మార్పులు తీసుకురావడానికి చెల్లింపులు, జమల విధానాన్ని సమీక్షిస్తారు.

డి) పెరిగిన బ్యాంకు లావా దేవీలు, చెక్కుల ద్వారా చెల్లింపులలో ఎదురౌతున్న సవాళ్ళను పరిష్కరించడానికి Negotiable Instruments Act ను సంస్కరించనున్నారు .

## IX ప్రజా సేవలు

ఎ) పాస్ పోర్టు సేవలందించడానికి వీలుగా ప్రధాన పోస్టాఫీసులను ముఖ్య కార్యాలయలుగా అభివృద్ధి చేస్తారు.

బి) చట్టం నుంచి తప్పించుకొని దేశంనుండి పారిపోయిన ఆర్థిక నేరస్తులతో సహా పెద్ద నేరస్తులను శిక్షించడానికి, వారి ఆస్తులను జప్తు చేయడానికి చట్టంలో మార్పులు చేస్తారు. అవసరమైతే కొత్త చట్టాన్ని చేస్తారు.

| క్రమ | రంగాలు | BE 2016-17 | RE 2016-17 | BE 2017-18 |
|---|---|---|---|---|
| | | (కోట్లరూ.లలో) | | |
| 1. | వ్యవసాయం అనుబంధ రంగాలు | 48572 | 52821 | 58663 |
| 2. | గ్రామీణాభివృద్ధి | 102543 | 114947 | 128560 |
| 3. | మౌలిక రంగం | 348952 | 358634 | 396135 |
| 4. | సామాజిక రంగాలు | 168100 | 176225 | 195473 |
| 4ఎ | విద్య, వైద్యం | 112138 | 114806 | 130215 |
| 4బి. | సంక్షేమప్రాతిపదికగాసామాజిక రంగాలు | 55962 | 61419 | 65258 |
| 5 | ఉపాధి కల్పన, నైపుణ్యాలు, జీవనోపాధులు | 12006 | 14735 | 17273 |
| 6. | శాస్త్రీయ మంత్రిత్వ శాఖలు | 33467 | 34359 | 37435 |

పన్ను ప్రణాళిక (సంక్షిప్తంగా) పార్ట్-బి

### I సరసమైన ధరలకు అందుబాటులో ఇళ్లు

1. ప్రజలకు చౌకగా ఇళ్లను అందు బాటులోకి తీసుకురావడానికి ఆదాయ పన్నులో మూడు రకాల మినహా యింపులను ప్రకటించారు

ఎ. ఇంటి విస్తీర్ణం 30 లేదా 60 చదరపు మీటర్లు వుంటే దాన్ని బిల్ట్ ఇన్ ఏరియాగా కాకుండా కార్పెట్ ఏరియాగా పరిగణిస్తారు.

బి. 30 చదరపు మీటర్లను నాలుగు మహా నగరాల పరిధిలో, 60 చదరపు మీటర్లను దేశవ్యాప్తంగా ఇతర ప్రాంతాల్లో పరిగణిస్తారు.

సి. ఇంటి నిర్మాణ వ్యవధిని 3 నుంచి 5 సంవత్సరాలకు పెంచారు.

2. భవన నిర్మాణవేత్తలకు ఊహాత్మక ఇంటి అద్దెలపై పన్ను రాయితీని లెక్కించడానికి భవన నిర్మాణం పూర్తయిన ఒక ఏడాది తరువాత నిర్మాణం పూర్తయ్యినట్లు సర్టిఫికేటు అందుకున్న తరువాత సంవత్సరానికి లెక్కిస్తారు.

3. స్థిరాస్తి మూల ధన ఆదాయంపై పన్నులో మూడు రకాల మార్పులు

ఎ) స్థిరాస్తి మూల ధన ఆదాయంపై పన్నును లెక్కించడానికి మూడు సంవత్సరాలకు బదులు కాల పరిమితి ని రెండేళ్లకు తగ్గించడం

బి) అన్ని రకాల స్థిరాస్తుల ధరలను గణించడానికి ఆధార తేదీని 01/04/1981 నుంచి 01/04/2001కు మార్పు చేశారు.

4) ఆంధ్ర ప్రదేశ్ రాజధాని నిర్మాణానికి ల్యాండ్ పూలింగ్ కింద తమ భూములనిచ్చిన జూన్ 2, 2014 నాటి భూ యజమానులకు క్యాపిటల్ గెయిన్ మినహాయింపు లభిస్తుంది.

### II అభివృద్ధిని వేగవంతం చేయడానికి చర్యలు :

1. విదేశీ కంపెనీలు భారత్‌లో ఇస్తున్న రుణాలపై వడ్డీరాయితీని 5 శాతానికి నిలువుదల చేయడం లేదా ఆ పెట్టుబడులను 2017 జూన్ 30 తర్వాత మరో మూడు సంవత్సరాల పాటు కొనసాగించడం

2. స్టార్ట్ అప్ కంపెనీలకు గత ఏడాది ఇచ్చినట్లుగానే రెండు రకాల ఆదాయ పన్ను మినహాయింపులను ఇస్తున్నారు.

ఎ) ప్రమోటర్‌కు చెందిన అసలు పెట్టుబడిని నిర్వీర్యం చేయనంతవరకు అతనికి 51 శాతం ఓటింగ్ హక్కులను కొనసాగించాలనే షరతులను సడలించ వచ్చు.

బి) కంపెనీ స్థాపించిన తేదీనుంచి ఏవైనా 7 సంవత్సరాల్లో 3 ఏళ్ళకు ఈ మినహాయిపును వినియోగించుకోవచ్చు.

3 MAT క్రెడిట్‌ను వినియోగించుకునే కాలాన్ని 10 నుంచి 15 ఏళ్ళకు పెంచారు.

4. 2015-16లో 50 కోట్ల రూపాయల టర్నోవరు కలిగిన కంపెనీలకు కార్పొరేట్ పన్నును 30 శాతం నుంచి 25 శాతానికి తగ్గించారు. దీని వల్ల దేశంలో ప్రస్తుతమున్న 6.67 లక్షల కంపెనీల్లో 96 శాతం క్సంపెనీలకు లబ్ది కలుగుతుంది.

5. బ్యాంకులకు చెందిన నిరర్థక ఆస్తుల నుంచి లాభాన్ని 7.5 శాతానికి బదులు 8.5 శాతానికి తగ్గించారు.

6. నాన్ - షెడ్యూల్డ్ సహకార బ్యాంకుల్లో నిరర్థక ఆస్తులపై వడ్డీ జమ అయినప్పుడే దాన్ని ఆదాయం గా పరిగణిస్తారు.

### III డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు ప్రోత్సాహం:

1. చిన్న వ్యాపారస్తులకు సంభావిత ఆదాయ పన్ను లెక్కింపులో డిజిటల్ లేదా బ్యాంకింగ్ వ్యవస్థ ద్వారా జరిగిన లావాదేవీల్లో 6 శాతాన్ని ఆదాయంగా పరిగణిస్తారు.

2. నగదు రూపంలో చేసే వ్యయ పరిమితిని ప్రస్తుతమున్న రూ. 20 వేల నుంచి రూ. 10 వేలకు తగ్గించారు.

3. నగదు లావాదేవీలను మూడు లక్షల రూపాయలకు మించి అనుమతించరు. ఈ నిబంధనను ఉల్లంఘిస్తే సమానమైన మొత్తాన్ని అపరాధ రుసుముగా విధిస్తారు.

### IV ఎన్నికల నిధుల్లో పారదర్శకత:

1. ఒక్కో వ్యక్తి రాజకీయ పార్టీలకు ఇచ్చే విరాళాన్ని రూ. 20 వేల నుంచి రూ.2 వేలకు తగ్గించారు.

2. పన్ను చెల్లించిన ఆదాయాన్ని రాజకీయ పార్టీలకు విరాళాల రూపంలో ఇవ్వడానికి ఎన్నికల బాండ్లను ప్రవేశ పెడతారు. దీన్ని గోప్యంగా వుంచుతారు.

3. రాజకీయ పార్టీలు ఆదాయ పన్ను చట్టంలో పేర్కొన్న విధంగా నిర్ణీత కాలంలో తమ రిటర్నులను దాఖలు చేయాల్సివుంటుంది.

### V వ్యాపారం చేయడం సులభతరం:

1. ఏవైనా రెండు కంపెనీలలో ఒకటి నిర్దిష్టంగా లాభార్జనతో కూడిన తగ్గింపు వెసులుబాటును పొందుతున్నప్పుడు మాత్రమే ధరను స్థానికంగా బదిలీ చేసే ప్రయోజనం పొందుతారు.

2. సంభావిత పథకాలను ఎంపిక చేసుకునే వ్యాపార సంస్థలకు ఆడిట్ పరిమితిని కోటి రూపాయల నుంచి రెండు కోట్ల రూపాయలకు పెంచనున్నారు.

3. వ్యక్తులు లేదా అవిభక్త హిందూ కుటుంబాల (HUF) వార్షిక టర్నోవరు 25 లక్షల రూపాయల వరకు వుంటే

లేదా ఆదాయం రూ. 2.5 లక్షలుంటే వారు ఖాతా పుస్తకాలను నిర్వహించ వలసిన అవసరం లేదు.

4. విదేశీ పోర్ట్ ఫోలియో కేటగిరీ 1&2 కు చెందిన మదుపరులను పరోక్ష బదిలీ నుంచి మినహాయించనున్నారు.

5. వ్యక్తిగత బీమా ఏజెంట్లు తమ ఆదాయం పన్ను పరిమితికన్నా తక్కువగావున్నదని ధృవీకరిస్తే, వారి నుంచి 5 శాతం TDS వసూలు చేయరు.

6. సంభావిత పథకం కింద ప్రొఫెషనల్స్ ముందస్తు ఆదాయ పన్నును ప్రస్తుతం చెల్లిస్తున్న 4 విడతలుగా కాకుండా ఒకే సారి మార్చి నెల లో చెల్లించాలి.

7. పన్ను రిటర్నులను పునశ్చరణ చేసే కాల పరిమితిని 12 నెలలకు తగ్గించారు. 2019-20 అసెస్మెంట్ సంవత్సరం నుంచి పన్ను రిటర్నులను సమీక్షించే కాల పరిమితిని 12 నెలలకు కుదించనున్నారు.

### VI వ్యక్తిగత ఆదాయ పన్ను:

1. వార్షిక ఆదాయం రూ. 2.5 లక్షల నుంచి రూ. 5 లక్షల మధ్య శ్లాబ్ పరిధి లోకి వచ్చే వారికి ఆదాయపన్ను ను ప్రస్తుతమున్న 10 శాతం నుంచి 5 శాతానికి తగ్గించారు. దీంతో వారికి ఆదాయ పన్ను భారం సగానికి తగ్గుతుంది. 5 లక్షలకు పైగా ఆదాయమున్న ప్రతి ఒక్కరికీ రూ. 12,500 చొప్పున లబ్ది కలుగుతుంది. (దీని వల్ల ప్రభుత్వం రూ. 15,500 కోట్ల ఆదాయం కోల్పోతుంది)

2. వార్షిక ఆదాయం 5 లక్షల నుంచి ఒక కోటి రూపాయల వరకు వున్న వారికి 10 శాతం సర్ చార్జి విధించనున్నారు. (దీని వల్ల రూ. 2,700 కోట్లు ఆదాయం లభిస్తుంది)

### VII అప్రత్యక్ష పన్ను:

1. ద్రవ రూపంలోని సహజ వాయువు (LNG) పై కస్టమ్స్ డ్యూటీని 5 శాతం నుంచి 2.5 శాతానికి తగ్గించారు. దీని వల్ల రసాయనిక, పెట్రో-కెమికల్, ఉక్కు పరిశ్రమలకు లబ్ది కలుగుతుంది.

2. డిజిటల్ చెల్లింపులకు వినియోగించే పాయింట్ ఆఫ్ సేల్ (POS) మెషిన్లు, మైక్రో ATM, ఫింగర్ ప్రింట్ రీడర్లు,స్కానర్లు, ID స్కానర్ల పై కస్టమ్స్, కౌంటర్ వైలింగ్ డ్యూటీ (CVD), ప్రత్యేక అడిషన్ డ్యూటీ (SAD), ఎక్సైజ్ డ్యూటీ లను పూర్తిగా ఎత్తివేశారు.

VIII వస్తు సేవల పన్ను (GST) ప్రక్రియ కొనసాగుతోంది. దీన్ని 2017 జూలై 1 నుంచి ప్రారంభించే అవకాశముంది. ■

---

## సూచన

యోజన చందాదారులకు ప్రతి నెలా ఒకటి, రెండవ తేదీల్లో ఠంచనుగా వారి సంచిక పోస్టులో వెళ్లిపోతుంది. ఎవరికైనా అందకపోతే వారి పోస్టుమ్యాన్‌ను సంప్రదించి చిరునామాను సరిచూసుకోవాలి. సంచిక అందక పోతే యోజన బాధ్యత వహించదు. ఇందులో ఉత్తర ప్రత్యుత్తరాలకు, టెలిఫోన్ సంభాషణలకు అవకాశంలేదు. గమనించగలరు.

*– సీనియర్ ఎడిటర్*

## గమనిక

**వ్యాసకర్తలకు సూచన** యోజన మాసపత్రికకు వ్యాసాలు పంపేవారు తమ వ్యాసం సాఫ్ట్ కాపీని పేజిమేకర్ 6.5 లేదా 7 మరియు “అను” 7 ఫాంట్‌లో, వర్డ్‌లోనూ పంపాలి. వ్రాతప్రతిని కూడ హామీ పత్రంతో కలిపి పోస్టుద్వారా పంపాలి. హామీ పత్రంలో ఇది తమ స్వంత రచన అనీ, దేనికీ అనువాదం, అనుసరణ కాదనీ, మరే పత్రికకూ పంపలేదనీ, ఇంతకుముందు పుస్తకంగా ముద్రించలేదని పేర్కొనాలి. రచనలు 15వ తేది లోపు మాకు చేరాలి. ప్రచురణకు నోచుకోని రచనలు తిరిగి పంపబడవు. దీనిపై ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరాలకూ చోటులేదు. గమనించగలరు.

*సీనియర్ ఎడిటర్*

యోజన తెలుగు మాసపత్రిక, 205, రెండవ అంతస్తు, సి.జి.ఓ. టవర్స్, కవాడిగూడ, హైదరాబాద్ – 500 080.
E-mail: yojana_telugu@yahoo.co.in - yojana.telugu@nic.in

# యువత భవిష్యత్తు కోసం – ఓ కొత్త అధ్యాయం



**ప్రస్తుతం దేశ జనాభాలో 60%కి పైగా ఉన్నవారి సగటు వయసు 35 సంవత్సరాలు. ఇది 2020 నాటికి 29 సంవత్సరాలుగా ఉంటుంది. ఇదే సమయంలో చైనాలో 37, జపాన్‌లో 48 సగటుగా ఉంటుంది. ఈరోజున 'డిజిటల్ గురుకుల'తో అద్భుతాలు ఆవిష్కరింప చేయవచ్చు. వైఫై, టివి, రేడియో, కంప్యూటర్ల వంటి ఉపకరణాలను, ఆసక్తి, ఉత్సాహంతో గ్రామాల బాట పడుతున్న నవ టెక్నోక్రాట్లను సక్రమంగా వినియోగించుకుంటే లక్ష్యసాధన సులువవుతుంది.**

ఐక్యరాజ్యసమితి 2016లో ప్రపంచ జనాభాకు సంబంధించి ఒక నివేదిక విడుదలచేసింది. దాని ప్రకారం మన దేశ జనాభా 130 కోట్లు. ప్రపంచ దేశాల్లో రెండో స్థానం. 1.2% వృద్ధి అంచనాల ప్రకారం 2022నాటికి మొదటి స్థానంలో ఉన్న చైనాను కిందకు లాగి మనం ఆ స్థానాన్ని ఆక్రమించేస్తాం. అప్పుడు మన దేశాన్ని '150కోట్ల అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం' అని అభివర్ణిస్తుంటారు. అయితే దీనిలో కూడా కీలకమైన మలుపు ఒకటి ఉంది. ఇప్పుడు ఆ మలుపే మన ప్రభుత్వాలు (కేంద్ర, రాష్ట్ర) ఇప్పుడు వేస్తున్న ప్రతి అడుగునూ ప్రభావితం చేస్తున్నది. మరి కొంత కాలం ఇలా చేస్తుందికూడా. అదేమిటంటే– ప్రస్తుతం దేశ జనాభాలో 60%కి పైగా ఉన్నవారి సగటు వయసు 35 సంవత్సరాలు. ఇది 2020 నాటికి 29 సంవత్సరాలుగా ఉంటుంది. ఇదే సమయంలో చైనాలో 37, జపాన్‌లో48 సగటుగా ఉంటుంది. అంటే మిగిలిన అగ్రదేశాలకంటే మనది 'యవ్వనంతో మిసమిస లాడుతున్న భారత్' అవుతుంది. ఈ యువశక్తే ఇకముందు కీలకం కాబోతున్నది.

అయితే 2020 ఎంతో దూరంలో లేదు. ఈ యువశక్తిని ఒక ప్రతిభాశక్తిగా మలుచు కోవడానికి మనం సంసిద్ధంగా ఉన్నామా? అలా చేయాలంటే వారికి అవసరమైన విద్యా బుద్ధులు, చక్కటి ఉపాధి కల్పించాల్సి ఉంది. ఇది జరగాలంటే ప్రణాళికా రచన సవివరంగా ఉండాలి. కచ్చితమైన దృక్పథం ఉండాలి. ప్రతి కూలతలను ఎదుర్కోగల ప్రత్యామ్నాయా లుండాలి. వచ్చే సంవత్సరానికి రూపొందించిన బడ్జెట్ ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు పార్లమెంటు ముందుంచింది. కాబట్టి ఒక్కసారి ఇక్కడ ఆగి దాన్ని తేరిపార చూద్దాం.

దీనిలో 'టెక్ఇండియా' (TEC India) అని చాలాచోట్ల కన్పిస్తున్నది. దీని పూర్తి అర్థం– 'పరివర్తన, ఇంధన సామర్థ్యం, స్వచ్ఛభారత్' అని. పాలనలో, ప్రజాజీవనంలో ప్రామాణికమైన పరివర్తన తీసుకు రావాలన్నది దీని లక్ష్యం. దీని ఆచరణకు చాలా అంశాలను ప్రస్తావించినా, బాగా ఆకట్టుకుంటున్నది మాత్రం – గ్రామీణ జనాభాకు, అక్కడి మౌలిక సదుపాయాల అభివృద్ధికి, ఉపాధి పథకాలకు, భద్రతకు,

**డా॥ ఎస్.ఎస్. మంత,** ప్రముఖ విద్యావేత్త, బెంగళూరు.
E-mail: ssmantha@vjti.org.in

గృహసౌకర్యాన్ని అందుబాటులో ఉంచడానికి ప్రకటించిన చర్యలు. అలాగే వేగం, బాధ్యతాయుత ప్రవర్తన, పారదర్శకతల కోసం, డిజిటల్ ఆర్థిక వ్యవస్థను పటిష్ఠం చేయడం.

ఈ సందర్భంగా ఉరుగ్వే నవలా కారుడు ఎడ్వర్డో గెలీనో అన్నమాటలను ఒకసారి మననం చేసుకుందాం. "దానధర్మాలు, ఔదార్యం వంటి వాటిని నేను నమ్మను. సంఘీభావంపట్ల నాకు పూర్తి నమ్మకం ఉంది. ఔదార్యం అనేది నేలబారు చూపులతో ఉంటుంది. పైనుంచి కిందికి ప్రసరిస్తూ ఉంటుంది. కానీ సంఘీభావంలో ఒకడు ఇంకొకడిని గౌరవిస్తుంటాడు. వాడినుంచి నేర్చుకుంటుంటాడు. అలా నేను ఇతరుల నుంచి నేర్చుకోవాల్సింది చాలా ఉంది" అన్నారు ఆయన.

గ్రామీణ భారతం ప్రధానంగా 3 సమస్యలను ఎదుర్కొంటున్నది. ఏది కావాలన్నా ప్రతి దానికీ హద్దులుంటాయక్కడ. వనరులు చాలా తక్కువ. మూడవది–అత్యంత ప్రధానమైనది– కరుడుగట్టిన చాదస్తపు భావాలు. ఈ పరిస్థితులను మార్చగలిగే ఏకైక పరిష్కారం విద్య. సమాజానికి శక్తి, ఆలోచనలు, నైపుణ్యం..అన్నీ యువతనుంచే రావాల్సిన అవసరం ఉంది. వారు మనసావాచా పూర్తిగా పాల్గొనకుండా సమాజ చీకుచింతలను తొలగించుకోవాలను కోవడం అవివేకమవుతుంది.

విద్య ప్రధాన పాత్ర పోషిస్తుంది. స్వేచ్ఛాయుత ఆలోచనలు, ఆచరణలలో స్ఫూర్తికి అది మెరుగులు దిద్దుతుంది. ఇది పరోక్షంగా సామ్యవాద, లౌకికవాద, ప్రజాస్వామ్య విలువల పటిష్టతకు దారులు పరుస్తుంది. ఆర్థిక వ్యవస్థ పలుదశల్లో అమలుకు అవసరమైన మానవ వనరులను అందిస్తుంటుంది. పరిశోధనలకు వేదికను సిద్ధం చేస్తుంది. ఇవన్నీ స్వయం సమృద్ధికి మార్గాన్ని సుగమం చేసేవే. అందరికీ విద్య అన్నదే మన జాతీయ విధానంకూడా. 2010లోనే మనం తెచ్చుకున్న విద్యాహక్కు ఈ దిశలో ముఖ్యమైన పరిణామం.

ప్రగతి సాధనకు ఎన్ని పనులు చేపడుతున్నా, కొన్నిఅవరోధాలు అడ్డుతగులుతూనే ఉంటాయి. వాటిలో ఒకటి – మౌలిక సదుపాయాల సమస్య. మంచి ఉపాధ్యాయులు, మంచి ఉపకరణాలవంటివి సమకూర్చుకోవడానికి గ్రామాలకు పరిమితులుంటాయి. అలాగే పేదరికం పెరుగుతూ పోవడం, ప్రాథమిక దశలో పిల్లలు బడి మానేయడం, నిరక్షరాస్యత, మరికొన్ని ముఖ్యమైన మౌలిక సమస్యలు. దీనికి కొత్తసాంకేతిక ఆవిష్కరణ ఒక్కటే పరిష్కారం.

ఇప్పుడు విస్తృతంగా అందుబాటులోకి వస్తున్న డిజిటల్ టెక్నాలజీ కొద్ది నిమిషాల వ్యవధిలో ఒక పొలాన్ని తరగతి గదిగా మార్చగలదు. పూర్వకాలంలో పిల్లలను వారి ఇళ్లకు దూరంగా గురుకులాల్లోఉంచి చదివించేవారు. ఈరోజున 'డిజిటల్గురుకుల'తో అద్భుతాలు ఆవిష్కరింప చేయవచ్చు.పిల్లలు ఆర్థికంగా వారి కుటుంబాలకు అండగా ఉంటూనే కొత్త సాంకేతీకరణతో విద్యార్జన పద్ధతులకు అనుసంధానం కాగలరు.వైఫై, టివి, రేడియో, కంప్యూటర్ల వంటి ఉపకరణాలను, ఆసక్తి, ఉత్సాహంతో గ్రామాల బాట పడుతున్న నవ టెక్నోక్రాట్లను సక్రమంగా వినియోగించుకుంటే లక్ష్యసాధన సులువవుతుంది. ప్రాథమిక స్థాయిలో బడిలో చేరే పిల్లల సంఖ్య 95% ఉండవచ్చు. కానీ ప్రమాణాలపరంగా బడి చాలామటుకు ఉపేక్షకు గురవుతున్నది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు లేక, అత్యుత్తమ ప్రైవేటు పాఠశాలలని చెప్పుకునే వాటిలోకూడా పాతబోధనాపద్ధతుల రోతతో, పిల్లల్లో పరిశోధనాత్మక శక్తి ధ్వంసమవుతున్నది.

ఈ పరిస్థితిని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం–పిల్లలు పాఠశాలల్లో ఎంతవరకు నేర్చుకుంటున్నదీ తెలుసుకోవడానికి ఒక పద్ధతిని ప్రవేశపెట్టింది. దీనిలో ప్రధానమైనది–స్థానిక పరిశోధనలను ప్రోత్సహించడానికి "మాధ్యమిక పాఠశాల స్థాయిలో ఒక పరిశోధనా నిధి"ని ఏర్పాటు చేయడం.

ఉన్నత విద్యకు సంబంధించి విశ్వవిద్యాలయాలు ఎందుకు ఏర్పాటు చేసారు! జ్ఞానాన్ని అందించడానికి, ఆ మేరకు అర్హత సర్టిఫికేట్లు అందించడానికే కదా! అయితే జ్ఞానబోధనలో కీలకాంశాలు– జిజ్ఞాస, చర్చ, 'అలానే ఎందుకుండాలి?' వంటి ప్రశ్నలకు సమాధానాల అన్వేషణ వంటివి విజ్ఞాన సముపార్జనకు తగిన వాతావరణాన్ని, పరిస్థితులను శ్రద్ధతో వాటిలో కల్పించాలి. వాటిని భద్రంగా కాపాడాలి. స్వేచ్ఛాయుత వాతావరణం, వివిధరంగాలలో నిష్ణాతులైన మేధావులతో చర్చోపచర్చలు, వాదోపవాదాలవంటివి ఉండాలి. అందుకే ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల్లో దేనిలో చూసినా చాలా రకాల సబ్జెక్టులు, వాటి విభాగాలు ఉంటాయి. లిబరల్ ఆర్ట్స్ నుంచి సోషల్ సైన్సెస్ వరకు, బేసిక్ సైన్సెస్ నుంచి అప్లయిడ్ సైన్సెస్ వరకు చాలా ఉంటాయి. కానీ చాలాకాలం నిలదొక్కుకుంటూవచ్చిన అఫీలియేషన్ వ్యవస్థ భారత్లో ఉన్నత ప్రమాణాలు, తగినన్ని నిధులు లేక నామమాత్రంగా మిగిలిపోయింది. తర్వాత నియంత్రించలేని విధంగా పెరిగిపోయింది. జ్ఞానబోధనపై ఉంచాల్సిన దృష్టి పాలక విషయాలపై కేంద్రీకృతమయింది. పరీక్షలు, ఫలితాల ప్రకటనల చుట్టూ ప్రదక్షిణలు మొదలయ్యాయి. తగిన మానవ, ఆర్థిక వనరులు లేక చర్చావేదికలకు డిపార్ట్మెంట్లు నీళ్లొదిలాయి. ఇదంతా ఒక ఎత్తయితే –అంతర్గత పాలనా వ్యవస్థ–మేనేజ్మెంట్

కౌన్సిల్/సిండికేట్, అకాడమిక్ కౌన్సిల్ వంటివి రాజకీయ శరణార్థులతో నిండిపోయి అసలు విశ్వవిద్యాలయాల లక్ష్యమైన 'అకాడమిక్స్'కు మంగళం పాడేసాయి.

ఈ సంక్షోభం నుండి ఉన్నత విశ్వ విద్యాలయాలను బయటపడేయాలంటే దానికి ఒకటే చిట్కా–వాటికి ఉన్న స్వయంప్రతిపత్తిని గౌరవించడం, లేనివాటికి కల్పించడం. విద్యావిషయక, పాలనా సంబంధ అంశాలను కలగాపులగం చేయకుండా ఉండడం. ప్రభుత్వంకూడా ఇప్పుడిప్పుడు ఉన్నత విద్యప్రామాణికతను గుర్తించి ఈ దిశగా అడుగులు వేస్తున్నది.

జ్ఞానసముపార్జన విధానాల్లో కూడా చాలా మార్పులు వస్తున్నాయి. నిరంతరం నేర్చుకోవడం, తరగతి గదుల్లో నేర్చుకోవడం, ఇతరత్రా వనరులనుంచి గ్రహించడంవంటి పద్ధతులు సంప్రదాయ గోడలను కూల్చేసి విద్యార్జన వేదికను సువిశాలం చేస్తున్నాయి. ఐటి ఆధారంగా ప్రభుత్వమే 'స్వయం' (SWAYAM) అనే వేదికను సిద్ధం చేసింది. 350 ఆన్‌లైన్ కోర్సులు దీనినుంచి ప్రారంభం కాబోతున్నాయి. నిరంతరం నేర్చుకోవాలనే అభిలాష ఉన్న జిజ్ఞాసి ఎవరైనా ఆన్‌లైన్ ద్వారా కూడా తమ నైపుణ్యాన్ని అర్హతలను పెంచుకోవచ్చు.

ఇదిలా ఉంటే మరో వంక–ఉన్నత విశ్వవిద్యాలయాల్లో ప్రవేశానికి పిల్లలు సవాలక్ష ప్రవేశ పరీక్షలు రాయాల్సివస్తున్నది. ఇది పిల్లలను మానసికంగా ఒత్తిడికి గురి చేస్తుంటే తల్లిదండ్రులకు ఆర్థికంగా తలకు మించిన భారమవుతున్నది. దీని పరిష్కారానికి కూడా ప్రభుత్వం నడుంబిగించింది. అన్ని సంస్థల్లో ప్రవేశాలకు ఒకే పరీక్ష నిర్వహించడానికి జాతీయ పరీక్షల సంస్థ (National Testing Agency) ఏర్పాటుచేయాలని సంకల్పిం చింది. దీనికి స్వయం ప్రతిపత్తి ఉంటుంది.

అలాగే పరిశోధనలను ప్రోత్సహించడానికి మరో ప్రతిపాదన సిద్ధమవుతున్నది. ప్రభుత్వ- ప్రైవేటు భాగస్వామ్యంతో ఇవి ఏర్పాటవుతాయి. పరిశ్రమలు, ప్రభుత్వం చేసుకునే ఒప్పందాల ద్వారా 70%, మిగిలిన 30% కేంద్ర, రాష్ట్రాలనుండి 9:1 నిష్పత్తిలో గ్రాంటుల రూపంలో అందే ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల పరిశోధనారంగం బాగా విస్తృతంగా, పటిష్టంగా అభివృద్ధిచెందడమే కాక, విద్యార్థుల జ్ఞానసముపార్జన నైపుణ్యం, యోగ్యతల్లో కూడా వలుసానుకూల మార్పులు వస్తాయి.

ఇదిగాక విశ్వవిద్యాలయాల బయట ప్రాథమిక పరిశోధన అభివృద్ధికి కూడా అవకాశం ఉంది. విశ్వవిద్యాలయాల్లో నిర్దిష్ట సబ్జెక్టుల్లో మాత్రమే పరిశోధనకు అవకాశం ఉంటుంది. కానీ వీటిల్లో ఆ హద్దులుండవు. రెండు, మూడు, అంతకంటే ఎక్కువ సబ్జెక్టుల్లో విడివిడిగా కానీ, కలిసి కానీ అదికూడా సంప్రదాయ కోర్సులలోనే కాక, సామాజిక శాస్త్రాల్లో, లైఫ్ సైన్సెసులవంటి వాటిల్లోకూడా చేయవచ్చు.

అయితే ఇక్కడ మనం మరో ముఖ్యమైన అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. ఉద్యోగుల్లో చాలా రకాల వారుంటారు. పరిశ్రమల్లో , కార్యాలయాల్లో, సేవాసంస్థల్లో ప్రభుత్వరంగంలో పనిచేసే ఉద్యోగుల పనిలో, సేవల్లో వారు వారి నైపుణ్యాలను, ప్రతిభను పెంచుకోవాల్సి ఉంటుంది. దీనికి అవసరమైన శిక్షణను దేశవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకు రావాల్సిన అవసరముంది. అన్నిటికంటే ముఖ్యంగా యువతరానికి, పారిశ్రామిక రంగంలోని వారికి నైపుణ్యాలను అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా అందించే వ్యవస్థను సిద్ధం చేయాలి.

జాతీయ విద్యా ప్రమాణాల పెంపుదల కృషిలో వృత్తి విద్య, శిక్షణ (Vocational Education and Training `VET) ఇక్కడ ఒక కీలకాంశమే. ప్రభుత్వం కూడా దీనిని పునర్నిర్వచించాలని నిర్ణయించింది.

ఇటువంటి అనేక ఆలోచనలకు బడ్జెట్ కార్యరూపం ఇచ్చేందుకు రంగం సిద్ధం చేసింది. దేశవ్యాప్తంగా 600 జిల్లాలకు పైగా ప్రధానమంత్రి కౌశల్ కేంద్రాలను (Pradhan Mantri Kaushal Kendras) విస్తరించాలనేది వాటిలో ఒక ప్రతిపాదన. దేశవ్యాప్తంగా 100 భారత అంతర్జాతీయ నైపుణ్య కేంద్రాలను నెలకొల్పి రు.4 వేల కోట్లతో సంకల్ప్ (SANKALP - Skill Acquisition and Knowledge Awareness for Livelihood Promotion)ను ప్రారంభించాలనేది మరొక ప్రతిపాదన. దీనివల్ల 3.5కోట్లమంది యువతీయువకులకు సమకాలీన మార్కెట్ అవసరాలకు తగిన శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు.

* 2012లో 47కోట్ల 41లక్షలమంది కార్మికులు భారత్‌లో ఉన్నారు. చైనా తర్వాత ఇదే రెండో పెద్ద గణాంకం ఉన్న దేశం.
* 94%పైగా పైగా శ్రమ అవ్యవస్థీకృత రంగంలో ఉంది. తోపుడు బండ్లనుండీ ఇళ్ళదగ్గర వజ్రాలకు మెరుగులు పెట్టే పనుల వరకు చాలా ఈ కేటగిరీలోనివే. ఈ రంగం కార్మికులకు ఉపాధి లాభం కానీ సామాజిక భద్రత కానీ ఉండదు.
* భారత శ్రామికుల్లో 60% స్వయం ఉపాధితో బతికేవారే. చివరకు పేదలుగానే మిగిలిపోతున్నారు.
* దాదాపు 30% మంది రోజువారీ కూలీలు. 10% రెగ్యులర్ ఉద్యోగులు. వీరిలో ఐదింట రెండు వంతులమంది ప్రభుత్వరంగంలో పనిచేస్తుంటారు.

* భారత్‌లో తలసరి ఆదాయం, ఉత్పాదకత రెండూ బాగా తక్కువే. తలసరి ఆదాయం జపాన్‌లో 30వేల డాలర్లు, శ్రీలంకలో 879 డాలర్లు, భారత్‌లో మాత్రం 433 డాలర్లే. వర్థమానదేశాల్లో తలసరి ఆదాయంలో 7.5% ప్రస్తుతం మన దేశంలో తలసరి ఆదాయంగా ఉంది. మరో 50 ఏళ్ళలో దీనిని 80% పెంచాల్సిన అవసరం ఉందనేది నిపుణుల మాట.
* మనజనాభాలో 55% వ్యవసాయ రంగం ద్వారా ఉపాధిపొందుతున్నారు. ఈ రంగంలో స్థూల దేశీయోత్పత్తి (GDP) క్రమేణా పడిపోతున్నది. గ్రామీణ పట్టణ వలసలుకూడా చాలా సమస్యలు సృష్టిస్తున్నాయి.

ఈ దశలో సంకల్పను పకడ్బందీగా రూపొందించి ఆచరణలోకి తీసుకురావాల్సిన అవసరముంది. అలాగే 2017-18 సంవత్సరానికి ప్రతిపాదించిన పారిశ్రామిక విలువలు పెంచే నైపుణ్యాల బలోపేత పథకాన్ని (Skills for Industrial Value Enhancement - STRIVE) వీలయినంతమేర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలతో అనుసంధానం చేయాలి. పర్యాటకాన్ని స్థానిక ఉపాధిని ప్రోత్సహించే ఇన్‌క్రెడిబుల్ ఇండియా 2.0 (Incredible India 2.0) ప్రచార కార్యక్రమంలో భాగంగా తోళ్ళ, పాదరక్షల తయారీ పరిశ్రమల్లో ఉపాధి పెంచడానికి తీసుకుంటున్న చర్యలు కూడా ప్రశంసార్హమైనవి.

వర్ధమాన దేశాల్లో వయోవృద్ధుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో అవకాశాలు అందిపుచ్చుకోవడంలో బాగా అంతరం ఏర్పడుతున్నది. భారత్ మాత్రం యువశక్తితో ముందంజలో ఉంటున్నది. అందుతున్న సమాచారాన్నిబట్టి జపాన్‌లో 80లక్షల మంది, అమెరికాలో 1.7 కోట్ల మంది, ఐరోపాలో కేవలం 4% మంది మాత్రమే ఈ తరగతిలో ఉంటారు. ఈ పరిస్థితిని భారత్ విస్మరిస్తే, మన అవకాశాలను మనం చేజేతులా చైనా, శ్రీలంక, ఇతర వర్ధమాన ఆసియా దేశాల ఆర్థిక వ్యవస్థలకు అప్పగించినట్లవుతుంది.

**ముగింపు :**

ప్రధాని నరేంద్రమోదీ ఎక్కువ శ్రద్ధచూపిన డిజిటలైజేషన్ ప్రక్రియ యువత మీద బాగా ప్రభావం చూపుతున్నది. బడ్జెట్‌లో కూడా డిజిటల్ ఆర్థిక వ్యవస్థ దిశగా తీసుకున్న పలు చర్యలు ఈ విషయకంగా సానుకూలమైనవే. వాటిలో ప్రత్యేకించి చెప్పుకోవలసినవి- భీమ్‌యాప్, వ్యక్తులకు రెఫరల్ బోనస్‌వంటి కొత్త పథకం, వ్యాపారులకు క్యాష్‌బ్యాక్, ఆధార్ చెల్లింపులవంటివి ఉన్నాయి. 2017-18లో యుపిఎల్, యు ఎస్ఎస్‌డి, ఆధార్ చెల్లింపులు, ఐఎంపిఎస్, (UPI, USSD, Aadhar Pay, IMPS), డెబిట్‌కార్డుల ద్వారా లావాదేవీలుజరపడానికి రు.2500 కోట్లతో చేపట్టిన కార్యక్రమం, అలాగే ప్రభుత్వం జరిపే చెల్లింపులు, రశీదులు కూడా ప్రభుత్వ, ప్రైవేటురంగాల్లో పారదర్శకతను, జవాబుదారీతనాన్ని తీసుకురావడానికి ఉపయోగపడడమే కాక, కొత్త ఉద్యోగాలను, నైపుణ్యావకాశాలను సృష్టిస్తుంది కూడా.

నిజానికి నాకు వ్యక్తిగతంగా ఏమనిపిస్తుందంటే - పాఠశాల, కళాశాల స్థాయిలో విద్యాబోధనను, నైపుణ్యాలను అలవర్చే కార్యక్రమాలను అనుసంధానం చేసి నియత విద్య నుంచి వృత్తి విద్యలోకి ఉద్యోగరంగంలోకి ఎక్కడికక్కడే ప్రవేశించ గల, నిష్క్రమించగల అవకాశాలను కల్పించాలి. పెట్టిన పెట్టుబడుల మీద తగినన్ని ఫలితాలు పొందాలంటే - ప్రభుత్వం నిర్వహించే అన్ని నైపుణ్య కేంద్రాలను సమన్వయ పరచడానికి ఒక జాతీయ నైపుణ్య విశ్వవిద్యాలయం ఉండడం చాలా అవసరం. యువతరం సాధికారతను పెంచడానికి చాలా చర్యలు తీసుకుం టున్నాం. కానీ యువతజనాభా పెరుగుతూ పోతూ ఉంటే విద్యారంగంమీద పెట్టే ఖర్చు తగ్గుతూ పోవడం ఆందోళన కలిగించే విషయం.

ఇప్పుడు ప్రభుత్వం ఏం చేయాలి? నా సలహా ఏమిటంటే- పౌరుల అవసరాలు, బాధ్యతలు పేర్కొంటూ పౌరులకు ఒక ఆజ్ఞాపత్రం (ఛార్టర్) రూపొందించాలి. తద్వారా భారతదేశ అభివృద్ధికి, భవితవ్యానికి సంబంధించి ఒక కొత్త అధ్యాయాన్ని రచించాలి. ఇది శక్తిమంతంగా ముందుకు సాగాలంటే - పౌరులు కూడాచట్టబద్ధ సంపద సృష్టిలో మనస్ఫూర్తిగా, పూర్తి భాగస్వామ్యంతో తర్వాత తరానికి తాళం చెవులు అందిస్తూ చెప్పాల్సిన హితోక్తి ఒకటుంది. అది- అపారమైన శక్తితోపాటూ, అపారమైన బాధ్యతలు కూడా నీడలా వస్తాయి' అని. ■

**యోజన చందా ఆన్‌లైన్‌లో**

భారత ప్రభుత్వ ప్రచురణల విభాగం వారి యోజన, ఇతర పత్రికలకు చందాను ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చు. www.Bharatkosh.gov.in వెబ్ సైట్‌లో Publications' Divistion వారి linkను క్లిక్ చేసి సూచనలను అనుసరించండి. చెల్లింపులు నెట్ బ్యాంకింగ్, క్రెడిట్ కార్డ్, డెబిట్ కార్డ్ ద్వారా చెయవచ్చు. చందా వివరాలు సంవత్సరానికి రూ. 230/-, రెండు సంవత్సరాలకు రూ. 430/-, మూడు సంవత్సరాలకు రూ. 610/-లు.

**సీనియర్ ఎడిటర్**



# విజ్ఞాన విపంచి

ప్రాతూరి పోతయ్య శర్మ

1) ఈ కింది వాటిల్లో ఏది కరెక్ట్? (రాష్ట్రాలలో ఓటర్లసంఖ్య: అసెంబ్లీ సీట్లు)
   - ఎ) పంజాబ్: సుమారు1,92,14,236 (అసెంబ్లీ సీట్లు: 117)
   - బి) గోవా: సుమారు10,85,271 (అసెంబ్లీ సీట్లు : 40)
   - సి) ఉత్తర ప్రదేశ్ : సుమారు 13,85,17,026 (అసెంబ్లీ సీట్లు : 403)
   - డి) పైవన్నీ (భారత ఎన్నికల కమిషన్ నివేదిక ప్రకారం)

2) స్విస్ టెన్నిస్ ఆటగాడు రోజర్ ఫెదరర్, ఆస్ట్రేలియా ఓపెన్ పురుషుల సింగిల్స్‌లో ఇప్పటివరకు ఐదుసార్లు గెలిచాడు . అవి ఏ ఏ సంవత్సరాలలో?
   - ఎ) 2004, 2006 బి) 2007
   - సి) 2010 & 2017 డి) పైవన్నీ

3) 1920లో ఏ కమిటీ భారతీయ రైల్వేలకు సెపరేట్ బడ్జెట్ కావాలని రికమెండ్ చేసింది?
   - ఎ) సర్ విలియం ఆక్ వర్త్ కమిటీ
   - బి) సర్ గోపాల స్వామి అయ్యంగార్
   - సి) స్వామినాథన్ S.A. అయ్యర్
   - డి) బిబేక్ దేబ్రాయ్

4) ఈ కింది వాటిల్లో ఏది కరెక్ట్? (భారతీయ రైల్వేలకు సంబంధించి )
   - ఎ) ఉద్యోగుల సంఖ్య : 1.3 మిలియన్లు
   - బి) వార్షిక సరకుల రవాణా : ఒక బిలియన్ టన్నులు
   - సి) ప్రతి రోజూ భారతీయ రైల్వే కి చెందిన 12,000 పాసెంజర్ రైళ్ళలో ప్రయాణించే ప్రయాణీకుల సంఖ్య : 24 మిలియన్లు
   - డి) పైవన్నీ

5) సేపరేషన్ కన్వెన్షన్ ప్రకారం, ఎప్పటి నుండి రైల్వే బడ్జెట్ , జనరల్ బడ్జెట్ నుండి విడి పోయింది?
   - ఎ) 1947 బి) సెప్టెంబర్20, 1924
   - సి) డిసెంబర్ 21, 1949
   - డి) 1.2.2017

6) మొబైల్ వ్యాలెట్స్ (అంటే మనీ పర్సులు వంటివి)కి ఉదాహరణలు ఏవి?
   - ఎ) SBI బడ్డీ బి) చిల్లర్
   - సి) పే టి ఎం డి) పైవన్నీ

7) మొబైల్ యాప్‌ల ద్వారా చేసే పేమెంట్స్‌లో గల సాధక బాధకలేవి ?
   - ఎ) కంప్రమైజ్డ్ అప్లికేషన్స్
   - బి) డినయల్ ఆఫ్ సర్వీస్
   - సి) మాన్ - ఇన్ - మిడిల్ వల్నరబిలిటి
   - డి) పైవన్నీ

8) ఇన్లాండ్ - వాటర్ వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (IWAI) వైస్ చైర్మన్ ప్రవీర్ పాండే తెల్పిన ప్రకారం, భారతదేశంలో గుర్తించిన జల మర్గాలేవి ?
   - ఎ) NW2 (బ్రహ్మపుత్ర నది మీద సాదియా – ధుబ్రి స్ట్రెచ్) పొడవు: 891 కి.మీ.
   - బి) NW3 (కొట్టపురం – కొల్లం వెస్ట్ కోస్ట్ కెనాల్) పొడవు: 168 కి.మి.
   - సి) NH4 (కాకినాడ – పుదుచ్చేరి) పొడవు: 1,078 కి.మి.
   - డి) పైవన్నీ (మొత్తం 111 జలమర్గాలను గుర్తించారు)

9) ఇటీవల USA అధ్యక్షుడు ఏ దేశాల నుండి USA వచ్చే ప్రయాణీకుల పై 90 రోజుల నిషేధ అంక్షలు విధించాడు ?
   - ఎ) ఇరాన్, ఇరాక్
   - బి) సిరియా, సోమాలియా
   - సి) యెమెన్, లిబియా , సుడాన్
   - డి) పైవన్నీ (మొత్తం 7 దేశాలు )

10) రూ. 1,420 కోట్ల రూపాయల NavIC లేక నావిగేషన్ విత్ ఇండియన్ కాన్ స్టేల్లేషన్ (ఇండియన్ రీజినల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టం) వివరాలేవీ?
   - ఎ) దీనిలో గల 3 ఉప గ్రహాలలో అణు గడియారాలు సాంకేతిక లోపాలను చూపాయి.
   - బి) ఇవి పొజిషన్ , నావి గేషన్, టైం (PNT) తెలుపుతాయి (భూమి మీద , సముద్రం, ఆకాశంలో గల వారికీ)
   - సి) IRNSS-1A ని జూలై 2013లో ప్రయోగించారు . IRNSS-1G ని ఏప్రిల్, 2016లో ప్రయోగించారు
   - డి) పైవన్నీ

11) మనునీధి చోళన్ (లేక) 'ఏలార' అనే చోళ మహారాజు తమిళనాడులో ఎప్పుడు పరిపాలన చేశాడు? (అయన విగ్రహం మద్రాస్ హైకోర్టులో ఉంది)
   - ఎ) 450 AD
   - బి) క్రీస్తు పూర్వం 250 సంవత్సరాల క్రితం (సుమారు)
   - సి) 600 AD డి) 700 AD

12) CBI నూతన డైరెక్టర్ ఎవరు?
   - ఎ) A.K.సిన్హా బి) అలోక్ కుమార్ వర్మ
   - సి) J.J. సింగ్ డి) వీరెవరు కారు

13) 2017 – 18 కేంద్ర బడ్జెట్‌లో చెప్పిన, TEC అనే అబ్రివేషన్‌ను విస్తరించండి?
   - ఎ) T : ట్రాన్స్ ఫార్మ్ బి) E : ఎనర్జైజ్
   - సి) C : క్లీన్ ఇండియా డి) పైవన్నీ

14) శ్రీ అరుణ్ జైట్లీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా ఇప్పటివరకు ఎన్ని సార్లు , వరుసగా బడ్జెట్ సమర్పించారు?
   - ఎ) 2014 (2014-15)
   - బి) 2015 (2015-16)
   - సి) 2016 (2016-17) & 2017 (2017 18)
   - డి) పైవన్నీ (వరుసగా నాలుగు సార్లు)

15) 2017-18 కేంద్ర బడ్జెట్‌లో MGNREGS కి ఎంత కేటాయించారు ? (కోట్ల రూపాయలలో)
   - ఎ) 28,000 బి) 48,000
   - సి) 20,000 డి) 15,000

16) స్మాల్ & మీడియం ఎంటర్ ప్రైజెస్ వాళ్ళ వార్షిక టర్నోవర్ రు.50 కోట్ల లోపు ఉంటె, (2017-18లో) ఎంత శాతం పన్ను కట్టాలి?
   - ఎ) 30% బి) 25% సి) 15% డి) 10%

17) 2017-18 బడ్జెట్ ప్రకారం, వార్షిక ఆదాయం ఏ టాక్స బుల్ ఇన్ కం స్లాబ్‌లో వారికీ 5% పర్సనల్ ఇన్ కం టాక్స్‌గా కట్టాలని తెలిపారు?
   - ఎ) రూ. 2.5 లక్షలలోపు వారికీ
   - బి) రూ. 2.5 లక్షలకి– రూ. 5లక్షలకి మధ్య వారికీ
   - సి) రూ. 5 లక్షలకి–రు. 10 లక్షలకి మధ్యవారికీ
   - డి) రూ. 10 లక్షలకి –రూ. 20 లక్షలకి మధ్యవారికీ

18) 2017-18బడ్జెట్ ప్రకారం రాష్ట్రీయ రైల్ సంరక్షకోష్‌ను ఎంత నిధితో ఏర్పాటు చేయదలిచారు (రాబోయే 5 సంవత్సరాల కాలంలో)? (లక్ష కోటి రూపాయలలో)
   - ఎ) ఒకటి బి) మూడు
   - సి) నాలుగు డి) రెండు

19) రైల్వేలు చేపట్టాల్సిన ముఖ్య పనులేవి, రాబోయే ఆర్థిక సంవత్సరంలో?
   - ఎ) ట్రైన్ కంట్రోల్ కోసం అడ్వాన్స్‌డ్ సిగ్నలింగ్ కొనుగోలు.

బి) లింకే – హాఫ్ మాన్ బుష్ కోచ్‌లను (రూ. 10,000 కోట్లతో) కొనటం
సి) అన్ మాన్ డ్ లెవెల్ క్రాసింగ్‌లు లేకుండా చెయ్యటం. డి) పైవన్నీ
20) 2017 – 18బడ్జెట్‌లో కొత్త లక్షణాలు ఏవి?
ఎ) రైల్వే బడ్జెట్ ను, జనరల్ బడ్జెట్ లో కలపటం
బి) ప్లాన్ & నాన్ – ప్లాన్ ఖర్చు తేడా తొలగించటం
సి) అవుట్ కం బడ్జెట్ ప్రవేశ పెట్టటం.
డి) పైవన్నీ
21) 2016–17 ఆర్థిక సర్వే రిపోర్ట్ ప్రకారం, భారత దేశంలో ఖరీఫ్ సీజన్‌లో మొత్తం ఆహార ధాన్యాల ఉత్పత్తి ఎంత? (మిలియన్ టన్నులలో)?
ఎ) 93.9 బి) 32.5 సి) 23.4
డి) 135 (ఫస్ట్ అడ్వాన్స్ డ్ ఎస్టిమేట్ ప్రకారం)
22) 2017–18 కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో అగ్రిగేట్ మూలధన వ్యయం, జీడీపీలో ఎంత శాతం ఉంది?
ఎ) 0.5 % బి) 1.8 %
సి) 2% డి) 4%
23) భారతీయ రైల్వే లకు చెందిన ఏ పబ్లిక్ సెక్టార్ కంపెనీ లను స్టాక్ మార్కెట్ లో లిస్టింగ్ చేయ బోతున్నారు ?
ఎ) IRCTC
బి) ఇండియన్ రైల్వే ఫైనాన్సు కార్పొరేషన్
సి) IRCON డి) పైవన్నీ
24) 2017 – 18 కేంద్ర బడ్జెట్‌లో డిఫెన్సు రంగానికి ఎంత కేటాయించారు (రూ. కోట్లలో)?
ఎ) 2,58,589.13 బి) 2,74,114/–
సి) 85,740/– డి) 50,000/–
25) భారత దేశంలో ఉన్న అన్ని ఆయిల్ కంపెనీలను కలిపి కేంద్రం 'ఆయిల్ మేజర్' ఏర్పాటు చేయాలనీ తలపెట్టింది. ప్రభుత్వ రంగంలో ఉన్నఆయిల్ సెక్టార్ కంపెనీలు ఏవి? వివరాలు ఏవి ?
ఎ) ONGC, OIL, GAIL ( వీటిని అప్ స్ట్రీమ్ ఆయిల్ కంపెనీలు అంటారు)
బి) IOCL , HPCL, BPCL ( వీటిని డౌన్ స్ట్రీమ్ ఎనర్జీ కంపెనీలు అంటారు)
సి) అప్ స్ట్రీమ్ , డౌన్ స్ట్రీమ్ లను కలిపితే మొత్తం మార్కెట్ కాపిటలైజేషన్ రూ.6,82,145 కోట్లు అవుతుంది
డి) పైవన్నీ
26) ఫసల్ భీమా యోజన (FBY) లేక ప్రధాన మంత్రి ఫార్మ్ ఇన్సురెన్సు స్కీం కింద ఏ సంవత్సరాలలో ఎంతెంత అగ్రికల్చర్ క్రాప్ కవర్ చేస్తారు?
ఎ) 2016–17 : 30 %
బి) 2017–18 : 40 %
సి) 2018–19 : 50 %
డి) పైవన్నీ ( 2017–18లో దీని కోసం రూ. 9,000 కోట్లు కేటాయించారు )
27) NABARDలో ప్రారంభించనున్న వ్యవసాయ రంగ సంబంధిత నిధులు ఏవి ?
ఎ) డెడికేటెడ్ ఇరిగేషన్ ఫండ్ : రూ.40,000 కోట్లతో.
బి) డైరీ ప్రాసెసింగ్ & ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ ఫండ్ : రూ. 8,000 కోట్లు (3 సంవత్సరాల కాలంలో)
సి) డ్రిప్ ఇరిగేషన్ ఫండ్ : రు. 2,000 కోట్లు
డి) పైవన్నీ
28) భారత్ నెట్ ప్రాజెక్ట్ కింద 2017–18లో, రు.10,000 కోట్లతో ఎన్ని లక్షల గ్రామ పంచాయతిలను హై స్పీడ్ ఇంటర్నెట్‌తో కనెక్ట్ చేస్తారు?
ఎ) 3 బి) 1.5 సి) 4 డి) 5
29) 2017–18లో వ్యవసాయ రుణాల కోసం, ఎన్ని లక్షల కోట్ల రూపాయలు కేంద్ర బడ్జెట్‌లో కేటాయించారు?
ఎ) 20 బి) 10 సి) 15 డి) 25
30) ఫారిన్ ఇన్వెస్ట్ మెంట్ ప్రమోషన్ బోర్డు (FIPB) ని ఎప్పుడు ప్రారంభించారు? ( ఇప్పుడు దీనిని రద్దు చేయదలచారు)
ఎ) 1975 బి) 1993 సంస్కరణల కాలంలో
సి) 1985 డి) 1969
31) ప్రతిపాదిత చెల్లింపుల నియంత్రణ మండలిలో ఎవరెవరు ఉంటారు ?
ఎ) RBI గవర్నర్: ఛైర్మన్‌గాను
బి) ఇద్దరు RBI డిప్యూటీ గవర్నర్‌లు సభ్యులు గాను
సి) కేంద్ర ప్రభుత్వం నియమించే ముగ్గురు ఎక్స్‌టర్నల్ సభ్యులు
డి) పై అందరూ (ఇది RBI లో ఉంటుంది )
32) ఎంతకు మించిన మొత్తాన్ని వ్యాపార లావాదేవీలలో క్యాష్ రూపంలో ఇవ్వకూడదని, 2017–18 బడ్జెట్‌లో తెలిపారు?
ఎ) రూ. 3 లక్షలు బి) రూ. 5 లక్షలు
సి) రూ. 10 లక్షలు డి) ఇవేవి కావు
33) ఎంతకు మించిన మొత్తాన్ని క్యాష్ రూపంలో చారిటబుల్ ట్రస్ట్‌లకు డొనేషన్‌గా ఇవ్వరాదు అంటున్నారు, వచ్చే ఆర్థిక సంవత్సరం నుండి?
ఎ) రూ. 2,000 బి) రూ. 10,000
సి) రూ. 25,000 డి) రూ. 30,000
34) BHIM యాప్‌తో అనుబంధంగా వేటిని ఏర్పాటు చెయ్యదలిచారు ?
ఎ) రెఫరల్ బోనస్ స్కీం (వ్యక్తులకి)
బి) క్యాష్ బ్యాక్ స్కీం (వ్యాపార వేత్తలకి)
సి) పైన తెల్పిన (ఎ)&(బి) డి) ఇవేవి కావు
35) RBI సెంట్రల్ బోర్డులో కేంద్ర ప్రభుత్వం నియమించిన డైరెక్టర్‌లు ఎవరు?
ఎ) డా. రాజీవ్ కుమార్
బి) డా. అశోక్ గులాటి
సి) మనీష్ సబర్వాల్ డి) పై అందరూ
36) డిసెంబర్, 2017లో WTO మినిస్టీరియల్ కాన్ఫరెన్స్ (MC) ఎక్కడ నిర్వహించ దలిచారు?
ఎ) వాంకోవర్
బి) బ్యూనస్ ఏయిర్స్, అర్జంటినా
సి) జెనీవా డి) బెర్న్
37) ఇటీవల WTO డైరెక్టర్ జనరల్ రాబర్టో అజవేడో భారత దేశం వచ్చినప్పుడు చర్చించిన అంశాలు ఏవి?
ఎ) ఆహార భద్రత కోసం ఉంచిన, ప్రజా ఆహార ధాన్యాల నిల్వలు
బి) దోహా రౌండ్ చర్చలు
సి) 'న్యూ ఇష్యూస్'/ ప్రతిపాదనలు (ICC & B–20 చెప్పిన WTO పాకేజ్ లేక e-commerce) డి) పైవన్నీ
38) బంగాళా ఖాతంలో ఉన్న 'తేగార్ చార్' అనే దీవి ఏ దేశ అధినం లో ఉంది ?
ఎ) భారత్ బి) బంగ్లాదేశ్
సి) శ్రీలంక డి) మయన్ మార్
39) భారత రాజ్యాంగంలోని ఏ ఆర్టికల్ ప్రకారం నాగాలాండ్‌కి స్పెషల్ స్టేటస్ లభించింది?
ఎ) 370 బి) 371 A
సి) 356 డి) 352
40) కేరళలోని ఏ వస్తువుల కోసం జియో గ్రాఫికల్ ఇండికేషన్ (GI) ట్యాగ్‌కి అప్లైచేసారు / లభించింది?
ఎ) నీలంబూర్ టేకు బి) పొక్కిలి ధాన్యం
సి) చెంగాలి కొండన్ అరటి డి) పైవన్నీ
41) షీలా భిడే కమిటీ ఇటీవల వేటి గురించి అధ్యయనం చేసింది?
ఎ) షెడ్యూల్ IX లో ఉన్న సంస్థలను ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ రాష్ట్రాలు ఏరీతిన పంచుకోవాలో
బి) షెడ్యూల్ X సి) షెడ్యూల్ II
డి) ఇవేవి కావు
42) మెగస్తనీస్ ఎవరి రాయబారిగా భారత దేశానికీ వచ్చాడు?
ఎ) ఆరిస్టాటిల్ బి) సెల్యూకస్ - I
సి) క్లియర్ కస్ డి) హెలియో డో టస్
43) క్రీస్తు శకం 1848 నుండి 1856 వరకు, ఇండియా గవర్నర్ జనరల్‌గా పనిచేసిన లార్డ్ డల్హౌసీ పేరుతో ఉన్న, ఢిల్లీలోని రోడ్డేరును దేనిగా మార్చనున్నారు ?
ఎ) దారా సిఖో రోడ్
బి) డా. APJ అబ్దుల్ కలాం రోడ్
సి) లోక్ కళ్యాణ్ మార్గ్ డి) లోడి రోడ్
44) డాంగ్ ఫెంగ్–16 (DF-16) మీడియం రేంజ్ ఖండాంతర క్షిపణులు (1000 కి.మి.రేంజ్)

ఏ దేశం పరీక్షించింది?

ఎ) పాకిస్తాన్ బి) చైనా

సి) ఆఫ్ఘనిస్తాన్ డి) సిరియా

45) ఇర్ర వాడి డాల్ఫిన్స్, హంప్బ్యాక్, బాటిల్నోసే, పాన్ ట్రాపికల్ స్పాటెడ్ డాల్ఫిన్స్, భారత దేశంలో ఎక్కడ ఎక్కడ తిరుగుతూ కనిపిస్తాయి ?

ఎ) చిలకా సరస్సు (ఒడిశా)

బి) భీతర్ కనిక

సి) భద్రక్ వన్య ప్రాణి సంరక్షణ కేంద్రం.

డి) పైవన్నీ

46) తెలంగాణా రాష్ట్రములో ఉన్న 'పాలరాపు క్లిఫ్' (శిఖరం), ముర్లిగూడ ఫారెస్ట్ దేనికి ప్రసిద్ధి ?

ఎ) ఏనుగులు

బి) జిప్స్ ఇండి కస్ (ఇండియన్ వల్చర్ )

సి) ఖడ్గ మృగాలు డి) సింహాలు

47) హిమాలయన్ మరియు యురేషియన్ అనే రెండు టె క్టో నిక్ ప్లేట్ల మధ్య ఉన్న భారత దేశ రాష్ట్రము ఏది?

ఎ) తమిళనాడు బి) ఉత్తరా ఖండ్

సి) కేరళ డి) కర్ణాటక

48) ఈ కింది వాటిలలో ఏది కరెక్ట్(భారత రాజ్యాంగంలో ఆర్టికళ్ల సంబందిచినవి)

ఎ) ఆర్టికల్ 129: కంటెంప్ట్

బి) ఆర్టికల్ 22 2 (1) : హై కోర్ట్ జడ్జిల బదిలీలు

సి) ఆర్టికల్ 320: పబ్లిక్ సర్వీస్ కమిషన్ల విధులు. డి) పైవన్నీ

49) 'బయో ప్లాస్టిక్స్' వేటి నుండి తయారుచేస్తారు?

ఎ) మొక్క జొన్న పిండి, కాయగూరల క్రొవ్వు &ఆయిల్

బి) నేచురల్ గ్యాస్

సి) పెట్రోలియం డి) అల్యూమినియం

50) ఈ కింది వాటిలలో ఏది కరెక్ట్ ?

ఎ) మైక్రో గ్రిడ్ : 10 KW లోపల

బి) మినీ గ్రిడ్ :10 KWకి–50 KWకి మధ్య

సి) తెలంగాణా రాష్ట్ర సంప్రదాయేతర విద్యుచ్ఛక్తి లక్ష్యం : సుమారు 10 గిగా వాట్స్

డి) పైవన్నీ (సౌర శక్తి ఉత్పత్తికి సంబంధించినవి)

51) భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 164 (4) ప్రకారం MLA కాని ఒక వ్యక్తి, ఆ రాష్ట్రములో మంత్రి అయితే, మామూలుగా ఎన్ని నెలల లోపల రాష్ట్ర లెజిస్లేటివ్ అసెంబ్లీకి ఎన్నిక కావాలి?

ఎ) 6 బి) 3 సి) 2 డి) 5

52)కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ (KIPC) లిమిటెడ్ ను ఏర్పాటు చేసి, రు. 7,400 కోట్ల టర్మ్ లోన్ ను, 10 జాతీయ బ్యాంకు ల కన్సార్షియం నుండి పొంది, తెలంగాణా రాష్ట్రము ఎన్ని కిస్తీలలో తిరిగి చెల్లించాలని నిర్ధారించింది ?

ఎ) 48 (మొదటి చెల్లింపు జూన్ 30 , 2020 నుండి ప్రారంభం అవుతుంది)

బి) 60 సి) 84 డి) 12

53) ఒక గ్రామాన్ని క్యాష్ లెస్ గ్రామంగా తీర్చి దిద్దాలంటే, ఏమేమి కావాలి?

ఎ) గ్రామస్తులందరికీ బ్యాంకు ఖాతాలు ఉండాలి

బి) మైక్రో ATM లు ఏర్పాటు చెయ్యాలి / పాయింట్ అఫ్ సేల్స్ (PoS) మెషిన్లు ఏర్పాటు చెయ్యాలి.

సి) బిజినెస్ కరెస్పాండెంట్‌లను నియమించాలి

డి) పైవన్నీ

54) పెంటావలెంట్ వాక్సిన్‌ను పిల్లలలో ఏ రోగాలు నిరోధించటానికి ఇస్తారు ?

ఎ) డిఫ్తీరియా, పెర్టుసిస్

బి) టెటానస్

సి) హెపటైటిస్ B & న్యుమోనియా

డి) పైవన్నీ (5 వ్యాధులు)

55) ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ (INCOIS) ఎక్కడుంది?

ఎ) నాగపూర్ బి) హైదరాబాద్

సి) ఇండోర్ డి) హసన్, కర్ణాటక

56) "ఆర్టికల్164 (4), అధికారం కోసం ఒక ఆధారం కాదు" అని ఏ కేసులో సుప్రీమ్‌కోర్ట్ తీర్పు ఇచ్చింది?

ఎ) కేశవా నంద భారతి కేసు

బి) B.R.కపూర్ Vs.తమిళనాడు స్టేట్ & ఇతరులు, సెప్టెంబర్, 2001

సి) మినర్వా మిల్స్ కేసు డి) ఇవేవి కావు

57) PSLV-C 37 రాకెట్ మోసుకుపోయే 104 ఉపగ్రహాలలో, చాలావరకు క్యూబ్ శాట్‌లు ఉన్నాయి. క్యూబ్ శాట్ల వివరాలేవీ ?

ఎ) బరువు : 5 కిలోగ్రాములు

బి) వీటిని 'డోవ్స్' అని, 'ఫ్లాక్ 3పి' అని పిలుస్తారు.

సి) ఇవి ప్లానెట్ స్ 100 ఉపగ్రహాల, 'లైన్ స్కాన్నర్ 'డోవ్స్ నక్షత్ర మండలంలో భాగంగా ఉంటాయి. డి) పై వన్ని

58) ఇస్రో ఒకేసారి పంపించే 104 ఉపగ్రహాలలో ఏవేవి ఉంటాయి ?

ఎ) 96 కస్టమర్ ఉపగ్రహాలు USA వి; 05 ఇతర దేశాల ఉపగ్రహాలు ఉంటాయి

బి) నాల్గవ కార్టోశాట్ –2 సిరీస్ ఉపగ్రహం.

సి) INS-1 A & INS - 1 B అనే నానో ఉపగ్రహాలు ఉంటాయి డి) పైవన్నీ

59) ఎలిసీ పాలస్ ఏ దేశ అధ్యక్షుని అధికార నివాసం?

ఎ) USA బి) ఫ్రాన్స్

సి) క్యూబా డి) జపాన్

60) ఈ కింది వాటిల్లో ఏది కరెక్ట్ ?

ఎ) 'జిన్నా ఆఫెన్ కేం టు అవర్ హౌస్': కిరణ్ దోషి

బి) 'హోప్ అఫ్ వాట్ ఐ సే': అనిల్ మీనన్

సి) 'ది ఆదివాసీస్ విల్నాట్ డాన్స్': హన్స్ దా సౌవేంద్ర శేఖర్

డి) పైవన్నీ (పుస్తకాలు: రచయితలు)

61) GST ఎప్పటి నుండి అమలు చేయదలిచారు?

ఎ) 2018 బి) జూలై 1, 2017

సి) 2019 డి) ఇవేవి కావు

62) ఇటీవల 'రైసినా డైలాగ్' అనే సమావేశం ఎక్కడ నిర్వహించారు?

ఎ) ఇస్లామాబాద్ బి) న్యూ ఢిల్లీ

సి) కాబుల్ డి) బీజింగ్

63) RBI గవర్నర్ నివేదిక ప్రకారం (జనవరి 19, 2017) ఎంతధనం మళ్ళీ చలామణిలోకి వచ్చింది, భారత దేశంలో (రూ. లక్షల కోట్లలో)?

ఎ) 9.2 బి) 15.44 సి) 20 డి) 35

64) 2016–17 ఆర్థిక సర్వేలో తెల్పిన, యూనివర్సల్ బేసిక్ ఇన్‌కం (UBI)లో గల అంశాలు ఏవి?

ఎ) యూనివెర్శాలిటి బి) అన్ కండిషనాలిటి

సి) ఏజెన్సీ డి) పైవన్నీ

65) "సిటీస్ & ది వెల్త్ అఫ్ నేషన్స్" అనే పుస్తకం ఎవరు రాశారు ?

ఎ) జేన్ జాకబ్స్ బి) జోనాథన్ కొల్మర్

సి) ప్రొఫెసర్ రాజా చెల్లయ్య

డి) ఆడమ్ స్మిత్

66) ఎకనామిక్ సర్వే రిపోర్ట్ 2016–17లో తెలిపిన 'జిఫ్స్ సూత్రం' దేన్నీ తెలియ చేస్తుంది ?

ఎ) నగర జనాభా–దాని సైజు

బి) వినియోగ దారుల ఆదాయం

సి) సప్లై & డిమాండ్

డి) మనీ & ఇంట్రెస్ట్

## జవాబులు (మార్చి - 2017)

| | | | |
|---|---|---|---|
| 1–డి | 18–ఎ | 35–డి | 52–ఎ |
| 2–డి | 19–డి | 36–బి | 53–డి |
| 3–ఎ | 20–డి | 37–డి | 54–డి |
| 4–డి | 21–డి | 38–బి | 55–బి |
| 5–బి | 22–బి | 39–బి | 56–బి |
| 6–డి | 23–డి | 40–డి | 57–డి |
| 7–డి | 24–బి | 41–ఎ | 58–డి |
| 8–డి | 25–డి | 42–బి | 59–బి |
| 9–డి | 26–డి | 43–ఎ | 60–డి |
| 10–డి | 27–డి | 44–బి | 61–బి |
| 11–బి | 28–బి | 45–డి | 62–బి |
| 12–బి | 29–బి | 46–బి | 63–ఎ |
| 13–డి | 30–బి | 47–బి | 64–డి |
| 14–డి | 31–డి | 48–డి | 65–ఎ |
| 15–బి | 32–ఎ | 49–ఎ | 66–ఎ |
| 16–బి | 33–ఎ | 50–డి | |
| 17–బి | 34–సి | 51–ఎ | |

■

# దర్పణం

### నేర్చుకోడానికి పరిమితులు లేవు:



చిత్తశుద్ధితో అధ్యయనం చేయడానికి ఎటువంటి హద్దులూ లేవని తెలియచేస్తూ, ఈ సంవత్సరం వార్షిక బడ్జెట్‌లో కేంద్రం SWAYAM (Study Webs of Active - Learning for Young Aspiring Minds) అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రకటించింది. దీనిప్రకారం ఆసక్తి ఉన్న ఎవరైనా, వివిధ అంశాలలో 2000 ల పై చిలుకు కోర్సులను అభ్యసించవచ్చు. కావలసిన పాఠ్యవివరాలను ఆన్‌లైన్‌లో నిపుణులైన ఐఐఎం అధ్యాపకులు అందచేస్తారు. దేశంలోని ఏ ఐఐఎం, ఐఐటి లకైనా ప్రవేశ పరీక్ష స్థాయిలో ఉండే ఈ కోర్సులలో దూరవిద్యావిధానంలో చేరవచ్చు. వచ్చే అగస్టు 15 న ప్రధానిచే ప్రారంభించబడే ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి. ఒకేసారి దాదాపు మూడు కోట్లమందిని చేర్చుకునే ఈ విధానం అమలులోకి వస్తే, దేశంలోని మొత్తం విద్యా విధానం రూపురేఖలే మారిపోతాయి.

### సంకల్ప్:



బడ్జెట్ 2017-18 ని పార్లమెంట్‌లో సమర్పిస్తూ కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ విద్యర్థుల జీవనోపాధిలో నైపుణ్యాలను మరింత పదును తేల్చడానికి రూ. 4 వేల కోట్ల కేటాయింపుతో Skill Acquisition and Knowledge Awareness for Livelihood Promotion programme (SANKALP) కార్యక్రమాన్ని ప్రకటించారు. పథకం రెండవ దశలో పారిశ్రామిక విలువను మరింత పెంచడానికి మరో రూ. 2200 కోట్లతో STRIVE కార్యక్రమాన్ని కూడ ప్రకటించారు. దేశ, కాల, జీవన రీతుల్లో ఉన్న వైవిధ్యాన్ని దృష్టిలో పెట్టుకుని, యువత తమ జీవనోపాధికి అవసరమైన నైపుణ్యాలను సంతరించుకోడానికి ఈ రెండు కార్యక్రమాలూ 3.5 కోట్లమంది యువతకు సహకరిస్తాయి.

### ఆపరేషన్ క్లీన్ మనీ:



పెద్దనోట్లరద్దు పర్యవసానంగా బ్యాంకుల్లో జమ అయిన రద్దయిన నోట్లతో ఏంచేస్తారనే ప్రశ్న తలెత్తింది. దీనికి జవాబు, ముందుగా ఆయా డిపాజిట్లు చేసినవారి ఆర్థిక చరిత్రను సమీక్షిస్తారు. దీనినే ఆపరేషన్ క్లీన్ మనీ అంటారు. గత నవంబర్ 09 నుండి, డిసెంబర్ 31, 2016 వరకు భారీ మొత్తంలో నగదు జమచేసినవారికి మొత్తం 18 లక్షలమందికి ఆన్‌లైన్‌లో వివరాలు సమర్పించమని కోరగా, నోట్ల జమ, మార్పిడి చేసిన మొత్తం 5.27 లక్షలమంది పన్ను చెల్లింపుదారులు స్పందించారు. వీరిలో 99.5 శాతంమంది తమ నగదు డిపాజిట్లను సమర్థించారు. అయితే, వీరిలో 4.84 లక్షలమంది ఇంకా పన్ను చెల్లింపుదారులుగా ఈ-ఫైలింగ్ పోర్టల్ లో నమోదుచేసుకోలేదు. ఇలాంటివారందరినీ, వెంటనే ఈ-ఫైలింగ్ కు నమోదుచేసుకోవాలని ఆదాయపుపన్ను శాఖ కోరుతున్నది.

### ప్రపంచంలో ఆరవ పెద్ద పారిశ్రామిక వ్యవస్థ భారత్:



మన దేశం 2015 నాటికి ప్రపంచంలో ఆరవ అతి పెద్ద పారిశ్రామిక దేశంగా అవతరించిందని ఐక్యరాజ్యసమితి అభివృద్ధి సంస్థ వెల్లడించింది. వారి అంచనాల ప్రకారం అమెరికాను తోసిరాజని చైనా ప్రథమ స్థానాన్ని ఆక్రమిస్తున్నది. మన దేశం అంతకు ముందు సంవత్సరం తొమ్మిదవ స్థానంలో ఉండేది. భారత్ తయారీ రంగం 2015 సంవత్సరంలో 7.6శాతం పెరిగింది. మనదేశం భారీ తయారీ రంగమైనప్పటికీ, దేశంలో పోటీతత్వం చాలా తక్కువస్థాయిలో ఉన్నది.


### ఆర్భాటపు పెళ్ళిళ్లకు చెల్లుచీటీ:



మనదేశంలో పెళ్ళిళ్ల పేరున భారీ స్థాయిలో ధనం, ఆహారం వృధా అవుతున్నది. దీనిని నియంత్రించడానికి పార్లమెంటు వచ్చే శీతాకాల సమావేశాలలో ఒక బిల్లును ప్రవేశపెట్టనున్నారు. ఏ వర్గం వారికైనా ఒక పెళ్ళికి ఐదు లక్షల రూపాయల గరిష్ట వ్యయపరిమితిని నిర్దేశిస్తూ, శ్రీమతి రంజీత్ రంజన్ అనే కాంగ్రెస్ సభ్యురాలు ఈ ప్రైవేటు బిల్లును ప్రవేశపెట్టనున్నారు. ఈ పరిమితిని మించి ఖర్చు చేస్తే దానిలో 10 శాతం

పేదకుటుంబాల అమ్మాయిల వివాహాలకు సహాయంగా అందచేయాలి అనేది నిబంధన. దీనితో పాటుగా, ప్రతి వివాహాన్నీ, తప్పని సరిగా రిజిస్టర్ చేయాలనే సుప్రీంకోర్టు ఆదేశానికి చట్టరూపాన్ని కూడ ఇస్తారు. వివాహమంటే ఆడంబరాలప్రదర్శనకాదనీ, వ్యాపారం కూడ కాదనీ, స్పష్టంచేస్తున్న ఈ బిల్లును పలువురు హర్షిస్తున్నారు.

### ఎలక్ట్రానిక్స్ రంగానికి చేయూత:




ఎలక్ట్రానిక్స్ రంగానికి ప్రైవేటు రంగ సహకారంతో చేయూత నిచ్చేందుకు కేంద్రం రూ. 10 వేల కోట్ల కేటాయింపుతో ఒక పథకాన్ని ప్రకటించింది. ఇతర ప్రగతి స్ఫోరక దేశాలతో పోలిస్తే మనం ఈ రంగంలో వెనుకబడి ఉన్నామనే చెప్పాలి. ఎలక్ట్రానిక్స్‌లో నూతన ప్రాజక్టులకు ప్రయత్నిస్తున్న సంస్థలకు రిస్కు మద్దతును ఈ నిధి కల్పిస్తుంది. 2025 నాటికి మన ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు రూ. 200 బిలియన్ మార్కును చేరతాయని అంచనా.

### స్టేట్ బ్యాంక్ సమాహారం:

ఎంతో కాలం నుండి నలుగుతున్న స్టేట్ బ్యాంక్ అనుబంధ బ్యాంకుల విలీనం మొత్తానికి ఒక కొలిక్కి వచ్చింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ బికనీర్ – జైపూర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ మైసూర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ పటియాలా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ట్రావెన్కోర్ లను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో విలీనం చేయడానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ విలీనంతో ఎస్.బి.ఐ. 37 ట్రిలియన్ రూపాయల ఆస్థులు, 22,500 శాఖలు, 58 వేల ఏటిఎంలు, 50 కోట్ల ఖాతాదారుల కు సేవలను అందించాల్సి వస్తుంది. భారతీయ మహిళా బ్యాంకును కూడ దీనిలో విలీనం చేయాలనే ప్రతిపాదన ఇంకా పరిశీలనలోనే ఉంది. ఈ విలీనం వల్ల ఈ బ్యాంకింగ్ గ్రూపు నిర్వహణలో ప్రతిసంవత్సరమూ వెయ్యి కోట్లు ఆదా అవుతుంది. దీనితో మన ఎస్.బి.ఐ. ప్రపంచంలో 50 వ పెద్ద బ్యాంకు అవుతుంది.

### రెండు రోజుల్లో 4666 మరుగుదొడ్లు:



తమిళనాడులోని పెరంబలూర్ జిల్లాలో కేవలం రెండు రోజుల్లో, అంటే 48 గంటల్లో రికార్డు స్థాయిలో 4,666 మరుగుదొడ్లు నిర్మించారు. ఒక్కొక్క మరుగుదొడ్డినీ, రూ. 12 వేల పూర్తి ప్రభుత్వ సహాయంతో నిర్మించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ 121 గ్రామాలలో నాలుగు వేలమంది కార్మికుల సహాయంతో ఈ బృహత్తర కార్యాన్ని, కేవలం 48 గంటలలో పూర్తిచేసింది. స్వచ్ఛభారత్ పథకం కింద మార్చి 31 వరకూ మొత్తం 78,635 మరుగుదొడ్ల నిర్మాణం లక్ష్యమని డి ఆర్ డి ఏ అధికారులు తెలియచేశారు. ■

---

### పాఠకులకు మనవి

**యోజన తెలుగు మాసపత్రిక పాఠకుల స్పందనలను ఆహ్వానిస్తోంది. యోజన పాఠకులు, చందా దారులు, శ్రేయోభిలాషులు పత్రికలో వచ్చే వ్యాసాలపై తమ సందేహాలు, సూచనలు, స్పందనను లేఖలు, ఈ–మెయిల్ (yojana_telugu@yahoo.co.in), ట్విట్టర్ (@TeluguYojana)ల ద్వారా తెలియచేయగలరు. యోజన నాణ్యతను మరింత మెరుగు పరచడానికి మీ స్పందన మాకు ఎంతో ఉపకరిస్తుంది.**

**The Editor,
Yojana (Telugu), Room No. 205,
Second Floor, CGO Towers;
Kavadiguda, Hyderabad - 500 080.**

– ఎడిటర్, యోజన

### మనవి

**కేంద్ర ప్రభుత్వ పనితీరుపై ప్రజలు తమ సూచనలను mygov.in వెబ్‌సైట్ ద్వారా పంపవచ్చు లేదా 1800 117 800 (టోల్ ఫ్రీ) నెంబరుకు తెలియచేయవచ్చు.**

# కేంద్ర బడ్జెట్ 2017-18 లో వ్యవసాయానికి ఊతం



**గత రెండు సంవత్సరాలుగా ప్రభుత్వం రైతుల ఆదాయం రానున్న ఐదు సంవత్సరాలలో రెట్టింపు కావాలనే లక్ష్యంతో వ్యవసాయానికి అనేక ప్రోత్సాహకాలను ప్రకటించింది. ప్రధానమంత్రి కృషి సించాయి యోజన, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన వంటి పథకాలతో పాటు, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌కు ఒక ఈ-ప్లాట్ ఫామ్ వంటివి వీటిలోకి వస్తాయి. ఈ 2017-18 వార్షిక బడ్జెట్, నాబార్డు వద్ద చిన్న నీటివనరుల ప్రోత్సాహానికి ఐదువేల కోట్ల రూపాయలతో ఒక నిధిని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది.**

కేంద్ర బడ్జెట్ 2017-18 వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి అనేక చర్యలను ప్రకటించింది. ఇవన్నీ ఎలాంటి ఆటంకాలూ లేకుండా అమలైతే, రైతన్నలకు కొంత ఊరట తప్పనిసరిగా లభిస్తుంది. వ్యవసాయ, అనుబంధరంగాల ఉత్పత్తి మరింత పెరగడానికి ప్రోత్సాహమిస్తే, వినియోగం కూడ మరింత పెరుగుతుంది. దీనికోసం, పాడి, ఉద్యానవన పంటల కేటాయింపును మరింత పెంచిన విషయం తెలిసిందే. వ్యవసాయరంగమైతే, 2015-16 సం. నాటి రెండు శాతం వృద్ధి రేటును 4.1 శాతంగా నమోదుచేసింది. వ్యవసాయ మార్కెటింగ్‌కు కూడ ఈ బడ్జెట్ ఊత మిచ్చింది. పంటల బీమా మొత్తాన్ని పెంచింది, వ్యవసాయరుణ పరిమితిని కూడ పెంచింది. నీటిపారుదల, పాడి వంటి అంశాలకు నూతన పథకాలను అమలు చేయమని నాబార్డును ప్రభుత్వం ఆదేశించింది. వ్యవసాయ పురోగతే లక్ష్యంగా రుణరంగానికి 2017-18 వార్షిక బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యమిచ్చారు. గత సంవత్సరం కన్నా లక్షకోట్లు అధికంగా, పది లక్షలకోట్ల రూపాయలు కేటాయించారు.

గత రెండు సంవత్సరాలుగా ప్రభుత్వం రైతుల ఆదాయం రానున్న ఐదు సంవత్సరాలలో రెట్టింపు కావాలనే లక్ష్యంతో వ్యవసాయానికి అనేక ప్రోత్సాహకాలను ప్రకటించింది. ప్రధానమంత్రి కృషి సించాయి యోజన, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన వంటి పథకాలతో పాటు, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌కు ఒక ఈ-ప్లాట్ ఫామ్ వంటివి వీటిలోకి వస్తాయి. ఈ 2017-18 వార్షిక బడ్జెట్, నాబార్డు వద్ద చిన్న నీటివనరుల ప్రోత్సాహానికి ఐదువేల కోట్ల రూపాయలతో ఒక నిధిని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. మన దేశంలో సాగులోనున్న నికర 141 మిలియన్ హెక్టారుల భూమిలో 54 శాతం ఇలాంటి చిన్న నీటివనరులపైనే ఆధారపడటంవల్ల, ఈ నిర్ణయం ఎంతోమందికి మేలు చేస్తుంది. జాతియ వ్యవసాయ మార్కెట్, అంటే ఈ-నామ్ కింద ఇప్పటివరకూ 250 మార్కెట్లు మాత్రమే లబ్ది పొందుతున్నాయి. ఈ సంఖ్యను 585కు పెంచాలని ప్రతి మార్కెట్‌కూ పరిశుభ్రత, గ్రేడింగ్, పాకింగ్ వంటి అవసరాలకు రూ. 75 లక్షల సహాయ మందించాలనీ నిర్ణయించారు. దీనివల్ల రైతుల ఉత్పత్తులకు విలువ మరింత పెరుగుతుంది. వ్యవసాయ తయారీ యూనిట్ల కింద పండ్ల సాగులో పనిచేసే రైతుల సంక్షేమం కోసం, కాంట్రాక్టు

**లక్ష్మీ జోషి,** ఫెలో, నేషనల్ కౌన్సిల్ ఫర్ అప్లయిడ్ ఎకనమిక్ రీసెర్చ్, న్యూ ఢిల్లీ. E-mail: ljoshi@ncaer.org
**వి.పి. ఆహూజ,** ఫెలో, నేషనల్ కౌన్సిల్ ఫర్ అప్లయిడ్ ఎకనమిక్ రీసెర్చ్, న్యూ ఢిల్లీ.

వ్యవసాయ చట్టాన్ని ఒకదాన్ని రూపొందించి, తగిన మార్పులు, చేర్పులు, అమలుకు రాష్ట్రాలకు పంపుతారు. త్వరగా చెడిపోయే ఉత్పత్తులను వ్యవసాయ ధరల నిర్ణాయక సంఘాల పరిధి నుండి తప్పించి, నేరుగా తాము స్వయంగా అమ్ముకునే వెసులు బాటును కల్పిస్తారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన PMFBY పథకాన్ని 2016 ఖరీఫ్ సీజన్‌లో ప్రారంభించారు. మొదటి సీజన్‌లోనే అత్యంత ప్రతిభావంతంగా మొత్తం రైతులలో 26.5 శాతం మంది, అంటే 366.64 లక్షల మంది రైతులకు ప్రయోజనం కల్పించింది. వర్తమాన రబీ సిజన్‌కు ఈ బీమాను మరో 30 శాతం మేరకు విస్తరించాలని నిర్ణయించింది. ఈ పథకానికి కేంద్రం 2016-17లో కేటాయించింది 5500 కోట్ల రూపాయలైతే, 2017-18 సంవత్సరానికి రూ. 9,000 కోట్లుగా పెంచింది. వర్తమాన బడ్జెట్ సంవత్సరానికి 40 శాతం మంది రైతులకు ఈ పథకాన్ని వర్తింపచేయాలనీ, రానున్న బడ్జెట్ సంవత్సరానికి దీనిని 50 శాతంగా పెంచాలనేది లక్ష్యం. 2015లో ప్రారంభించిన భూ ఆరోగ్య కార్డు విధానాన్ని మరింత పటిష్ట పరచడానికి దేశవ్యాప్తంగా ఉన్న 648 కృషి విజ్ఞాన కేంద్రాలలో చిన్నపాటి భూసార పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయాలనీ, దీనికి అదనంగా నిపుణులైన వెయ్యి మందికి స్థానిక ప్రభుత్వాల సహకారంతో మరో వెయ్యి భూసార పరీక్షా కేంద్రాల ఏర్పాటుకు అనుమతివ్వాలనీ నిర్ణయించారు. నూతన వస్తు సేవల పన్ను (GST) మనదేశ వ్యవసాయ, ఆహార రంగాలకు ఎంతో ఉపయోగపడుతుంది. ముఖ్యంగా ఈ రెండు రంగాలు అనేక ప్రత్యక్ష, పరోక్ష పన్నులతో కునారిల్లుతున్న సందర్భంలో ఈ ఏకీకృత పన్ను విధానం ఎంతో ప్రయోజనం చేకూరుస్తుంది.

నూర్పిళ్ళ తరువాతి కలిగే నష్టాలను వీలైనంత తగ్గించడానికి పళ్ళు, కురగాయల సాగును వ్యవసాయ ఉత్పత్తుల తయారీ యూనిట్లతో అనుసంధానంచేయ సంకల్పించింది. ఇప్పటికే మొదటి దశలో పది రాష్ట్రాలలోని 250 మార్కెట్లను ఈ-నామ్‌తో అనుసంధానించింది. దీనితో రూ. 421 కోట్ల విలువైన వర్తకం జరిగింది. ఈ-మార్కెట్‌లోని ధరవరల గురించిన సమాచారానికై, రైతులకు ఒక మొబైల్ యాప్‌ను కూడ రూపొందించింది కేంద్ర ప్రభుత్వం. పాడి పరిశ్రమ మౌలిక సదుపాయాలకు నాబార్డు ఆధ్వర్యంలో ఒక నిధిని ఏర్పాటు చేసింది. దీనితో రైతులకు వ్యవసాయేతర కార్యకలాపాల ద్వారా అదనపు ఆదాయం సమకూరుతుంది. పాడి ఉత్పత్తులు కూడ మరింతగా ప్రజలకు అందుబాటులోకి వస్తాయి. సహకార పాడి పరిశ్రమలలోనూ, కోల్డ్ స్టోరేజీలకు పెట్టుబడుల అవకాశాలు మరింత పెరుగుతాయి. ■

*28వ పేజీ తరువాయి...*

## బడ్జెట్-2017-18 : మౌలిక రంగానికి కేటాయింపులు


ఈ మిషన్‌ను మరింత ముందుకు తీసుకెళ్లడానికి 28 వేల ఆర్సెనిక్, ఫ్లోరైడ్ పీడిత ఆవాసాలకు రానున్న నాలుగేళ్లలో సురక్షిత మంచినీటి సదుపాయం కల్పించాలని తాజా బడ్జెట్‌లో ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదన జాతీయ గ్రామీణ తాగునీటి కార్యక్రమం (ఎన్ఆర్‌డిడబ్ల్యూపి) లో ఉప పథకంగా ఉంటుంది. దీని కోసం కేటాయింపుల ప్రతిపాదన 2016-17 బీఈలో రూ. 5 వేల కోట్లు ఉండగా ఈ ఏడాది అది రూ.6050 కోట్లకు చేరింది.

### స్థూల మదింపు:

2017-18 బడ్జెట్‌ను స్థూలంగా పరిశీలిస్తే కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసుకున్న లక్ష్యాలను త్వరగా, సకాలంలో పూర్తి చేయాలనే సంకల్పంతో ఉన్నట్లు స్పష్టమవుతుంది. మొత్తం బడ్జెట్‌లో దేశ మౌలిక రంగానికి చేసిన కేటాయింపులు దాదాపు ఒకింట అయిదొంతులు ఉండడమే దీనికి నిదర్శనంగా చెప్పాలి. బడ్జెట్ కేటాయింపులతోనే లక్ష్యాలను సాధించడంలో ప్రభుత్వానికి ఉన్న పట్టుదల చిత్తశుద్ధి అర్థమవుతుంది. మొత్తం మౌలికరంగాన్ని సమూలంగా మార్పు చేస్తూ పై స్థాయికి తీసుకెళ్లానే ప్రభుత్వ ధోరణి ఈ కేటాయింపులతోనే తేటతెల్లమవుతోంది. ఇది దేశ ఆర్థిక రంగానికి కొత్త ఉత్తేజాన్ని ఇవ్వడమే కాకుండా యువతకు భారీగా ఉపాధి అవకాశాల కల్పనకి బాటలు వేస్తూ, విదేశీ మదుపరులకి అనుకూల వాతావరణాన్ని సృష్టిస్తూ, గ్రామీణ భారతానికి సరికొత్త జవజీవాలను అందిస్తుంది.

మౌలిక సౌకర్యాల కల్పనలో అనేక సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఆర్థిక వ్యయ భారాలు, సురక్షిత విధానాలు, అందుబాటులో నైపుణ్యమున్న మానవ వనరులు, తక్షణమే ఉపాధి కల్పన, అనేక మంత్రిత్వశాఖల మధ్య సహకార, సమన్వయం, పర్యావరణ అనుమతులు, చట్టపరమైన, క్రమబద్ధీకరణ సమస్యలు, భూ సేకరణ ప్రాజెక్టులకు ఆమోదం లభించడం, వాటిని సిద్ధం చేయడం వంటి సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉండడంతో మౌలిక సౌకర్యాల కల్పనను పై స్థాయికి తీసుకెళ్లాని ప్రభుత్వం దృఢంగా భావించినా అంత సులభ సాధ్యం కాదని చెప్పాలి. ఇక ఈ లక్ష్యాలను సాధించడానికి, వాటికి కేటాయించిన నిధులను వ్యయం చేయడానికి ప్రభుత్వానికి ఒక పరిమితమైన కాల వ్యవధి మాత్రమే ఉంటుంది. లేదంటే మౌలిక సౌకర్యాల కల్పన అనే మొత్తం వ్యవహారం టేకాఫ్ దశలోకి ప్రవేశించడం కాకుండా, ఆర్ఈ దశ మొదలైనప్పుడైనా టేకాఫ్ జరగకుండా లాండ్ అయ్యే ప్రమాదం ఉంది. ■

# గ్రామీణ వ్యవస్థకు ప్రాధాన్యతనిచ్చిన ప్రగతిదాయక బడ్జెట్




**రాగల ఐదు సంవత్సరాలలో వ్యవసాయ ఆదాయాన్ని రెట్టింపుచేయడం, గ్రామీణ మౌలికసదుపాయాల వృద్ధి, యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు, సామాజిక భద్రత, ఆరోగ్యం, గృహనిర్మాణం, మెరుగైన జీవన ప్రమాణాల సాధనకు మౌలిక సౌకర్యాల వృద్ధి,అభివృద్ధి, సుస్థిరత, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, ప్రజల భాగస్వామ్యంతో ప్రజాసేవ, మెరుగైన రీతిలో ఆర్థికవ్యవస్థ నిర్వహణ, నిజాయితీ పరులను గౌరవించడం ముఖ్య ఉద్దేశాలుగా బడ్జెట్ రూపకల్పన జరిగింది.**

కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ 2017-18 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఫిబ్రవరి1వ తేదీన పార్లమెంటు ముందుంచిన బడ్జెట్ ప్రతిపాదనలు వినూత్న సంస్కరణలకు తెరతీశాయి. బడ్జెట్ ద్వారా గరిష్ఠ ప్రయోజనం సాధించేదిశగా తీసుకున్న నిర్ణయాలు దేశ ఆర్థిక సామాజిక ప్రగతికి మరింతగా దోహదం చేయనున్నాయి. సాధారణంగా ఫిబ్రవరి నెలాఖరులో ప్రవేశపెట్టే బడ్జెట్‌ను నెల రోజులు ముందుకు జరిపి బడ్జెట్ ప్రతిపాదనల సమగ్ర అధ్యయనానికి, పరిశీలనకు, అర్థవంతమైన చర్చకు అవకాశం ఇవ్వడం మేలైన చర్య. అలాగే రైల్వేబడ్జెట్‌ను విడిగా ప్రవేశపెడుతూ వచ్చిన బ్రిటిష్‌కాలం నాటి సంప్రదాయానికి చెల్లుచీటీ పలికి సాధారణ బడ్జెట్‌లోనే దానికి స్థానం కల్పించారు. ప్రణాళిక,ప్రణాళికేతర వ్యయాలను వేరుగా చూపే పద్ధతిని మార్చి బడ్జెట్‌ను మరింత ఆచరణాత్మక పత్రం గా రూపొందించారు. ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచి, ఆర్థికప్రగతిని వేగవంతం చేయడంతో పాటు దీర్ఘకాలిక ఆర్థిక ప్రగతి వ్యూహాలకు పదునుపెట్టే చర్యలూ ఈ బడ్జెట్‌లో తీసుకున్నారు.

ప్రజల జీవన ప్రమాణాలు పెంచడం, యువత, అణగారిన వర్గాల శక్తియుక్తులకు మరింత చేయూతనిచ్చి వారినిప్రోత్సహించడం, అవినీతిని, నల్లధనాన్ని రూపుమాపడం వంటి లక్ష్యాలతో ట్రాన్స్‌ఫామ్, ఎనర్జైజ్, క్లీన్ ఇండియా దిశగా తీసుకున్న చర్యలూ బడ్జెట్‌లో కనిపిస్తాయి.

రాగల ఐదు సంవత్సరాలలో వ్యవసాయ ఆదాయాన్ని రెట్టింపుచేయడం, గ్రామీణ మౌలికసదుపాయాల వృద్ధి, యువతకు నైపుణ్య శిక్షణ,ఉపాధి అవకాశాలు, సామాజిక భద్రత, ఆరోగ్యం, గృహనిర్మాణం, మెరుగైన జీవన ప్రమాణాల సాధనకు మౌలిక సౌకర్యాల వృద్ధి,అభివృద్ధి, సుస్థిరత, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, ప్రజల భాగస్వామ్యంతో ప్రజాసేవ, మెరుగైన రీతిలో ఆర్థికవ్యవస్థ నిర్వహణ, నిజాయితీ పరులను గౌరవించడం ముఖ్య ఉద్దేశాలుగా బడ్జెట్ రూపకల్పన జరిగింది.

ప్రపంచవ్యాప్తంగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ప్రవాహం ఐదు శాతం తగ్గగా మన దేశంలో మాత్రం 36 శాతం పెరుగుదల కనిపించింది. ఈ ఏడాది జనవరి నాటికి విదేశీ మారకద్రవ్య నిల్వలు 360

**రేవూరు ఉమామహేశ్వరరావు,** ప్రిన్సిపాల్, రచన కాలేజ్ ఆఫ్ జర్నలిజం, హైదరాబాద్.
E-mail: umarevuru@yahoo.com

బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఇది మన ఆర్థిక వ్యవస్థ బలాన్ని సూచిస్తున్నది.

2017-18 బడ్జెట్‌లో రైల్వే పద్దు 22 శాతం పెరుగుదలతో 1.31 లక్షల కోట్లకు చేరింది. మూడున్నర వేలకిలోమీటర్ల కొత్తరైలు మార్గనిర్మాణానికీ, ఐదు సంవత్సరాలలో లక్ష కోట్ల రూపాయల కార్పస్‌ఫండ్‌తో రైలు భద్రతా నిధిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు., లక్షా 31వేల కోట్లతో అభివృద్ధి పెట్టుబడి వ్యయానికి కేటాయింపులు చేశారు. ఇందులో ప్రభుత్వం 55 వేల కోట్ల రూపాయలు సమకూర్చనున్నది. 2020 నాటికి బ్రాడ్‌గేజ్ నెట్ వర్క్‌లోని అన్ని కాపలా లేని లెవల్ క్రాసింగ్‌ల తొలగింపు, 2019 నాటికి అన్ని రైల్వే బోగీలలోనూ బయోటాయిలెట్ల ఏర్పాటుతో పాటు, దివ్యాంగులకు ఉపయోగపడేలా 500 రైల్వేస్టేషన్లను ఆధునీకరించనున్నారు. ఈ బడ్జెట్‌లో దక్షిణమధ్య రైల్వేకు 5,135 కోట్ల రూపాయల నిధుల కేటాయింపు జరిగింది.

గ్రామీణాభివృద్ధికి, వ్యవసాయ రంగానికి ఈ బడ్జెట్‌లో పెద్దపీట వేశారు. ఈ రంగాలకు గత ఏడాది కంటె 24 శాతం ఎక్కువగా లక్షా 87 వేల 233 కోట్ల రూపాయలు కేటాయించారు.

రాగల ఐదేళ్లలో రైతుల ఆదాయం రెట్టింపు చేయాలన్న ప్రభుత్వ సంకల్పంలో భాగంగా ప్రతి బొట్టు నీటికి అదనపు పంట సాధించే లక్ష్యంతో మైక్రో ఇరిగేషన్ ఫండ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు 5వేల కోట్ల రూపాయల కార్పస్‌తో నాబార్డ్ ఒక నిధిని ఏర్పాటు చేస్తుంది. గ్రామీణ ప్రాంతాలలో పాడిపరిశ్రమాభివృద్ధి చెందితే అది గ్రామ సీమలలో రైతుకుటుంబాలకు అదనపు రాబడిని సమకూరుస్తుంది. ఈ లక్ష్యంతో పాడి పరిశ్రమాభివృద్ధికి నాబార్డ్ మూడేళ్లలో 8 వేల కోట్ల రూపాయలతో మౌలిక సదుపాయాల కల్పన నిధిని ఏర్పాటు చేయనుంది. రెండువేల కోట్లరూపాయల మూలధన నిధితో దీనిని ఏర్పాటు చేస్తారు. వ్యవసాయ, అనుబంధ రంగాలకు మొత్తంగా 58,663 కోట్ల రూపాయలు కేటాయించారు.

వ్యవసాయదారులకు రుణసదుపాయాన్ని మరింత విస్తరిస్తూ 2017-18 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో దేశవ్యాప్తంగా పది లక్షల కోట్ల రూపాయల మొత్తాన్ని రుణాల మంజూరుకు వినియోగించాలని నిర్ణయించారు. గత ఏడాది కంటే ఇది లక్ష కోట్ల రూపాయలు ఎక్కువ. రైతులకు సబ్సిడీపై ఏడుశాతం వార్షిక వడ్డీతో మూడు లక్షల రూపాయాల లోపు పంట రుణాలను మంజూరు చేస్తారు. నిర్ణీత గడువులోగా సకాలంలో చెల్లించిన వారికి ప్రోత్సహకంగా మూడు శాతం అదనపు సబ్సిడీని ప్రభుత్వం మంజూరు చేస్తుంది. దీనితో సకాలంలో తిరిగి పంటరుణాన్ని చెల్లించే రైతుకు పంట రుణం కేవలం నాలుగుశాతం వడ్డీకే లభించినట్లవుతుంది. వ్యవసాయ రుణాల మంజూరులో వెనుకబడిన జమ్ము కశ్మీర్,ఈశాన్య రాష్ట్రాల రైతులకు మరింతగా రుణసదుపాయం అందేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నారు.

నలభైశాతం మంది చిన్న, సన్నకారు రైతులు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల నుంచి రుణాలు తీసుకుంటుంటారు. ఇందుకు సంబంధించి 63 వేల సహకార పరపతి సంఘాలను జిల్లా సహకార బ్యాంకుల కోర్ బ్యాంకింగ్ వ్యవస్థతో కంప్యూటరైజేషన్ ద్వారా అనుసంధానం చేయనున్నారు. దీనితో రైతులకు మరింత మెరుగుగా సత్వరం రుణసదుపాయం అందించడానికి వీటికి వీలు కలుగుతుంది. ఇందుకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక తోడ్పాటుతో రాగల మూడేళ్లలో 1900 కోట్ల రూపాయల వ్యయంతో కంప్యూటరైజేషన్‌ను చేపట్టనున్నారు. పంటలకు గిట్టుబాటు ధర లభించని సమయంలో మార్కెట్ ధరలలో జోక్యం చేసుకునే పథకానికి 200 కోట్ల రూపాయలు కేటాయించారు. విదేశాలనుంచి దిగుమతి అయ్యే ఫాస్ట్ ఫుడ్ ఉత్పత్తులనుంచి దేశీయ ఆహార పరిశ్రమను కాపాడేందుకు జీడిపప్పు (రోస్టెడ్,సాల్ట్) దిగుమతిపై 30 శాతం ఉన్న కస్టమ్స్ సుంకాన్ని 45 శాతానికి పెంచారు.

కేంద ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను 2016-17లో 30 శాతం పంట ప్రాంతానికి అమలు చేస్తే 2017లో దానిని 40 శాతానికి.2018-19లో 50 శాతానికి విస్తరింప చేయాలని నిర్ణయించారు. 2016-17 బడ్జెట్ అంచనాలలో ఈ పథకానికి ఐదువేల కోట్ల రూపాయలు కేటాయించగా, సవరించిన అంచనాలలో అది 13,240 కోట్ల రూపాయలకు పెరిగింది.గత బకాయిలు కూడా చెల్లించాల్సి రావడంతో ఇది పెరిగింది. 2017-18 ఆర్థిక సంవత్సరానికి ఈ పథకానికి 9 వేల కోట్ల రూపాయలు ప్రతిపాదించారు. 2015 ఖరీఫ్ సీజన్‌లో బీమా మొత్తం విలువ 69 వేల కోట్లరూపాయలు కాగా, 2016 ఖరీఫ్ నాటికి ఈ మొత్తం లక్షా 41 వేలా 625 కోట్లకు పెరిగింది.

భూసార పరీక్షలు నిర్వహించి రైతుకు తన భూసారానికి సంబంధించిన వివరాలు అందజేస్తే అందుకు అనుగుణంగా రైతు ఎరువులు వాడి దిగుబడి పెంచుకోవడానికి వీలు కలుగుతుంది. అయితే భూసార పరీక్షలలో జాప్యం జరిగితే రైతుకు ప్రయోజనం ఉండదు. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకుని కృషి విజ్ఞాన కేంద్రాలలో మినీ భూసారపరీక్షా ప్రయోగశాలలను ఏర్పాటు చేయనున్నారు. నాబార్డ్ ఆధ్వర్యంలో

దీర్ఘకాలిక ఇరిగేషన్ ఫండ్ ఏర్పాటై ఉంది. దీనికి ప్రధానమంత్రి మరో 20 వేల కోట్ల రూపాయల మద్దతును ప్రకటించారు. దీనితో ఈ కార్పస్ 40 వేల కోట్ల రూపాయలకు చేరుతుంది. మార్కెట్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతం ఉన్న నేషనల్ అగ్రికల్చరల్ మార్కెట్ (ఈ-నామ్)ను 285 మార్కెట్లనుంచి 585 ఎపిఎంసిలకు విస్తరించనున్నారు.

## గ్రామీణాభివృద్ధి...

కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు తమ బడ్జెట్లనుంచి కేటాయించేమొత్తం, స్వయం సహాయక బృందాలకు బ్యాంకు లింకేజి వంటివి కలుపుకుంటే ఏటా మూడు లక్షల కోట్ల రూపాయల వరకు గ్రామసీమలపై ఖర్చుచేస్తున్నారు. ఈ నిధుల వినియోగంలో మరింత పారదర్శకతను సాధిస్తూ 2019లో మహాత్మాగాంధీ 150వ జయంతి నాటికి మిషన్ అంత్యోదయ కింద కోటి కుటుంబాలను పేదరికం నుంచి బయటపడేయాలని, 50 వేల గ్రామ పంచాయితీలను పేదరిక రహిత పంచాయితీలుగా తిర్చిదిద్దాలని సంకల్పం చెప్పుకున్నారు.

గ్రామీణాభివృద్ధికి మరింత ఊతం ఇచ్చే మహాత్మాగాంధీ జాతీయగ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎ) కింద గ్రామాలలో ఉపాధి అవకాశాలను పెంచడంతోపాటు ఆస్తుల కల్పనకు అవకాశం కలుగుతుంది. ఇందుకు అనుగుణంగా 2017-18 బడ్జెట్లో ఈ కార్యక్రమానికి 48 వేల కోట్ల రూపాయలు కేటాయించారు. 2016-17లో ఇది 37వేల కోట్ల రూపాయలు మాత్రమే. ఎం.ఎన్.ఆర్.ఇ.జి.ఎ కింద 2017 మార్చి నాటికి పది లక్షల పొలం కుంటల తవ్వకం పూర్తి కానుంది. 2017-18లో మరో ఐదు లక్షల పొలం కుంటలను ఈ పథకం కింద తవ్వుతారు. దీనివల్ల గ్రామ పంచాయితీలలో కరువు ఛాయలు లేకుండా చూడడానికి వీలు కలుగుతుంది. ఈ పథకం కింద పనులు కల్పించడంతోపాటు రైతు ఉత్పత్తి పెంచే చర్యలూ ఇందులో ఉన్నాయి. ఉపాధి హామీ పథకం కింద చేపట్టేపనులలో పారదర్శకత సాధించాడానికి ఈ పథకం కింద ఆస్తులకు జియోట్యాగింగ్ చేస్తున్నారు. అలాగే ఈ పనులకు అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా పెద్ద ఎత్తున వినియోగించేందుకు ప్రయత్నాలు చేపడుతున్నట్టు ఆర్థిక మంత్రి తెలిపారు.

గ్రామీణ మహిళల్లో సాధికారతను పెంచేందుకు మహిళా శక్తి కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. దేశవ్యాప్తంగా ఆర్సెనిక్ ఫ్లోరైడ్ బాధిత 28 వేల నివాస ప్రాంతాలకు రాగల నాలుగేళ్లలో రక్షిత మంచినీటిని సరఫరా చేసేందుకు నిశ్చయించారు. 2022 నాటికి ఐదు లక్షల మందికి తాపీ పనిలో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో తొలి విడతగా 20 వేల మందికి శిక్షణనివ్వనున్నారు.

## స్వచ్ఛతకు చేయూత.....

పరిశుభ్రమైన దేశంతోనే ప్రజల ఆరోగ్యం పదిలంగా ఉంటుంది. ఈ లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా స్వచ్ఛభారత్ కార్యక్రమాలను చేపడుతోంది. పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖకు 2017-18 బడ్జెట్లో 34,212 కోట్ల రూపాయలు కేటాయిస్తే అందులో స్వచ్ఛభారత్ కార్యక్రమం అమలుకు 2300 కోట్ల రూపాయలు కేటాయించారు. తాగునీరు, పారిశుధ్య మంత్రిత్వశాఖకు 20,011 కోట్లరూపాయలు కేటాయించారు. ఇందులో స్వచ్ఛభారత్ గ్రామీణ్‌కు 13,948 కోట్ల రూపాయలు కేటాయించారు. స్వచ్ఛభారత్ మిషన్ రూరల్‌కు గత 2016-17 లో సవరించిన అంచనాల ప్రకారం జరిగిన కేటాయింపులు 10,500 కోట్ల రూపాయలు .

## గ్రామీణ రహదారులు

గ్రామీణ రహదారుల అభివృద్ధి గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు చోదక శక్తిగా ఉపయోగపడుతుంది. గ్రామీణ ఉత్పత్తులు సత్వరం మార్కెట్ చేరడానికి ఈ రహదారులు ఉపయగపడతాయి. ఇందుకు పెద్దఎత్తున గ్రామీణ రహదారుల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నారు. 2011-14 సంవత్సరాల్లో సగటున రోజుకు 73 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం జరగగా 2016-17నాటికి దానిని సగటున రోజుకు 133 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి పెంచారు. 2017-18లో ఈ పథకం కింద 19 వేల కోట్ల రూపాయలను ప్రతిపాదించారు. మొత్తం రాష్ట్రాలవాటా కూడా కలుపుకుంటే ప్రధానమంత్రి గ్రామ్‌సడక్ యోజన కింద 2017-18 సంవత్సరంలో 27 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయనున్నారు. ఇది గ్రామీణ ప్రాంత రవాణా సదుపాయాల రంగంలో గణనీయమైన మార్పును తీసుకురానుంది. 2019 నాటికి గ్రామీణ ప్రాంతాలలో 2.23 లక్షల కిలోమీటర్ల రహదారులను నిర్మించి 65 వేల ఆవాసాలను అనుసంధానిస్తారు.

గ్రామీణప్రాంతాలలో కచ్చా ఇళ్లలో ఉంటున్న వారికి సరైన గృహ వసతి కల్పించేందుకు 2019 నాటికి కోటి ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం ప్రధానమంత్రి ఆవాస్ యోజన -గ్రామీణ్ పథకం కింద 2016-17లో 15వేల కోట్లరూపాయలు కేటాయించగా 2017-18 బడ్జెట్లో దీనిని 23 వేలకోట్ల రూపాయలకు పెంచారు.

## జాతీయ రహదారుల అభివృద్ధి

జాతీయ రహదారులు దేశ ఆర్థిక వ్యవస్థకు జీవనాడులుగా చెబుతారు. జాతీయ రహదారులు అభివృద్ధి చెందితే పారిశ్రామిక రంగం పుంజుకుంటుంది. ఉత్పత్తులు సత్వరం మార్కెట్ చేరడానికి వీలుకలుగు

తుంది. 2017-18 బడ్జెట్‌లో జాతీయ రహదారులకు కేటాయింపులను 64,900 కోట్లకు పెంచారు. 2016-17 బడ్జెట్‌లో ఇది 57,976 కోట్లు.

మౌలిక సదుపాయాల అభివృద్ధికి కూడా బడ్జెట్‌లో ప్రాధాన్యత లభించింది. ఈ రంగానికి 3.96 లక్షల కోట్ల రూపాయలు కేటాయించారు. 2016-17లో సవరించిన అంచనాలు 3,58,634 కోట్లు. మల్టీమోడల్ లాజిస్టిక్ పార్కులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటారు.

ప్రభుత్వ రంగ సంస్థల వాటాల ఉప సంహారణ ద్వారా 72,500 కోట్ల రూపాయలు సమకూర్చుకోవాలని నిర్ణ యించారు. ప్రపంచస్థాయి పి.ఎస్.యులతో పోటీపడేలా దేశీయ ప్రభుత్వ రంగ సంస్థలను తీర్చిదిద్దాలని నిర్ణయించారు. ప్రభుత్వరంగ బ్యాంకులకు తాజా మూలధనం కింద పదివేల కోట్ల రూపాయలను సమకూర్చ నున్నారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఎక్కువభాగం ఆటోమేటిక్ మార్గంలో వస్తున్నందున విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డును రద్దు చేయాలని నిర్ణయించారు. రక్షణ రంగానికి పెన్షన్లు మినహా 2,74.114 కోట్ల రూపాయలు కేటాయించారు. పర్యావరణ శాఖకు 2,250.34 కోట్ల రూపాయలు కేటాయించారు.

### గ్రామీణ విద్యుదీకరణ

2018 మే ఒకటి నాటికి నూరు శాతం గ్రామీణ విద్యుదీకరణ సాధించే లక్ష్యంతో పనులు ముమ్మరంగా సాగుతు న్నాయి. ఈ లక్ష్యం సాకారమయ్యేందుకు 2017-18లో దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామ్‌జ్యోతి యోజనకు కేటాయింపులను 4814 కోట్ల రూపాయలకు పెంచారు. నూరు శాతం విద్యుదీకరణతో గ్రామాలలో కుటీర పరిశ్రమలు, లఘు పరిశ్రమలు పుంజుకోవ డానికి అవకాశం ఉంటుంది.

2017-18 చివరి నాటికి ఒకటిన్నర లక్ష గ్రామ పంచాయితీలకు ఒ.ఎఫ్.ఎన్ కింద హై స్పీడ్ బ్రాడ్ బ్యాండ్ సదుపాయం కల్పించనున్నారు. డిజిటల్ టెక్నాలజీ ద్వారా టెలి మెడిసిన్, విద్య, నైపుణ్యాల కల్పనకు డిజిగావ్ కార్యక్రమాన్ని ప్రారంభించ నున్నారు.

దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన, నేషనల్ రూరల్ లైవ్లీ హుడ్ మిషన్‌కింద కేటాయింపులను 2017-18లో 4500 కోట్ల రూపాయలకు పెంచాలని నిర్ణయించారు. గ్రామీణ ప్రాంతాలలో నైపుణ్యాభివృద్ధి, జీవనోపాధి కల్పనకు ఈ నిధులను వినియోగిస్తారు. ప్రధానమంత్రి కౌశల్ కేంద్రాలను 600 కు పైగా జిల్లాలకు విస్తరించనున్నారు. దేశవ్యాప్తంగా వంద ఇండియా ఇంటర్నేషనల్ స్కిల్ సెంటర్లు ఏర్పాటు చేస్తారు. సంకల్ప్‌పథకం కింద మూడున్నర కోట్ల మంది యువతకు జీవనోపాధి నైపుణ్యాలు కల్పిస్తారు.

ఇక ఈ బడ్జెట్‌ను గమనించినపుడు 2017-18లో రవాణా రంగానికి సంబంధించి రైల్, రోడ్, జల రవాణా రంగాలకు కలిపి 2లక్షల 41 వేలా 837 కోట్ల రూపాయలు కేటాయించినట్టయింది. రవాణా రంగంలో పెద్దమొత్తంలో ఖర్చు చేయడం వల్ల ఆర్థిక కార్యకలాపాలు ఊపందుకుని ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంది. ఒకటిన్నర లక్షల గ్రామ పంచాయితీలకు వేగవంతమైన బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ కనెక్షన్లు కల్పించనున్నారు. రెండు వేల కిలోమీటర్ల మేర కోస్తా తీర ప్రాంత అనుసంధాన రోడ్లను నిర్మాణం, అభివృద్ధి కోసం గుర్తించారు.

### ఆరోగ్య రంగం....

ఆరోగ్య పరిరక్షణ కోసం వైద్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకు రావడానికి కేంద్ర ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో కేటాయింపులు పెంచింది. 2016-17 సంవత్సరం కేటాయింపులతో పోలిస్తే 2017-18 బడ్జెట్‌లో 23 శాతం కేటాయింపులను ఈ రంగానికి పెంచారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖకు 2016-17లో 39,688 కోట్ల రూపాయలు కేటాయించగా, 2017-18 బడ్జెట్‌లో దీనిని 48,853 కోట్ల రూపాయలకు పెంచారు. దీనికితోడు శిశు, బాలింత మరణాల రేటును గణనీయంగా తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోనున్నట్టు ప్రకటించింది. 2014లో ప్రతి వెయ్యి జననాలకు 39 గా ఉన్న శిశు మరణాల రేటును 2019 నాటికి 28కి తగ్గించేందుకు చర్యలు చేపడతారు. అలాగే ప్రతి లక్ష శిశు జననాలకు 2011-13లో 167 గా నమోదైన బాలింతల మరణాల రేటును వందకు తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ఏడాది కాలా అజర్, బోధకాలు వ్యాధులను, వచ్చే ఏడాది చివరి నాటికి కుష్టు వ్యాధిని, 2025 నాటికి క్షయ వ్యాధిని నిర్మూలించాలని లక్ష్యాన్ని నిర్ణయించుకున్నారు. సీనియర్ సిటిజన్లకు ఆధార్ ఆధారిత ఆరోగ్య కార్డులు ఇవ్వాలని నిర్ణయించారు.

షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలు, మైనారిటీల సంక్షేమానికి నిధుల కేటాయింపు పెంచారు. దళితుల సంక్షేమానికి 52,393 కోట్ల రూపాయలు కేటాయించారు. గిరిజన సంక్షేమ శాఖకు 31,920 కోట్ల రూపాయలు కేటాయించారు. మైనారిటీల సంక్షేమ మంత్రిత్వశాఖకు ఈ బడ్జెట్‌లో 4,195.48 కోట్ల రూపాయలు కేటాయించారు. గత ఏడాది కంటే ఇది 368.23 కోట్లు ఎక్కువ. మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖకు 22,095 కోట్ల రూపాయలు కేటాయించారు. 2016-17లో ఇది 17,640 కోట్ల రూపాయలు మాత్రమే.

శాస్త్ర సాంకేతిక మంత్రిత్వశాఖకు 37,435 కోట్ల రూపాయలను బడ్జెట్‌లో

ప్రతిపాదించారు. ఇందులో అంతరిక్ష పరిశోధన రంగానికి అదనంగా వెయ్యి కోట్ల రూపాయలు సమకూరుస్తారు. ముడి చమురు నిల్వలు పెంచేందుకు వ్యూహాత్మక విధానానికి రూపకల్పన చేస్తారు. ట్రేడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎక్స్‌పోర్ట్ పథకాన్ని కొత్త ఆర్థిక సంవత్సరంలో ప్రారంభిస్తారు. ఐ.ఆర్.సిటిసి వంటి రైల్వే సంస్థలను స్టాక్ మార్కెట్‌లో నమోదు చేస్తారు. ప్రధానమంత్రి ముద్రా యోజన కింద రుణాల పంపిణీ లక్ష్యాన్ని 2.44 లక్షల కోట్లుగా నిర్ణయించారు.

పర్యాటక రంగానికి1840.77 కోట్ల రూపాయలు సమకూరుస్తారు. స్పాట్ మార్కెట్, డెరివేటివ్, కమాడిటీస్ మార్కెట్‌లను అనుసంధానం చేసేందుకు సంబంధించిన అంశాలను పరిశీలించేం దుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తారు.

ఇక వ్యక్తిగత ఆదాయ పన్నుకు సంబంధించి ప్రభుత్వం మధ్యతరగతి ప్రజలకు మేలు చేకూర్చే పన్ను ప్రతిపాదనలు చేసింది. పన్ను చెల్లించాల్సిన ఆదాయం రెండున్నర లక్షలు దాటి ఐదుల లక్షల రూపాయల మధ్యలో ఉంటే దానిపై పన్నును ఇప్పటివరకు ఉన్న పది శాతానికి బదులుఆ 5 శాతానికి తగ్గించారు.

చెక్‌బౌన్స్ కేసుల సత్వర విచారణకు నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్ చట్టానికి సవరణలు తీసుకురానున్నారు. నిర్దిష్ట మొత్తానికి మించిన ప్రభుత్వ వసూళ్లను అన్నింటినీ డిజిటల్ మార్గంలో స్వీకరిం చేందుకు చర్యలు చేపట్టనున్నారు.

రిజర్వు బ్యాంకు పరిధిలో ప్రస్తుతం ఉన్న చెల్లింపులు, పరిష్కారాల వ్యవస్థ, నియంత్రణల బోర్డు స్థానంలో చెల్లింపుల నియంత్రణ బోర్డును ఏర్పాటు చేయను న్నారు.

రాజకీయ పార్టీల విరాళాల సేకరణలో పారదర్శకతను సాధించేందుకు ఇకనుంచి రెండు వేల రూపాయలు దాటిన విరాళాలను చెక్కు రూపంలో లేదా డిజిటల్ లావాదేవీల రూపంలో, లేదా ఎలక్టోరల్ బాండ్ల రూపంలో చెల్లించాల్సి ఉంటుంది.

విద్యారంగాన్ని బలోపేతం చేసే దిశగా పలు చర్యలూ ఇందులో ఉన్నాయి. పాఠశాల విద్య, అక్షరాస్యతకు 46,356 కోట్లు, ఉన్నత విద్యకు 33,329 కోట్లు కేటాయించారు. ఒకేషనల్ విద్యకు 2200 కోట్లు కేటాయించారు. స్వయం పథకం ద్వారా 350 ఆన్‌లైన్ కోర్సులను అందుబాటులోకి తెస్తారు.స్కిల్ అక్విజిషన్ అండ్ నాలెడ్జ్ అవేర్‌నెస్ ఫర్ లైవ్లీహుడ్ ప్రమోషన్ ప్రోగ్రామ్ (సంకల్ప్) ను 2017-18లో ప్రారంభించనున్నారు. ఇందుకు నాలుగు వేల కోట్ల రూపాయలు కేటాయించి మూడున్నరకోట్ల మంది యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇస్తారు.

2017-18లో ప్రభుత్వంపై సబ్సిడీల భారం 2,72,276 కోట్ల రూపాయలు ఉండనుంది. ఇది దీని ముందు సంవత్సరం కంటె నాలుగున్నర శాతం ఎక్కువ. ఇందులో పెట్రోలియం సబ్సిడీకింద 25 వేల కోట్ల రూపాయలు, ఆహార సబ్సిడీ కింద లక్షా 45 వేలా 338.6 కోట్ల రూపాయలు, ఎరువుల సబ్సిడీ కింద ఏడు లక్షల కోట్ల రూపాయలు భరించవలసి ఉంటుంది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు 4.11 లక్షల కోట్ల రూపాయలను వివిధ పథకాల కింద బదిలీ చేయనున్నారు.

బడ్జెట్‌లో పన్నులు కట్టని భారతీయుల గురించిన గణాంకాలూ ఉ న్నాయి. దేశంలో ఆదాయపన్ను రిటర్నులు దాఖలు చేస్తున్న వేతన జీవులు 1.7 కోట్ల మంది మాత్రమే. అసంఘటిత రంగంలో సంస్థలు 5.8 కోట్లుంటే రిటర్నులు దాఖలు చేస్తున్నవి 1.8 కోట్లు మాత్రమేనని లెక్కతేలింది. నమోదైన సంస్థలు 18.9 లక్షలు ఉంటే రిటర్నులు సమర్పిస్తున్నవి 5.9 లక్షలు మాత్రమే ఉన్నాయి. లాభాలు లేని లేదా నష్టాలలో ఉంటున్నామంటున్న సంస్థలు 2.8 లక్షల వరకు ఉన్నట్టు అంచనా.

ఒకానొక అంచనా ప్రకారం కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు పన్నుల రూపంలో వసూలు చేస్తున్న మొత్తం జిడి.పిలో 18 శాతంగా మాత్రమే ఉంటోంది.


దేశంలో అభివృద్ధి పెద్దఎత్తున జరగడానికి అవసరమైన నిధులు సమకూరాలంటే పన్ను పరిధిలోకి వచ్చే వారి సంఖ్య, సంస్థల సంఖ్య గణనీయంగా పెరగవలసి ఉంది. పన్ను ఎగవేత దారుల ఆట కట్టించడం ద్వారా కొంత వరకు రాబడి పెంచుకోవడానికి అవకాశం ఉంది. అందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు ప్రారంభించింది.

గ్రామీణ, మౌలిక సదుపాయాల రంగాన్ని పటిష్టం చేసుకుంటూ, ఉపాధి కల్పన మార్గాలను మరింత మెరుగుపరిచే చర్యలు బడ్జెట్‌లో చేపట్టారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తూ ఉత్పాదకత పెంపు ద్వారా రైతుకు మరింత లాభం చేకూర్చే విధంగా 2017-18 బడ్జెట్ ప్రతిపాదనలు సాగాయి. అలాగే పేదరికాన్ని రూపుమాపడానికి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడానికి బడ్జెట్‌లో ప్రాధాన్యతనిచ్చారు.

సంస్కరణల పథంలో దేశాన్ని ముందుకునడిపిస్తూ, వివిధ రంగాలను బలోపేతం చేస్తూ కేంద్రం ప్రవేశపెట్టిన 2017-18 బడ్జెట్‌తో మరింత ప్రగతికి దోహద పడగలదని భావించవచ్చు.

■

# మౌలిక సదుపాయాల రంగం - బడ్జెట్ కేటాయింపులు



**ఈ బడ్జెట్‌లో మొట్టమొదటి సారిగా అందరికీ అందుబాటులో గృహాల పేరిట గృహ రంగానికి మౌలిక వసతుల హోదా కల్పించారు. ఇది చాలా ప్రయోజనాత్మకమైన మార్పు. గృహ వసతి ప్రతి ఒక్కరికి అందుబాటులోనికి వచ్చినట్లయితే వారి జీవన ప్రమాణాలు పెరుగుతాయి. మౌలిక సదుపాయాలు కల్పిస్తే ఆర్థిక కలాపాలు పెరుగుతాయి. ఉత్పాదకత పెరుగుతుంది. జీవన ప్రమాణాలు, నాణ్యత మెరుగవుతాయి. తద్వారా, ఉపాధి అవకాశాలు పెరిగి ఆదాయాలు పెరుగుతాయి.**

సమర్థత, ఉత్పాదకత మరియు జీవన నాణ్యత ప్రధాన లక్ష్యాలుగా 2017 - 2018 కేంద్ర బడ్జెట్ మౌలిక సదుపాయాల రంగానికి పెద్ద పీట వేసింది. అన్ని రంగాల్లో వృద్ధిని పరుగులు పెట్టించాలంటే, మొట్ట మొదటగా మౌలిక రంగంపై దృష్టి సారించాలి. మౌలిక రంగంలో వసతులు అనగా; రవాణా రంగం (రోడ్, రైల్వే, విమాన మరియు నౌకా రవాణ) టెలికాం రంగం, ఎనర్జీ రంగం, ఎలెక్ట్రోనిక్ ఉత్పత్తుల తయారి, ఎగుమతులకై మౌలిక సదుపాయలు మరియు రియల్ ఎస్టేట్ రంగాలలో వసతులు కల్పించడము. ఈ రంగంలో అభివృద్ధితో పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు గ్రామీణాభివృద్ధిని సాధించు కోగలం. మొట్టమొదటిసారిగా స్వతంత్ర్య భారతదేశములో రైల్వే బడ్జెట్ సాధారణ బడ్జెట్‌లో విలీనమైంది. రైల్వే రంగం స్వయం ప్రతిపత్తిని కలిగియున్నా అది మౌలిక వసతుల్లోనే ఒక వసతిగా చూడవచ్చును. రైల్వే బడ్జెట్ విలీనము వలన మౌలిక వసతులకు ఎక్కువ మొత్తము నిధులు కేటాయించినట్లుగా ఈ బడ్జెట్లో కనిపిస్తుంది. అయినప్పటికి రైల్వే కేటాయింపులు ప్రక్కన పెట్టి చూసినట్లయితే మిగిలిన రంగాల్లో కేటాయింపులు 2016 - 2017 బడ్జెట్ కంటే ఎక్కువగానే ఉన్నాయి. మౌలిక సదుపాయాలు కల్పిస్తే ఆర్థిక కలాపాలు పెరుగుతాయి. ఉత్పాదకత పెరుగుతుంది. జీవన ప్రమాణాలు, నాణ్యత మెరుగవుతాయి. తద్వారా, ఉపాధి అవకాశాలు పెరిగి ఆదాయాలు పెరుగుతాయి. నగరంలో మౌలిక వసతులకై కేంద్రప్రభుత్వము స్మార్ట్ సిటీ, అమృత్ (AMRUT) మరియు అందరికి గృహము మొదలైన పథకాలను అమలు చేస్తున్నది. అదే విధంగా గ్రామీణ మౌలిక వసతులకై ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకము అమలులో ఉన్నది.

**రవాణా రంగము:**

కేంద్ర ప్రభుత్వం ఈ బడ్జెట్ ద్వారా తీర ప్రాంతాల్లో రోడ్డు విస్తరణ, టైరు - 2 పట్టణాల్లో విమానాశ్రయాల నిర్మాణము, పల్లెలు మరియు రేవుల అనుసంధానం మరియు నగర రవాణా సౌకర్యాలను ప్రధానాంశాలుగా ప్రకటించింది. రవాణా రంగము కేటాయింపులు చూసినట్లయితే ఒక సమగ్ర పద్ధతిలో రైలు, రోడ్డు, విమాన మరియు నౌకాయానాలను కలుపుతూ వేటి ప్రాముఖ్యత వాటికి చూపుతూ వాటిలో పెట్టుబడులను ప్రోత్సహించే విధంగా

**ప్రొఫెసర్ వి. ఉషాకిరణ్,** డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
E-mail: usha_ou@yahoo.co.in

ఉన్నాయి. వీటన్నిటి అభివృద్ధికై ఆర్థిక మంత్రి కేటాయించిన నిధులు రూ. 2,41,381 కోట్లు. ఇందులో రైల్వేలకు రూ. 1,31,000 కోట్లుకాగా జాతీయ రహదారులకు రూ. 64,900 కోట్లు కేటాయింపు జరిగింది. తీర ప్రాంత రహదారులు 2000 కి.మీ. మేర గుర్తించిన వాటిని నిర్మించడానికై బడ్జెట్ నిధులు వాడతారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన క్రింద 1,40,000 కి.మీ. వరకు 2014 – 2015 నుండి నేటి వరకు రోడ్డు నిర్మాణము జరిగింది. బహుళ నమూనా రవాణా రంగం మరియు లాజిస్టిక్ పార్కులు కూడా ఈ రంగ అభివృద్ధికి తోడ్పడుతాయి.

ఎయిర్ పోర్ట్స ఆథారిటి ఆఫ్ ఇండియా చట్టాన్ని (Airport Authority of India Act) సవరించి విమానాశ్రయాలకు (2 టైరు నగరాల్లో) సంబంధించిన భూములను అమ్మి వచ్చిన వనరులతో PPP (ప్రైవేటు పబ్లిక్ పార్టనర్షిప్) నమూనాలో వాటిని నిర్వహిస్తామని బడ్జెట్‌లో ప్రతిపాదించారు.

**టెలికామ్ రంగం :**

టెలికామ్ రంగంలో స్పెక్ట్రమ్ అమ్మకాలవలన వాటి కొరత చాలా వరకు తగ్గిపోయింది. అందువలన మొబైల్ బ్రాడ్ బ్యాండు మరియు డిజిటల్ ఇండియా కార్యక్రమాలు మారుమూల పల్లెజనాలకు కూడా అందించగలుగుతున్నారు. భారత్ నెట్ పథకానికి రూ.10,000 కోట్లు కేటాయించారు. దీని ద్వారా 1,50,000 గ్రామ పంచాయితీలకు డిజిటల్ సేవలు మరియు వైఫై సేవలు అందుతాయి. డిజిగోవాన్ పథకము ద్వారా టెలీమెడిసిన్, విద్య మరియు నైపుణ్య శిక్షణ అందించాలని కేంద్ర ప్రభుత్వ సంకల్పము. ఈ పథకాన్ని సరిగ్గా అమలు చేసినట్లయితే దేశంలో ఒక విప్లవాత్మకమైన మార్పుకు తెరలేస్తుంది.

**ఎనర్జీ (శక్తి) రంగము :**

ప్రస్తుతము ఇండియాలో మూడు స్ట్రాటజిక్ క్రూడ్ ఆయిల్ నిల్వ కేంద్రాలు నిర్మించబడినాయి. ఈ బడ్జెట్ ద్వారా మరో రెండు కేంద్రాలను నిర్మించి నిల్వ సామర్థ్యాన్ని 15.33 MMT వరకు పెంపొందించాలని ప్రతిపాదించారు. సోలార్ శక్తిని కూడా మరో 20,000 మెగావాట్ల సామర్థ్యము పెంచాలని బడ్జెట్‌లో ప్రతిపాదించారు . దీనివలన ఎనర్జీ రంగంలో ఉత్పాదకత పెరిగి ఇతర రంగాల్లో ఆర్థిక కలాపాలు పెరుగుతాయి.

**ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల తయారీ రంగము:**

ఈ రంగములో గత రెండేళ్ళలో 250 పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయి. పెట్టుబడుల మొత్తము రూ. 1.26 లక్షల కోట్లు. ఈ పెట్టుబడులను ప్రోత్సహించడానికి M-SIPS మరియు EDF మొదలైన ప్రోత్సాహక పథకాలకు మునుపెన్నడూ ఇవ్వని విధంగా పెద్ద మొత్తములో రూ. 745 కోట్లు కేటాయించారు. ఇంత మొత్తము ప్రోత్సాహకాలకి ఇవ్వడము ద్వారా ఈ రంగము చాలా అభివృద్ధి చెందే అవకాశము ఉన్నది.

**ఎగుమతులకు మౌలిక సదుపాయాలు :**

ప్రస్తుత పోటీ ప్రపంచములో ఎగుమతులు పెంచుకోవడానికి సరైన వసతులు కావాలి. ఈ దిశగా, కేంద్రము ఒక క్రొత్త పథకాన్ని TIES అనగా ట్రేడ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫర్ ఎక్స్పోర్ట్సు స్కీం 2017 – 2018లో ప్రారంభిస్తుంది. దీని ద్వారా ఎగుమతులకు కావల్సిన మౌలిక వసతులు కల్పిస్తారు.

**గృహ నిర్మాణ రంగం :**

మౌలిక వసతుల్లో ప్రాముఖ్యమైనది, ప్రజలకు ప్రియమైనది మరియు కలగా చాలా మందికి మిగిలిపోయేది గృహ నిర్మాణం. ఈ బడ్జెట్‌లో మొట్టమొదటి సారిగా అందరికి అందుబాటులో గృహాల పేరిట గృహ రంగానికి మౌలిక వసతుల హోదా కల్పించారు. ఇది చాలా ప్రయోజనాత్మకమైన మార్పు. గృహ వసతి ప్రతి ఒక్కరికి అందుబాటులోనికి వచ్చినట్లయితే వారి జీవన ప్రమాణాలు పెరుగుతాయి. మౌలిక వసతుల హోదా గృహ రంగానికి కల్పించడము ద్వారా గృహ నిర్మాణ రంగములో నిర్మాణదారులకు మూల ధనము పై వడ్డీ తగ్గుతుంది. కేంద్రము సెక్షన్ 80 IB (Income Tax Act) ద్వారా తీసుకొని వచ్చిన కొన్ని మార్పులు ముఖ్యంగా గృహ విస్తీర్ణము సూచించే కొలతలు, గృహ నిర్మాణ సమయము పెంపుదల (3 నుండి 5 ఏళ్ళకు) మరియు గృహ పరిసరాల విస్తీర్ణము గృహ నిర్మాణ సంస్థలకు చాలా ప్రోత్సాహకర మైనవి.

**కొలత ప్రమాణాల మార్పు**

1. నిర్మాణ స్థలము నుండి (buit up area): గృహ కొలతను నిర్మాణ అంతర్గత స్థలముగా మార్పు చేసారు. దీనివలన చాలా మంది గృహ నిర్మాణ దారులకు ప్రయోజనం.
2. గృహ పరిసరాల విస్తీర్ణము మెట్రో నగరాల్లో 30 చ.మీ. గ మరియు ఇతర ప్రదేశాల్లో 60 చ.మీ కార్పెట్ ఏరియగా నిర్ణయించారు.
3. నిర్మాణము పూర్తయిన ఇళ్ళు అమ్మక పోయినట్లైతే వాటిపై సంవత్సరకాలము పాటు అద్దె ఆదాయము చూపెట్టాల్సిన అవసరము లేదు.
4. National Housing Bank ద్వారా రూ. 20,000 కోట్ల గృహ రుణాలకు ఆర్థిక సహాయం కల్పిస్తారు.

వీటి వలన గృహ నిర్మాణ సంస్థలు ఈ రంగంలో అభివృద్ధికి ముందు కొస్తాయి.

***తరువాయి 60వ పేజీలో...***

# కేంద్ర బడ్జెట్ 2017-18 : స్థిరాస్తి రంగంపై ప్రభావం



**డిమాండ్ మరియు సప్లై ఆధారిత బడ్జెట్ విధానం ద్వారా ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టినట్లు అయ్యింది. డిమాండ్ ఆధారిత కేటాయింపుల ద్వారా వృద్ధి పుంజుకోవడంతో పాటు వీటి ఫలితాలు ప్రతి క్వార్టర్‌లోనూ ప్రతిబింబిస్తుంటాయి. స్థిరాస్తి హక్కుదారుడు ఏదైన భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకొని అభివృద్ధి పనులు చేపడితే సదరు ప్రాజెక్టు పూర్తి అయ్యే వరకూ క్యాపిటల్ గెయిన్స్ నుంచి మినహాయింపు కలిగిస్తున్నట్లు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.**

బడ్జెట్ 2017 పలు అంశాల్లో విప్లవాత్మకమైన మార్పులకు సాక్షిగా నిలిచింది. ముఖ్యంగా ఈ దఫా బడ్జెట్‌లో ప్రణాళిక, ప్రణాళికేతర అనే విభాగాలకు స్వస్తి పలికారు. తొలిసారిగా రెవెన్యూ, మూలధన వ్యయం అనే విభాగాలుగా జమా ఖర్చులను విభజించారు. ఇది ఒక విప్లవాత్మకమైన ఒరవడి అని పలువురు విశ్లేషకులు పేర్కొన్నారు. ఇక మరో విశిష్టత ఈ దఫా బడ్జెట్‌లో రైల్వేకు సంబంధించి అసలు ప్రత్యేక బడ్జెట్ లేకుండా సాధారణ బడ్జెట్‌లోనే కలిపివేయడం అని చెప్పవచ్చు. గడిచిన 92 సంవత్సరాలుగా వస్తున్న ప్రత్యేక రైల్వే బడ్జెట్ సంప్రదాయాన్ని ఈ సారి తొలగించడంతో సంప్రదాయ ధోరణులకు చరమగీతం పాడినట్లయ్యింది. ప్రధానంగా ఆదాయ వనరులను అభివృద్ధి చేయడంతో పాటు ఏఏ రంగాల్లో ఏ మేర అభివృద్ధికి ఆవశ్యకత ఉందో నిర్దేశించుకొని ఆయా లక్షిత రంగాలకు ప్రాధాన్యత ఇచ్చారు. ముఖ్యంగా ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఎక్కువగా పెట్టుబడికి తగిన అభివృద్ధి ఉండేలా ప్రాధాన్యతా రంగాలను గుర్తించడంతో పాటు డిమాండ్ సహిత అభివృద్ధిపై ఎక్కువగా దృష్టి సారించారు. దేశంలో తక్కువ వినియోగిత అనే సమస్యతో పాటు పారిశ్రామిక ప్రగతి కూడా నేటికి తక్కువగానే ఉంది. ఈ అగాథాన్ని పూడ్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ప్రత్యక్ష పన్నుల నుంచి కొంతమేర వెసులుబాటు కల్పించడంతో వినియోగిత పెరిగేందుకు ఆస్కారం కలిగింది. ఒక వేళ పన్నుల కొరడా ఝుళిపించినట్లయితే డిమాండ్‌కు తగ్గ వినియోగిత వ్యాప్తిలోకి తేవడం అసాధ్యమయ్యేది. స్థిరమైన అభివృద్ధిని లక్ష్యంగా చేసుకొని ప్రభుత్వ పెట్టుబడులను ప్రోత్సహించడం ఈ బడ్జెట్ ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. డిమాండ్‌కు తగిన ఉత్పత్తిని ప్రోత్సహించడం ద్వారా బడ్జెట్ ఆయా ప్రాధాన్యతా రంగాలకు మరలింది. బడ్జెట్‌లో ప్రాధాన్యత రంగాల విషయానికి వస్తే మౌలిక వసతుల కల్పనకు గానూ సుమారు రూ. 3.96 లక్షల కోట్ల మేర కేటాయింపులు జరిగాయి. ఉదయ్ పేరిట నూతన పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు రూ. 2.44లక్షల కోట్ల నిధులతో రుణాలు అందించే పథకాన్ని ప్రారంభించారు. అలాగే వ్యవసాయం అనుబంధ రంగాలకు రూ. 1.85 లక్షల కోట్ల కేటాయింపులు జరిగాయి. ఒక జాతీయ ఉపాధి హామీ

**రంజిత్ మెహతా,** డైరెక్టర్, పంజాబ్, హర్యానా, ఢిల్లీ ఛాంబర్ ఆఫ్ కామర్స్, న్యూ ఢిల్లీ.
E-mail: ranjeetmehta@gmail.com

పథకం ద్వారానే గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనకుగాను రూ. 48,000 కోట్లను కేటాయించారు. ఇక మహిళా శిశు సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తూ రూ. 1.84 లక్షల కోట్లు కేటాయింపులు జరిగాయి. పై రంగాలకు ప్రాధాన్యతను ఇస్తూ కేటాయింపులు జరపడం వల్ల డిమాండ్ ఆధారిత అభివృద్ధికి ఆస్కారం కలిగింది. అలాగే ఆర్థిక ప్రగతికి వెసులుబాటు కలిగింది.

డిమాండ్ మరియు సప్లై ఆధారిత బడ్జెట్ విధానం ద్వారా ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టినట్లు అయ్యింది. డిమాండ్ ఆధారిత కేటాయింపుల ద్వారా వృద్ధి పుంజుకోవడంతో పాటు వీటి ఫలితాలు ప్రతీ క్వార్టర్‌లోనూ ప్రతిబింబిస్తుంటాయి. పెట్టుబడి ఆధారిత అభివృద్ధి జరగాలంటే మాత్రం ఫలితాలు జీడీపీ ప్రామాణికంగా కనీసం మూడు త్రైమాసికాల అనంతరం వెలువడేవి. ఈ నేపథ్యంలో భారతీయ స్థిరాస్తి రంగంలో నెలకొని ఉన్న కొన్ని వ్యత్యాసాలు అలాగే ఈ రంగంతో ముడిపడి ఉన్న 265 రంగాలు త్వరితగతిన అభివృద్ధి బాట పట్టాల్సిన ఆవశ్యకత ఉంది. స్థిరాస్తి రంగం ఈ మధ్య కాలంలో పలు విప్లవాత్మకమైన మార్పులను చవిచూసింది. ఈ రంగం దేశ ఆర్థికాభివృద్ధిలో కీలక భూమిక నిర్వహిస్తోంది. అయితే డీమానిటైజేషన్ అనంతరం ఈ రంగంలో కొంత స్తబ్దత నెలకొంది. ముఖ్యంగా మన దేశంలో ఈ రంగం వ్యవస్థీకృతంగా ఎదగలేదు. ఎక్కువగా అనధీకృత రంగంగానే మిగిలిపోయింది. అలాగే అసంఘటిత ఆర్థిక వ్యవస్థకు మూలంగా నిలిచింది. మరోవైపు ప్రపంచ వ్యాప్తంగా ఈ రంగం వ్యవస్థీకృతమై సుస్థిరమైన ప్రగతి సాధిస్తోంది. పెరుగుతున్న ప్రాధాన్యతలు, అలాగే ప్రపంచ పరిస్థితుల నేపథ్యంలో ఈ రంగం సుస్థిరమైన అభివృద్ధి సాధించాల్సిన ఆవశ్యకతను అటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాయి. దేశ ఆర్థికాభివృద్ధిలో సైతం ఈ రంగం ప్రాధాన్యత క్రమక్రమంగా పెరుగుతోంది. ఇక కేంద్ర బడ్జెట్ 2017-18 విషయానికి వస్తే ఈ దఫా స్థిరాస్తి రంగానికి దోహదపడే పలు అంశాలను కేంద్రం పరిగణలోకి తీసుకుంది. అందులో ప్రధానమైనది మౌలికవసతుల కల్పన కాగా, మరొకటి అందరికీ అనుగుణమైన ఇళ్లు అనే నినాదం ఈ రంగానికి ప్రధానమైన ముందడుగుగా భావించవచ్చు. 2022 నాటికి అందరికీ ఇళ్లు అనే ప్రభుత్వ నిర్ణయం స్థిరాస్తి రంగానికి ఒక ప్రధాన చోదకంగా నిలిచింది. ఈ రంగానికి ప్రభుత్వ ఇతోధికంగా మేలు చేసినట్లయ్యింది. కేంద్రం దేశవ్యాప్తంగా ఉన్న 305 పట్టణాల్లో 2022 నాటికి అర్హులకు గృహాలు నిర్మించే విధంగా ప్రణాళికలు రచిస్తోంది. అలాగే ప్రధాన మంత్రి ఆవాస్ యోజన క్రింద పట్టణ ప్రాంతాల్లో సుమారు రెండు కోట్లకు పైగా గృహ సముదాయాలు నిర్మించేలా కేంద్రం నిర్ణయించింది. ఈ పథకం ద్వారా సుమారు 3.8 కోట్ల మందికి 2030 వరకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభిస్తుందని కేంద్రం భావిస్తోంది. అలాగే ప్రస్తుతం 2.9 కోట్ల మందికి ఉపాధి లభిస్తుందని కేంద్రం ప్రణాళికలు వేసింది. తద్వారా కేంద్రం ఈ రంగంలో ఉపాధి అవకాశాల కల్పనకు ద్వారాలు తెరిచింది.

## సమూల మార్పు, బలోపేతం, పారదర్శకత

1. రైతులు – వ్యవసాయం ద్వారా లభించే ఆదాయాన్ని రానున్న ఐదు సంవత్సరాల్లో రెండింతలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు.
2. గ్రామీణ జనాభా – కనీస మౌలిక సదుపాయాల కల్పన అలాగే ఉపాధి కల్పన ద్వారా అభివృద్ధి
3. యువత – యువతలో ఉపాధి కల్పన, నైపుణ్య అభివృద్ధి ఉద్దేశించిన నిధుల కేటాయింపు.
4. నిరుపేద, దారిద్ర్య రేఖ దిగువ వర్గాలు – ఆయా వర్గాలకు సామాజిక భద్రత, ఆహార భద్రత, వసతి సదుపాయల కల్పన.
5. మౌలిక సదుపాయాల కల్పన, ఉత్పాదకత పెంపుదల, జీవన ప్రమాణాల పెంపుదల
6. ఆర్థిక రంగం – అభివృద్ధి కోసం సుస్థిరమైన వ్యవస్థాపనలకు కృషి.
7. డిజిటల్ ఎకానమీ వృద్ధి వలన వ్యవస్థలో పారదర్శకత పెంపుదల.
8. ప్రజా భాగస్వామ్యం ద్వారా సమర్థవంతమైన సుపరిపాలనను అందించడం.
9. సమర్థవంతమైన ఆర్థిక నిర్వహణ ద్వారా వనరులను సక్రమంగా వినియోగించుట
10. పన్నుల విధానం – నిజాయితీ, పారదర్శకత

## స్థిరాస్తి రంగానికి ప్రోత్సాహకాలు

1. అందరికీ ఇళ్ల పథకానికి మౌలిక వసతుల కల్పన హోదా.
2. 2019 నాటికి ఒక కోటి గ్రామీణ గృహాల నిర్మాణానికి శ్రీకారం.
3. జాతీయ గృహ బ్యాంక్ ద్వారా రూ.20 వేల కోట్ల రుణాలు వితరణ.
4. ప్రధాన మంత్రి ఆవాస యోజన కింద 23 వేల కోట్ల నిధుల కేటాయింపు
5. ఇకపై రియల్ డెవలపర్లు కాపిటల్ ప్రాజెక్టు పూర్తి చేయాల్సిన వ్యవధి లోపు మాత్రమే క్యాపిటల్ గెయిన్స్ పన్ను చెల్లించేలా నిర్ణయం. దీని ద్వారా డెవలపర్లకు పన్ను నుంచి వెసులుబాటు కల్పించారు.
6. 30 నుంచి 60 చదరపు మీటర్ల పరిధిలో గృహాల నిర్మాణానికి ప్రణాళికలు.
7. స్థిరాస్తులపై చెల్లించాల్సిన క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ పరిధిని మూడు

సంవత్సరాల నుంచి రెండు సంవత్సరాలకు ప్రభుత్వం తగ్గించింది.

8. అమ్ముడు పోని వెంచర్లలో పన్ను చెల్లింపును ఒక సంవత్సరానికి మినహాయిస్తూ నిర్ణయం.

9. రూ.3లక్షలకు మించి నగదు లావాదేవీలపై నిషేధం.

10. 600 జిల్లాలకు ఇందిరా ఆవాస్ యోజన విస్తరణ.

11. క్యాపిటల్ గెయిన్స్ లెక్కింపును 01-04-1981 నుంచి 01-04-2001కి మార్పు.

### అందరికీ ఇళ్లు పథకానికి మౌలిక వనరుల కల్పన

బడ్జెట్ 2017లో పలు ఆర్థిక సరళీకృత విధానాలకు వేదిక అవుతుందనేది పలువురు విశ్లేషకులతో పాటు పలు ఏజెన్సీలు ఆర్థిక వేత్తలు ఊహించిన విషయమే. ముఖ్యంగా ఆర్థిక నిర్వహణ, ద్రవ్యోల్బణ కట్టడి విషయాలపై కేంద్రం దృష్టి సారించనుందని అంచనాలు వెలువడ్డాయి. ముఖ్యంగా అందరికీ గృహాలు పథకానికి మౌలిక సదుపాయాల రంగ హోదా కల్పించడం ప్రధాన అడుగుగా అభివర్ణించవచ్చు. ఈ హోదా ద్వారా స్థిరాస్తి రంగానికి ఊతం కల్పించినట్లు అయ్యింది. ముఖ్యంగా 2022 నాటికి అందరికీ ఇళ్లు అనే లక్ష్యాన్ని చేరుకునేందుకు ఈ అడుగు ప్రధానంగా దోహదపడనుంది. ముఖ్యంగా మధ్యతరగతి – దిగువ వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే గృహాల నిర్మాణానికి పలు సవాళ్లు ఎదురయ్యాయి. వాటిని అధిగమిస్తూ ముందుకు వెళ్లేందుకు ఈ పథకం దోహదపడింది. కేంద్రం తీసుకునే నిర్ణయంతో అటు ప్రైవేటు కంపెనీలు సైతం మధ్య తరగతి ప్రజలకు గృహాల కల్పనకు చర్యలు తీసుకునే దిశగా అడుగులు వేయనున్నాయి.

స్థిరాస్తి రంగం చాలాకాలంగా పారిశ్రామిక హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తోంది. రియల్ ఎస్టేట్ రంగానికి పారిశ్రామిక రంగ హోదా కల్పించకపోవడం వల్ల దాని అభివృద్ధి కుంటుపడటమే కాకుండా, ప్రగతి నిరోధకంగా నిలిచింది. అయితే ప్రస్తుతం ప్రధాన మంత్రి ఆవాస యోజన క్రింద తక్కువ ఖర్చుతో గృహాల నిర్మాణానికి పన్ను మినహాయింపులు కల్పించింది. ముఖ్యంగా రూ. 9 లక్షల నుంచి రూ. 12 లక్షలలోపు గృహ రుణాలకు 4 శాతం వడ్డీ రేటు నిర్ణయించగా, ఆ పై రుణాలకు 3 శాతం వడ్డీ రేటును నిర్ణయించారు. ఇక ప్రధానంగా మధ్య, దిగువ తరగతి కుటుంబాలను ఉద్దేశించి ఈ నిర్ణయం తీసుకున్నారు. అలాగే మధ్య తరగతి ప్రజలను ఉద్దేశించిన అసంపూర్తిగా నిలిపివేసిన ప్రాజెక్టులకు సైతం ఈ వడ్డీ రేట్లు వర్తించేలా 3 నుంచి 5 సంవత్సరాల కాలవ్యవధితో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో చాలా ప్రాజెక్టులకు ఉపలబ్ది చేకూరింది. దీంతో పాటు పన్ను ఇతోధికాలతో ఆకర్షితులవుతున్న పలు ప్రైవేటు సంస్థలు కూడా మధ్య తరగతికి అందుబాటులో ఉండే ప్రాజెక్టులపై దృష్టి పెడుతున్నాయి. మౌలిక సదుపాయాల హోదా ఇవ్వడం కూడా పలుసంస్థలు ఈ రంగంలో అడుగు పెట్టేందుకు దోహదపడనుంది.

### అందుబాటు ధరలో గృహాల నిర్మాణానికి చేయూత

తక్కువ ధరలకు మధ్యతరగతి, దిగువ వర్గాలకు గృహాలు నిర్మించడం కేంద్రం ముందు ఉన్న ప్రధాన సవాలు. ఆయా వర్గాల సంఖ్య జనాభాలో మెజారిటీ మొత్తంలో ఉంది. వీరందరికీ అందుబాటులో ఉండే కనీస అవసరాలు తీర్చే గృహాల నిర్మాణం కోసం కేంద్రం పలు కీలక నిర్ణయాలుతీసుకుంది. వాటిలో ప్రధానమైనది గృహాల నిర్మాణానికి కావాల్సిన నిర్మాణ వైశాల్యం. ఈ విషయంలో కేంద్రం నిర్మాణ వైశాల్యం కొలతలను 30/60 చదరపు మీటర్లుగా నిర్ణయించింది. దీంతో తక్కువ ఖర్చుతో ఇళ్లునిర్మించేందుకు వీలు కలిగింది. నిబంధనల సడలింపుతో అటు ఇతర సంస్థలు కూడా మధ్యతరగతి ప్రజలకు గృహాలు నిర్మించేందుకు ముందుకు వచ్చే వీలుంది. అయితే 30 చదరపు మీటర్ల వైశాల్యంలో గృహ నిర్మాణం అనేది అటు నగరాలు అలాగే మెట్రో నగరాలకు పరిమితం చేయగా, 60 చదరపు మీటర్ల వైశాల్యంలో గృహ నిర్మాణం అనేది గ్రామాలు, చిన్న పట్టణాల్లో అమలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది.

### స్థిరాస్తులపై కాలవ్యవధి తగ్గింపు

కేంద్ర బడ్జెట్ 2017లో తీసుకున్న మరో కీలక నిర్ణయం స్థిరాస్తుల లాభాల పన్నును 3 సంవత్సరాల నుంచి 2 సంవత్సరాలకు తగ్గించారు. దీని వల్ల రియల్ ఎస్టేట్ ప్రమోటర్లకు ఊతమిచ్చినట్లయ్యింది. పన్ను భారం తగ్గడం వల్ల ఇతర అభివృద్ధి పనులకు ఈ మొత్తాన్ని కేటాయించే అవకాశం ఉంది. అలాగే ఆస్తుల విలువను లెక్కగట్టే ఆధార సంవత్సరాన్ని 1981 నుంచి 2001కి మార్చారు. దీని ద్వారా ధర విషయంలో తలెత్తే ఇబ్బందులను దూరం చేసినట్లయ్యింది. తద్వారా మూలధన లాభాలపై భారం తగ్గింది. అలాగే అమ్ముడు పోని ఆస్తులకు ఒక సంవత్సరం వరకూ పన్ను నుంచి మినహాయింపు ఇవ్వడం కూడా ఈ రంగానికి పెద్ద ఊరట అనే చెప్పాలి.

### జాతీయ గృహ బ్యాంక్ (ఎన్ హెచ్ బీ)

డీమానిటైజేషన్ ద్వారా 2016 చివరి నెల భారీగా మిగులు డిపాజిట్లు వచ్చి పడ్డాయి. దీంతో దేశవ్యాప్తంగా అటు పలు బ్యాంకులు వడ్డీ రేట్లను తగ్గించాయి. ఈ పరిణామం కొత్తగా ఇళ్లు కొనుగోలు

చేసేవారికి ఊరట కలిగించే అంశమే. తక్కువ వడ్డీ రేట్లతో రియల్ రంగానికి కూడా ఊపు వచ్చింది. దీన్ని దృష్టిలో ఉంచుకొనే కేంద్రం అన్ని వర్గాల ప్రజలకు గృహ రుణాలు అందుబాటులోకి తేవాలని జాతీయ గృహ బ్యాంకును ఏర్పాటు చేసింది. దీని మూల నిధి కోసం రూ.20 వేల కోట్ల వరకూ కేటాయించనుంది. ఈ బ్యాంకు ఏర్పాటు ద్వారా తక్కువ వడ్డీ రేట్లు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

### క్యాపిటల్ గెయిన్స్ టాక్స్‌లో మార్పులు

స్థిరాస్తి అభివృద్ధికి ప్రతినిరోధకంగా ఉన్న మరో అంశం కాపిటల్ గెయిన్స్ టాక్స్ అని చెప్పవచ్చు. అయితే ఈ బడ్జెట్‌లో క్యాపిటల్ గెయిన్స్ టాక్స్ విషయంలో పలు కీలకమైన నిర్ణయాలు తీసుకున్నారు. స్థిరాస్తి హక్కుదారుడు ఏదైన భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకొని అభివృద్ధి పనులు చేపడితే సదరు ప్రాజెక్టు పూర్తి అయ్యే వరకూ క్యాపిటల్ గెయిన్స్ నుంచి మినహాయింపు కలిగిస్తున్నట్లు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. స్థిరాస్తుల అభివృద్ధికి దోహదం చేసే ఈ చర్య ఆహ్వానించదగినదే. అలాగే ఉమ్మడి భాగస్వామ్య అభివృద్ధి ఒప్పందం కుదుర్చుకొని సదరు ప్రాజెక్టు పూర్తి అయ్యాకే క్యాపిటల్ గెయిన్స్ పన్ను చెల్లించడం వల్ల అటు స్థిరాస్తి హక్కు దారుడితో పాటు అటు బిల్డర్ లేదా ప్రమోటర్లకు కూడా ఊరట లభించినట్లు అయ్యింది. దీని వల్ల మరిన్ని స్థిరాస్తులు అభివృద్ధి చెంది మార్కెట్లోకి అందుబాటులోకి వచ్చే వీలు కలిగింది.

### నగదు లావాదేవీలు పరిమితం..

డీమానిటైజేషన్‌తో విపణిలో కరెన్సీ పరిమితం అయిపోయింది. ఈ పరిణామాన్ని మరింత వేగవంతం చేసేందుకు లావాదేవీల్లో మరింత పారదర్శకత పెంచేందుకు నగదు చెల్లింపులను 3 లక్షలకే పరిమితం చేస్తూ నిర్ణయం కేంద్రం నిర్ణయం తీసుకుంది. దీని వల్ల వ్యవస్థలో పారదర్శకత పెరిగే అవకాశం ఉంది. కొనుగోలుదారులకు సరైన ధరలకు ఆస్తులు కొనుగోలు చేసే వీలు కలిగింది. ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతున్న ధరలకు కళ్లెం వేసేందుకు ఈ చర్య దోహదపడింది. అలాగే స్థిరాస్తి రంగంలో మరిన్ని విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు పెట్టేందుకు ఈ చర్య అవకాశం కల్పించింది.

### ఆంధ్రప్రదేశ్ నూతన రాజధానిలో ల్యాండ్ పూలింగ్ విధానం – భూ సేకరణ చట్టంపై ప్రభావం

ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని నిర్మాణం కోసం భూ సేకరణ చట్టం ద్వారా కాకుండా ల్యాండ్ పూలింగ్ విధానం ద్వారా స్థల సేకరణ చేపట్టారు. సాధారణంగా స్థల సేకరణ అనేది పలు సమస్యలకు మూల కారణంగా మారుతోంది. అంతేకాదు పలు ప్రాజెక్టులు సైతం స్థల సేకరణ విషయంలో నిలిచిపోతున్నాయి. ఆంధ్ర ప్రదేశ్ నూతన రాజధాని విషయంలో మాత్రం ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్ ద్వారా స్థల హక్కు దారులను ప్రమోటర్లుగా మార్చింది. ఈ విధానానికి ప్రోత్సాహకంగా కేంద్రం క్యాపిటల్ గెయిన్స్ నుంచి మినహాయింపునిస్తూ బడ్జెట్‌లో ప్రకటించింది.

### ఆదాయ పన్ను స్లాబ్ రేట్లలో 5 శాతం తగ్గింపు

2.5 లక్షల నుంచి 5 లక్షల మధ్య ఆదాయంపై విధించే ఆదాయ పన్ను స్లాబ్ రేట్లను సైతం 10 శాతం నుంచి 5 శాతానికి తగ్గిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఇది కూడా స్థిరాస్తి రంగానికి పరోక్షంగా ఊతమిచ్చే విధానమే. దీతో పలు ఆదాయ వర్గాల వారు ఆదాయ పన్ను తగ్గింపును పెట్టుబడిగా స్థిరాస్తివైపు తరలించే అవకాశం ఉంది. మరోవైపు బ్యాంకులు సైతం వడ్డీ రేట్లను తగ్గించడం కూడా పలు వర్గాలను ఆకర్షిస్తున్నాయి.

### ముగింపు

బడ్జెట్ 2017 కూర్పు నుంచి ప్రకటన వరకూ వినూత్న రీతిలో సాగింది. అలాగే ముందుగా అంచనాలు వేసినట్లే సమూల మార్పులకు దోహదపడేలా ఉంది. అటు పన్ను విధానాల్లో కూడా పలు విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకుంది. డీమానిటైజేషన్ వల్ల వ్యవస్థలో కాస్త స్తబ్దత కనిపించినప్పటికీ దీర్ఘకాలిక ప్రయోజనాల దృష్ట్యా ఆహ్వానించదగిన పరిణామం. మరోవైపు జీఎస్‌టీ పన్ను విధానం కూడా సేవారంగంతో పాటు, ఉత్పత్తి రంగానికి ఊతం అందించనుంది. ఏకీకృత పన్ను విధానం వల్ల వ్యవస్థలో పారదర్శకత పెరిగే అవకాశం ఉంది. అలాగే రియల్ ఎస్టేట్ రంగంలో నల్లధనాన్ని అరికట్టేందుకు అటు ప్రభుత్వం చెల్లింపులన్నీ డిజిటల్ లేదా చెక్ ద్వారా జరగాలని నిర్ణయం తీసుకుంది. తద్వారా పారదర్శకత పెరిగి ప్రత్యక్ష పన్నుల రాబడి పెరిగి ప్రభుత్వం మరింత జవాబుదారీగా పనిచేసే వీలు కలుగుతుంది. దేశవ్యాప్తంగా పట్టణప్రాంతాల్లో సుమారు 1.89 కోట్ల మందికి గృహ వసతి అవసరం ఉంది. వీరిలో 96 శాతం మంది ఆర్థికంగా వెనుకబడిన వర్గాలుగా ఉన్నారు.

బడ్జెట్ ప్రతిపాదనల్లో చాలా వరకూ రియల్ రంగానికి ఊపు నిచ్చే విధంగా చర్యలు ఉన్నాయి. ముఖ్యంగా క్యాపిటల్ గెయిన్స్ మినహాయింపు, ఎన్‌హెచ్‌బీ బ్యాంకు ఏర్పాటు, అలాగే ట్యాక్స్ స్లాబ్ విధానంలో మార్పులు వంటివి స్థిరాస్తి రంగంలో ఊపు నిచ్చేవిగా మారాయి. ప్రభుత్వ చర్యలతో ఉపాధి అవకాశాలూ పెరుగుతాయి. అలాగే అందరికీ గృహ వసతి అనే లక్ష్యం నెరవేర్చేలా ఉంది.

■

# నవ్యాభివృద్ధి నమూనా : మహా యుగంవైపుగా ప్రయాణం



జాతీయ స్థాయిలో అనుసంధానితమైన మార్కెటింగ్ మండీలను ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తేవడమే ఈ-నామ్ లక్ష్యమని దేశంలో వివిధ ప్రాంతాల్లో వివిధ స్థాయిల్లో ఉండే మండీల భౌతిక సౌకర్యాలను ఆన్‌లైన్ ట్రేడింగ్ పోర్టల్ ద్వారా అనుసంధా నించడంతో ఆయా రాష్ట్రాల వెలుపల ఉన్న కొనుగోలుదారులు కూడా క్రయ, విక్రయాల్లో పాల్గొనడం సాధ్యమవుతుంది. ఈ కార్యక్రమం కింద ఎనిమిది రాష్ట్రాల్లో 21 మండీలను అనుసంధించడం జరుగుతుంది.

ఈ ఏడాది బడ్జెట్ బలమంతా దాని సరైన సమతుల్యతలోనే ఉందని చెప్పాలి. వ్యవసాయ రంగం, రైతుల సంక్షేమం, గ్రామీణ ప్రాంతాల పురోభివృద్ధి, ఉపాధి కల్పనలకు కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాముఖ్యత ఇస్తున్నది. ఈ రంగాల్లో మెరుగైన ఫలితాలు సాధించడానికి చేస్తున్న ప్రయత్నాలకు ఈ యేడాది బడ్జెట్‌లో మరింత ఊతమిచ్చే చర్యలకు చోటు కల్పించారు.

అనేక మంది విశ్లేషించినట్లుగా, భారతదేశంలోని వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ, గ్రామీణాభివృద్ధిలో ఆశించిన ఫలితాలు ఇంకా రాలేదనడం ఒక వాస్తవంగా గుర్తించాలి. అయితే 2017-18 బడ్జెట్ అనేక విధాలుగా పలు రంగాల్లో మార్పులు తీసుకొచ్చే విధంగా ఉంటుందని అంతా ఆశించారు. ఆయా రంగాలకు నిధుల పెంపు, సరైన ప్రాజెక్టులను గుర్తించడం, ఒక స్పష్టమైన రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేయడం వంటి చర్యలతో గ్రామీణాభివృద్ధిలో అడ్డుపడుతున్న మానవ తప్పిదాలను, ప్రాకృతిక అవరోధాలను తొలగించడం సాధ్యమవనుంది. గ్రామీణ ప్రాంతాలపై దృష్టి పెడుతూ, వ్యసాయదారులకు అదే విధంగా పట్టణ ప్రాంత వినియోగదారులకు దోహదపడే విధంగా ఉంది.

మొదటగా, గత ఏడాదితో పోలిస్తే 2017-18 బడ్జెట్‌లో ఈసారి 24 శాతం అధికంగా గ్రామీణ, వ్యవసాయ, అనుబంధ రంగాలకు రూ.1,87,223 కోట్ల కేటాయింపు ఆయా రంగాలకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను చెప్పకనే చెబుతోంది.

దేశాభివృద్ధి సాధించడంతో పాటు 'సబ్ కా సాత్, సబ్ కా వికాస్' నినాదం స్ఫూర్తిగా సమ్మిళిత ప్రణాళికలను రూపొం దించడానికి వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో గ్రామీణ మౌలిక సౌకర్యాల కల్పనపై దృష్టి సారించడం తప్పనిసరి అన్న విషయాన్ని ఇక్కడ అర్థం చేసుకోవాలి. ఇక దశాబ్దాలుగా రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటకి సరైన మద్దతు ధర రాకపోవడం వంటి సమస్యలు వేధిస్తు న్నాయి. వ్యవసాయ మార్కెట్లు అనుసంధానం కాకపోవడం కూడా దీనికి కారణంగా చెప్పాలి. దీంతో ప్రభుత్వం వ్యవసాయ అనుబంధ మార్కెట్లను అనుసంధానం చేస్తూ, ప్రాంతాల మధ్య వ్యత్యాసాలను తగ్గించడానికి సరైన మార్కెటింగ్ సౌకర్యాలను కల్పించ

**నీరేంద్ర దేవ్,** ప్రత్యేక విలేకరి, ద స్టేట్స్‌మన్, న్యూ ఢిల్లీ.
E-mail: nirendev1@gmail.com

డానికి చర్యలు తీసుకోవడం ప్రారంభించింది.

**వ్యవసాయ ఉత్పత్తులకు తగిన మూల్యం:**

రైతులు పండించిన పంటలకు తగిన ధర లభించేలా దోహదపడడానికి రాష్ట్రాల మధ్య ఒప్పంద వ్యవసాయాన్ని వృద్ధి చేయడానికి ఒక చట్టాన్ని తయారు చేయాలనే భావనతో కేంద్ర ఆర్థిక మంత్రి సైతం ఏకీభవించారు. జాతీయ ఎలక్ట్రానిక్ వ్యవసాయ మార్కెట్ (ఈ-నామ్) వేదికపైకి మరింతగా క్రమబద్ధీకరించిన వ్యవసాయ మార్కెట్లను తీసుకొని రావాలనే లక్ష్యానికి కట్టుబడి ఉన్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.

జాతీయ ఎలక్ట్రానిక్ వ్యవసాయ మార్కెట్ (ఈ-నామ్) పరిధిలోని ప్రస్తుతమున్న 250 మార్కెట్లను 585కి పెంచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. పార్లమెంటులో కేంద్ర ఆర్థిక మంత్రి సాధారణ బడ్జెట్‌ని ప్రవేశపెడుతూ ప్రతి ఈ-నామ్ మార్కెట్‌లో వ్యవసాయ ఉత్పత్తుల శుద్ధీకరణ, గ్రేడింగ్, ప్యాకింగ్ వంటి సదుపాయాల కోసం కేటాయింపులను రూ.75 లక్షల వరకు పెంచడానికి ప్రతిపాదించారు.

ఈ-నామ్ వేదికగా ఎలక్ట్రానిక్ వాణిజ్య వేదికను 2016లో ప్రవేశపెట్టినప్పుడు అది అతి పెద్ద ముందడుగుగా భావించడం జరిగింది. తరచూ ధరల వ్యత్యాసాలతో సతమతమయ్యే రైతుల సమస్యలను పరిష్కరించడానికి ఈ-నామ్ ఒక సాధనంగా పనిచేస్తుంది. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖలో పని చేస్తున్న అధికారులు రైతులు ఎదుర్కొంటున్న కొన్ని సమస్యలు, సవాళ్లను గుర్తించామనీ, అందులో దళారీల సమస్యను తక్షణమే పరిష్కరించాల్సి ఉందని అంటున్నారు. ఆ విధంగా, వ్యవసాయ మార్కెట్‌లలో దళారీ వ్యవస్థను, వారి పాత్రను ముగించడానికి, వ్యవసాయ ఉత్పత్తుల క్రయ, విక్రయాల్లో పూర్తి పారదర్శకత సాధించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. దేశవ్యాప్తంగా వ్యవసాయ ఉత్పత్తులకు ఒక నిర్దిష్టమైన ధరల సూచికను ఏర్పాటు చేయడంలో ఈ-నామ్ పోషించే దీర్ఘకాలిక పాత్రపై ప్రభుత్వం దృష్టి సారించింది.

నిజానికి, గత ఏడాది కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ పేర్కొన్న విధంగా ఈ-నామ్ అన్నది కేవలం ఆన్‌లైన్ వేదికగానే ఉంటుంది తప్ప దాన్ని సమాంతర మార్కెటింగ్ వ్యవస్థగా చూడరాదు. నిజానికి జాతీయ స్థాయిలో అనుసంధానితమైన మార్కెటింగ్ మండీలను ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తేవడమే ఈ-నామ్ లక్ష్యమని వ్యవసాయశాఖలో ఒక సీనియర్ అధికారి స్పష్టం చేశారు.

దేశంలో వివిధ ప్రాంతాల్లో వివిధ స్థాయిల్లో ఉండే మండీల భౌతిక సౌకర్యాలను ఆన్‌లైన్ ట్రేడింగ్ పోర్టల్ ద్వారా అనుసంధానించడంతో ఆయా రాష్ట్రాల వెలుపల ఉన్న కొనుగోలుదారులు కూడా క్రయం, విక్రయాల్లో పాల్గొనడం సాధ్యమవుతుంది. ఈ కార్యక్రమం కింద ఎనిమిది రాష్ట్రాల్లో 21 మండీలను అనుసంధించడం జరుగుతుంది. అందులో ఉత్తర ప్రదేశ్‌లో ఆరు, గుజరాత్‌లో మూడు, తెలంగాణాలో అయిదు, రాజస్థాన్‌లో ఒకటి, మధ్యప్రదేశ్‌లో ఒకటి, హర్యానాలో రెండు, జార్ఖండ్‌లో ఒకటి, హిమాచల్‌ప్రదేశ్‌లో రెండు మార్కెట్లు ఉన్నాయి.

ఏది ఏమైనా ఇందులోకి కొన్ని సమస్యలపై మరోసారి దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పాలి. ప్రత్యేకంగా వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ ప్రక్రియకి సేకరణ కర్తలుగా ఉన్న దళారీలను దూరంగా ఉంచడం ద్వారా ఈ రంగంలో పారదర్శకత సాధించాలని ప్రభుత్వం తలపోస్తోంది. సరైన దృక్పథంతో, సరైన దిశానిర్దేశం చేసే క్రమంలో కేంద్ర ఆర్థికమంత్రి తన బడ్జెట్ ఉపన్యాసంలో 'మార్కెట్ సంస్కరణల'ను అమలు చేసే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ ఉత్పత్తులు నాశనం అయ్యే కేటగిరీ నుంచి తొలగించాలని కోరడం జరిగింది. తద్వారా రైతులు తమ ఉత్పత్తులను మంచి ధరలకు విక్రయించు కోవడం సాధ్యమవుతుంది.

పండ్లు, కాయగూరలు పండించే రైతుల సమగ్రతను పరిరక్షించడానికి బడ్జెట్‌లో ప్రతిపాదించిన చర్యలు సరైన దిశలో ఉండడంతో వారి ఉత్పత్తులకు ఆగ్రో ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా మెరుగైన ధర లభించడంతో పాటు కోత తరువాతి నష్టాలను నివారించడానికి దోహదపడుతుంది.

**రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం నాబార్డ్ ఆధ్వర్యంలో సూక్ష్మ సేద్య నిధిని ఏర్పాటు చేయడం ద్వారా ప్రతి బిందువుకి మరింత పంట అనే నినాదాన్ని ప్రకటించింది. దీని కోసం కేంద్ర ప్రభుత్వం రూ.5000 కోట్ల కార్పస్ ఫండ్‌ని ఏర్పాటు చేసింది.** అదే కాకుండా నాబార్డ్ పాల ఉత్పత్తుల ప్రాసెసింగ్ సౌకర్యాల కోసం రూ.8000 కోట్లతో ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసింది. అయితే ఈ దిశగా గుజరాత్, మహారాష్ట్ర, కర్నాటక వంటి రాష్ట్రాలు మాత్రమే డయిరీ ఫార్మింగ్‌లో మెరుగైన ఫలితాలను సాధించాయి.

ఈ ఏడాది బడ్జెట్‌లో నిర్ణీత తేదీలోగా సవ్యంగా బకాయిలు చెల్లించిన రైతులకు అదనంగా మూడు శాతం ప్రోత్సాహకాలను ప్రకటించడం జరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ రంగం 4.1 శాతం వృద్ధి రేటును నమోదు చేసినట్లు కేంద్ర ఆర్థికమంత్రి ప్రకటించారు. అయితే ఇక్కడ అంత తేలిక కాకపోయినా ఒక విషయం చెపాల్సి ఉంది. అదేమిటంటే వేసవిలో ఖరీఫ్, శీతాకాలంలో రబీ సీజన్‌లో

పంట విస్తీర్ణం గణనీయంగా పెరిగింది.

రైతులు దయనీయస్థితిలో ఉన్నప్పుడు వారిని ఆదుకోవడానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉన్నట్లు 2017-18 బడ్జెట్ ప్రతిపాదనల్లో సూచనప్రాయంగా కనిపించింది. అది గత ఏడాది ప్రకటించిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనా ద్వారా పంట బీమా కోసం ప్రత్యేక నిధులను రూ.5,500 కోట్ల నుంచి రూ.13,240 కోట్లకు పెంచడం జరిగింది. రాబోయే ఆర్థిక సంవత్సరంలో ఈ మొత్తాన్ని రూ.9,000 కోట్లకి పెంచడానికి ప్రతిపాదించడం ఇక్కడ గమనించాల్సి ఉంది. ఈ పథకం కింద 2016-17లో ముప్పై శాతం పంట విస్తీర్ణాన్ని తీసుకొస్తే 2017-18 ఆర్థిక సంవత్సరంలో దాని పరిధి 40 శాతం ఉండగా 2018-19 సంవత్సరానికి 50 శాతానికి విస్తరించడం జరుగుతుందని కేంద్ర ఆర్థికమంత్రి వెల్లడించారు.

ఫసల్ బీమా యోజనా పథకానికి నిధుల పెంపు ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం చేసినప్పుడు దానికి పార్లమెంటు లోపలా వెలుపలా విపక్షాలు కూడా మద్దతు ప్రకటించడం విశేషం. ఇక దీంతో పాటు **ఈసారి బడ్జెట్‌లో సాగునీటి పారుదల రంగంపై దృష్టి సారించిన ప్రధాన మంత్రి క్రిషి సించాయి యోజనకి ప్రాధాన్యత కల్పించారు.** భూసార పరిరక్షణ కార్డుల గురించి కేంద్ర ఆర్థిక మంత్రి బడ్జెట్ ఉపన్యాసంలో ప్రస్తావిస్తూ, భూసారాన్ని వేగవంతంగా పరీక్షిస్తూ, ఆయా భూముల పౌష్టిక పరిమాణాలను గుర్తించినప్పుడే రైతులకు నిజమైన సాయం అందుతుందని అన్నారు. దీని కోసం ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ఉన్న 648 కృషి విజ్ఞాన కేంద్రాల్లో వంద శాతం భూసార పరీక్షలు చేయడానికి వీలుగా మిని ప్రయోగశాలలను నెలకొల్పడానికి తగిన చర్యలకు ఉపక్రమిస్తోంది. పైగా దీర్ఘకాలిక వ్యవసాయ నిధిని నాబార్డ్ ఇప్పటికే ఏర్పాటు చేసినట్లు కేంద్ర ఆర్థికమంత్రి ప్రకటించారు.

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ క్షేత్రాల్లో మౌలిక సౌకర్యాల కల్పనలో చెరువులు, కుంటల్లో వాననీటిని వడిసి పట్టడం ద్వారా వ్యసాయ అను కూలమైన ప్రత్యేకించి తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రాంతాల్లో కీలక పాత్ర పోషించనున్నట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వర్షపునీటి సేద్యాన్ని ఇప్పటికే అనేక రాష్ట్రాలు చట్టబద్ధం చేయగా అవి సాగునీటి పారుదలకి అనుబంధంగా ఉంటున్న నేపథ్యంలో 2014లోనే ప్రస్తుత ప్రభుత్వం ప్రారంభించిన ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన సరైన దిశగా ప్రయాణం చేస్తున్నదని చెప్పాలి.

2016-17 ఆర్థిక సంవత్సరంలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ, వ్యవసాయేతర రంగాల్లో ఆదాయాన్ని 2020 నాటికి రెట్టింపు చేయడానికి సరికొత్త చర్యలు చేపట్టడానికి ప్రతిజ్ఞ చేయడం జరిగింది.

### గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ వ్యయం చేయాలి:

తినడం ద్వారానే దేని రుచి అయినా తెలుస్తుంది అన్నది ఒక వాస్తవం. ఆ విధంగా, గ్రామీణ భారతంలో మార్పులు తీసుకొని రావాలని కేవలం ఒట్టి మాటలకే సరిపెట్టుకుంటూ, గ్రామాల్లో నిధులను వ్యయం చేయకపోతే అర్థమే ఉండదు. 2014 నుంచి తన నాలుగవ బడ్జెట్ ప్రతిపాదనల్లో గ్రామీణ ప్రాంతాల్లో నిధుల వ్యయంపై కేంద్ర ఆర్థిక మంత్రి మాట్లడడం జరిగింది. అయితే మౌలిక సౌకర్యాల కల్పన, గ్రామీణ రహదారులు, విద్యుదీకరణ వంటి అంశాలతో పాటు పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉన్నట్లు చెప్పారు. ఆర్థిక సంస్కరణలు కొనసాగిస్తూనే అదే సమయంలో అత్యధికంగా నిధుల వ్యయంతో పాటు వృద్ధి రేటును వేగవంతం చేయడం ముఖ్యమని కేంద్ర ఆర్థిక మంత్రి స్పష్టం చేశారు.

ఏటా దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో రూ.3 లక్షల కోట్లు వ్యయం చేస్తున్న విషయాన్ని ఇక్కడ ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అదే సమయంలో జవాబు దారీతనాన్ని మరింతగా పెంచడంపై దృష్టి పెట్టిన కేంద్ర ప్రభుత్వం అంత్యోదయ పథకం కింద 2019 నాటికి ఒక కోటి కుటుంబాలను తీసుకొస్తూ 50,000 గ్రామ పంచాయతీల్లో పేదరికాన్ని సమూలంగా నిర్మూలించాలన్న లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుంది. సరిగ్గా అప్పటిక మహాత్మాగాంధీ 150 జయంతి రావడం కూడా కాకతాళీయంగా చెప్పాలి. భారతదేశ ముఖచిత్రాన్ని మార్చాలంటే గ్రామాల అభివృద్ధే మార్గమని భావించే గాంధేయవాదానికి అనుగుణంగా అంత్యోదయ పథకాన్ని అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం పటిష్టమైన చర్యలకు సిద్ధపడుతోంది.

ఏటా పెరుగుతున్న కేటాయింపులతో పాటు ఇప్పటికే ఉన్న వనరులను మరింతగా వినియోగించుకోవడంపై ప్రభుత్వం దృష్టి పెట్టినట్లు కేంద్రమంత్రి స్పష్టం చేశారు. దరిద్రంలో కునారిల్లుతున్న ప్రతి కుటుంబానికి సుస్థిరమైన జీవనోపాధి కల్పించే సూక్ష్మస్థాయి ప్రణాళికలపై అంత్యోదయ పథకం దృష్టి పెడుతుందని అన్నారు. పేదరికం లేని గ్రామ పంచాయతీల సాధన కోసం క్షేత్రస్థాయి పర్యవేక్షణతో కూడుకున్న ప్రణాళికను అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు.

ఇక తరచూ వార్తల్లో ఉండే గ్రామీణ ఉపాధి అంశమైన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని ఇకపై గ్రామీణుల ఉపాధిని రెట్టింపు చేయడానికి ఒక చైతన్యపూర్వకమైన ప్రయత్నం ద్వారా సమూలంగా మార్చనున్నట్లు కేంద్రమంత్రి

చెప్పారు. ప్రతి గ్రామీణ కుటుంబానికి కనీసంగా ఏడాదిలో వంద రోజుల పనిని కల్పించడం ద్వారా గ్రామీణ ఉత్పాదకతను పెంచడంతో పాటు ఆదాయ వృద్ధిపైనా దృష్టి పెడుతున్నట్లు కేంద్ర ఆర్థికమంత్రి స్పష్టం చేశారు.

గత బడ్జెట్‌లో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా అయిదు లక్షల చెరువులు, పది లక్షల కుంటల అభివృద్ధి లక్ష్యాన్ని సాధించినట్లు కేంద్రమంత్రి స్పష్టం చేశారు. నిజానికి అయిదు లక్షల వ్యవసాయ చెరువులనే లక్ష్యంగా పెట్టుకుంటే అవి మార్చి, 2017 నాటికే పది లక్షలకు చేరుకోనుండడం విశేషం. ఒక 2017-18 ఆర్థిక సంవత్సరంలో మరో అయిదు లక్షల చెరువుల వృద్ధిని చేపట్టనున్నారు. ఈ ఒక చర్యే గ్రామ పంచాయతీల్లో కరువు నిర్మూలనకి గణనీయంగా దోహదపడు తుందని చెప్పాలి. ఇక గతంలో ఉపాధి హామీ పథకంలో 48 శాతం ఉన్న మహిళల భాగస్వామ్యం ఇప్పుడు 55 శాతానికి పెరగడం మరో ప్రాముఖ్యత కలిగిన అంశంగా గుర్తించాల్సి ఉంది.

జాతీయ ఉపాధి హామీ పథకానికి 2016-17లో రూ.38,500 కోట్లు కేటాయించగా, 2017-18 ఆర్థిక సంవత్సరంలో దాన్ని రూ.48,000 కోట్లకి పెంచుతున్నట్లు కేంద్ర ఆర్థికమంత్రి తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. జాతీయ హామీ ఉపాధి పథకం అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇంత పెద్ద మొత్తంలో నిధుల కేటాయింపు జరగలేదని కేంద్ర ఆర్థిక మంత్రి వెల్లడించారు. దీంతోపాటు ఈ పథకం కింద చేపట్టే అన్ని పనులకు జీయో ట్యాగింగ్ చేపట్టడం ద్వారా ప్రజా జీవితంలో భారీగా పారదర్శకత సాధ్యమవుతుందని భావిస్తున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడడానికి ప్రభుత్వం సన్నిహితంగా పర్యవేక్షిస్తుందని కేంద్ర ఆర్థికమంత్రి స్పష్టం చేశారు. ఇందులో ఎలాంటి రాజీ పడబోమని పార్లమెంటు సభ్యుల హర్షధ్వానాల మధ్య కేంద్ర ఆర్థికమంత్రి ప్రకటించారు. గతంలో, ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన పథకాలపై ఈ ఏడాది బడ్జెట్‌లో ప్రస్తావిస్తూ 2017-18 ఆర్థిక సంవత్సరంలో 20,000 మంది గ్రామీణ యువతకి, 2022 నాటికి 5 లక్షల మందికి నూతన శిక్షణా కార్యక్రమాల నిర్వహణకి ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు కేంద్ర ఆర్థికమంత్రి స్పష్టం చేశారు.

అయితే ఇప్పటికే అనేక పంచాయతీ రాజ్ సంస్థల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి తగిన రీతిలో మానవ వనరుల లేమి పట్టి పీడిస్తోంది. ఈ దిశగా ఫలితాలు సాధించడానికి 2017-18 ఆర్థిక సంవత్సరంలో 'ఫలితాల సాధన కోసం మానవ వనరుల సంస్కరణల'ను ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. గ్రామీణ, వ్యవసాయదారులను ఆదుకోవ డానికి ప్రత్యేకించి సబ్ కా సాత్, సబ్ కా వికాస్ నినాదాన్ని సాకారం చేయడానికి తగిన చర్యలకు ప్రభుత్వం సిద్ధపడుతోంది. ఈ దిశగా, తన బడ్జెట్ ప్రారంభంలో బాలికలు, మహిళలపై కేంద్ర ఆర్థికమంత్రి ప్రత్యేక ప్రస్తావన చేశారు.

గ్రామీణ స్థాయిలో మహిళా శక్తి కేంద్రాలను దేశవ్యాప్తంగా ఉన్న 14 లక్షల అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొల్పడానికి రూ.500 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ఈ కేంద్రాల ద్వారా మహిళలు, బాలికల సర్వతోము ఖాభివృద్ధికి అవసరమైన అన్ని రకాల శిక్షణలు, ఉపాధి కల్పన, ఆరోగ్యం, పౌష్టికాహారం వంటివి సాధించనున్నారు.

ఇక ఇప్పటికే అంటే డిసెంబర్, 31 నాడే ప్రధానమంత్రి గర్భిణీల ఆర్థిక సాయం కోసం ఒక పథకాన్ని ప్రకటించారు. దీని కింద ప్రతి గర్భిణీకి నేరుగా తన ఖాతాకే రూ.6 వేలను పంపడం ద్వారా హాస్పిటల్ వ్యయం, పుట్టిన పిల్లలకు వ్యాక్సిన్లు వేయండం వంటివి చేసుకోగలుగుతారు. ఈ పథకం గ్రామీణ ప్రాంత ప్రజలకు మరెంతగానో ఉపయోగపడుతుంది. దీంతోపాటు ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకానికి రూ.19 వేల కోట్లు కేటాయించడం ద్వారా దేశంలోని అన్ని గ్రామీణ ఆవాసాలను అనుసంధానం చేయడం సాధ్యం అవుతుంది. అయితే ఈ పథకంలో రాష్ట్ర ప్రభుత్వాల వాటాను కూడా పరిగణనలోకి తీసుకొంటే మొత్తం క్యాపిటల్ వ్యయం రూ.27,000 కోట్లకు చేరుకోనుంది. ఇక 2016-17 ఆర్థిక సంవత్సరంలో రోజుకి ఈ పథకం కింద 133 కిలోమీటర్ల రహదారులు నిర్మిస్తే అదే 2011-14లో అది కేవలం రోజుకి 73 కిలోమీటర్లు మాత్రంగానే ఉంది. పైగా ప్రధాన మంత్రి అవాస్ యోజన కింద పేదల ఇళ్ల నిర్మాణం కోసం 2017-18 బడ్జెట్‌లో 44 శాతం పెంచడంతో అది రూ.23,000 కోట్లకు చేరుకుంది. దీని కింద కోటి గృహాల నిర్మాణాన్ని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అదే విధంగా, దీన దయాళ్ ఉపాధ్యాయ గ్రామ జ్యోతి యోజన పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో విద్యుదీకరణ కోసం ఈ ఆర్థిక సంవత్సరంలో గత ఏడాది కన్నా 43 శాతం అధికంగా అంటే రూ.4,814 కోట్లకు పెంచడం జరిగింది.

### సంక్షిప్తంగా:

భారతదేశంలో సుస్థిరాభివృద్ధి జరగాలంటే గ్రామీణ భారతంలో మౌలిక సౌకర్యాల కల్పనతో పాటు రైతుకి వెన్నుదన్నుగా ఉండడం అత్యంత కీలకమైన అంశంగా గుర్తించాల్సి ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక సౌకర్యాల కల్పనతో పాటు వ్యవసాయాభివృద్ధి కోసం గతంలోలాగా కాకుండా ప్రత్యక్షంగా అనుసంధాన కార్యక్రమాలను నిర్వహించాల్సి

ఉంటుంది. దీనికి సంబంధించిన చర్యలను తీసుకుంటూ, గత రెండున్నరేళ్లుగా రూపొందించిన పథకాలను సక్రమంగా అమలు చేయడం ద్వారా గ్రామాల్లో, చిన్న పట్టణాల్లో ఉపాధి కల్పనను గృహ స్థాయిలో కల్పించడం, వ్యవసాయం, దాని అనుబంధ పరిశ్రమలను వృద్ధి చేయడం ద్వారా దేశ గ్రామ సీమల్లో శాంతి, సంపద వర్ధిల్లుతాయని ఆశిద్దాం.

**గ్రామీణ విద్యుదీకరణ**

గ్రామీణ విద్యుదీకరణకి కేంద్ర ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో అత్యంత ప్రాముఖ్యత ఇచ్చింది. రాజీవ్‌గాంధీ గ్రామ్య విద్యుదీకరణ పథకాన్ని అమలు చేసినా దేశంలోని అనేక గ్రామీణ ప్రాంతాలు వెలుగుకి నోచుకోలేకపోయాయి. ఈ నేపథ్యంలో 9, ఫిబ్రవరి, 2017న పార్లమెంటులో కేంద్ర విద్యుత్‌శాఖ మంత్రి ఒక ప్రశ్నకి సమాధానిమిస్తూ సంపూర్ణ విద్యుదీకరణ సాధించడానికి దేశంలోని 29 రాష్ట్రాల్లో 28 రాష్ట్రాలు కేంద్ర పథకంతో కలిసి పనిచేయడానికి అంగీకరించినట్లు తెలిపారు. దేశం మారుమూల ప్రాంతాల్లో, మరీ ముఖ్యంగా మావోయిస్టు ప్రభావిత గ్రామాల్లో రాజీవ్ గాంధీ విద్యుదీకరణ పథకం పెద్దగా ప్రభావితం చూపించలేదని చెప్పారు.

ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గ్రామీణ విద్యుదీకరణ అన్న కార్యక్రమాన్ని భారీ స్థాయిలో చేపట్టడం జరుగుతోంది. 2014-15 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ వ్యర్థ జలాలను, మురుగు జలాలను వినియోగించి విద్యుత్ ఉత్పత్తి సాధించిన ఢిల్లీ అనుభవాన్ని దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో అమలు చేయడానికి ప్రతిపాదించింది.

విస్తారంగా సౌర విద్యుత్ వినియోగంతో భారతదేశ విద్యుత్ చిత్ర పటాన్ని సమూలంగా మార్పు చేయడానికి కేంద్ర ప్రభుత్వం కంకణబద్ధమై ఉంది.

**బడ్జెట్ ప్రకటనలో ముఖ్యాంశాలు:**

1. రైతు రుణాల కోసం రికార్డు స్థాయిలో రూ. 10 లక్షల కోట్లకి పెంపు
2. భూసార పరీక్ష కార్డుల పరిధి పెంచడం: క్రిషి విజ్ఞాన కేంద్రాల్లో మినీ ల్యాబ్‌ల ఏర్పాటు
3. నాబార్డు ద్వారా దీర్ఘకాలిక వ్యవసాయ నిధి కోసం రూ. 40,000 కేటాయింపు
4. రాష్ట్రాల్లో ఒప్పంద వ్యవసాయం కోసం చట్టం చేయడం
5. పాల ఉత్పత్తుల అభివృద్ధి కోసం రూ. 8,000 కోట్ల నిధి
6. అంత్యోదయ పథకం కిందకి దేశంలోని కోటి కుటుంబాలను తీసుకొని రావడం
7. జాతీయ ఉపాధి హామీ పథకానికి రికార్డు స్థాయిలో రూ. 48 వేల కోట్ల కేటాయింపు
8. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకానికి రూ. 19 వేల కోట్ల కేటాయింపు ఇందులో రాష్ట్రాలు చేసే వ్యయం కలిపితే అది రూ. 27 వేల కోట్లు అవుతుంది.
9. ప్రధానమంత్రి అవాస్ యోజన కోసం రూ. 23 వేల కోట్ల కేటాయింపు.
10. మే, 2018 నాటికి దేశంలో వంద శాతం గ్రామాల్లో విద్యుదీకరణ లక్ష్యం.

■

*51వ పేజీ తరువాయి...*

**మౌలిక సదుపాయాల రంగం - బడ్జెట్ కేటాయింపులు**

దానివలన డిమాండు సప్లయి మధ్య ఉన్న తేడా తగ్గిపోతుంది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా ఇచ్చే వడ్డీ సబ్సిడీల వలన ఆ పథకములో లబ్దిదారులకు నిర్మాణ ఖర్చులు తగ్గుతాయి. అందుకే ఈ బడ్జెట్‌లో PMAY (ప్రధాన మంత్రి ఆవాస్ యోజన) NHB (NATIONAL HOUSING BANK) లకు కేటాయించిన నిధులు గృహ నిర్మాణ రంగానికి ఆర్థికంగా వెసులుబాటు కల్పిస్తాయి. గృహ నిర్మాణానికి ఇచ్చిన హోదాతో మొత్తము రియల్ ఎస్టేటు రంగం అభివృద్ధి చెందుతుంది. రియల్ ఎస్టేటు ఇండస్ట్రీ ఎన్నో ఏళ్ళుగా ఎదురు చూస్తున్న పరిణామం ఇది.

గృహ నిర్మాణానికి ఈ హోదా కల్పించడమంటే ఈ రంగంలో పెట్టుబడులను ఆకర్షించడము మరియు నిర్మాణదారులకు ప్రభుత్వ సబ్సిడీలు పన్ను ప్రోత్సాహకాలు, వ్యవస్థాపక వ్యవస్థల ద్వారా ఆర్థిక సాయము (తక్కువ వడ్డీ రేటుతో) అందజేయడము. ఇన్సురెన్స్ కంపెనీలు, బాంకులు తదితర సంస్థలు పెట్టుబడులకు ముందుకొచ్చే అవకాశము ఉన్నది. అయితే నిర్మాణదారులకు ఆర్థికావసరాలు ముఖ్యంగా భూసేకరణప్పుడు కల్గుతాయి. ఆ సమయములో నిధులను సమీకరించు కోగల్గితే మిగిలిన ఖర్చును గృహ లబ్దిదారు లేదా యజమాని భరిస్తారు. కాబట్టి నిర్మాణదారులకు ఆ సమయములో వనరుల సమీకరణ సులభతరంగా చేయగల్గితే ఈ రంగము అభివృద్ధిలో ముందుకు దూసు కెళ్తుంది.

**ముగింపు:**

ఈ బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వము మౌలిక రంగానికి విస్తృత కేటాయింపులు కల్పిస్తు ఆ రంగములో అభివృద్ధి ద్వారా మిగిలిన రంగాల్లో అభివృద్ధిని ఆశిస్తుంది. బడ్జెట్ కేటాయింపులు ఒక ఎత్తైతే వాటిని సరిగ్గా వినియోగ పరచడము మరొక సవాలు. దానిలో విజయము పొందితేనే అనుకున్న ధ్యేయాలు అంటే ఉత్పాదకత, సమర్ధత మరియు జీవన నాణ్యతను సాధించ గలుగుతాము.


■

# వైద్య సేవల్లో ఆరోగ్యకరమైన అభివృద్ధి



**వాస్తవానికి వైద్య, ఆరోగ్య రంగంపై మనం ఏంతో ఖర్చు చేస్తున్నామని, స్థూల జాతీయోత్పత్తిలో 2014-15 సంవత్సరం సుమారు 1.3% కేటాయించామని, అలాగే 2014-15లో ప్రభుత్వం చేసిన మొత్తం ఖర్చులో 4.8% ఈ రంగంపైనే ఖర్చు చేశామని గొప్పలు చెప్పుకుంటున్నాం. అయితే 2013-14 లో చేసిన ఖర్చు 20 మిలియన్ డాలర్ల లోపుగానే ఉందని, ఇతర దేశాలతో పోలిస్తే ఇది తృణప్రాయమని స్పష్టమవుతోంది. తొలినుంచీ ప్రజారోగ్యంపై నామమాత్రంగా ఖర్చు చేయడం చారిత్రాత్మక మైన తప్పిదంగానే మిగిలిపోయింది. ..**

కేంద్రప్రభుత్వ బడ్జెట్‌లో వైద్య ఆరోగ్య శాఖకు గత ఏడాది (2016-17) కేటాయించిన రూ. 39,533 కోట్లకంటే ఈ ఏడాది బడ్జెట్ 2017-18లో 27% అధికంగా అంటే రూ. 50,283 కోట్ల కేటాయింపు జరిగింది. దీంతో గత 15ఏళ్ళలో ఎన్నడూ లేనంత పెద్ద ఎత్తున వైద్య ఆరోగ్య శాఖకు నిధులకేటాయింపు జరిగినట్టు స్పష్టమవుతోంది. ఈ పైన గ్రాఫ్‌ను చూడండి. వచ్చే ఆర్థిక సంవత్సరంలో కూడా వైద్య ఆరోగ్య విభాగానికి సంబంధించి ద్రవ్యోల్బణం అంచనాలకు అనుగుణంగా సర్దుబాటు చేసిన తర్వాత జరిగిన కేటాయింపు కావడంవల్ల ఇది ఆరోగ్యకరమైన వాస్తవిక పెరుగుదలగా గుర్తించాలి. వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించిన వివిధ పద్దులకు కేటాయించిన నిధులు పరిశీలిస్తే కేంద్ర ప్రభుత్వం ప్రజారోగ్యం పై ఎంతటి శ్రద్ధ వహిస్తోందో వెల్లడవుతుంది.




ఈ రేఖాచిత్రం ద్వారా కేంద్ర ప్రభుత్వం 2004-05 నుంచి 2017-18 ఆర్థిక సంవత్సరం వరకు వైద్యఆరోగ్య శాఖకు (సాధారణ పరిస్థితుల్లో) కేటాయించిన నిధులపైన, చేసిన ఖర్చుల పైనా ఒక అవగాహన కలుగుతుంది. ప్రజారోగ్య రంగంలో ఇంతకుముందు అతి తక్కువ నిధుల కేటాయింపుతోబాటు

**రాజీవ్ ఆహూజా,** డవలప్‌మెంట్ ఎకనమిస్ట్, న్యూ ఢిల్లీ.
E-mail: ahujaahuja@yahoo.com

ఖర్చులపై కూడా కొత్త అధికంగా ఉండేదన్న వాస్తవాన్ని ఇక్కడ గుర్తుంచుకోవలసిన అవసరం ఉంది.

దేశం గణనీయమైన ఆర్థికాభివృద్ధి సాధిస్తూ అపారమైన ఆదాయ వనరులు అందుబాటులోకి వస్తున్న సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలను విస్తృతం చేసేందుకు సమృద్ధిగా నిధులు ఖర్చు చేసేందుకు అవకాశం ఉండడంతో 2005-2006 ఆర్థికసంవత్సరంలో జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకాన్ని ప్రవేశపెట్టారు. అందువల్ల 2004-2005 నుంచి 2017-18 వరకు (మధ్యలో 2013 -14 నుంచి 2015-16 వరకు తప్ప) ప్రతి ఏటా కనీసం పదిశాతం కంటే ఎక్కువగానే గ్రామీణ వైద్యసేవలకోసం నిధుల కేటాయింపులను పెంచుతూనే ఉన్నారు. ఈ మధ్య మూడేళ్ళ కాలంలో ఒక ఏడాది కేంద్రంలో ప్రభుత్వం మారిపోవడం, మరో ఏడాది 14వ ఆర్థికసంఘం సిఫార్సుల మేరకు వివిధ రకాల పన్నులలో రాష్ట్రాలకు లభించవలసిన వాటా మొత్తం గణనీయంగా పెరగడం వల్ల వైద్యఆరోగ్య సేవల కోసం కేంద్రం నుంచి నిధుల కేటాయింపు తగ్గిపోయింది. ఇలా పన్నుల వాటాకింద పెద్దమొత్తంలో సొమ్ము సంక్రమించడం వల్ల రాష్ట్ర ప్రభుత్వాలు తమ పరిధిలో ఉన్న వైద్య సేవలతోసహా వలుకార్యక్రమాలను విస్తృతంగా చేపట్టే అవకాశం లభించింది. ఇలా హెచ్చు నిధులు లభిస్తుండడం వల్ల రాష్ట్ర ప్రభుత్వాలు కూడా 2010-11 వరకు వార్షిక బడ్జెట్‌లలో నిధులు పెంచుతూ భారీగా ఖర్చు చేస్తూ వచ్చాయి. అయితే ఆ తర్వాత నిధుల కొరతవల్ల 2010-11 నుంచి 2015-16 వరకు అభివృద్ధి రేటు 10 శాతం కంటే తక్కువగానే నమోదు కావడం దురదృష్టకరం. ఈ నేపథ్యంలో ఇప్పుడు నిధులు పెరగడం విశేషం

అయితే 2016-17 ఆర్థికసంవత్సరానికి సంబంధించి ప్రజారోగ్యంపై ఖర్చుల వివరాలన్నీ వెంటనే తెలిసే అవకాశం లేనప్పటికీ గతంలోకంటే సుమారు 17 శాతం వరకు అధికంగానే ఉండవచ్చునని సవరించిన అంచనాలు వెల్లడిస్తున్నాయి. దీనికి తోడు 2015-16 బడ్జెట్ నాటకి గతంలో కంటే అభివృద్ధి రేటు 15 శాతం కంటే కుంచించుకుపోగా నిధుల కేటాయింపు కూడా సుమారు 15 శాతం మేరకు తగ్గింది. దీంతో ఆర్థిక సంవత్సరం మధ్యలో నిధుల కేటాయింపు- ఖర్చు అంచనాల సవరింపులతో మొత్తం మీద 9 శాతం మేరకు వృద్ధి నమోదు జరిగింది. ఈ నేపథ్యంలో 2017-18 లో వైద్యఆరోగ్య సేవలకోసం కేటాయింపులు ఒకేసారి 27 శాతానికి పెరగడం ఆరోగ్యకరమైన అభివృద్ధికి ప్రాతినిధ్యం వహిస్తోందని చెప్పుకోవచ్చు. అలాగే కేంద్రం నిధుల కేటాయింపు పెరగడం వల్ల రాష్ట్రాల్లో కూడా వైద్యఆరోగ్యసేవలపై ప్రణాళికాబద్ధమైన ఖర్చు పెరిగే అవకాశం కలుగుతుంది.

వైద్యఆరోగ్యశాఖలో ఖర్చుకు తగిన కేటాయింపు లభించడాన్ని ఆరోగ్యకరమైన పరిణామంగా ఎలా భావించాలి? గత రెండేళ్లలో బడ్జెట్ సందర్భంగా కేటాయించిన మొత్తాలను ఖర్చుచేసిన విధానమే ఈ విశ్వాసాన్ని కల్పిస్తోంది. ఈ కింద పట్టికను పరిశీలిద్దాం .......

**బడ్జెట్ కేటాయింపులు - సునిశిత పరిశీలన**

2017-18 కేంద్ర బడ్జెట్‌లోని వైద్య ఆరోగ్యశాఖ పద్దులలో 94% వరకు కేటాయింపులుపొందే ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖకు సంబందించిన లెక్కలు నిశితంగా పరిశీలిస్తే ఆసక్తికరమైన కింది అంశాలు వెల్లడవుతాయి.

* బడ్జెట్‌లో వైద్య ఆరోగ్యశాఖపద్దు కింద వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాతాలకు బదలాయించిన మొత్తాలలో 59 % వరకు కేంద్రం ప్రవేశపెట్టిన జాతీయ ఆరోగ్య పథకం, ఆరోగ్య

**పట్టిక**

| బడ్జెట్ వినియోగ శాతం | 2010-11 | 2011-12 | 2012-13 | 2013-14 | 2014-15 | 2015-16 | 2015-16 |
|---|---|---|---|---|---|---|---|
| సవరించిన బడ్జెట్ కేటాయింపు | 99.6 | 92.9 | 84.9 | 82.6 | 81.5 | 105 | 103.7 |
| వాస్తవ బడ్జెట్ కేటాయింపులు | 97.2 | 85 | 80.9 | 80.7 | 81.9 | 105.7 | |

మూలం: వివిధ సంవత్సరాలకు సంబంధించిన కేంద్ర బడ్జెట్ పత్రాలు

**గమనిక :**

1) ఇందులో ప్రజారోగ్యం కోసం ప్రభుత్వం చేసే ఖర్చులను లెక్కించేందుకు గాను వైద్య, ఆరోగ్య & కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, ఆయుష్ మంత్రిత్వ శాఖ కేటాయింపులను ఒక్కటిగా తీసుకున్నారు. వైద్య,ఆరోగ్య & కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖను 2014-15 తర్వాత ప్రత్యేక మంత్రిత్వ శాఖగా గుర్తించారు. అందువల్ల మొత్తం వైద్య ఆరోగ్య శాఖల ఖర్చుల పద్దులను లెక్కించేటప్పుడు వైద్య,ఆరోగ్య & కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, ఆయుష్ మంత్రిత్వ శాఖ, వైద్య పరిశోధన శాఖల పద్దులను కలిపి లెక్కించారు.

సంరక్షణ పథకం వంటి కార్యక్రమాలపైనే ఖర్చుపెట్టవలసి ఉంటుంది.

* అఖిలభారత వైద్య విజ్ఞాన సంస్థల ఏర్పాటు, వైద్య కళాశాలలను అభివృద్ధి చేయడానికి వినియోగపడే ప్రధాన మంత్రి స్వాస్థ్య సురక్ష యోజన (పీ.ఎం. ఎస్.ఎస్.వై) వంటి పథకాలకు 15% సొమ్ము మాత్రమే కేటాయించారు.

* వైద్య ఆరోగ్యసేవలను విస్తృతపరచే దిశలో మానవ వనరులను పెంపొందించడానికి, ఉన్నతస్థాయి వైద్య విద్యా సంస్థలను మెరుగుపదరచేందుకు బడ్జెట్ కేటాయింపులు పెంచారు (రూ.3, 425 కోట్లు) జాతీయ గ్రామీణ ఆరోగ్య కార్యక్రమం (రూ.3, 100కోట్లు) పీ.ఎం.ఎస్.ఎస్.వై (రూ.1525 కోట్లు) పథకాలకు కేటాయించడంతో ఈ మూడు పద్దుల కిందే దాదాపు 80 శాతం సొమ్ము ఖర్చవుతుంది.

* వైద్యసిబ్బంది కొరత, ముఖ్యంగా నిపుణులైన వైద్యుల కొరతను దృష్టిలో ఉంచుకుని మానవ వనరుల అభివృద్ధికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇచ్చింది. ఇకపై నిపుణులైన వైద్యులను తయారుచేసేందుకు ఏటా 5వేల పోస్ట్-గ్రాడ్యుయేట్ సీట్లు కల్పిస్తామని ఆర్థికశాఖ మంత్రి తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొనడం విశేషం. దీని కోసం మానవ వనరుల అభివృద్ధికై వైద్య విద్య శిక్షణ సంస్థలను మెరుగుపరచేందుకు అత్యధిక నిధులు కేటాయించడం ఆశ్చర్యమనిపించబోదు.

* జాతీయ గ్రామీణ ఆరోగ్య కార్యక్రమానికి వరుసగా నిధుల కేటాయింపును పెంచుతూనే ఉన్నారు. వైద్యఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలకు కేటాయించిన మొత్తంలో సుమారు 45% ఈ కార్యక్రమానికే కేటాయించారు. అయినప్పటికీ నిశితంగా పరిశీలిస్తే ఇందులో కూడా ఆరోగ్య వ్యవస్థను మెరుగుపరచేందుకు తీసుకోవలసిన చర్యలకోసమే హెచ్చు కేటాయింపులు జరిగినట్టు స్పష్టమవుతుంది.

* పీ.ఎం.ఎస్.ఎస్.వై. కింద ఏర్పాటయ్యే వైద్య విద్యా సంస్థలతోబాటు ప్రభుత్వ ఆస్పత్రుల నిర్మాణం, అభివృద్ధి, వంటి పెట్టుబడులకు ప్రాధాన్యం ఇవ్వడంవల్ల గత బడ్జెట్‌లో కేటాయించిన సొమ్ముకంటే ఇప్పటి బడ్జెట్‌లో కేటాయించిన సొమ్ము దాదాపు రెట్టింపైంది. (ఈ కేటాయింపుల మొత్తం 2016-17లో రూ. 1760 నుంచి 2017-18లో రూ.3, 510లకు పెరిగింది).

* వైద్య ఆరోగ్య సేవలను మరింత విస్తృత పరచేందుకు ఈబడ్జెట్‌లో గతంలో కంటే సుమారు 27% హెచ్చు నిధులు కేటాయించినప్పటికీ ఇంతకంటే అధికంగా ఆశించిన చాలామంది అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**ఎక్కువ మొత్తం తక్కువగా కనిపించేదెప్పుడు?**

**కేంద్ర వైద్య, ఆరోగ్య & కుటుంబ సంక్షేమ శాఖ బడ్జెట్** **(రూపాయలు కోట్లలో )**

| | | 2016-17బడ్జెట్ | 2017-18బడ్జెట్ | మొత్తం మార్పు | మార్పు |
|---|---|---|---|---|---|
| | | A | B | B-A | శాతం % |
| 1) | కేంద్ర సిబ్బంది నిర్వహణ ఖర్చు | 3804 | 4731 | 927 | 24.4 |
| 2) | కేంద్ర పథకాలు/కార్యక్రమాలు ... | 4789 | 6967 | 2178 | 45.5 |
| | వాటిలో ప్రధానమంత్రి స్వాస్థ్య సురక్ష యోజన | 2450 | 3975 | 1525 | 62.2 |
| 3) | కేంద్ర ప్రభుత్వ విభాగంలో ఇతర ఖర్చులలో | 6607 | 7965 | 1358 | 20.6 |
| | చట్టబద్ధమైన/ఇతర నియంత్రణ సంస్థలు | 100 | 171 | 71 | 71 |
| | స్వయంప్రతిపత్తిగల సంస్థలు | 5174 | 6088 | 9141 | 17.7 |
| | ఇతరములు | 1333 | 1706 | 373 | 28 |
| 4) | కేంద్రప్రభుత్వ సహాయ పథకాలు (ఏంబి) | 21862 | 27691 | 5829 | 26.7 |
| | ఏ) జాతీయ ఆరోగ్య పథకం ...... ఇందులో ..... | 20362 | 26691 | 6329 | 31.1 |
| | జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకం | 18087 | 21189 | 3102 | 17.2 |
| | జాతీయ పట్టణ ఆరోగ్య పథకం | 950 | 752 | -198 | -20.8 |
| | ఇతర ఆరోగ్య పథకాలు | 725 | 725 | 0 | 0 |
| | వైద్య, ఆరోగ్య విద్య సిబ్బంది వనరులు | 600 | 4025 | 3425 | 570.8 |
| | (బి) జాతీయ ఆరోగ్య పరిరక్షణ పథకం | 1500 | 1000 | -500 | -33.3 |
| | **మొత్తం** | **37062** | **47354** | **10292** | **27.8** |

ఈ బడ్జెట్ ద్వారా పెద్దమొత్తాల కేటాయింపును ఆశించడానికి ప్రాతిపదిక ఏమిటి?

* ఇందుకు కారణాల్లో ఒకటి వైద్య ఆరోగ్య సేవలపై ఖర్చు చేసే మొత్తం తొలినుంచి అత్యల్పంగా ఉండడం కాగా, రెండోది జాతీయ ఆరోగ్య సంరక్షణ పథకం ప్రకటించినప్పటికీ ఇందుకోసం నిర్దిష్టమైన కార్యక్రమం లేకపోగా ఇటీవల ప్రకటించిన పథకాలకు సంబంధించి నిధుల కేటాయింపులో దేనికెంత అన్న అంశాల్లో కూడా స్పష్టత లేకపోవడం ప్రధానంగా చెప్పుకోవచ్చు.

ఈ రెండు సందర్భాలను మరింత లోతుగా, నిశితంగా పరిశీలిస్తే బడ్జెట్ కేటాయింపులపై వారి అంచనాలు సాధారణస్థాయికంటే హెచ్చుగా ఉండడానికి తగిన కారణాలు గోచరిస్తాయి.

### భారత దేశంలో ప్రజారోగ్యం పై చేసే ఖర్చు స్వల్పమే:

వాస్తవానికి వైద్య, ఆరోగ్య రంగంపై మనం ఏంతో ఖర్చు చేస్తున్నామని, స్థూల జాతీయోత్పత్తిలో 2014-15 సంవత్సరం సుమారు 1.3% కేటాయించామని, అలాగే 2014-15లో ప్రభుత్వం చేసిన మొత్తం ఖర్చులో 4.8% ఈ రంగంపైనే ఖర్చు చేశామని గొప్పలు చెప్పుకుంటున్నాం. అయితే 2013-14 లో చేసిన ఖర్చు 20 మిలియన్ డాలర్ల లోపుగానే ఉందని, ఇతర దేశాలతో పోలిస్తే ఇది తృణప్రాయమని స్పష్టమవుతోంది. తొలినుంచి ప్రజారోగ్యంపై నామమాత్రంగా ఖర్చు చేయడం చారిత్రాత్మక మైన తప్పిదంగానే మిగిలిపోయింది.

ఈ తప్పిదాన్ని కప్పిపుచ్చుకునేందుకు ప్రతియేటా కేటాయింపులలో నామమాత్రపు పెంపుదలవల్ల జరిగిన నష్టాన్ని ఏమాత్రం భర్తీ చేయలేము. అంతే గాకుండా కేటాయించిన సొమ్ములో కనీసం మూడో వంతు కూడా ఖర్చుచేయలేకపోవడం మరింత దారుణం. అంటే ప్రభుత్వం కేటాయించిన సొమ్ములో మూడింతరెండు వంతుల సొమ్ము రాష్ట్రాల వద్ద మిగిలిపోతోందంటే ఆరోగ్య రంగాన్ని మనం ఎంత ఘోరంగా విస్మరించమో స్పష్టమవు తోంది. అందువల్ల వైద్య ఆరోగ్య రంగానికి కేంద్రం కేటాయించే సొమ్మును పూర్తిగా సద్వినియోగం చేసుకోవలసిన బాధ్యత రాష్ట్రప్రభుత్వాలపై ఉంది. పద్నాలుగో ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు రాష్ట్ర ప్రభుత్వాలకు పెద్దఎత్తున నిధులు లభించడం వల్ల ఆరోగ్యశాఖకు కూడా భారీగానే నిధుల కేటాయింపు జరిగింది. అందువల్ల రాష్ట్రాల్లో నిధుల కేటాయింపు కాకుండా వాటిని సక్రమంగా ఖర్చుచేయడమే ప్రధాన సమస్యగా కనిపిస్తోంది. వాస్తవానికి ప్రజలందరికి వైద్యసేవలు అందేలా చూడడం కూడా రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత. అయితే కేటాయింపులకు చేసే ఖర్చుకు పొంతన లేకపోవడానికీ, సంబంధిత బాధ్యులపై అజమాయిషీ లేకపోవడానికీ తగిన కారణాలు అన్వేషించాలి. నిజానికి వైద్య ఆరోగ్య రంగాలకు సొమ్ము కేటాయింపు ఒక చక్రమైతే వాటిని సక్రమంగా ఖర్చుచేయగల యంత్రాంగం రెండో చక్రంలా పనిచేయాలి. రెండు చక్రాలు సక్రమంగా తిరిగినప్పుడే బండి సాఫీగా నడుస్తుంది. ఇందుకోసం వైద్య ఆరోగ్య రంగంలో సేవలను అందించేందుకు తగిన యంత్రాంగాన్ని కూడా ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఈ లోపాలను సరిదిద్దే దిశలో రాష్ట్రప్రభుత్వాలకు తగిన రాజకీయ దృక్పథం, ప్రజారోగ్యంపై సరైన అవగాహనతోబాటు దూరదృష్టి కలిగిన నాయకత్వం అవసరం.

### జాతీయ ఆరోగ్య పరిరక్షణ పథకం (ఎన్.హెచ్.పి.ఎస్)

దేశంలో పేద ప్రజలందరికి లక్ష రూపాయల మేరకు ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించే పథకాన్ని త్వరలోనే ప్రవేశపెడ తామని ప్రధాన మంత్రి 2016 స్వతంత్ర దినోత్సవ సందర్భంగా ప్రకటించారు. అలాగే ఈ పథకం కింద ఎక్కువ మంది పేదలకు వైద్య సహాయం అందజేయడమేగాక నాణ్యమైన వైద్యసేవలు అందుబాటులోకి తేవడమే తమ లక్ష్యమని ఆర్థిక మంత్రి కూడా 2016 ఫిబ్రవరిలో తమ బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం 2017-18 బడ్జెట్‌లో ఈ అంశాన్ని ప్రస్తావించకపోవడంతో జాతీయ ఆరోగ్య పరిరక్షణ పథకంపై ప్రజలు పెంచుకున్న ఆశలపై నీళ్లు చల్లినట్టైంది. కానీ ఈ పథకాన్ని ప్రభుత్వం మూలనపడేయ లేదని, కేవలం వాయిదా వేసుకుందని తెలుస్తోంది. బహుశా అయిదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతున్నందువల్ల ఇది సరైన సమయం కాదని భావించివుండవచ్చునని తెలుస్తోంది. ఎన్నికల సందర్భంగా ఈ పథకాన్ని తాయిలంగా వినియోగిస్తున్నారన్న విమర్శలు రాకుండా ప్రభుత్వం జాగ్రత్త వహిస్తోందని భావించవలసి వస్తోంది. ఈ పథకాలకు ఏమేరకు నిధులు కేటాయిస్తారో కూడా స్పష్టత లభించలేదు. ఉదాహరణకు గర్భిణీలకు టీకాలు వేయించడం, పోషకాహారం అందజేయం కోసం చేస్తున్న ఖర్చు కింద నేరుగా వారి ఖాతాలోకే రూ.6 వేలు జమచేయాలని ప్రభుత్వం ఆశిస్తోంది. అలాగే బోదకాలు, కాలా అజర్ వ్యాధులను 2017 లోగానూ, కుష్టువ్యాధిని 2018 నాటికీ, అమ్మవారు (తట్టు) వ్యాధిని 2020 నాటికీ, క్షయ వ్యాధిని 2025 నాటికీ పూర్తిగా నిర్మూలించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోంది. అయితే వీటిని అమలు చేయాలంటే తగిన యంత్రాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధం చేసుకోవాల్సి ఉంటుంది. ఈ నిధుల కేటాయింపు ఏప్రాంతాలకు ఏవిధంగా ఉంటుందన్న అంశంపై స్పష్టత

*తరువాయి 72వ పేజీలో...*

# బలహీనవర్గాల సంక్షేమం... అభివృద్ధి



**షెడ్యూల్డు కులాలు, తెగల వెనుకబాటుతనానికి ప్రధాన కారణం విద్యాలోపమే. ఎస్సీ విద్యార్థులలో బడి మానేసేవారి శాతం జాతీయ సగటుకన్నా ఎక్కువని ఒక పరిశీలనలో తేలింది. వారివి ఆర్థికంగా పేద కుటుంబాలు కావడం ఇందుకు ఓ కారణం. తల్లిదండ్రులు చదువు భారాన్ని మోయలేక పోవడం లేదా అదనపు ఆర్జనపరులుగా కుటుంబ ఆదాయానికి మరికాస్త జోడించాల్సిన దుస్థితివల్ల అనేకమంది విద్యార్థులు మధ్యలోనే చదువు వదిలేస్తున్నారు.**

సమాజంలోని బలహీన, దుర్బలవర్గాలపట్ల 2017-18 కేంద్ర బడ్జెట్ ఆశావహ దృక్పథం ప్రదర్శించింది. మొత్తంగా చూస్తే గ్రామీణ ప్రాంతాలు, మౌలిక సదుపాయాలు, పేదరిక నిర్మూలనవైపు దృష్టి సారించింది. ఒక్కమాటలో చెబితే "పరివర్తిత, సశక్త, పరిశుభ్ర భారతం" (TEC India) అనే మూలసూత్రం ప్రాతిపదికగా బడ్జెట్ రూపొందింది. 'పరివర్తన, సశక్తీకరణ, పరిశుభ్రత' పదాలకు సమాజంలోని బలహీన, దుర్బలవర్గాలతో ప్రత్యేక సంబంధం ఉంది. ప్రజా జీవన నాణ్యతపై ప్రత్యక్ష ప్రభావం చూపే పరిపాలన నాణ్యతలో 'పరివర్తన'ను బడ్జెట్ ప్రధానంగా ఆకాంక్షిస్తోంది. సమాజంలోని వివిధ వర్గాలను బలోపేతం చేయాలని సంకల్పించింది. ప్రత్యేకించి దుర్బల వర్గాలలోని వాస్తవ సామర్థ్యాన్ని వెలికితీసి, వారి జీవన నాణ్యతను మెరుగుపరిచే బృహత్ లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. అలాగే షెడ్యూల్డు కులాలు-తెగలు (SC,ST), మహిళలు, పిల్లలు, అల్పసంఖ్యాక (మైనారిటీ) సామాజిక వర్గాలుసహా దివ్యాంగులపైనా శ్రద్ధతోపాటు ప్రత్యేకంగా దృష్టి సారించాల్సి ఉంది. ఆయా సామాజిక వర్గాలకు సామాజిక-ఆర్థిక సాధికారత కల్పనద్వారా వారి స్థాయిని మెరుగుపరచాలన్న ప్రభుత్వ ధ్యేయాన్ని బడ్జెట్ ప్రతిబింబించింది. తదనుగుణంగా వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాల పరిధిలోగల ఆయా వర్గాల కోసం కేటాయింపులు గణనీయంగా పెరిగాయి. కొన్ని కీలక కేటాయింపుల వివరాలు ఇలా ఉన్నాయి:-

(i) షెడ్యూల్డు కులాల సంక్షేమం కోసం కేటాయింపులను (2016-17వరకూ దీన్ని ఎస్సీ ఉప ప్రణాళికగా వ్యవహరించేవారు) రూ.52,393 కోట్లకు (2017-18 బడ్జెట్ అంచనాలు) పెంచారు. 2016-17నాటి బడ్జెట్ అంచనాల (రూ.38,833 కోట్లు)తో పోలిస్తే ఇది 35 శాతం అధికం.

(ii) షెడ్యూల్డు తెగల సంక్షేమం కోసం కేటాయింపులను (లోగడ దీన్ని గిరిజన ఉప ప్రణాళికగా వ్యవహరించేవారు) రూ.31,920 కోట్ల (2017-18 బడ్జెట్ అంచనాలు) పెంచారు. 2016-17 నాటి బడ్జెట్ అంచనాల (రూ.24,005.39 కోట్లు)తో పోలిస్తే ఇది 33 శాతం అధికం.

(iii) లైంగికతపరంగా నిధులు కేటాయింపులనూ 2017-18 బడ్జెట్ అంచనాల్లో రూ.1,13,326.65 కోట్లకు పెంచారు.

**శ్రీకర నాయక్,** సలహాదారు, (SJE) నీతీ ఆయోగ్, న్యూ ఢిల్లీ. E-mail: srikara@gov.in
**కుమారి అంజలి బన్సల్,** (YP) నీతి ఆయోగ్, న్యూ ఢిల్లీ. E-mail: anjali.bansal@gov.in

2016-17లో ఇది 90,769.80 కోట్లు మాత్రమే కాగా, ఈసారి 24.85%దాకా పెంపుదల కనిపించింది.

(iv) బాలల సంక్షేమం కోసం కేటాయింపులను 2017-18 బడ్జెట్‌లో రూ. 71,305.35 కోట్లకు పెంచారు. 2016-17లో ఇది రూ. 65,758.45 కోట్లు కాగా, ఈసారి 8.44 శాతం అధికంగా కేటాయించారు.

(v) మైనారిటీ వ్యవహారాల శాఖకు 2017-18 బడ్జెట్‌లో రూ. 4,195 కోట్లు కేటాయించగా, 2016-17లో కేటాయింపుల (రూ. 3827 కోట్లు)కన్నా ఇది 8.76 శాతం ఎక్కువ.

షెడ్యూల్డు కులాలు, తెగలకు సంబంధించి 26 కేంద్ర మంత్రిత్వ శాఖలు/విభాగాలు ఎస్సీల సంక్షేమానికి కేటాయింపులు చేయగా, 32 కేంద్ర మంత్రిత్వ శాఖలు/విభాగాలు ఎస్టీల సంక్షేమం కోసం కేటాయింపులు చేశాయి. మొత్తం మీద కేటాయింపులు గణనీయంగా పెరిగాయి. అయితే, వ్యవసాయంతోపాటు అందరూ దృష్టి సారించే తాగునీటి సరఫరా, గృహ నిర్మాణం, ఆరోగ్యం, విద్య తదితరాల్లో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన పథకాల గురించి పట్టిక 1, 2లలో వరుసగా వివరించాం.

**పట్టిక 1: ప్రధాన పథకాల కింద షెడ్యూల్డు కులాల సంక్షేమానికి కేటాయింపులు (రూపాయలు.. కోట్లలో)**

| మంత్రిత్వశాఖలు/విభాగాలు | పథకం | బడ్జెట్ అంచనా 2016-17 | బడ్జెట్ అంచనా 2017-18 | పెంపు శాతం |
|---|---|---|---|---|
| వ్యవసాయం, సహకారం, రైతు సంక్షేమం | ప్రధానమంత్రి పంటల బీమా | 921.00 | 1484.67 | 61.20 |
| వ్యవసాయం, సహకారం, రైతు సంక్షేమం | స్వల్పకాలిక రైతు రుణాలపై వడ్డీ రాయితీ | - | 2430.00 | కొత్త పథకం |
| వ్యవసాయం, సహకారం, రైతు సంక్షేమం | ప్రధానమంత్రి సాగునీటి సరఫరా (PMKSY) | 391.32 | 550.80 | 40.75 |
| తాగునీరు, పారిశుధ్యం | స్వచ్ఛ భారత్-గ్రామీణ | 1980.00 | 3068.62 | 54.98 |
| తాగునీరు, పారిశుధ్యం | జాతీయ గ్రామీణ తాగునీటి సరఫరా కార్యక్రమం | 1100.00 | 1331.00 | 21 |
| ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం | జాతీయ గ్రామీణ ఆరోగ్య కార్యక్రమం | 3931.02 | 4272.93 | 8.69 |
| గ్రామీణాభివృద్ధి | ప్రధానమంత్రి ఆవాస -గ్రామీణ (PMAY) | 5116.74 | 7652.72 | 49.56 |
| నైపుణ్యాభివృద్ధి | ప్రధానమంత్రి నైపుణ్యాభివృద్ధి | 311.00 | 470.00 | 51.12 |
| పాఠశాల విద్య, అక్షరాస్యత | నవోదయ విద్యాలయ సమితి | 380.00 | 418.27 | 10.07 |

ప్రధానమంత్రి పంటల బీమా పథకం (PMFBY), ప్రధానమంత్రి సాగునీటి పారుదల పథకం (PMKSY) కేటాయింపులు 2016-17తో పోలిస్తే, 2017-18లో వరుసగా 61 శాతం, 41 శాతం వంతున పెరిగాయి. ఇక 'స్వల్పకాలిక రైతు రుణాలపై వడ్డీ రాయితీ పథకం' ఈసారి కొత్తగా రూ. 15వేల కోట్లతో ప్రారంభం కానుండగా ఇందులో షెడ్యూల్డు కులాల వారికోసం రూ. 2430 కోట్లు కేటాయించారు. ఎస్సీలకు సంబంధించి కేటాయింపులు పెరిగిన ఇతర ప్రధాన పథకాలలో 'స్వచ్ఛ భారత్ మిషన్-గ్రామీణ (55శాతం), ప్రధానమంత్రి ఆవాస పథకం-గ్రామీణ (PMAY 50 శాతం), ప్రధానమంత్రి నైపుణ్యాభివృద్ధి పథకం (PMKVY 51 శాతం) ఉన్నాయి.

ఈ పథకాలన్నిటి కింద షెడ్యూల్డు తెగల సంక్షేమం కోసం కేటాయింపులలో పెరుగుదల కూడా ఇదేవిధంగా ఉంది. ఆ మేరకు 2016-17తో పోలిస్తే ప్రధానమంత్రి పంటల బీమా (PMFBY) 83 శాతం, ప్రధానమంత్రి సాగునీటి పథకం (PMKSY) 45 శాతం, స్వచ్ఛభారత్ మిషన్-గ్రామీణ (SBM-R) 55 శాతం, ప్రధానమంత్రి ఆవాస పథకం-గ్రామీణ (PMAY-R) 39 శాతం, ప్రధానమంత్రి నైపుణ్యాభివృద్ధి పథకం (PMKVY) 51 శాతం వంతున 2017-18 బడ్జెట్‌లో కేటాయింపులు పెరిగాయి. ఇక ప్రస్తుత బడ్జెట్ కాలం నుంచి కొత్తగా ప్రారంభమవుతున్న స్వల్పకాలిక రైతు రుణాలపై వడ్డీ రాయితీ పథకంలో భాగంగా ఎస్టీల కోసం రూ. 1,200 కోట్లు కేటాయించారు. ఆ వివరాలను దిగువ ఇచ్చిన పట్టిక 2లో చూడవచ్చు.

ఎస్సీ, ఎస్టీ, ఇతర వెనుకబడిన వర్గాలు (OBC), మైనారిటీలు, దివ్యాంగులు తదితరులకు సంబంధించిన వ్యవహారాలు పర్యవేక్షించే ప్రధాన మంత్రిత్వ శాఖలు/విభాగాలలో సానుకూల వ్యయచిత్రణను బడ్జెట్ ప్రతిబింబించింది.

| పట్టిక 2: ప్రధాన పథకాల కింద షెడ్యూల్డు కులాల సంక్షేమానికి కేటాయింపులు (రూపాయలు.. కోట్లలో) | | | | |
|---|---|---|---|---|
| మంత్రిత్వశాఖలు/విభాగాలు | పథకం | బడ్జెట్ అంచనా 2016-17 | బడ్జెట్ అంచనా 2017-18 | పెంపు శాతం |
| వ్యవసాయం, సహకారం, రైతు సంక్షేమం | ప్రధానమంత్రి పంటల బీమా పథకం | 392.86 | 719.04 | 83.02 |
| వ్యవసాయం, సహకారం, రైతు సంక్షేమం | స్వల్పకాలిక రైతు రుణాలపై వడ్డీ రాయితీ | - | 1200.00 | కొత్త పథకం |
| వ్యవసాయం, సహకారం, రైతు సంక్షేమం | ప్రధానమంత్రి సాగునీటి సరఫరా (PMKSY) | 187.20 | 272.00 | 45.29 |
| తాగునీరు, పారిశుధ్యం | స్వచ్ఛ భారత్-గ్రామీణ | 900.00 | 1394.83 | 54.98 |
| తాగునీరు, పారిశుధ్యం | జాతీయ గ్రామీణ తాగునీటి సరఫరా కార్యక్రమం | 500.00 | 605.00 | 21 |
| ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం | జాతీయ గ్రామీణ ఆరోగ్య కార్యక్రమం | 2125.22 | 2332.28 | 9.74 |
| గ్రామీణాభివృద్ధి | ప్రధానమంత్రి ఆవాస-గ్రామీణ (PMAY) | 3823.43 | 5318.28 | 39.09 |
| నైపుణ్యాభివృద్ధి | ప్రధానమంత్రి నైపుణ్యాభివృద్ధి | 157.75 | 238.15 | 50.96 |
| పాఠశాల విద్య, అక్షరాస్యత | నవోదయ విద్యాలయ సమితి | 203.00 | 223.81 | 10.25 |

షెడ్యూల్డు కులాలు, తెగల వెనుకబాటుతనానికి ప్రధాన కారణం విద్యాలోపమే. ఎస్సీ విద్యార్థులలో బడి మానేసేవారి శాతం జాతీయ సగటుకన్నా ఎక్కువని ఒక పరిశీలనలో తేలింది. వారివి ఆర్థికంగా పేద కుటుంబాలు కావడం ఇందుకు ఓ కారణం. తల్లిదండ్రులు చదువు భారాన్ని మోయలేకపోవడం లేదా అదనపు ఆర్జనపరులుగా కుటుంబ ఆదాయానికి మరికాస్త జోడించాల్సిన దుస్థితివల్ల అనేకమంది విద్యార్థులు మధ్యలోనే చదువు వదిలేస్తున్నారు. ఈ సమస్యపై బడ్జెట్ విస్తృత దృష్టి సారించింది. బలహీనవర్గాల విద్యార్థులకు ఉపకార వేతన పథకాల కోసం కేటాయింపులను గణనీయంగా పెంచడం ఇందుకో నిదర్శనం. మెట్రిక్ అనంతర ఉపకార వేతనం (PMS) కింద ఎస్సీ విద్యార్థుల కోసం 2016-17లో కేటాయించింది రూ.2,791 కోట్లు కాగా, 2017-18 బడ్జెట్‌లో 20 శాతం మేర పెంచి రూ.3,348 కోట్లు కేటాయించారు.

| పట్టిక 3: సామాజిక మంత్రిత్వశాఖలు/విభాగాలలో 2017-18 వ్యయచిత్రణ (రూపాయలు.. కోట్లలో) | | | |
|---|---|---|---|
| మంత్రిత్వశాఖలు/విభాగాలు | బడ్జెట్ అంచనా 2016-17 | బడ్జెట్ అంచనా 2017-18 | పెంపు శాతం |
| సాంఘిక న్యాయం, సాధికారత | 6566.95 | 6908.00 | 5.20 |
| గిరిజన వ్యవహారాలు | 4827.00 | 5329.00 | 10.39 |
| మైనారిటీ వ్యవహారాలు | 3827.00 | 4195.00 | 9.61 |
| దివ్యాంగుల సాధికారత | 784.00 | 855.00 | 9.05 |

ఇక నివాసాలకు పాఠశాల దూరంగా ఉండటం కూడా బలహీనవర్గాల విద్యార్థులు.. ప్రత్యేకించి బాలికలు బడి మానేయడానికి ప్రధాన కారణమవుతోంది. ఈసారి బడ్జెట్‌లో ఈ సమస్య పరిష్కారానికి ప్రాధాన్యం లభించింది. తదనుగుణంగా ఎస్సీ బాలురు, బాలికల కోసం వసతిగృహాల నిర్మాణానికి గత బడ్జెట్‌లో కేటాయించిన రూ.45 కోట్లను ఈసారి గణనీయంగా పెంచి రూ.155 కోట్లు చేశారు. అంతే కాకుండా ఎస్సీ విద్యార్థుల ఉన్నత విద్యా భ్యాసానికి వీలుగా 'జాతీయ విద్యార్థి సభ్యత్వం' పథకం కోసం 2016-17తో పోలిస్తే రూ.200 కోట్ల నుంచి ఈసారి రూ.230 కోట్లకు కేటాయింపులు పెంచారు. ఆ మేరకు ఉన్నత విద్యాశాఖ 'ప్రధానమంత్రి పరిశోధక విద్యార్థి సభ్యత్వం' (PMRF)పేరిట సరికొత్త పథకాన్ని అమలు చేయాల్సి ఉంటుంది. ఇందులో ఎస్సీల కోసం రూ.12 కోట్లు కేటాయించారు.

సమాజంలో ఉన్నతవర్గాలుగా పిలవబడేవారినుంచి వివిధ రూపాల్లో దౌర్జన్యానికి గురవుతున్న దుర్బలవర్గాలైన షెడ్యూల్డు కులాలవారి పౌరహక్కుల రక్షణ కూడా ప్రభుత్వ ప్రాధాన్యాలలో ఒకటిగా ఉండటంతో ఆ మేరకు బడ్జెట్‌లో దానికి సముచిత స్థానం ఇచ్చింది. ఇందులో భాగంగా పౌర హక్కుల రక్షణ చట్టం-1995, అత్యాచార నిరోధక చట్టం-1989లను

కట్టుదిట్టంగా అమలు చేసే యంత్రాంగాన్ని బలోపేతం చేయబూనింది. ఇందుకోసం 2016-17 బడ్జెట్‌లో రూ.150 కోట్లు కేటాయించగా తాజా బడ్జెట్‌లో దాన్ని 100 శాతం పెంచి రూ.300 కోట్లు కేటాయించింది.

షెడ్యూల్డు తెగలవారి సంక్షేమం కోసం తీసుకున్న ప్రధాన చర్యలలో మెట్రిక్ అనంతర ఉపకార వేతనం (PMS) కోసం కేటాయింపులు కూడా ఒకటి. దీనికింద ఎస్టీ విద్యార్థుల కోసం 2016-17లో రూ.1200 కోట్లు కేటాయించగా తాజా బడ్జెట్‌లో 12.25 శాతం మేర పెంచి రూ.1347 కోట్లు కేటాయించారు. 'ఎస్టీ విద్యార్థుల ఉన్నత విద్యాభ్యాసం కోసం జాతీయ విద్యార్థి సభ్యత్వం-ఉపకార వేతనం' కింద 2016-17లో కేటాయించింది రూ.50 కోట్లు మాత్రమే కాగా, ఈసారి ఏకంగా 140 శాతం పెంచి రూ.120 కోట్లు కేటాయించారు. గిరిజన అభివృద్ధి కోసం విధానాలు, కార్యక్రమాల రూపకల్పనలో ప్రధాన ఉత్పాదక వనరులు కాగల గిరిజన పరిశోధన సంస్థల (TRI)ను ప్రోత్సహించాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని కూడా బడ్జెట్ ప్రతిఫలించింది. ఈ సంస్థల కోసం 2016-17లో రూ.21 కోట్లు మాత్రమే కేటాయించగా తాజా బడ్జెట్‌లో దాదాపు 5 రెట్లు పెంచి రూ.80 కోట్లు కేటాయించింది.

మైనారిటీ సంక్షేమం విషయానికొస్తే.. విద్యా, నైపుణ్యాభివృద్ధి కల్పనపై 2017-18 బడ్జెట్‌లో ప్రభుత్వం దృష్టి సారించింది. తదనుగుణంగా మైనారిటీ వ్యవహారాల శాఖకు 9.6 శాతం పెంపుతో రూ.4,195 కోట్లు కేటాయించింది. గత బడ్జెట్ (2016-17)లో ఈ కేటాయింపులు రూ.3,827 కోట్లుగా ఉండటం గమనార్హం. ఇక 'మైనారిటీల విద్యా సాధికారత' కోసం మొత్తం కేటాయింపులు కూడా 2016-17లో 1,949 కోట్లు కాగా రూ.105 కోట్ల మేర పెంచి 2017-18 బడ్జెట్‌లో రూ.2054 కోట్లు కేటాయించింది. అదేవిధంగా 'నైపుణ్యాభివృద్ధి-జీవనోపాధి' కోసం కేటాయింపులు 2016-17లో రూ.542 కోట్లు కాగా తాజా బడ్జెట్‌లో 17 శాతం పెంచి రూ.635 కోట్లు కేటాయించింది. ఇక 'దివ్యాంగుల', ఇతర సామాజిక వర్గాల వ్యవహారాలను పర్యవేక్షించే దివ్యాంగుల సాధికారత శాఖమీద కూడా ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. ఆ మేరకు సదరు శాఖకు 2016-17లో రూ.784 కోట్లుగా ఉన్న కేటాయింపులను 10 శాతం పెంచి 2017-18 బడ్జెట్‌లో రూ.855 కోట్లుగా చూపింది.

దేశంలోని ప్రతి కుటుంబానికీ నిలువ నీడ కల్పించాలన్న దృఢ సంకల్పానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. దీన్ని సాకారం చేసే దిశగా ప్రధానమంత్రి ఆవాస పథకం-గ్రామీణ (PMAY) కింద అందుబాటు గృహనిర్మాణం ఇప్పటికే కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో పట్టిక 1, 2లలో చూపిన విధంగా ఎస్సీ, ఎస్టీలకు ఈ పథకం కింద కేటాయింపులను 50 శాతం, 39 శాతం వంతున పెంచింది. పేద కుటుంబాలకు ఉచిత వంటగ్యాస్ కనెక్షన్లు ఇవ్వడం కూడా ప్రభుత్వం చేపట్టిన ప్రధాన, విజయవంతమైన చర్య. దీన్ని సుస్థిరంగా కొనసాగించడం కోసం ప్రధానమంత్రి ఉజ్వల్ యోజన (PMUY) కింద 2016-17లో రూ.500 కోట్లుగా ఉన్న కేటాయింపులను రూ.20 కోట్ల మేర పెంచి తాజా బడ్జెట్‌లో రూ.520 కోట్లు కేటాయించింది. ఈ పథకం కింద రెండేళ్లలో 5 కోట్ల కుటుంబాలకు లబ్ధి కల్పించాలన్నది ప్రభుత్వ ధ్యేయం.

ఈ బడ్జెట్‌లో షెడ్యూల్డు కులాలు, తెగలు, ఇతర సామాజికవర్గాల్లోని యువతకు ఉపాధి, పారిశ్రామిక అవకాశాల కల్పనను కూడా ప్రభుత్వం ఒక ప్రధాన లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఆ మేరకు తీసుకుంటున్న కొన్ని చర్యలు ఇలా ఉన్నాయి:-

* షెడ్యూల్డు కులాలు, తెగలవారిలో పారిశ్రామిక నైపుణ్యాభివృద్ధికి ఉద్దేశించినదే 'స్టాండప్ ఇండియా'. ఈ పథకం కింద బడ్జెట్ కేటాయింపులు 2016-17లో ఇది రూ.500 కోట్లు కాగా ఈసారి రూ.520 కోట్లకు పెంచారు.
* 'పారిశ్రామిక విలువ పెంపు కోసం నైపుణ్య బలోపేతం' (STRIVE) పథకం తదుపరి దశ ప్రారంభం కోసం రూ.2,200 కోట్లు కేటాయించారు. ఐటీఐలలో విపణి సంబంధిత వృత్తివిద్యలో నాణ్యత మెరుగుపరచడం, పారిశ్రామిక సముదాయాలలో శిక్షణార్థి కార్యక్రమాలను పటిష్ఠం చేయడం ఈ పథకం ముఖ్యోద్దేశాలు.
* 'జీవనోపాధి ప్రోత్సాహక నైపుణ్య సాధన-పరిజ్ఞానావగాహన కార్యక్రమం' (SANKALP) కింద 3.5 కోట్ల మంది యువతకు విపణి సంబంధిత శిక్షణ ఇచ్చే పథకం కూడా 2017-18లో ప్రారంభం కానుండగా దీనికి ప్రత్యేక మూలనిధి కింద బడ్జెట్‌లో రూ. 4వేల కోట్లు కేటాయించారు.
* దేశంలో పాడి పరిశ్రమాభివృద్ధి కోసం తగిన ప్రాసెసింగ్, మౌలిక సదుపాయాల కల్పన కోసం జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు (NABARD) పరిధిలో పాడి ప్రాసెసింగ్-మౌలిక వసతుల అభివృద్ధి నిధిని మూడేళ్లలో రూ.8వేల కోట్ల మూల నిధిని ఏర్పాటు చేయనుండగా ప్రస్తుత బడ్జెట్‌లో రూ.2వేల కోట్లు కేటాయించారు. సమాజంలోని అణగారిన వర్గాలకోసం తాజా బడ్జెట్‌లో చేపట్టిన మరికొన్ని ముఖ్యమైన చర్యలు ఇలా ఉన్నాయి:-

(i) వృద్ధ పౌరుల కోసం 2017-18లో వారి ఆరోగ్య వివరాలతో కూడిన

***తరువాయి 72వ పేజీలో...***

# బడ్జెట్‌లో విధానపరమైన మార్పులు



**ప్రణాళికా వ్యయాలు, ప్రణాళికేతర వ్యయాలు అంటూ విభజన వల్ల ప్రణాళికా వ్యయం అభివృద్ధికి దోహదకారి, ప్రణాళికేతర వ్యయం అభివృద్ధి నిరోధకం అనే ఒక రకమైన అపోహ ఏర్పడేందుకు కారణమవుతోంది. ఫలితంగా ప్రణాళికా వ్యయాలకు అధిక కేటాయింపులు ఇచ్చి ప్రణాళికేతర వ్యయంలోకి వచ్చే నిర్వహణ ఖర్చుల వంటివి నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. 2017-18 కేంద్రబడ్జెట్ నుంచి బడ్జెట్ పత్రాల్లో ఈ విభజన తీసివేసి మొత్తం వ్యయాన్ని ఒకే పద్దులో చూపిస్తున్నారు.**

12వ పంచవర్ష ప్రణాళిక ముగింపు దశకు చేరుకుంటున్న సమయంలో గత రెండు సంవత్సరాలుగా తీసుకున్న పలు నిర్ణయాలు బడ్జెట్ విధానంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికాయి. దీనికి అనుగుణంగా ప్రస్తుత ప్రభుత్వం ఫిబ్రవరి ఒకటో తేదీన ప్రవేశపెట్టిన నాలుగో బడ్జెట్ కొన్ని మార్పులను ఆచరణీయం చేసేందుకు మార్గం సుగమం చేసింది. 2017-18 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ ఆర్థిక స్థిరీకరణ అనే స్థూల లక్ష్యాన్ని కొనసాగించింది. అయితే బడ్జెట్ విధానంలో మాత్రం పలు మార్పులు చోటు చేసు కున్నాయి. రైల్వే బడ్జెట్‌ను సాధారణ బడ్జెట్‌లో విలీనం చేయడం, కేంద్ర ప్రభుత్వ వ్యయాల పద్దులో ప్రణాళిక-ప్రణాళికేతర వ్యయాల వర్గీకరణ రద్దు చేయడం, బడ్జెట్ ప్రతిపాదించే తేదీని ఒక నెల ముందుకు తీసుకురావడం ఇందులో ప్రధానమైనవి.

సాధారణ బడ్జెట్‌లో భాగంగానే రైల్వే బడ్జెట్‌ను కూడా ప్రతిపాదించడం ఈ బడ్జెట్‌లో చోటు చేసుకున్న పెద్ద మార్పు. నీతి ఆయోగ్ సూచన మేరకు తీసుకున్న ఈ నిర్ణయంతో ప్రత్యేకంగా రైల్వే బడ్జెట్‌ను ప్రతిపాదించే 92 సంవత్సరాల సంప్రదాయానికి తెర దించింది. 1920 సంవత్సరంలో బ్రిటిష్ పాలకులు రైల్వే ఆర్థిక వనరులను సాధారణ వనరుల నుంచి వేరు చేశారు. రైల్వే బడ్జెట్‌ను సాధారణ బడ్జెట్‌లో విలీనం చేయడం వల్ల రైల్వేల ఆర్థిక పురోగతి వేగవంతం అవుతుందని ప్రభుత్వం చెబుతోంది. కాని ఈ విలీనం కేవలం ఒక ఆకర్షణ మాత్రమే నంటూ కొందరు ఆందోళన కూడా ప్రకటిస్తున్నారు. ఇలాంటి ఆకర్షణలకు ప్రాధాన్యత ఇచ్చే కన్నా రైల్వేల పునర్ వ్యవస్థీకరణపై దశాబ్దిగా మూలపడి ఉన్న రాకేష్ మోహన్ సిఫారసులను అమలు చేయడం ప్రధానమన్నది వారి అభిప్రాయం. "అవసరానికి చాలని పెట్టుబడులు, చాలీ చాలని వనరుల కేటాయింపు, నానాటికీ పెరిగిపోతున్న రుణభారం, ఏ మాత్రం సంతృప్తికరంగా లేని ప్రయాణికుల సేవలు, నానాటికీ దిగజారిపోతున్న ఆర్థికస్థితి" రైల్వేలను కుంగదీస్తున్న అంశాలని ఆ కమిటీ అభిప్రాయపడింది. వాస్తవానికి రైల్వే ఒక వాణిజ్య సంస్థా లేదా ఒక సామాజిక లక్ష్యంతో సాగుతున్న వ్యవస్థా అన్నది ఒక వేధించే ప్రశ్న. అంత కీలకం కాని

**హేపీ పంత్,** హెడ్ అడ్వకసీ టీమ్, సెంటర్ ఫర్ బడ్జెట్ & గవర్నెన్స్ అకౌంటబిలిటీ (సిబిజిఏ), న్యూ ఢిల్లీ.
E-mail: happy@cbgaindia.org

కార్యకలాపాల నిర్వహణ భారాన్ని తప్పించడం, వ్యాపార లక్ష్యాలకు సరిపోయే కార్యకలాపాలను కొనసాగించడం, వాణిజ్య పరమైన అకౌంటింగ్ పెర్ఫార్మెన్స్ నిర్వహణ విధానాలు ప్రవేశపెట్టడం ద్వారా భారత రైల్వే వ్యవస్థను సత్వరమే ఆధునికీకరించి, సంస్కరించాల్సిన అవసరం ఉన్నదన్నది ఆ కమిటీ అభిప్రాయం. రైల్వేలపై సామాజిక వ్యయాల భారం ఎంత ఉన్నదనేందుకు గణాంకాలు అందుబాటు లోనే ఉన్నాయి. ఈ వ్యయాలను కేంద్ర ప్రభుత్వం లేదా రాష్ట్ర ప్రభుత్వాలే భరించాలని చాలా కమిటీలు ఇప్పటికే సూచించాయి.

## ప్రణాళిక, ప్రణాళికేతర వ్యయాల వర్గీకరణ తొలగింపు

ప్రణాళికా సంఘం సమర్థవంతంగా కేటాయింపులు చేయడానికి వీలుగా 1951లో మొదటి పంచవర్ష ప్రణాళికా కాలంలో కేంద్ర వ్యయ బడ్జెట్‌లో ప్రణాళిక, ప్రణాళికేతర వ్యయాల విభజనను ప్రవేశపెట్టారు. పంచవర్ష ప్రణాళికలో నిర్దేశించిన కార్యక్రమాలు, పథకాలకు చేసే వ్యయాలను ప్రణాళికా వ్యయంగా పరిగణిస్తున్నారు. రెవిన్యూ, పెట్టుబడి పద్దుల కింద చేపట్టే కార్యక్రమాలు, పథకాలన్నీ ఇందులో భాగంగా ఉన్నాయి. ఉదాహరణకి సర్వశిక్షా అభియాన్ కింద ఉపాధ్యాయుల వేతనం ప్రణాళికా వ్యయంలో రెవిన్యూ వ్యయం పద్దులోకి వస్తే, పాఠశాల భవనాల నిర్మాణం ప్రణాళికా పెట్టుబడి వ్యయంగా పరిగణనలోకి వస్తుంది. ప్రణాళికా సంఘం/ పంచవర్ష ప్రణాళికలో భాగం కాని విధులు, సేవలన్నీ ప్రణాళికేతర వ్యయం పద్దులోకి వస్తాయి. ఉదాహరణకి వడ్డీ చెల్లింపులు, సబ్సిడీలు, వేతనాలు, పింఛను చెల్లింపులు (అన్ని విభాగాలకు చెందిన రెగ్యులర్ కేడర్ సిబ్బంది) పోలీసు, రక్షణ, అన్ని రంగాలకు అవసరమైన మౌలిక వసతులు, ఆస్తుల నిర్వహణ వ్యయాలన్నీ ప్రణాళికేతర వ్యయం బడ్జెట్ కిందకు వస్తాయి. ప్రణాళికేతర వ్యయం అంటే రక్షణ, పోలీసు సిబ్బంది వ్యయాలు, వడ్డీ చెల్లింపులే కాదు...విద్య, ఆరోగ్యం వంటి ప్రధాన రంగాలపై వ్యయాలు, ఆయా రంగాల పరిధిలోకి వచ్చే రెగ్యులర్ ప్రభుత్వ సిబ్బంది వేతనాలు, మౌలిక వసతులు, ఆస్తుల నిర్వహణ వనరులు కూడా ప్రణాళికేతర వ్యయం కోవలోకే వస్తాయి.

ఇప్పటివరకు అమలులో ఉన్న ప్రణాళికా వ్యయాలు, ప్రణాళికేతర వ్యయాలను వర్గీకరణను మరింత స్పష్టంగా అర్థం చేసుకునేందుకు కొన్ని ఉదాహరణలు పరిశీలిద్దాం. ప్రధానమంత్రి గ్రామసడక్ యోజన కింద గ్రామీణాభివృద్ధి శాఖకు అందుబాటులో ఉండే నిధుల్లో రోడ్ల నిర్మాణ ఖర్చులు ప్రణాళికా వ్యయం పద్దులోకి వస్తే వాటి నిర్వహణ వ్యయాలు ప్రణాళికేతర వ్యయంలోకి వస్తాయి. కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాలు, ఇతర ప్రభుత్వ పాఠశాలల్లోని రెగ్యులర్ ఉపాధ్యాయులు, ఆరోగ్య కేంద్రాలు, వైద్యకళాశాలల్లోని రెగ్యులర్ కేడర్ డాక్టర్ల వేతనాల చెల్లింపునకు కేటాయించే నిధులు ప్రణాళికేతర పద్దులోకి వస్తే సర్వశిక్షా అభియాన్ (ఎస్ఎస్ఎ) కింద పని చేసే కాంట్రాక్టు ఉపాధ్యాయులు, జాతీయ ఆరోగ్య కార్యక్రమం (ఎన్‌హెచ్‌ఎం) కింద పని చేసే కాంట్రాక్టు వైద్యుల వేతనాల చెల్లింపులకు కేటాయించే నిధులు ప్రణాళికా బడ్జెట్ పద్దులోకి వస్తాయి. కేంద్రబడ్జెట్‌ను ప్రతిపాదించే సమయంలో ఈ వ్యయాల న్నింటినీ కలిపి ఒక్కటిగానే ప్రకటిస్తారు. కాని ప్రణాళికా వ్యయాలు, ప్రణాళికేతర వ్యయాలు అంటూ విభజన వల్ల ప్రణాళికా వ్యయం అభివృద్ధికి దోహదకారి, ప్రణాళికేతర వ్యయం అభివృద్ధి నిరోధకం అనే ఒక రకమైన అపోహ ఏర్పడేందుకు కారణమవుతోంది. ఫలితంగా ప్రణాళికా వ్యయాలకు అధిక కేటాయింపులు ఇచ్చి ప్రణాళికేతర వ్యయంలోకి వచ్చే నిర్వహణ ఖర్చుల వంటివి నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. ప్రణాళికేతర వ్యయానికి అవసరమైనన్ని నిధులు అందుబాటులో లేకపోవడం వల్ల చాలా రాష్ట్రాల్లో అన్ని విభాగాల్లోనూ రెగ్యులర్ కేడర్ ఉద్యోగులకు తీవ్రమైన కొరత ఏర్పడుతోంది. అలాగే బడ్జెట్ వనరుల కేటాయింపులోని ఈ విభజన వల్ల ఒక సేవ అందించేందుకు అవుతున్న మొత్తం వ్యయం ఎంత అన్నది కూడా తేటతెల్లం కాని పరిస్థితి నెలకొంది. 2017-18 కేంద్రబడ్జెట్ నుంచి బడ్జెట్ పత్రాల్లో ఈ విభజన తీసివేసి మొత్తం వ్యయాన్ని ఒకే పద్దులో చూపిస్తున్నారు. ఇలా ప్రణాళిక, ప్రణాళికేతర వ్యయాలను కలిపివేయడం వల్ల వనరుల కేటాయింపు సరళం కావడంతో పాటు ఆయా వనరులతో ఏమేమి సాధించింది మరింత స్పష్టంగా తెలియచేసే అవకాశం ఏర్పడింది. "వివిధ రంగాలకు, మంత్రిత్వ శాఖలకు సమగ్ర అవగాహనతో పూర్తి స్థాయిలో నిధులు కేటాయించేందుకు ఈ ప్రక్రియ దోహదపడుతుంది'' అని ప్రణాళిక, ప్రణాళికేతర వ్యయాలను విలీనం చేయడానికి గల సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు ఏర్పాటైన కార్యాచరణ బృందం అభిప్రాయపడింది. ఇప్పటివరకు షెడ్యూల్డు కులాల ఉప ప్రణాళిక (ఎస్‌సిఎస్‌పి) స్ట్రాటజీ కింద దళితులకు బడ్జెట్‌లో 16.6 శాతం ప్రణాళికా నిధులు కేటాయిస్తున్నారు. కాని ఈ ఏడాది స్టేట్‌మెంట్ 10ఎ కింద 'షెడ్యూల్డు తెగల సంక్షేమం కోసం నిధులు' కేటాయించారు. కాని ఈ కేటాయింపులకు ఆయా మంత్రిత్వ శాఖలు, ప్రభుత్వ శాఖలు ఏ కొలమానాలు ఉపయోగించింది స్పష్టంగా లేదు. ఆయా మంత్రిత్వ శాఖలు, ప్రభుత్వ శాఖలు

అనుసరించే ఎస్‌సిఎస్‌పికి అనుగుణంగా ఈ కేటాయింపులు ప్రకటించే కొత్త నిబంధనలు రూపొందించడం చాలా అవసరం.

కొద్ది రాష్ట్రాలు మాత్రమే కేంద్ర బడ్జెట్‌లో ఈ మార్పులకు దీటుగా ప్రణాళిక, ప్రణాళికేతర వ్యయ విభజనను రద్దు చేసి ఒకటిగానే బడ్జెట్ ప్రకటించే ప్రక్రియను అనుసరిస్తున్నాయి. కాని ఆ విభజనను యథాతథంగా కొనసాగించేందుకే మొగ్గు చూపిన రాష్ట్రాలకు వచ్చే బడ్జెట్లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసే బాధ్యత కేంద్రానిదే. అలాగే ఈ విభజన రద్దు చేయడం వల్ల వ్యయాలను 'కేపిటల్', 'రెవిన్యూ' వ్యయాలుగా వర్గీకరించడంపై అధికంగా దృష్టి కేంద్రీకరిస్తే విద్య, ఆరోగ్యం వంటి కీలక రంగాలు ఇబ్బందులు ఎదుర్కొనే ఆస్కారం ఉంది. ప్రభుత్వ వ్యయాల్లో అధిక శాతం రెవిన్యూ వ్యయాలుగానే పరిగణించడం ఇందుకు కారణం. కొత్త ప్రణాళికా విధానం కింద 'ప్రణాళిక పాత్ర, ప్రాధాన్యం'లో జాతీయ స్థాయికి దిగువన ఉండే స్థాయిలను ఏ మాత్రం తక్కువ చేయకూడదు. ప్రజల అవసరాల ఆధారంగా అభివృద్ధిలో వ్యత్యాసాలు లేని విధానం ఆచరించాలంటే వికేంద్రీకృత ప్రణాళిక కీలకమని గతంలో గుర్తించారు. రాజ్యాంగపరమైన గుర్తింపు ఉన్నప్పటికీ జిల్లా ప్రణాళికా కమిటీ (డిపిసి) వ్యవస్థ తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోంది. పంచవర్ష ప్రణాళికలకు స్వస్తి చెప్పిన ఈ తరుణంలో దిగువ స్థాయి నుంచి ప్రణాళికల రూపకల్పనకు డిపిసిలను బలోపేతం చేయడం చాలా అవసరం. ప్రత్యేక ప్యాకేజిల ద్వారా ప్రాంతీయ అసమానతలను చక్కదిద్దడం గతంలో అనుసరించిన పంచవర్ష ప్రణాళికల ప్రధానోద్దేశం. కొత్త విధానంలో అలాంటి ఫోకస్ దెబ్బ తినకూడదు. వెనుకబడిన ప్రాంతాలను గుర్తించి ఆయా విభాగాలకు అదనపు వనరులు అందించడం ద్వారా ప్రాంతీయ అసమానతలు తొలగించేందుకు కేంద్ర మంత్రిత్వ శాఖలు అవసరమైన జోక్యాన్ని కొనసాగించాలి.

**బడ్జెట్ తేదీ నెల ముందుకి...**

సాధారణంగా బడ్జెట్ ప్రతిపాదించే తేదీకి నెల రోజులు ముందుగానే ఈ సారి ఫిబ్రవరి ఒకటో తేదీన కేంద్ర బడ్జెట్ ప్రకటించారు. సాంప్రదాయికంగా ఫిబ్రవరి నెల చివరి రోజున లోక్‌సభలో బడ్జెట్ ప్రతిపాదించడం ఆనవాయితీ. అలాగే కేంద్రబడ్జెట్‌ను ఫిబ్రవరి నెల చివరి రోజున సాయంత్రం ఐదు గంటలకు ప్రకటించే బ్రిటిష్ పాలకుల నాటి సాంప్రదాయాన్నే 2000 సంవత్సరం వరకు మనం అనుసరించాం. 2000 తర్వాత బడ్జెట్ ప్రతిపాదించే సమయాన్ని ఉదయం 11 గంటలకు మార్చారు. కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం అయ్యే నాటికే బడ్జెట్ కేటాయింపులన్నింటికీ చట్టపరమైన ఆమోదం పొంది మొదటి త్రైమాసికం ప్రారంభమైన రోజు నుంచే వివిధ మంత్రిత్వ శాఖలకు నిధులు అందుబాటులో ఉంచడం లక్ష్యంగా కేంద్రబడ్జెట్ ప్రతిపాదనను ఒక నెల ముందుకు జరిపారు. గతంలో అయితే ఫిబ్రవరి నెల మధ్యలో బడ్జెట్ సమావేశాలు ప్రారంభమై స్వల్పవిరామంతో మే నెల చివరి వరకు జరిగేవి. బడ్జెట్ సమావేశాల రెండో సెషన్‌లో మాత్రమే ద్రవ్యవినిమయ బిల్లుకు ఆమోదం లభించేంది. ఈ లోగా వివిధ శాఖలకు నిధులు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులకు అనుగుణంగా కన్సాలిడేటెడ్ నిధి నుంచి సొమ్ము ఉపసంహరించేందుకు మార్చిలో పార్లమెంటులో ఓటాన్ అకౌంట్ ప్రవేశపెట్టాల్సివచ్చేది. రెండు, మూడు నెలల వ్యయాలకు ఈ ఓటాన్ అకౌంట్ నిధులు మద్దతు ఇచ్చేవి. 2017-18 నుంచి సాంప్రదాయానికి భిన్నంగా బడ్జెట్ ప్రతిపాదన తేదీని ఒక నెల ముందుకు జరపడం వల్ల కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం అయ్యే నాటికే వివిధ మంత్రిత్వ శాఖలకు నిధులు విడుదల చేసే వెసులుబాటు ఏర్పడుతోంది. ఇందులో కొన్ని సవాళ్లు కూడా ఉన్నాయి. రెవిన్యూ, వ్యయాలకు సంబంధించిన సమగ్ర గణాంకాలు ఫిబ్రవరి ఒకటో తేదీ నాటికి అందుబాటులో ఉండకపోవడం అందులో ప్రధానమైనది. గత ఏడాది వరకు అమలులో ఉన్న విధానం కింద ఫిబ్రవరి మధ్యలో బడ్జెట్ రూపకల్పన తుది దశకు వచ్చే నాటికి ఆర్థిక సంవత్సరంలో తొమ్మిది నెలల కాలానికి రెవిన్యూ వసూళ్లు, వ్యయాల ధోరణులు అందుబాటులో ఉండేవి. కాని ఈ ఏడాది బడ్జెట్ రూపకల్పనలో 2016-17 ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో జిడిపి, వివిధ రంగాలవారీగా చోటు చేసుకున్న అభివృద్ధి గణాంకాలు మాత్రమే పరిగణనలోకి తీసుకోవలసి వచ్చింది. అలాగే బడ్జెట్ తేదీని ముందుకు జరపడం వల్ల మరికొన్ని ఇబ్బందులు కూడా ఉన్నాయి. బడ్జెట్‌పై చర్చించేందుకు పార్లమెంటుకు, వివిధ స్థాయీ సంఘాలకు సరిపడ సమయం అందుబాటులో ఉన్నదా అన్నది శేష ప్రశ్న.

**కన్సాలిడేటెడ్ ఔట్‌కమ్ బడ్జెట్**

దేశ చరిత్రలోనే తొలిసారిగా అన్ని మంత్రిత్వ శాఖలు, ప్రభుత్వ శాఖలకు సంబంధించిన కన్సాలిడేటెడ్ ఫలితాల సాధన వివరాలతో ఔట్‌కమ్ బడ్జెట్‌ను ప్రకటిస్తామని ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. అభివృద్ధి కార్యక్రమాలు, పథకాలకు సంబంధించిన ప్రభుత్వ వ్యయాలపై సాధించిన ఫలితాలకు ప్రాధాన్యం కల్పించడం దీని లక్ష్యం. ప్రభుత్వ కార్యక్రమాల కోసం కేటాయించిన నిధులు

నిర్దేశిత లక్ష్యాలను ఏ మేరకు సాధించింది అన్న అంశంలో స్పష్టత అందించడానికి ఇది సహాయకారిగా ఉంటుంది.



**బడ్జెట్ ప్రక్రియ పటిష్టతకు ఇతర చర్యలు**

కొన్ని బడ్జెటరీ విధానాలకు సంబంధించి ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యలు ప్రభుత్వ వ్యయ నిర్వహణకు సంబంధించి మరింత స్పష్టత ఇచ్చేందుకు ఉద్దేశించినవి కావడం వల్ల ఇవి సరైన దిశలో తీసుకున్న చర్యలే. కాని సామాజిక వ్యయాలపై ఫలితాల మెరుగుదలకు ఈ చర్యలు మాత్రమే చాలవు. అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు రాజ్యాంగబద్ధంగా ఏర్పాటైన జిల్లా ప్రణాళికా కమిటీలను పటిష్ఠం చేయడం అత్యంత ప్రధానం. సామాజిక రంగాల కార్యక్రమాలకు సంబంధించి జిల్లా స్థాయిలో ప్రభుత్వ వ్యయాలపై విడివిడిగా గణాంకాల సేకరణ ఒక సవాలే. నిర్దేశిత కాలవ్యవధిలో అభివృద్ధి కార్యకలాపాలకు సంబంధించిన ఇలాంటి సమాచారాన్ని ప్రచురించి ప్రజలకు అందుబాటులో ఉంచడం వల్ల ప్రభుత్వ వ్యయాలపై మెరుగైన ఫలితాలు సాధించ గలుగుతాం. బడ్జెటింగ్ ప్రక్రియలో ఈ అంశాలను కూడా చేర్చడం అత్యంత అవసరం. ■

### *64వ పేజీ తరువాయి...*

## వైద్య సేవల్లో ఆరోగ్యకరమైన అభివృద్ధి

లేదు. కానీ ఇప్పటికే ఇలాంటి పథకాలు అమలు చేసేందుకు తగిన యంత్రాంగాన్ని సిద్ధం చేసుకున్న రాష్ట్రాలకు వెంటనే నిధులు మంజూరు చేస్తారు. అలాగే దేశ వ్యాప్తంగా ఉన్న ఆరోగ్య ఉప కేంద్రాలన్నింటిని (సబ్ సెంటర్స్) హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్స్‌గా మార్చేస్తామని ప్రకటించిన ఆర్థిక మంత్రి ఇది ఎప్పటిలోగా పూర్తిచేస్తామన్న అంశంపైగాని, ఇందుకోసం ఎంత నిధి కేటాయిస్తారనన్న అంశంపై గాని స్పష్టత ఇవ్వలేదు. బహుశా ఆలోచనాత్మకమైన ఈ కార్యక్రమానికి రానున్న సంవత్సరాల్లో భారీగా నిధులు కేటాయించే అవకాశం ఉంది.

చౌకధరలకే జనరిక్ మందుల లభ్యతకు, విస్తృతస్థాయిలో ధరల నియంత్రణకు అనుకూలంగా ఉండేవిధంగా డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ రూల్స్ ను సవరించడం, వైద్య పరికరాలపై బడ్జెట్ పరంగా ఎలాంటి నియంత్రణలు లేకుండా చేయడం వంటి అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. ఇలాంటి అన్ని విషయాల్లోనూ కేంద్రప్రభుత్వం బడ్జెట్ సందర్భంగా సరళంగానే వ్యవహరించిందనే చెప్పాలి. అయితే రానున్న కొద్దీ వారాలు లేదా కొన్ని నెలల్లో ఏఏ రాష్ట్రప్రభుత్వాలు ముందుగా ఈ అంశాల అమలుకు తగిన చర్యలు తీసుకోనున్నాయన్న విషయంపైనే అందరూ దృష్టిసారిస్తున్నారు. అలాగే తగినన్ని నిధుల కేటాయించడం ద్వారా ప్రజలకు వైద్య, ఆరోగ్య సేవలు అందించడంలో ఏ రాష్ట్రం ముందుంటుందోగమనించాల్సి ఉంది. ■

### *68వ పేజీ తరువాయి...*

## బలహీనవర్గాల సంక్షేమం... అభివృద్ధి


ఆధార్ ఆధారిత స్మార్ట్ కార్డుల జారీకి 15 జిల్లాల్లో ప్రయోగాత్మకంగా శ్రీకారం చుడతారు.

(ii) దేశంలో 2019 నాటికల్లా కోటి కుటుంబాలకు పేదరిక విముక్తితోపాటు 50వేల పంచాయతీలలో అదే ఏడాది మహాత్మాగాంధీ 150వ జయంతినాటికి పేదరిక నిర్మూలన కోసం 'అంత్యోదయ కార్యక్రమం' చేపడతారు. ఈ మేరకు ప్రతి నిరుపేద కుటుంబానికీ సుస్థిర జీవనోపాధి ధ్యేయంగా సూక్ష్మ ప్రణాళికలపై దృష్టి సారిస్తారు.

(iii) ప్రధానమంత్రి ముద్ర యోజన (PMMY) కింద 2015-16నాటి రుణ వితరణ లక్ష్యాన్ని రెట్టింపు చేయాలని 2017-18 బడ్జెట్ ప్రతిపాదనలలో నిర్దేశించారు. తదనుగుణంగా ఈ లక్ష్యాన్ని రూ. 2.44 లక్షల కోట్లుగా నిర్ణయించారు. ఇందులో భాగంగా చిన్నతరహా వ్యాపారాలు, పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే దళిత, గిరిజన, వెనుకబడిన, మైనారిటీ, మహిళా వర్గాలకు ప్రాముఖ్యం ఇస్తారు.

మొత్తంమీద విద్య, అందుబాటు ధరలో గృహాలు, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక తోడ్పాటు తదితర మౌలిక, ప్రాధాన్య రంగాలపై 2017-18 బడ్జెట్ ప్రధానంగా దృష్టి సారించింది. ప్రభుత్వ ప్రాథమ్యాలేమిటో బడ్జెట్ కేటాయింపులు సూచనప్రాయంగా వెల్లడిస్తున్నాయి. ఇప్పటికే ప్రభుత్వం ప్రాధాన్యమిస్తున్న మేరకు ఉత్పాదకత, ఫలితాలు లక్ష్యంగా ప్రభావవంతమైన పర్యవేక్షణ యంత్రాంగంపై బడ్జెట్ శ్రద్ధ చూపింది. ఈ తాజా ప్రతిపాదనల అమలుతో తమ జీవన నాణ్యత గణనీయంగా మెరుగుపడగలదని సమాజంలోని అణగారిన, దుర్బలవర్గాలు ఆశించవచ్చు. ■

BOOK YOUR COPY NOW







Reference Annual

**A TREASURE FOR RESEARCHERS, POLICY MAKERS, ACADEMICS, MEDIA PROFESSIONALS AND JOB SEEKERS, ESPECIALLY, ASPIRANTS OF CIVIL SERVICES EXAMINATION**

**Also available as eBook**
**Buy online at-**
**play.google.com, amazon.in, kobo.com**



Publications Division
Ministry of Information & Broadcasting, Government of India
Soochna Bhawan, CGO Complex, Lodhi Road, New Delhi-110003
Copies Available at: Room No.204, C.G.O. Towers, Kavadiguda, Hyd-80. Ph: 040-27535373
**website: www.publicationsdivision.nic.in**
For placing orders, please contact:
Phone : **011-24367260, 24365609**, e-mail: **businesswng@gmail.com**
@ DPD_India
www.facebook.com/publicationsdivision
www.facebook.com/yojanaJournal

# ఇండియా 2017 ఆంగ్ల, హిందీ వార్షిక సంచికలను విడుదల చేసిన కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి

కేంద్ర ప్రభుత్వం ప్రతిసంవత్సరమూ విడుదల చేసే జాతీయ సంకలనం ఇండియా 2017ను, దాని హిందీ సంకలనం భారత్ 2017ను ఇటీవల కేంద్ర పట్టణాభివృద్ధి వ్యవహారాలు, గృహనిర్మాణం, పట్టణ పేదరిక నిర్మూలన, సమాచార ప్రసార శాఖ మంత్రి శ్రీ వెంకయ్య నాయుడు ఆవిష్కరించారు. గత 61 సంవత్సరాలుగా, ఈ సంకలనం మనదేశం వివిధ రంగాలలో సాధించిన ప్రగతిని సవివరంగా, సమగ్రంగా పాఠకులకు తెలియచేస్తూ వారి అభిమానాన్ని చూరగొన్నది. మొత్తం 33 అధ్యాయాలలో ఈ పుస్తకం, గ్రామీణ, పట్టణాభివృద్ధి, పరిశ్రమలు, మౌలిక సౌకర్యాలు, శాస్త్ర-సాంకేతిక విజ్ఞానం కళ, సంస్కృతి, ఆర్థిక రంగం, ఆరోగ్యరంగం, రక్షణ, విద్యా, ప్రసార మాధ్యమాలు వంటి అనేక అంశాలపై సవిస్తరంగా చర్చిస్తుంది. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీ వెంకయ్య ఈ సంకలనం మనదేశం గురించి సమగ్రంగా, ఖచ్చితమైన వివరాలతో సమాచారాన్ని అందిస్తున్నదని అభినందించారు. నమ్మదగిన, ఆధారపడ దగిన సమాచారాన్ని ఈ ప్రభుత్వం అందిస్తుందని ఆయన అన్నారు.




ఇండియా 2017/భారత్ 2017 పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి శ్రీ వెంకయ్య నాయుడు, సహాయ మంత్రి కల్నల్ రాజ్యవర్ధన్ రాథోడ్ (Retd) AVSM, కేంద్ర సమాచార, ప్రసార శాఖ కార్యదర్శి శ్రీ అజయ్ మిత్తల్, ప్రచురణల విభాగం అదనపు డైరెక్టర్ జనరల్ డా. సాధన రౌత్ తదితరులు.

ఇదే పుస్తకం ఈ-కాపీ ని ఆవిష్కరిస్తూ మంత్రి వెంకయ్య నాయుడు సాంకేతికంగా ఈ-వర్షన్ అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యున్నత స్థాయిలో ఉన్నదని అన్నారు. ఈ-వర్షన్‌లో హైపర్ లింక్‌లు, హైలైట్ సౌకర్యము, ఇంటరాక్టివ్ సౌకర్యం వంటి వెసులుబాటులతో ఎంతో సౌకర్య వంతంగా ఉన్నదని అభినందించారు. దీనితో ఇది చదువరులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని ప్రశంసించారు. ఈ-పబ్లికేషన్ ఫార్మాట్‌లో లభించే ఈ పుస్తకాన్ని టాబ్లెట్, కంప్యూటర్, స్మార్ట్ ఫోన్ వంటి వివిధ రకాల ఉపకరణాలపై చదవవచ్చని అన్నారు.

ఇదే కార్యక్రమంలో మంత్రి, ప్రచురణల విభాగం వారి డిజిటల్ గ్రంథాలయాన్ని కూడా ఆవిష్కరించారు. ఈ గ్రంథాలయంలో 750 వరకు విభిన్న అంశాలపై పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ డిజిటల్ కార్యక్రమానికి ప్రోత్సాహమిస్తూ ప్రచురణల విభాగం 750 పుస్తకాలను డిజిటైజ్ చేయడం ముదావహం అన్నారు. 12వ ప్రణాళిక లక్ష్యమైన మార్చి 31 నాటికి వెయ్యి పుస్తకాలను డిజిటైజ్ చేసే లక్ష్యానికి చేరువలో ఉన్నదని అన్నారు. ఇలాంటి పుస్తకాలను అన్ని భారతీయ భాషలలోనూ తీసుకురావాలని ఆయన అభిలషించారు.




ప్రతి ఒక్కటి రూ. 350/-ల చొప్పున ఈ సంకలనం దేశవ్యాప్తంగా ఎనిమిది సేల్స్ ఎంపోరియాల్లోనూ, మూడు ప్రాంతీయ కార్యాలయాల్లోనూ, అధీకృత ఏజెంట్ల వద్దనూ లభ్యమవుతుంది. వీరందరి జాబితా www.publicationsdivision.nic.in లో లభ్యమవుతుంది. అంతేకాదు, businesswng@gmail.com కు ఈ-మైల్ పంపటం ద్వారా కూడా ప్రజలు తమ కాపీలను బుక్ చేసుకోవచ్చు. www.Bharatkosh.gov.in ద్వారా కూడా కొనవచ్చు. ఈ-కాపీ కేవలం రూ. 263/- లకే దొరుకుతుంది. ఆన్‌లైన్ వ్యాపార దిగ్గజాలైన Amazon.In, Google Play Books మరియు Kobo.com ల ద్వారా కూడా పొందవచ్చు.

ఆనంద్ సౌరభ్

2వ పేజీ తరువాయి...

(6) నిర్వహణా సామర్థ్యం. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు కేటాయింపులు సమగ్రంగా లేకపోవడమో, అట్టడుగు స్థాయిలోని పేదలకు చేరకపోవడమో, అనర్హులకు చేరడమో వంటి సమస్యలతో కునారిల్లుతున్నాయి. JAM ట్రినిటీ అనే జనధనఖాతా, ఆధార్ నెంబరు, మొబైల్ నెంబరులు కలిసి ఉమ్మడిగా ఈ సమస్యను కొంతవరకూ పరిష్కరిస్తున్నాయి. ఇది ఇంకా మెరుగుపడాల్సి ఉంది.

**అభ్యంతరాలు:**

ఈ కనీస వేతనానికి ఉన్న ప్రథమ అభ్యంతరం కొంత మొత్తం చేతిలో ఉంటే ప్రజలు పనిచేయకుండా సోమరులుగా మారతారనేది. ఆయితే, ఈ కనీసమొత్తం కేవలం అత్యంత కనీస అవసరాలకే కనుక దీని ప్రభావం వారి 'పనిచేయడం' పై పడుతుందనేది యదార్థంకాదు. పనిచేయ కుండా వేతనం ఇవ్వడమా అనేది రెండవ అభ్యంతరం. ఈ ప్రశ్నకు సమాజం ఇప్పటికే జవాబిచ్చిందని చెప్పవచ్చు. అయితే కేవలం ధనికులకు మాత్రమే. చాలామంది విషయంలో వారికి వారసత్వంగా ఏదైనా సంపద వచ్చినపుడు, అది వారు ఏపనీ చేయకుండా పొందినదే కదా! ఇక మూడవ అభ్యంతరం విషయానికి వస్తే, సమాజం వ్యక్తికి కనీస వేతనమిస్తే, ఆ వ్యక్తి ప్రతిగా సమాజానికేమిస్తాడు అనేది. నిజానికి ఈ విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తే, వ్యక్తులు సమాజానికి ప్రత్యక్షంగాను, పరోక్షంగాను అనేక సేవలందిస్తుంటారు. ఏ పనికైతే ప్రతిఫలాన్ని నిర్ణయించలేమో, ఆ పనికి ప్రతిఫలంగా ఈ వేతనాన్ని పరిగణించవచ్చు. ఉదాహరణకు మహిళలు ఇంట్లో చేసే పనికి ఎవరు ప్రతిఫలాన్ని నిర్ణయించగలరు?

ప్రస్తుతం అమలులో ఉన్న పేదరిక నిర్మూలన పథకాల సమస్యలు: జిల్లాలవారీగా అసమంజస కేటాయింపులు. మన ప్రభుత్వాల కేటాయింపులలో అతి పేదజిల్లాలు కొన్ని సాంకేతిక కారణాలవల్ల, అతి తక్కువ కేటాయింపులు పొందిన దృష్టాంతరాలున్నాయి. నిజమైన అర్హులు ప్రయోజనం పొందలేక పోవడాన్ని కూడ మనం చూస్తూనే ఉన్నాము.

ఈ ఆటంకాలను ఈ సార్వత్రిక మూలవేతనం ఎలా అధిగమిస్తుంది? లబ్దిదారుల బ్యాంకు ఖాతాలకే ఈ మొత్తం వెళుతుంది కనుక, మధ్యలోనుండే అధికారుల నిర్ణయాల ప్రసక్తి ఉండదు కనుక కొన్ని లోపాలు వాటంతట అవే పరిష్కారమౌతాయి. ఆందరికీ సార్వత్రిక విధానంలో చెల్లించబడుతుంది కనుక, పంపిణీలో తప్పులు జరిగే అవకాశం చాలా తక్కువ. ఒక విధంగా చెప్పాలంటే ఈ వేతనం ఒక బీమా మొత్తంలా పనిచేస్తుంది.

అయితే, ఈ పథకం విజయవంతం కావాలంటే రెండు అంశాలపట్ల జాగరూకత వహించాలి. అవి JAM అందరి చేతిలోనూ సక్రమంగా పనిచేస్తూ ఉండాలి. నిధులు సమకూర్చడంలో కేంద్ర, రాష్ట్రాల పాత్ర నిక్కచ్చిగా ఉండాలి.

ఈ పథకాన్ని అమలు చేస్తే, దేశంలోని పేదరికం 0.5 శాతం తగ్గుతుంది. స్థూలదేశీయోత్పత్తిలో 4-5 శాతం ఖర్చవుతుంది. ఈ ఆలోచన ఎంతో శక్తివంతమైనదనీ, వెంటనే అమలుకు నోచుకోకపోయినా, దీనిగురించి తక్షణమే, దేశవ్యాప్తంగా చర్చ మొదలవ్వాలని ఆర్థిక సర్వేక్షణం అభిప్రాయపడింది. ■

Publishing date 6th March 2017, Posting on 7-8 March 2017
Yojana (Telugu) March 2017 RNI Regd. No 37729/80 Regd. No. H/HD-663/2015-17


सत्यमेव जयते

# భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ

ఆధార్
నా ఆధార్, నా గుర్తింపు

## ఆధార్ వివరాలలో సవరణలు / మార్పులు చేసుకునే సౌలభ్యం

## ఆధార్‌లో వివరాలు 3 విధములుగా అప్‌డేట్ చేసుకోవచ్చు



ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా
www.resident.uidai.net.in



సాధారణ పోస్ట్ ద్వారా



ఆధార్ కేంద్రాన్ని లేదా పి.ఇ.సి. సెంటర్ సందర్శించటం ద్వారా

## ఆధార్ కేంద్రాలలో వివిధ ఆధార్ సేవలు

| ఆధార్ కేంద్రాలలో వివిధ ఆధార్ సేవలు | | రుసుము |
|---|---|---|
| ఆధార్ నమోదు | | ఉచితము |
| బయోమెట్రిక్ వివరాల మార్పు<br>పిల్లల (5 & 15 సం॥) తప్పనిసరి బయోమెట్రిక్ వివరాల మార్పు | | ఉచితము |
| ఇతర బయోమెట్రిక్ వివరాల మార్పు | | 25/- |
| డెమోగ్రాఫిక్ వివరాల మార్పు<br>(పేరు, పుట్టిన తేది, చిరునామా, లింగం & ఇ-మెయిల్) | | 25/- |
| ఆధార్ స్థితి తెలుసుకొనుటకు | ఈ-ఆధార్ (బ్లాక్ & వైట్) | 10/- |
| | ఈ-ఆధార్ (కలర్) | 20/- |

### ముఖ్య గమనికలు :

- ఆమోదింపబడిన రుసుము కంటే ఎక్కువ చెల్లించవద్దు
- మొబైల్ అప్‌డేట్ కొరకు ఆధార్ కేంద్రాన్ని మాత్రమే సందర్శించవలెను.

www.uidai.gov.in ఉచిత ఫోన్ నెం : 1947


Printed & Published by Mrs. Sadhana Rout, Additional Director General and Head on behalf of the Publications Division, Ministry of I & B, Govt. of India. and Printed at Prakhya Art Printers Pvt. Ltd. 1-8-724/A/31, Vegetable Market Street, Nallakunta, Hyderabad - 500 044. E-mail: print@prakhyaarts.com and Published at Yojana (Telugu), 205, 2nd Floor, C.G.O. Towers, Kavadiguda, Hyderabad - 500 080. Senior Editor: Vijayakumar Vedagiri, Tel: 040-27546314